
సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM




'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 155

SUNDAY Special — ఆదివారం 25-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## 'గబ్బర్' గుడ్‌బై

భారత క్రికెటర్ శిఖర్ ధావన్ ఆటకు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. భారత జట్టు తరఫున ధావన్ 34 టెస్టుల్లో 2,315... 167 వన్డేల్లో 6,793... 68 టి20ల్లో 1,759 పరుగులు సాధించాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలుచుకోవడంలో ఓపెనర్‌గా ధావన్ కీలక పాత్ర పోషించాడు.


- వివరాలు 14లో



### గళానికీ సంకెళ్లు!

మహిళలు బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడొద్దు. చదవొద్దు. పాడొద్దు. మీడియాలో కనిపించొద్దు. ఇవీ అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల ఆంక్షలు..

- వివరాలు 6లో



### జమ్మూకశ్మీర్‌కు పూర్వ హోదా

జమ్మూకశ్మీర్‌కు పూర్వహోదా కోసం పాటుపడతామని పీడీపీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది.

- వివరాలు 6లో



### అస్సాంలో ఆ కిరాతకుడు మృతి

బాలికపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు.. పోలీసులపై దాడిచేసి, తప్పించుకునే యత్నంలో చెరువులో దూకి మరణించాడు.

- వివరాలు 6లో



### రూమీ-1 ప్రయోగం విజయవంతం

పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ రూమీ-1ను భారత్ మొదటిసారిగా ప్రయోగించింది. చెన్నై తీరం నుంచి ఇది నింగిలోకి దూసుకెళ్లింది.

- వివరాలు 6లో

## న్యూస్‌రీల్

### బీటెక్‌లో మిగులు సీట్లు 11,836



ఇంజనీరింగ్ యూజీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సర ప్రవేశాల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 175 ఇంజనీరింగ్ కాలేజీల్లో 86,943 సీట్లున్నాయి. 75,107 మంది అడ్మిషన్లు పొందారు. మొత్తంగా 11,836 సీట్లు ఖాళీగా మిగిలాయి.

- వివరాలు 3లో

### డెంగీపై ఆందోళన వద్దు



డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య గతేడాది కంటే కాస్త పెరిగినా.. ఆందోళన అవసరం లేదని రాష్ట్ర ప్రజారోగ్య విభాగం సంచాలకుడు బి.రవీందర్ నాయక్ స్పష్టం చేశారు. పాజిటివిటీ రేటు ఏడు శాతంగా ఉందని, ఒక్క మరణం కూడా నమోదు కాలేదని చెప్పారు.

- వివరాలు 16లో

### రెండెకరాల భూమి కేటాయించండి



ఎయిమ్స్ బీబీనగర్‌కు అనుబంధంగా అర్బన్ హెల్త్-ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్ నడిబొడ్డున రెండెకరాల భూమిని కేటాయించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు.

- వివరాలు 12లో

### జీతాల కంటే అప్పులకే ఎక్కువ ఖర్చు



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకాలతో తమ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. శనివారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన ఆయన.. 8 అంశాలతో కూడిన విజ్ఞప్తులను రాతపూర్వకంగా అందచేశారు.

- వివరాలు 12లో



## ఇదండీ సంగతి



... నేనిప్పుడు అభద్రతలో ఉన్నా ఫోన్ కాసేపాగి చేస్తా!



నేలమట్టమైన ఎన్ కన్వెన్షన్ సెంటర్

# 'హైడ్రా'మా!

## ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

మాదాపూర్ తమ్మిడికుంట చెరువును ఆక్రమించారంటూ ఎన్-కన్వెన్షన్‌ను తెల్లవారగానే నేలమట్టం చేసిన హైడ్రా.. సాయంత్రానికి పోచారం వెంకటాపూర్ నాదం చెరువు సమీపంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణాల కూల్చివేతకూ ప్లాన్ చేసింది. నీటి పారుదల శాఖ ఫిర్యాదు మేరకు పల్లాపై పోచారంలో కేసు కూడా నమోదైంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు హైడ్రా దూకుడు ప్రదర్శించగా.. అడ్డుకోండి అంటూ అక్కినేని నాగార్జున, పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నాగార్జున పిటిషన్‌పై 'స్టేటస్ కో' ఇచ్చిన కోర్టు... పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై ఇరువైపులా చట్టప్రకారం నడుచుకోవాలని ఆదేశాలిచ్చింది.

### సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఫంక్షన్ హాల్‌ను కూల్చేసిన హైడ్రా

- తమ్మిడికుంట చెరువు ఆక్రమించి కట్టారనే ఆరోపణలతో చర్యలు
- ఫిర్యాదు చేసిన 'జనం కోసం' సంస్థ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కూల్చివేత కోసం పక్కా ప్రణాళికతో వచ్చిన అధికారులు... ఉదయం నుంచే భారీ బందోబస్తు..
- అటువైపు స్థానికులు, మీడియానూ అనుమతించని వైనం
- ఏడు భారీ యంత్రాలతో నాలుగు గంటల్లోనే కట్టడం నేలమట్టం
- చెరువు చుట్టూ ఉన్న ఇతర నిర్మాణాలు కూడా తొలగింపు

2లో

### కూల్చివేతపై స్టేటస్‌కో

- తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశం
- కూల్చివేతను సవాల్ చేస్తూ ఎన్-కన్వెన్షన్ ఎండీ ప్రీతమ్‌రెడ్డి పిటిషన్
- తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని కోర్టుకు వివరణ

2లో

### బఫర్ జోన్‌లో అనురాగ్ విద్యాసంస్థలు కట్టారు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఇరిగేషన్ శాఖ ఏఈఈ ఫిర్యాదు
- నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఆరోపణ.. ఎఫ్‌ఐఆర్ నమోదు
- ప్రభుత్వం కక్షసాధింపు: పల్లా

2లో

### న్యాయ పోరాటం చేస్తా..



ఎన్-కన్వెన్షన్ నిర్మించిన స్థలం పట్టా భూమి. ఒక్క అంగుళం కూడా చెరువు భూమి ఆక్రమణకు గురికాలేదు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదు. దీనిపై న్యాయ పోరాటం చేస్తాం. – సినీ నటుడు నాగార్జున

### అది అక్రమ నిర్మాణమే



తమ్మిడికుంట పరిధిలో ఉన్న ఎన్-కన్వెన్షన్ అక్రమ నిర్మాణం. ఎన్-కన్వెన్షన్‌పై ఇప్పటివరకు ఏ కోర్టూ ఎటువంటి స్టే ఇవ్వలేదు. ఇది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అనధికారిక నిర్మాణం. – ఏవీ రంగనాథ్, 'హైడ్రా' కమిషనర్

# పెన్షన్ భద్రత!

## కేంద్ర ఉద్యోగులకు అష్యూర్డ్ పెన్షన్ పథకం



- పాతికేళ్ల సర్వీసుంటే పెన్షన్‌గా సగం వేతనం
- పదేళ్ల సర్వీసుంటే కనీసం రూ.10 వేలు
- రిటైర్మెంట్ సమయంలో వేతనంలో పదోవంతు ఏకమొత్తంగా చెల్లింపు
- పెన్షనర్ మరణానంతరం కుటుంబీకులకు 60%
- ప్రభుత్వోద్యోగులకు సామాజిక భద్రత: కేంద్రం
- 23 లక్షల మందికి లబ్ధి: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వోద్యోగుల కోసం మోదీ సర్కారు తాజాగా ఏకీకృత పెన్షన్ విధానాన్ని (యూపీఎస్) తీసుకొచ్చింది. ఉద్యోగుల చిరకాల డిమాండ్లను నెరవేరుస్తూ హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకునే వారికి వేతనంలో సగం మొత్తాన్ని అష్యూర్డ్ పెన్షన్‌గా అందిస్తారు. దీనికి అదనంగా రిటైర్మెంట్ సమయంలో నిర్దిష్ట మొత్తాన్ని ఏకమొత్త ప్రయోజనంగా కూడా అందజేస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం యూపీఎస్‌కు ఆమోదముద్ర వేసింది. దీనితో 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వారికి సామాజిక భద్రత లభిస్తుందన్నారు. కేబినెట్ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నూతన జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)లో ఉన్న ఉద్యోగులు యూపీఎస్‌కు మారవచ్చని చెప్పారు. 2004 జనవరి 1 తర్వాత సర్వీసులో చేరిన వారికి ఈ పథకం వర్తించనుంది. సైనికోద్యోగులను మినహాయించి 2004 జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వోద్యోగాల్లో చేరిన వారందరికీ ఎన్‌పీఎస్‌ను అమలు చేయడం తెలిసిందే.

### సోమనాథన్ కమిటీ సూచనలతో..

మోదీ సర్కారు తీసుకొచ్చిన ఎన్‌పీఎస్‌పై ప్రభుత్వోద్యోగుల్లో వ్యతిరేకత రావడం తెలిసిందే. డీఏ ఆధారిత పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కోసం వాళ్లు పట్టుబడుతున్నారు. పలు రాష్ట్రాలు, ముఖ్యంగా బీజేపీయేతర పార్టీల పాలనలోని రాష్ట్రాలు ఇప్పటికే ఓపీఎస్ వైపు మళ్లాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా యూపీఎస్‌ను తెరపైకి తెచ్చింది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ సారథ్యంలో గతేడాది ఒక కమిటీ వేసింది. ప్రభుత్వోద్యోగుల పెన్షన్ పథకాన్ని సమీక్షించి, దానికి చేయాల్సిన మార్పుచేర్పులపై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరింది. కమిటీ 100కు పైగా భేటీలు జరిపిన మీదట యూపీఎస్

మిగతా 12వ పేజీలో ▶

## హెవీ డిమాండ్.. లో సప్లై!



- ప్రపంచాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధ
- దేశంలో ఏఐ నిపుణుల డిమాండ్ 6.5 లక్షలు
- కానీ పట్టుమని 2 లక్షల మంది కూడా లేని వైనం
- 2027 నాటికి 12.50 లక్షల మంది నిపుణులు అవసరం అని అంచనా... నాస్కామ్, డెలాయిట్ ప్రత్యేక అధ్యయనం వెల్లడి

3లో

# సోనియాదే నిర్ణయం!

### టీపీసీసీ చీఫ్ ఎంపికపై రాష్ట్ర నేతల భేటీలో కుదరని ఏకాభిప్రాయం

- మహేశ్‌కుమార్‌గౌడ్ పేరును బలపరిచిన సీఎం రేవంత్‌రెడ్డి
- మధుయాష్కీకి మద్దతుగా నిలిచిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్
- ఎవరి వాదన వారు వినిపించడంతో నిర్ణయాధికారం సోనియాకు అప్పగించిన ఖర్గే, రాహుల్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడి ఎంపిక బాధ్యత ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ కోర్టులోకి వెళ్లింది. అధ్యక్షుడి నియామకంపై రాష్ట్ర నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, ఎవరికి వారే తమ వర్గానికి చెందిన నేతల పేర్లను సిఫార్సు చేయడంతో ఈ అంశాన్ని సోనియా నిర్ణయాధికారానికి వదిలేయాలని ఏఐసీసీ కీలక నేతలు నిర్ణయించారు. ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అండగా నిలుస్తుండగా ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మద్దతిస్తున్నట్లు తెలిసింది.

**ఎవరి వాదన వారిదే..:** పీసీసీ చీఫ్ నియామకం సహా మంత్రివర్గ విస్తరణపై శుక్రవారం రాష్ట్ర నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జరిపిన చర్చలు ఫలవంతం కానట్లు తెలిసింది. 2004–2014 మధ్య రెండు యూపీఏ ప్రభుత్వాల్లో ఎంపీగా పనిచేసిన అనుభవంతోపాటు ఢిల్లీ నేతలతో సత్సంబంధాలు, ప్రచార కమిటీ చైర్మన్‌గా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పనితీరు

మిగతా 12వ పేజీలో ▶





మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో సత్యవతి, సబిత, సునీత... కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకుని ఆందోళన చేస్తున్న సునీతారావు తదితరులు

# హుందాగా ఉండాలనే క్షమాపణ చెప్పా

### చట్టాన్ని, మహిళలను గౌరవించే వ్యక్తిని నేను ● మహిళా కమిషన్ ఎదుట హాజరైన కేటీఆర్

- కేటీఆర్ కాన్వాయ్‌కి అడ్డు తగిలిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మహిళా నేతల ఆందోళనలతో దద్దరిల్లిన మహిళా కమిషన్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్/బన్సీలాల్‌పేట: రాజకీయాల్లో హుందాతనం ఉండాలని..తప్పు చేస్తే క్షమాపణ అడగాలనే ఉద్దేశంతోనే మహిళలను గౌరవించే వ్యక్తిగా క్షమాపణ కోరినట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా కమిషన్ ఆదేశాల మేరకు వ్యక్తిగతంగా హాజరైనట్టు వెల్లడించారు. యథాలాపంగా మాట్లాడిన మాటల పట్ల విచారం వ్యక్తం చేసిన విషయాన్ని మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణంపై వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసి వివరణ ఇచ్చారు. అనంతరం పార్టీ మహిళానేతలతో కలిసి

మిగతా 3వ పేజీలో ▶


# కొంతమంది వృద్ధులు.. వేధింపుల్లో పోకిరీలు

### షీ-టీమ్స్‌కు చిక్కుతున్న ఆకతాయిల్లో యువతతోపాటు 50 ఏళ్ల పైబడ్డ వారు కూడా..

- పదేళ్లలో 523 మందికి షీ-టీమ్స్ కౌన్సెలింగ్
- వెకిలిచేష్టలతో దొరికిన మరో 5,800 మంది మైనర్లు... మఫ్టీలో తిరుగుతూ ఆకతాయిల భరతం పడుతున్న షీ-టీమ్స్
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,122 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు
- షీ-టీమ్స్‌తో మహిళల్లో పెరిగిన భరోసా..

సాక్షి, హైదరాబాద్: సాధారణంగా ఆకతాయిలు, రోడ్‌సైడ్ రోమియోలంటే యువకులేనని అందరూ అనుకుంటారు. కానీ రాష్ట్రంలో గత పదేళ్లలో పోలీసులకు చిక్కిన ఆకతాయిల్లో 'తలపండిన' వారు కూడా ఉన్నట్లు తాజా గణాంకాల్లో వెల్లడైంది. కొందరు వ్యక్తులు వయసు పైబడ్డప్పటికీ వెకిలి చేష్టలతో మహిళలు, యువతులు, విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు తేలింది. 2014లో తెలంగాణలో షీ-టీమ్స్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 523 మంది 50 ఏళ్లకు పైబడిన 'ఆకతాయి'లు చిక్కారు. దీంతో టీనేజర్లు, యువతతోపాటు వారికి కూడా పద్ధతి మార్చుకోవాలని షీ-టీమ్స్ కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ ఆధ్వర్యంలో 331 షీ-టీమ్స్

మిగతా 12వ పేజీలో ▶




### 'భాగ్య'మంతా 'నగరి'కే..!



- రాష్ట్రంలోని బ్యాంకుల్లో ఉన్న నగదు డిపాజిట్లలో సింహభాగం గ్రేటర్ పరిధిలోనివే
- అప్పులు తీసుకున్నది కూడా ఎక్కువగా ఇక్కడివారే.. బ్యాంకు శాఖలూ ఇక్కడే ఎక్కువ
- రాష్ట్రంలో అన్ని రకాల బ్యాంకు లావాదేవీలు కలిపి 80% భాగ్యనగరంలోనే
- ఈ ఏడాది మార్చి 31 నాటి ఎస్‌ఎల్‌బీసీ గణాంకాల్లో వెల్లడి

16లో

## చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత: మంత్రి పొన్నం

**రాష్ట్రంలో ఎక్కడ చెరువులు ఆక్రమణకు గురైనా సమాచారం ఇవ్వండి**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెరువులు, కుంటలు ఆక్రమించి జరిపిన నిర్మాణాలపై తగిన చర్యలు ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. జంటనగరాలతో పాటు రాష్ట్రంలో ఎక్కడైనా చెరువులు ఆక్రమణకు గురైనట్లు సమాచారం తెలిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటు అందించాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. చెరువులు, కుంటలు ఆక్రమణకు పాల్పడిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని, వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా రాజధాని పరిధిలోని చెరువుల పరిరక్షణకు చేపట్టిన చర్యల వల్ల భవిష్యత్‌తరాలకు మేలు జరుగుతుందన్నారు.

## కోమటికుంట సరస్సులో మా నిర్మాణాలు లేవు

**వాసవీ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా**

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో వాసవీ గ్రూప్ నిర్మిస్తున్న వాసవీ అర్బన్ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకున్నామని ఆ సంస్థ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా తెలిపారు. ఆ ప్రాంతంలోని కోమటికుంట సరస్సుపై ఎటువంటి నిర్మాణ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదని స్పష్టం చేశారు. స్థానిక యూట్యూబ్ ఆధారిత వార్తా చానల్‌లు నిర్మాణాలకు సంబంధించి తప్పుడు వార్తలు ప్రసారం చేశాయని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాలలో భాగంగా కోమటికుంట సరస్సు, మైసమ్మ సరస్సు సుందరీకరణలో భాగమయ్యామని ఆయన వెల్లడించారు.

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

**సినీ నటుడు నాగార్జునకు చెందిన ఫంక్షన్ హాల్‌ను కూల్చేసిన హైడ్రా**

**తమ్మిడికుంట చెరువు ఆక్రమించి కట్టారనే ఆరోపణలతో చర్యలు**



శనివారం ఎక్స్‌కవేటర్‌తో ఎన్-కన్వెన్షన్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి:

ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఫంక్షన్ హాల్ ఎన్-కన్వెన్షన్ సెంటర్‌ను 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)' శనివారం నేలమట్టం చేసింది. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ల పరిధిలో దీనిని నిర్మించారంటూ కూల్చివేసింది. ఎన్-కన్వెన్షన్ అక్రమ నిర్మాణమని, దానికి జీహెచ్ఎంసీ అనుమతి లేదని 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. అయితే ఎన్ కన్వెన్షన్ సెంటర్ ఉన్న స్థలం పట్టా భూమి అని, గతంలో దీని కూల్చివేతకు ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే కూడా విధించిందని సినీ నటుడు నాగార్జున తెలిపారు.

### పక్కా ప్రణాళిక.. భారీ బందోబస్తు మధ్య..

ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతకు సిద్ధమైన అంశాన్ని ఉన్నతాధికారులు చివరి నిమిషం వరకు రహస్యంగా ఉంచారు. పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఎన్-కన్వెన్షన్ వైపు ఎవరినీ అనుమతించలేదు. అటువైపు వెళ్లే రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసి.. స్థానికులను సైతం మరో దారిలో పంపారు. మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మీడియాను సైతం అనుమతించలేదు. ఒక పెద్ద, రెండు చిన్న ఎక్స్‌కవేటర్లు, నాలుగు బుల్డోజర్లతో కూల్చివేత చేపట్టి.. నాలుగు గంటల్లో పూర్తిగా నేలమట్టం చేశారు. శిథిలాలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. అయితే కూల్చివేతపై ముందుగా నోటీసులు ఇవ్వకపోవడంతో.. కన్వెన్షన్ సెంటర్‌లోని ఏసీలు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని నిర్వాహకులు బయటికి తీయలేదు. అన్నీ ఉండగానే అధికారులు ఎన్-కన్వెన్షన్‌ను కూల్చేశారు. తమ్మిడికుంటకు ఇది తూర్పు వైపు ఉండగా.. పశ్చిమం వైపు ఉన్న ఆరు షెడ్లను 'హైడ్రా' సిబ్బంది తొలగించారు.

### మంత్రి కోమటిరెడ్డి, 'జనం కోసం' సంస్థ ఫిర్యాదులతో..

తమ్మిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించి ఎన్-కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించినట్టు ఏళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. అయితే గత వారం రోజుల్లో వచ్చిన రెండు ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు ముందుకు వెళ్లారు. చందానగర్‌కు చెందిన 'జనం కోసం' సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం రోజున, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నాడు 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్‌కు లిఖితపూర్వకంగా ఎన్ కన్వెన్షన్‌పై ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పాత అంశాలను పరిశీలించి కూల్చివేతకు నిర్ణయం తీసుకున్నట్టు హైడ్రా అధికారులు చెబుతున్నారు.

### గతంలోనూ ఆరోపణలతో..

మాదాపూర్‌లోని ఖానామెట్ సర్వే నంబర్లు 36, 37, 38/సీ, 11/2, 11/36/68/పీ, 41/పీలలో తమ్మిడికుంట చెరువు ఉంది. దీని ఎఫ్‌టీఎల్ 29.26 ఎకరాలుకాగా.. అందులో ఏడెకరాల భూమిపై ప్రైవేట్ వ్యక్తులకు పట్టా ఉంది. ఖానామెట్ సర్వే నంబర్ 30, 35, 37, 38/పి, 11/2, 11/36, 68/పి, 41/పిలలో 9.36 ఎకరాలను తమ్మిడికుంట బఫర్ జోన్‌గా 2013 ఆగస్టులో నిర్వహించిన సర్వేలో రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందులోనూ 4.13 ఎకరాలకు ప్రైవేట్ వ్యక్తులకు పట్టా ఉంది. ఈ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో సినీ నటుడు నాగార్జున ఎన్-కన్వెన్షన్‌ను నిర్మించారంటూ.. 'జనం కోసం' సంస్థ 2014లో చేసిన ఫిర్యాదును లోకాయుక్త స్వీకరించింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో.. అప్పటి ప్రభుత్వం ఎన్-కన్వెన్షన్‌ను కూల్చివేయాలని నిర్ణయించింది. కూల్చివేతలు చేపట్టడానికి జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు తమ్మిడికుంట చెరువు వద్దకు వెళ్లారు. ప్రహరీ కూల్చేశారు. అయితే ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే షెడ్డును తామే తొలగిస్తామని నిర్వాహకులు చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. కొంత మేర షెడ్డును తొలగించిన సినీ నటుడు నాగార్జున.. ఆపై న్యాయ పోరాటం ప్రారంభించారు. తర్వాత ఈ వ్యవహారం సద్దుమణిగిపోగా.. ఇప్పుడు 'హైడ్రా' దాన్ని నేలమట్టం చేసింది. 'హైడ్రా' తమ ఫిర్యాదుపై స్పందించి ఎన్-కన్వెన్షన్, ఇతర ఆక్రమణలను తొలగించడాన్ని స్వాగతిస్తున్నట్లు 'జనం కోసం' సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## అది పట్టా భూమి.. న్యాయ పోరాటం చేస్తా

**తప్పుడు సమాచారంతో కూల్చివేశారు**

**'హైడ్రా' తీరుతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు**

**సినీ నటుడు నాగార్జున**



సాక్షి, హైదరాబాద్: ఎన్-కన్వెన్షన్ నిర్మించిన స్థలం పట్టా భూమి అని, ఒక్క అంగుళం కూడా చెరువు భూమి ఆక్రమణకు గురికాలేదని సినీ నటుడు నాగార్జున స్పష్టం చేశారు. 'హైడ్రా' తీరుతో తాము ఆక్రమణలు చేశామని ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని పేర్కొన్నారు. ఎన్-కన్వెన్షన్ కూల్చివేతపై నాగార్జున తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. తమ నిర్మాణం పూర్తిగా ప్రైవేట్ స్థలంలో నిర్మించినదని, కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే కూడా ఇచ్చిందని నాగార్జున గుర్తు చేశారు. ఈ కూల్చివేత తప్పుడు సమాచారం వల్ల లేదా చట్టవిరుద్ధంగా జరిగిందని.. దీనికి ముందు తమకు ఎలాంటి నోటీసు జారీ చేయలేదని వివరించా రు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదని స్పష్టం చేశారు. ఒకవేళ కోర్టు వ్యతిరేక తీర్పు ఇచ్చి ఉంటే.. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా తానే కూల్చివేసేవాడినని పేర్కొన్నారు. కానీ తాజా పరిణామాల వల్ల తాము ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజల్లోకి సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు.

## అది అక్రమ నిర్మాణమే

**ఎన్-కన్వెన్షన్‌కు జీహెచ్ఎంసీ అనుమతి లేదు**

**'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్**



సాక్షి, హైదరాబాద్: తమ్మిడికుంట పరిధిలో ఉన్న ఎన్-కన్వెన్షన్ అక్రమ నిర్మాణమని.. దానికి జీహెచ్ఎంసీ అనుమతి లేదని 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. కూల్చివేత కోసం తాము తీసుకున్న చర్యలపై ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు తొలగించారు. తొలగించిన వాటిలో ఎన్-కన్వెన్షన్ కూడా ఒకటి. ఈ చెరువుకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై హెచ్ఎండీఏ 2014లో ప్రాథమిక నోటిఫికేషన్, 2016లో తుది నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీ తర్వాత ఎన్-కన్వెన్షన్ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించి చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని అప్పట్లో హైకోర్టు ఆదేశించింది. దాని ప్రకారం అధికారులు ఎన్-కన్వెన్షన్ వారి సమక్షంలో ఎఫ్‌టీఎల్ సర్వే నిర్వహించి, నివేదికను అందించారు. దీనిపై 2017లో ఎన్-కన్వెన్షన్ నిర్వాహకులు మియాపూర్‌లోని అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించారు. ఆ కేసు పెండింగ్‌లో ఉంది. ఎన్-కన్వెన్షన్‌పై ఇప్పటివరకు ఏ కోర్టు కూడా ఎటువంటి స్టే ఇవ్వలేదు. ఇది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అనధికారిక నిర్మాణం. వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్న ఎన్-కన్వెన్షన్ నిర్మాణం కోసం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్‌లో 2 ఎకరాల 18 గుంటలు ఆక్రమించారు. గతంలో వీళ్లు 'భవనాల క్రమబద్ధీకరణ (బీఆర్ఎస్)' కోసం దరఖాస్తు చేసుకున్నా.. ప్రభుత్వం తిరస్కరించింది. తమ్మిడికుంటతోపాటు పరిసర ప్రాంతాలను అనుసంధానించే నాలాలను తనిఖీ చేయగా.. ఈ ఆక్రమణల కారణంగా చెరువు నీటి నిల్వ సామర్థ్యం 50 నుంచి 60%మేర తగ్గిపోయింది. తమ్మిడికుంట చెరువు దిగువ ప్రాంతాలు భారీ వర్షాల సమయంలో తరచూ ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నిర్దిష్ట ప్రక్రియను అనుసరించి, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు శనివారం ఉదయం తమ్మిడికుంట చెరువులోని అనధికార నిర్మాణాలను పూర్తిగా కూల్చివేశారు..'' అని ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు.

# మరిన్ని నగరాలకు 'హైడ్రా'!

**'హైడ్రా'తరహాలో వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వ పరిశీలన**

- విధివిధానాలపై పురపాలక శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ పట్టణం నడిబొడ్డున బస్టాండ్‌కు సమీపంలో 1980కు ముందు పెద్ద చెరువు ఉండేది. ఆ చెరువును ప్రభుత్వమే పూడ్చేసి ఏకంగా జిల్లా కలెక్టరేట్‌ను నిర్మించింది. పక్కనే స్టేడియం కూడా కట్టారు. నాటి చెరువు కట్ట పక్కనే ఉన్న కట్టరాంపూర్ గ్రామం నగరంలో కలిసిపోయింది. కట్ట కింద ఉన్న పొలాలన్నీ కాలనీలుగా మారాయి. ఇప్పటికీ వర్షం వస్తే పట్టణంలోని వరదంతా కలెక్టరేట్ వైపే వస్తుంది. ఇలా 1980లో మొదలైన చెరువుల ఆక్రమణ.. కరీంనగర్ పట్టణం, దాని శివార్లలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పదుల సంఖ్యలో చెరువులు, కుంటలు కబ్జాల పాలయ్యాయి. ఒక్క కరీంనగర్‌కే ఇది పరిమితం కాలేదు. వరంగల్‌లో భద్రకాళి చెరువు, కోట చెరువు, బెస్తం చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డెపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వేలాది నిర్మాణాలు వెలిశాయి. నిజామాబాద్‌లో పేరున్న పులాంగ్ వాగు ఆక్రమణలతో పిల్ల కాలువలా మారిపోయింది. చాలా పట్టణాల్లో ఇదే పరిస్థితి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని'హైడ్రా'తరహాలో రాష్ట్రంలోని ఇతర నగరాల్లో కూడా విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు విధివిధానాల రూపకల్పనలో పురపాలక శాఖ నిమగ్నమైనట్టు సమాచారం.

**నిర్లక్ష్యం, అవినీతి కలిసి..**

రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలకు పట్టణాభివృద్ధి సంస్థలు ఉన్నాయి. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (వరంగల్), శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ (కరీంనగర్)తోపాటు నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట వంటి నగరాలకు అభివృద్ధి సంస్థలు ఉన్నాయి. వాటి సిఫారసు మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ (డీసీటీపీ) ద్వారా లేఅవుట్లు జారీ కావాలి. కానీ మాస్టర్‌ప్లాన్ల రూపకల్పన, అమలులో పట్టణాభివృద్ధి సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే మాస్టర్‌ప్లాన్లు, అప్రూవ్డ్ లేఅవుట్లతో సంబంధం లేకుండా.. చెరువుల శిఖం భూములు, బఫర్ జోన్లలోనూ అడ్డగోలుగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం కార్పొరేషన్లతోపాటు ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిర్మల్, నల్లగొండ, మిర్యాలగూడ, గద్వాల, సంగారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, సిరిసిల్ల, కోరుట్ల, కామారెడ్డి తదితర మున్సిపాలిటీల్లో ఆక్రమణల పాలైన చెరువులు, కుంటలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**హైడ్రా వంటి సంస్థల ద్వారానే..**

హైదరాబాద్‌లో 'హైడ్రా'చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందని భావిస్తున్న ప్రభుత్వం.. ఈ తరహా వ్యవస్థలను ఇతర నగరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని అధికార వర్గాలు తెలిపాయి. అవకాశమున్న చోటఆక్రమణలను తొలగించడం, కొత్తగా కబ్జాలు జరగకుండా కాపాడేలా చర్యలు చేపట్టనున్నట్టు వివరించాయి. ఇందులో భాగంగానే మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో ఎక్కడ చెరువుల ఆక్రమణలు జరిగినట్టు గుర్తించినా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలంటూ శనివారం ఓ వీడియో విడుదల చేశారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ గౌతం తదితరులు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోని పరిస్థితిపై సమీక్ష కూడా జరిపినట్టు తెలిసింది. త్వరలోనే ఇతర నగరాల్లో 'హైడ్రా'తరహా వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.

# ఎన్-కన్వెన్షన్ కూల్చివేతపై స్టేటస్ కో

**తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశం**

- కూల్చివేతను సవాల్ చేస్తూ ఎన్-కన్వెన్షన్ ఎండీ ప్రీతమ్‌రెడ్డి పిటిషన్
- తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని కోర్టుకు వివరణ
- పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా కూల్చివేత న్యాయసూత్రాలకు విరుద్ధమని వివరణ
- చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో కన్వెన్షన్ ఉన్నట్టు అధికారులు గుర్తించారన్న 'హైడ్రా' న్యాయవాది



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి కొనసాగింపు) ఆదేశాలు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎవరూ ఎలాంటి చర్యలు చేపట్టవద్దని పిటిషనర్‌ను, 'హైడ్రా'ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 291/1, 11/2, 11/3, 11/36లలో మొత్తం 27,063 చదరపు మీటర్ల పరిధిలో ఎన్-కన్వెన్షన్‌ను నిర్మించారు. అయితే కన్వెన్షన్ సెంటర్‌లోని కొంత భాగం తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ ఫిర్యాదులు రావడంతో.. 'హైడ్రా' శనివారం ఉదయం కూల్చివేత ప్రారంభించింది. దీనిని సవాల్ చేస్తూ కన్వెన్షన్ ఎండీ నల్ల ప్రీతమ్‌రెడ్డి శనివారం హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. కూల్చివేతలు ఆపేలా, తమ ఆస్తిలో జోక్యం చేసుకోకుండా ఉండేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురామ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్-కన్వెన్షన్ అంశంపై హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉండగానే కూల్చివేత చేపట్టడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని కోర్టుకు విన్నవించారు. చెరువు విస్తీర్ణానికి సంబంధించి 29 ఎకరాలా? లేక 20 ఎకరాలా అన్నదానిపై సందిగ్ధత ఉందని వివరించారు. మరోవైపు 'హైడ్రా' తరఫున స్టాండింగ్ కౌన్సిల్ రవీందర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గతంలో హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని, కన్వెన్షన్‌లోని 1.12 ఎకరాలు ఎఫ్‌టీఎల్‌లో, 2 ఎక రాలు బఫర్ జోన్‌లో ఉన్నట్టు అధికారుల గుర్తించి, కూల్చివేతలు చేపట్టారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్-కన్వెన్షన్‌కు సంబంధించి స్టేటస్ కో విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పిటిషనర్ కోరగా నిరాకరించారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

**నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతా?**

''కంపెనీల చట్టం ప్రకారం ఎన్-కన్వెన్షన్ సంస్థ ఏర్పాటైంది. 2009 సెప్టెంబర్‌లో నాగార్జున నుంచి కన్వెన్షన్ స్థలాన్ని లీజుకు తీసుకున్నాం. 2010-12 మధ్య కన్వెన్షన్ నిర్మాణం చేపట్టాం. అందులోని కొంత భాగాన్ని చెరువు సరిహద్దులో నిర్మించారంటూ 2014లో నీటిపారుదల, రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులపై నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఆరోపణలు నిరూపితమైతే నిర్మాణంలో మార్పులు చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టుకు విన్నవించారు. దీంతో హైకోర్టు తొలుత ఎఫ్‌టీఎల్, చెరువు సరిహద్దులను నిర్ధారించాలని, ఆ తర్వాత నోటీసులిచ్చి చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. భవన నిర్మాణ అనుమతి కూడా పెండింగ్‌లో ఉంది. చెరువు శిఖం భూమిలో ఒక్క గజం కూడా మేం ఆక్రమించలేదు. నోటీసులు జారీ చేయకుండా తప్పుడు ఫిర్యాదుల మేరకు కూల్చివేత చేపట్టడం చట్టవిరుద్ధం''అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## చట్టప్రకారమే కూల్చివేతలు


**'ఎన్' కన్వెన్షన్ ఘటనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: అక్రమ నిర్మాణాలను చట్టప్రకారమే కూల్చివేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సినీహీరో అక్కినేని నాగార్జునకు సంబంధించిన 'ఎన్'కన్వెన్షన్ కూల్చివేతపై ఆయన స్పందించారు. గత పదేళ్లలో రాష్ట్రంలో అనేక చెరువులు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై పర్యావరణవేత్తలు పలు మార్లు ధర్నాలు, నిరసనలు చేపట్టారని తెలిపారు. చెరువులు ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకే 'హైడ్రా' విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం అంటేనే లేక్స్ అండ్ రాక్స్ (సరస్సులు, రాళ్లు) అని, వాటిని కాపాడేందుకు తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఎవరి విషయంలోనైనా నోటీసులు ఇచ్చి ఆపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర విభజనకు ముందు, తర్వాత ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గత పదేళ్లలో ఎన్ని చెరువులు ఆక్రమణలకు గురయ్యాయో తెలుసుకుంటున్నామని చెప్పారు. ఎన్ కన్వెన్షన్‌కు అనుమతి ఇచ్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వమే కదా? మీ హయాంలోనే కదా నిర్మాణం చేపట్టిందని మీడియా ప్రశ్నించగా.. ఆయన సమాధానాన్ని దాటవేశారు.

## గతంలో అనుమతులు ఇచ్చింది మీరే కదా?: కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: హైడ్రా పేరుతో రాష్ట్రంలో పెద్ద హైడ్రామా నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సినీహీరో నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ నిర్మాణానికి అసలు అనుమతులు ఇచ్చింది మీ ప్రభుత్వమే కదా! అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 'ఇప్పుడు ఉన్న చట్టాలే అప్పుడూ ఉన్నాయి కదా? మరి ఇన్నేళ్లలో కూల్చనిది ఇప్పటికిప్పుడు కూల్చాల్సిన అవసరం ఏమిటి' అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది, ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది మరి ఈ రెండు ప్రభుత్వాలు మౌనంగా ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పాలన్నారు. ఈ కూల్చివేతపై సమగ్రమైన విచారణ జరపాలని సూచించారు.

# బఫర్ జోన్‌లో అనురాగ్ విద్యాసంస్థలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఇరిగేషన్ శాఖ ఏఈ ఫిర్యాదు**

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఆరోపణ.. ఎఫ్ఐఆర్ నమోదు
- 25 ఏళ్లుగా తన విద్యాసంస్థలు నిబంధనల మేరకే పనిచేస్తున్నాయన్న పల్లా
- ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపణ

పోచారం/సాక్షి హైదరాబాద్: చెరువు బఫర్ జోన్‌లో విద్యా సంస్థల నిర్మాణాలు చేపట్టారంటూ బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ విద్యాసంస్థల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వెంకటాపూర్ గ్రామం సర్వే నంబర్ 813లోని నాదం చెరువు బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల నిర్మాణాలను చేపట్టారంటూ ఇరిగేషన్ శాఖ ఏఈ ఎ. పరమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. మిషన్ కాకతీయ నాలుగో దశ కింద నాదెం చెరువును పరిరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. కానీ చెరువులో పల్లా విద్యాసంస్థల ఆక్రమణలు ఉన్నందున ఆయనపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, గతంలో ఈ నిర్మాణాలపై లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గణేశ్ ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని తెలిసింది. దీంతో గణేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన ఇరిగేషన్ శాఖ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



**నిబంధనల మేరకే నిర్మాణాలు..**

గత 25 ఏళ్లుగా నడుస్తున్న తన విద్యాసంస్థలు నిబంధనల మేరకే పనిచేస్తున్నాయని, వాటి నిర్మాణాలకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నుంచి తమ వర్సిటీ భూమి ఎంత దూరం ఉందో కొలిచిన తర్వాతే 2018లో వివిధ ప్రభుత్వ శాఖలు అనుమతులు ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఈ నెల 22న తమ వర్సిటీకి వచ్చి 23న ఫిర్యాదు చేయగానే పోలీసులు కనీసం తమను సంప్రదించకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం శోచనీయమని ఓ ప్రకటనలో విమర్శించారు. 2022లో నీటిపారుదల శాఖ, అగ్నిమాపక, రెవెన్యూ, ఎయిర్‌పోర్టు అథారిటీ జారీ చేసిన ఎన్‌ఓసీలను పరిశీలించాక భవన నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులిచ్చిందన్నారు. అన్ని అనుమతులతో, కావాల్సిన సెట్ బ్యాక్‌లు వదిలిపెట్టి భవన నిర్మాణాలు చేపట్టామని వివరించారు. ప్రభుత్వం కక్షపూరితంగానే తనపై కేసులు పెడుతోందని పల్లా ఆరోపించారు. ఎన్నికలు జరిగినప్పటి నుంచి వ్యక్తిగతంగా తనపై జనగామలో 4 కేసులు, హైదరాబాద్‌లో 2 కేసులు ప్రభుత్వం పెట్టిందని దుయ్యబట్టారు. న్యాయం కోసం చట్ట పరిధిలోనే పోరాటం చేస్తానన్నారు.

## చట్ట ప్రకారం ముందుకెళ్లండి

**'అనురాగ్' పిటిషన్‌పై హైడ్రాకు హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ విద్యాసంస్థలను బఫర్ జోన్‌లో నిర్మించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో చట్ట ప్రకారం ముందుకెళ్లాలని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ను హైకోర్టు ఆదేశించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని కొర్రెముల గ్రామం సర్వే నంబర్ 796, 813లోని కొంత భాగంలో ఉన్న 17.21 ఎకరాలు తమవేనని ఎమ్మెల్యే పల్లాకు చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్, అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు గూడ మధుకర్‌రెడ్డి హైకోర్టులో శనివారం రాత్రి హౌస్‌మోషన్ పిటిషన్ వేశారు. నిబంధనల మేరకే భవన నిర్మాణాలు చేపట్టామని.. రాజకీయాల్లో భాగంగా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ భూముల్లో జోక్యం చేసుకోకుండా హైడ్రాతోపాటు ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాది సమ్మతించడంతో ఆయన వాదనను రికార్డు చేశారు. చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని హైడ్రాను ఆదేశిస్తూ పిటిషన్‌లో విచారణను ముగించారు.

## ముందు అప్పటి అక్రమ కట్టడాలు కూల్చాలి

**మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ చేసినన్ని తప్పులు దావూద్ ఇబ్రహీం కూడా చేయలేదు: బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 'హైడ్రా'ను మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసి ఉంటే, ముందు బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయాలని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. హైడ్రా ఏర్పాటులో రాజకీయ దురుద్దేశం లేకపోతే ఆయా చెరువుల బఫర్ జోన్లను గుర్తించి కాపాడాలన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సి పల్ మంత్రిగా కేటీఆర్ చేసినన్ని తప్పులు దావూద్ ఇబ్రహీం కూడా చేయలేదని అన్నారు. గతంలో చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోని కేటీఆర్‌ను మొదటి ముద్దాయిగా అరెస్టు చేయాల న్నారు. ముందుగా కేటీఆర్ తన జన్వాడ ఫామ్ హౌస్‌ను కూల్చివేయించాలన్నారు. 'కవిత, కేటీఆర్‌ల ఫామ్ హౌస్‌లను కూల్చేందు కు ఎందుకు భయపడుతున్నారు? 111 జీవో పరిధిలో హరీశ్‌రావు, కవిత లకు ఆస్తులు లేవా.. వాటి సంగతి ఏమిటి'అని ప్రశ్నించారు. 2014లోనే ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయాలని హైకోర్టు ఆదేశించినా, చర్యలెందుకు తీసుకోలేదో, దాని వెనుక ఉన్న లాలూచీ ఏమిటో కేటీఆర్ చెప్పాలన్నారు.

**కూల్చివేతపై స్టే ఇవ్వడం సరికాదు..**

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైకోర్టు స్టే ఇవ్వడం సరికాదని రఘునందన్‌రావు అభిప్రాయపడ్డారు. 'జడ్జీలు ఎందుకు స్టే ఇస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కూలగొడితే తప్పు ఏంటి..? గతంలో కూల్చాలని జడ్జిమెంట్ ఇచ్చింది కూడా హైకోర్టే' అని వ్యాఖ్యానించారు.

# హెవీ డిమాండ్ లో సప్లై

## ప్రపంచాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధ

**దేశంలో ఏఐ నిపుణుల డిమాండ్ 6.5 లక్షలు**

- కానీ పట్టుమని 2 లక్షల మంది కూడా లేని వైనం
- 2027 నాటికి 12.50 లక్షల మంది నిపుణుల అవసరం అని అంచనా

కృత్రిమ మేధోశక్తి (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రపంచాన్ని శాసిస్తోంది. విద్య, వైద్యం, అంతరిక్షం.. అన్నింటిల్లోకి శరవేగంగా దూసుకొస్తోంది. ఇక ఈ–కామర్స్‌లో ఇది లేకుండా ముందుకెళ్ళడం కష్టమే. ఇప్పుడు ప్రపంచ ఏఐ సేవల మార్కెట్ విలువ 120 బిలియన్ డాలర్లు. 2027 నాటికి ఇది 500 బిలియన్ డాలర్లకు చేరబోతోంది. ఇందులో మన దేశం వాటా 20 శాతం. అయితే ఈమేర ఏఐ నిపుణుల సంఖ్య పెరగడం లేదు. ఇప్పుడు 6.5 లక్షల ఏఐ నిపుణుల అవసరం ఉంటే, మన దేశంలో ఉన్నది 2 లక్షల కన్నా తక్కువే. 2027 నాటికి ఏఐ నిపుణుల అవసరం 12.50 లక్షలకు పెరగబోతోంది. 'అడ్వాన్సింగ్ ఇండియా ఏఐ స్కిల్స్' పేరుతో నాస్కామ్, డెలాయిట్ సంస్థలు ఏఐ పురోగతి, నిపుణుల ఆవశ్యకతపై జరిపిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కాగా ఏఐ నిపుణుల తయారీపై దృష్టి పెట్టాలని కేంద్రం సంబంధిత విభాగాలను ఆదేశించింది. అధ్యయనంలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

– సాక్షి, హైదరాబాద్



### ఉద్యోగులకు సంస్థల శిక్షణ

ఐటీ కన్సల్టింగ్, ఇంప్లిమెంటేషన్, అప్లికేషన్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్, అవుట్ సోర్సింగ్, సపోర్టు అండ్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్‌కు ఏఐ తప్పనిసరి. ఏఐ సిస్టమ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరాన్ని పెంచింది. అనలిస్టులు, బిజినెస్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్, డేటా మేనేజ్‌మెంట్, ఇంటిగ్రేషన్, సాఫ్ట్‌వేర్ క్వాలిటీ, లైఫ్ సైకిల్ సాఫ్ట్‌వేర్‌కు ఏఐ నిపుణుల అవసరం ఉంది. ఇప్పటికే టీసీఎస్ 3.5 లక్షల మందికి, విప్రో 2.20 లక్షల మందికి ఏఐ నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి. 2025 నాటికి 2 మిలియన్ల ఏఐ నిపుణులను తయారు చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ నిర్ణయించింది. ఇన్ఫోసిస్ ఇప్పటికే అంతర్గత శిక్షణ చేపట్టింది.

### మనవాళ్లు అందుకొనేనా?

రాష్ట్రంలో ఏటా ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్న వారిలో 75 శాతం సీఎస్ఈ చేసినవాళ్ళే. వీళ్ళకు ఏఐపై కొంత అవగాహన ఉంటోంది. అయితే వీళ్ళకు అవసరమైన స్కిల్స్ పూర్తి స్థాయిలో ఉండటం లేదు. వాస్తవానికి సీఎస్ఈ బోధకులే బేసిక్ నాలెడ్జ్‌తో బోధిస్తున్నారు. ఇదే అంశాన్ని నాస్కామ్, డెలాయిట్ అధ్యయనం ప్రస్తావించింది. నైపుణ్య విస్తృతి పెంచాలని సూచిస్తోంది.

- డీప్ లెర్నింగ్, ఎల్ఎల్ఎం, ఎన్ఎల్‌పీ, రోబోటిక్స్ వంటి టెక్నాలజీపై దృష్టి పెట్టాల్సి ఉంది. వైద్య పరంగా సర్జరీలు, వ్యాధుల క్రోడీకరణకు అవసరమైన అప్లికేషన్స్ రూపొందించే సమర్థత ఉండాలి. పైథాన్, జావా వంటి లాంగ్వేజ్‌లే ఇప్పటికీ ఉన్నాయి. డేటా అనాలసిస్, స్టాటిస్టికల్ మోడలింగ్, విజువలైజేషన్, ఫ్యూచర్ ఇంజనీరింగ్, సెగ్మెంట్ స్పెసిఫికేషన్ వంటి స్కిల్స్‌తో కూడిన ఏఐ డెవలపర్స్ అవసరం ఏర్పడుతుంది. ఇదే తరహా బిల్డర్స్, ఆర్కిటెక్ట్స్ కూడా కావాల్సి ఉంటుంది.
- నాలెడ్జ్ ఆఫ్ బేసిక్ టూలింగ్, మేథమెటికల్ డేటాసైన్స్ కోడింగ్, ఇంప్లిమెంటేషన్ ఆఫ్ మెథడాలజీ వంటి ఏఐ ఇంటిగ్రేటర్స్ అవసరం మరింత పెరుగుతుంది. దీనికి స్కిల్ ఉన్నవాళ్ళు కావాలి.

### ఏం చేయాలి?

ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు ఏఐలో శిక్షణ ఇవ్వాలి. కొత్తగా వచ్చే విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వాలి. ఫండమెంటల్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్సులు తీసుకు రావాలి. పరిశ్రమలు చొరవ చూపాలి. అకడమిషియన్లతో కలిసి ఏఐ స్కిల్స్ పెంచాలి. సెమినార్లు, అవగాహన సదస్సులు నిర్వహించాలి. వర్క్‌షాప్‌ల ద్వారా బేసిక్ నాలెడ్జ్ పెంచే ప్రయత్నం చేయాలి. ఏఐ టెక్నాలజీలో డిగ్రీ, డిప్లొమాలను పెంచాలి. సాధారణ విద్యలోనూ ఏఐ మాడ్యూల్స్ తీసుకురావాలి. పాఠశాల విద్యలోనూ ఏఐని చేర్చాలి.

### కేరాఫ్ అమీర్‌పేట..

ఏఐ నేపథ్యంతో హైదరాబాద్ అమీర్‌పేటలో దాదాపు 20 వరకూ కోచింగ్ కేంద్రాల్లో 15 వేల మంది వరకూ శిక్షణ తీసుకుంటున్నారు. అయితే ఏఐ పూర్తి స్థాయిలో నేర్పలేకపోతున్నామని కోచింగ్ సెంటర్ల వారు అంటున్నారు. కేవలం నాన్–కంప్యూటర్ బ్రాంచి, గ్రామీణ నేపథ్యం ఉన్నవారిలో అవగాహనకు ఇది ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఆరు నెలల కోర్సుల ద్వారా కొన్ని ఉద్యోగాలు పొందే వీలుందంటున్నారు. కానీ ఈ కోర్సుల వల్ల పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండటం లేదని వరంగల్ విద్యార్థి నవీన్ తెలిపాడు. వీటికన్నా ఆన్‌లైన్ కోర్సులే ఉత్తమం అని ఖమ్మం విద్యార్థిని కృష్ణప్రియ తెలిపింది.

### కోర్సుల విస్తృతి అవసరం



ఏఐ నిపుణుల సంఖ్య పెంచాలి. ఏఐలో కోర్సుల సంఖ్య మరింత పెరగాలి. సర్టిఫికెట్ కోర్సులు తీసుకురావాలి. ఆరు నెలలు, ఏడాది కోర్సుల ద్వారా ఏఐపై కొంతమేర అవగాహన వస్తుంది. ఆ తర్వాత వాళ్లలో స్కిల్స్ పెంచవచ్చు.

–ఎన్‌వీ రమణారావు (నిట్ డైరెక్టర్, రాయపూర్)

### బోధనా ప్రణాళికలో ఏఐ



ఏఐ అవసరాలను గుర్తించి 2018 నుంచే వివిధ కోర్సులు తీసుకొచ్చాం. బోధనా ప్రణాళికలోనూ దీన్ని చేర్చాం. డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్‌ను వివిధ కోర్సుల్లో మేళవించాం. నాన్–కంప్యూటర్ గ్రూపులకూ ఏఐ సర్టిఫికెట్ కోర్సు అందిస్తున్నాం. ఏఐఎంఎల్ మైనర్ డిగ్రీలు అందిస్తున్నాం. కొన్నేళ్లలో ఏఐ నిపుణులు పెరుగుతారని ఆశిస్తున్నాం.

–డాక్టర్ సుప్రీతి కేపీ (సీఎస్ఈ విభాగం అధిపతి, జేఎన్‌టీయూహెచ్)

## ఓయూ లా పీజీ డిప్లొమా కోర్సులు రద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపకుల కొరతతో ఓయూలో మరికొన్ని కోర్సులు రద్దయ్యాయి. గతంలో 12 పీజీ డిప్లొమా హెల్త్ కేర్ కోర్సులతోపాటు ఆర్ట్స్ కాలేజీలో కొని పీజీ కోర్సులను రద్దు చేయగా తాజాగా ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాల, బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో కొనసాగుతున్న సాయంకాలం రెగ్యులర్ పీజీ డిప్లొమా కోర్సులను రద్దు చేశారు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అభ్యర్థులకు అదనపు అర్హతగా కొనసాగిన 9 డిప్లొమా కోర్సులను వీసీ ప్రొ. రవీందర్ రెండేళ్ల క్రితం న్యాయ కాలేజీ నుంచి ఓయూ దూరవిద్య కేంద్రానికి బదిలీ చేశారు. కానీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) ఢిల్లీ, యూజీసీతోపాటు బార్ కౌన్సిల్ అనుమతి అవసరం. కానీ అందుకు సంబంధించిన కార్యాచరణ చేపట్టనందున రెండేళ్లుగా ప్రవేశాలు నిలిచిపోయాయి. దీనికితోడు న్యాయ శాస్త్రంలో అధ్యాపకుల కొరత, డిప్లొమా కోర్సుల నిర్వహణ కష్టతరంగా మారడంతో డిప్లొమా కోర్సులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు సమాచారం. అధ్యాపకులు లేరని, విద్యార్థులు తగిన సంఖ్యలో చేరడం లేదనే సమాచారం తెలియక ఆయా కోర్సుల్లో చేరిన అభ్యర్థులు ప్రవేశాలు పొంది నష్టపోతున్నారు. రద్దు చేసిన కోర్సుల వివరాలను అధికారికంగా ప్రకటించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## బీటెక్‌లో మిగులు సీట్లు 11,836

**రాష్ట్రవ్యాప్తంగా భర్తీ అయిన 86.4% ఇంజనీరింగ్ సీట్లు**

- ప్రైవేట్ కాలేజీల్లోనే అడ్మిషన్లు కాని సీట్లు 10,102, యూనివర్సిటీ కాలేజీల్లో 1,509
- ప్రైవేట్ వర్సిటీల్లో 111 సీట్లు, ప్రభుత్వ కాలేజీల్లో 114 సీట్లు మిగులు
- ఏఐ, సీఎస్ఎన్, సీఎస్ఏ కోర్సుల్లో వందశాతం ప్రవేశాలు

ఇంజనీరింగ్ డిగ్రీ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సర ప్రవేశాల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి విడతలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించిన యంత్రాంగం.. తాజాగా ప్రవేశాలు, ఖాళీల వివరాలు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 175 ఇంజనీరింగ్ కాలేజీల్లో 47 కోర్సుల్లో 86,943 సీట్లున్నాయి. 99,006 మంది విద్యార్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొని ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాగా.. 75,107 మంది అడ్మిషన్లు పొందారు. మొత్తంగా 11,836 సీట్లు ఖాళీగా మిగిలాయి. మొత్తం సీట్లలో 86.39 శాతం భర్తీ అయినట్లు సాంకేతిక విద్యాశాఖ శనివారం వెల్లడించింది. అత్యధికంగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 10,102 సీట్లు మిగిలిపోగా.. ప్రైవేట్ వర్సిటీల్లో మాత్రం 92 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ యూనివర్సిటీ కాలేజీల్లో 1,509 సీట్లు, ప్రభుత్వ కాలేజీల్లో 114 సీట్లు మిగలగా.. కోస్గిలో ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో 198 సీట్లగాను 84 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. కన్వీనర్ కోటా సీట్ల భర్తీ కౌన్సెలింగ్ ముగిసినా, కాలేజీ యాజమాన్యాలు స్పాట్ అడ్మిషన్ నిర్వహించే వెసులుబాటు కల్పించనున్నట్లు సమాచారం.

– సాక్షి, హైదరాబాద్



### మూడు కోర్సుల్లో వంద శాతం సీట్లు ఫుల్

కేవలం మూడు కోర్సుల్లో మాత్రమే వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఎన్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (సీఎస్ఏ) కోర్సుల్లో పరిమిత సీట్లు ఉన్నా, పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 95.59 శాతం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్–ఏఐ ఎంఎల్(సీఎస్ఎం)లో 94.43 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

| | | |
|---|---|---|
| కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ అనుబంధ కోర్సుల్లో 61,587 సీట్లు ఉండగా, 57,637 సీట్లు భర్తీ అయ్యాయి. 3,950 సీట్లు ఖాళీగా ఉన్నాయి. భర్తీ శాతం 93.59 | ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో 16,692 సీట్లకుగాను 12,672 సీట్లు భర్తీ అయ్యాయి. 4,020 సీట్లు ఖాళీగా ఉన్నాయి. భర్తీ శాతం 75.92 | సివిల్, మెకానికల్ కోర్సుల్లో 7,458 సీట్లకుగాను, 4,081 సీట్లు భర్తీ అయ్యాయి. 3,377 సీట్లు మిగిలాయి. భర్తీ శాతం 54.72 |

ఇతర బ్రాంచ్‌లలో 1,206 సీట్లు ఉండగా, 717 సీట్లు భర్తీ అయ్యాయి. 489 సీట్లు మిగిలిపోయాయి. భర్తీ శాతం 59.45

ఈనెల 21, 22 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహించగా 10,300 మంది విద్యార్థులు ఆప్షన్లు ఎక్సర్‌సైజ్ చేశారు. 27,935 ఆప్షన్లు ఇవ్వగా, 5,579 మంది విద్యార్థులకు కొత్త కోర్సుల్లో సీట్లు దక్కాయి. ఇంటర్నల్ స్లైడింగ్‌లో కొత్త కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థులు... కొత్త అలాట్‌మెంట్ ఆర్డర్‌ను ప్రింట్ తీసి సదరు కాలేజీలో సమర్పించాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సూచించారు. ఈనెల 25వ తేదీతో ఈ గడువు ముగియనుంది.



## టీజీ ఐసెట్–24 ప్రవేశాల షెడ్యూల్ విడుదల

**సెప్టెంబర్ 1 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ**

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీ ఐసెట్–2024 అడ్మిషన్ షెడ్యూల్ శనివారం విడుదలైంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ఆర్.లింబాద్రి అధ్యక్షతన ప్రవేశాల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన అడ్మిషన్ షెడ్యూల్ విడుదల చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్, పేమెంట్ ప్రక్రియ సాగుతుంది. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు (7వ తేదీ మినహా) స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ల నమోదు, అదే రోజు ఆప్షన్ల ఫ్రీజింగ్ ఉంటుంది. 14వ తేదీన ప్రొవిజినల్ సీట్ అలాట్‌మెంట్ చేపడతామని, సీట్లు సాధించిన అభ్యర్థులు 17వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన తెలిపారు. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

## బీఏ యానిమేషన్ కోర్సు దరఖాస్తు గడువు 31

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బీఏ యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్ కోర్సులో ప్రవేశాల గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇంటర్ మార్కుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9032644463, 9063242329 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 'కేటీఆర్ చిల్లర మాటలు మానాలి'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత కేటీ రామారావు చిల్లర మాటలు మానుకోవాలని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ హితవు పలికారు. కేటీఆర్ మాదిరి రాజభోగాలు అనుభవించేందుకు తనకు ఫామ్‌హౌస్ లేదన్నారు. కేటీఆర్‌కు జన్వాడలో ఫామ్‌హౌస్ ఉందని, 111 జీవోకు వ్యతిరేకంగా ఫామ్‌హౌస్ నిర్మించారని ఆరోపించారు. ప్రజల్లో ఉండే వ్యక్తిగా తనకు పేరుందని, అందరిలా సాధారణ జీవితం గడిపే వ్యక్తినని స్పష్టం చేశారు. తనకు గండిపేట దగ్గర మామిడి తోట, సపోట తోట ఉన్నాయి తప్ప ఫామ్‌హౌస్ లేదన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాని వాస్తవాలు మాట్లాడాలని మధుయాష్కీ గౌడ్ సూచించారు.

## వచ్చేనెల 25న సీఎం రేవంత్ హాజరుకావాలి

- బీజేపీ మీద ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డికి నాంపల్లి కోర్టు ఆదేశం
- ఇది మా మొదటి విజయం: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



సాక్షి, హైదరాబాద్ : ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి బీజేపీపై ఆరోపణలు చేసినందుకుగాను ఆ పార్టీ కోర్టులో వేసిన ఫిర్యాదుకు సంబంధించి సెప్టెంబర్ 25న సీఎం హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. కేంద్రంలో నరేంద్రమోదీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగించే కుట్ర చేస్తారంటూ ఎన్నికలప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీజేపీ కోర్టులో ఫిర్యాదు చేసిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సాకుతో అడ్డగోలు మాటలు, తప్పుడు ఆరోపణలు, అవాస్తవాలు ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. తాము దాఖలు చేసిన పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణ చేపట్టి వాంగ్మూలం సేకరించిందని, బహిరంగసభలో రేవంత్ మాట్లాడిన వీడియోలను పరిశీలించిందన్నారు. ఇది తమ మొదటి విజయంగా భావిస్తున్నామని, కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలను న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు.

## ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు నోటీసులు

- కమిషన్ కార్యాలయంలో విచారణకొచ్చిన కేటీఆర్‌కు రాఖీలు కట్టి వీడియోలు తీస్తారా?
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మహిళా కమిషన్ సభ్యులకు కమిషన్ కార్యదర్శి శనివారం నోటీసులు జారీ చేశారు. ఓ కేసు విషయంలో మహిళా కమిషన్‌కు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్‌కు కమిషన్ కార్యాలయంలో రాఖీలు కట్టడం, ఈ వ్యవహారాన్ని వీడియోలు తీయడం పట్ల మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్ కార్యాలయంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేకపోయినా తీసుకొచ్చి ఫొటోలు తీసిన అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద... ఆరుగురు సభ్యులకు నోటీసులు జారీ చేయాలని కమిషన్ కార్యదర్శిని ఆదేశించారు. ఈ మేరకు కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. తెలంగాణ మహిళా కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా సభ్యులు ప్రవర్తించారని చైర్‌పర్సన్ శారద తీవ్రంగా స్పందించారు. సభ్యులపై చర్యలు తీసుకునేందుకు న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## బీపీఎస్ నిధులను విడుదల చేయాలి

**25 వేల మంది విద్యార్థులకు రూ.210 కోట్లు పెండింగ్**

- నాడు వైఎస్ ప్రారంభించిన ఆ పథకాన్ని బీఆర్ఎస్ కొనసాగించింది
- కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది
- డిప్యూటీ సీఎం భట్టికి మాజీ మంత్రి హరీశ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీపీఎస్) పథకం కింద ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ. 80 కోట్లతో పాటు ఈ ఏడాది విడుదల కావాల్సిన రూ.130 కోట్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ఆ నిధులు విడుదల కాకపోవడంతో 25 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదివే పేద దళిత, గిరిజన విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఇలాంటి పథకానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కొనసాగించిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యతో పాటు చెల్లించే మొత్తాన్ని కూడా పెంచామని వివరించారు. ఏటా రూ.130 కోట్లు ఈ పథకానికి కేటాయించాల్సి ఉన్నా నిధుల విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

### రోగాలు విజృంభిస్తున్నా చర్యలేవీ?

ప్రజారోగ్య సంరక్షణను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఓ ప్రకటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిస్తే.. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్యారోగ్యరంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. వర్షాకాలంలో ఆసుపత్రుల సన్నద్ధత, పారిశుద్ధ్యంపై సమీక్షలు జరగడం లేదని నిందించారు. పల్లె, పట్టణం తేడా లేకుండా మలేరియా, డెంగీ వంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నా చర్యలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన డెంగీ మరణాలు ప్రభుత్వ హత్యలేనని, వీటికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

# హుందాగా ఉండాలనే క్షమాపణ చెప్పా

▶ మొదటి పేజీ తరువాయి

కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'చట్టం, మహిళలను గౌరవించే వ్యక్తిగా మాట దొర్లటంపై క్షమాపణ అడిగా. షాద్‌నగర్‌లో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం, కొల్లాపూర్‌లో చెంచు మహిళపై దాడి, గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు తదితర ఘటనలు కమిషన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లా. మరోమారు రావాలని కమిషన్ చైర్‌పర్సన్ కోరారు. చైర్‌పర్సన్‌పై గౌరవంతో సమయం తీసుకొని మళ్లీ వస్తా. నేను ఇచ్చిన వివరణపై కమిషన్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**మహిళానేతలతో కలిసి కమిషన్ వద్దకు**

బీఆర్ఎస్ మహిళానేతలతో కలిసి శనివారం ఉదయం తెలంగాణభవన్ నుంచి మహిళా కమిషన్ కార్యాలయానికి కేటీఆర్ చేరుకున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్‌తోపాటు కవిత, హరిప్రియ, గంగ్ర జ్యోతి, ఉమ, సుశీలారెడ్డి, పావనిగౌడ్, తదితరులు ఉన్నారు. కార్యాలయంలో మహిళా కమిషన్ సభ్యులు కేటీఆర్‌కు రాఖీ కట్టారు. అయితే కమిషన్ చైర్‌పర్సన్ శారద ఆదేశాల మేరకు కేటీఆర్ ఒక్కరినే లోపలికి అనుమతించారు. విచారణ సందర్భంగా తమను లోనికి అనుమతించకపోవడంపై మహిళాకమిషన్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.గతంలో బండి సంజయ్‌ని మహిళా కమిషన్ విచారణ జరిపిన సందర్భంలో కమిషన్ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు కూడా పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు.

**క్షమాపణలతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సంతృప్తి**

కేటీఆర్ క్షమాపణ చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ ప్రకటించింది. భవిష్యత్‌లో ఈ తరహా వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఇలాంటివి పునరావృతం చేస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. మహిళల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసమే తెలంగాణ మహిళా కమిషన్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిందన్నారు. కమిషన్ ముందు హాజరై తాను చేసిన ప్రకటనల పట్ల కేటీఆర్ విచారం వ్యక్తం చేసినట్టు తెలిపింది. ఆ తరహా వ్యాఖ్యలు తన స్థాయి రాజకీయ నేతలు చేయాల్సిన కావని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేసినట్టు మహిళా కమిషన్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

### కేటీఆర్ కాన్వాయ్‌కి అడ్డుగా సునీతారావు

కేటీఆర్ కార్యాలయంలోకి వెళ్లడానికి ముందు ఒక్కసారిగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆయన కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కారు ముందు బైఠాయించారు. దీంతో కేటీఆర్ ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై నిలిచిపోయింది. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి సునీతారావును కారు ముందు నుంచి తొలగించారు. పోలీసు రక్షణలో కేటీఆర్ రెండవ అంతస్తులోని మహిళా కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు.

### మహిళా నేతల డిష్యుం...డిష్యుం

కార్యాలయ సెల్లార్‌లోకి వచ్చిన బీఆర్ఎస్, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు పోటా పోటీగా నినాదాలు చేస్తూ గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ చెప్పులు చూపించుకుంటూ నానా హంగామా చేశారు. ఎట్టకేలకు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు రోడ్డుపై బైఠాయించి కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు సెల్లార్‌లో బైఠాయించి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోటాపోటీ ఆందోళనలతో మహిళా కమిషన్ కార్యాలయ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఓ వైపు కొందరు...మరో చోట ఇంకొందరు నినాదాలు చేస్తూ హోరెత్తించారు. చాలాసేపటి తర్వాత పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎట్టకేలకు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకురాళ్లను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో తరలించారు. ఓ స్థాయి మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పోలీసు జులుం నశించాలి అంటూ నినాదాలు చేశారు. వాహనాల్లోకి ఎక్కకుండా పోలీసులను ముప్పుతిప్పలు పెట్టారు.

## అధికారం కోల్పోయినా అహం తగ్గలేదు

**మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు**



సాక్షి, హైదరాబాద్: అధికారం నుంచి ప్రజలు తప్పించినా బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు విమర్శించారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన సందర్భంగా క్షమాపణలు చెప్పాలని కేటీఆర్‌ను కోరేందుకు వెళ్తే.. కూలీలతో తమపై దాడి చేయించారని ఆరోపించారు. ఆమె శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళలనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్.. అదే బస్సు ఎక్కి మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయన్ను తెలంగాణలో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. మహిళా కమిషన్ వద్ద పోలీసులు పక్షపాతంగా వ్యవహరించారని, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను జుట్టు పట్టుకుని బూట్లతో తన్నారని ఆరోపించారు. యూనిఫాం వేసుకున్న దొంగ పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని సునీతారావు కోరారు.




“దేవుడు వారిని ఆశీర్వదించెను. మీరు ఫలించి, అభివృద్ధి పొంది, విస్తరించి, భూమిని నిండించి, దానిని లోబరుచుకొనుడి; సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను, భూమి మీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను.

– క్రైస్తవ ధర్మం



# ‘భూత్’ బంగ్లా సర్కార్!



## జనతంత్రం

వర్ధెల్లి మురళి

దేశంలోని ప్రస్తుత సీనియర్ మోస్ట్ రాజకీయవేత్తల్లో ఆయన ఒకరు. ముఖ్యమంత్రిగా ఇప్పుడు ఫోర్–ఓ (4.0) వెర్షన్. పదిహేనేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి అనే ట్యాగ్‌లైన్‌తో తిరిగారు. ఇంతటి అనుభవశాలి ఎందుకో కలవరపడుతున్నారు. అభద్రతా భావంతో తత్తరపాటుకు గురవుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి పేరు వింటేనే ఆయన సర్వేంద్రియాలు సంక్షోభానికి లోనవుతున్నవి. విజ్ఞత విలుప్తమైపోతున్నది. ఆయన జనంలోకి వెళితే ఈయన జ్వరపీడితుడవుతున్నారు. ఆ వేడికి భాష మరిగిపోతున్నది.

విశాఖ సమీపంలో జరిగిన ఫార్మా కంపెనీ దుర్ఘటన సందర్భాన్నే తీసుకుందాము. బాధిత కుటుంబాలను ఓదార్చడానికి మాజీ ముఖ్యమంత్రి అక్కడికి వెళ్లారు. చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరినీ అనునయించి ధైర్యం చెప్పారు. అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. ఆయన రాకను పురస్కరించుకొని వేలాది జనం అక్కడ గుమిగూడారు. ఈ పరిణామం ముఖ్యమంత్రికి ఆగ్రహం తెప్పించింది. ఆ తర్వాత కాసేపటికి జరిగిన ఒక గ్రామ సభలో ఆయన మాటలు అదుపు తప్పాయి.

మాజీ ముఖ్యమంత్రిని భూతంతో పోల్చారు. ఆ భూతం మళ్లీ వస్తా వస్తా అంటున్నదనీ, దాన్ని భూస్థాపితం చేయాలంటూ చెలరేగిపోయారు. ఇంకా కిందకు జారి మాట్లాడారు. మొన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసి, ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి హోదాతో ఉన్న వ్యక్తిని భూతంతో పోల్చితే అవే హోదాలు ఇంకా ఎక్కువకాలం అనుభవించిన తాను ఏమవుతారు? భూతమా... దయ్యమా? ఆయనీమధ్య తాను ’95 మోడల్ ముఖ్యమంత్రినని పదేపదే చెప్పుకుంటున్నారు. ఆ 95 మోడల్ అంటే నిజంగా జనాన్ని పీల్చి పిప్పిచేసిన దయ్యాలమర్రి పాలనే!

ప్రజలకు ఉచితంగా ఏదీ ఇవ్వకూడదంటూ నీతి శతకాలు రచించిన పాలకుడే నైన్టీ ఫైవ్ మోడల్. ధర్మాస్పత్రిలో జ్వరం బిళ్లకు సైతం యూజర్ ఛార్జీలు వసూలు చేసిన చేటుకాలమే 95 టూ 2004. ఆ తొమ్మిదేళ్ల కాలం ఉమ్మడి రాష్ట్ర రైతాంగ చరిత్రలో ఒక భీతావహ అధ్యాయం. నాగేటి చాళ్లలో క్షుద్ర విత్తనాలు మొలకెత్తిన కాలం. చేలల్లో చావు కంకులు విరగ్గాసిన కాలం. వేలాది రైతన్నలు ఉరికొయ్యలకు వేలాడిన రోజులు. 95 మోడల్‌కు వ్యవసాయం ఓ దండగమారి పని. అందువల్లనే ఆ మోడల్ అమలు చేసిన విధానాలు వ్యవసాయ రంగంలో విధ్వంసాన్ని సృష్టించాయి.

’95 మోడల్‌నని చెప్పుకోవడమే కాదు, ఆ దారిలో ఇప్పుడు కూడా పయనిస్తున్నారు! ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో ఎరువుల కోసం రైతుల క్యూలైన్లు కన్పిస్తున్నాయి. ‘అమూల్’ రంగప్రవేశంతో అధికాదాయం సంపాదించిన పాడి రైతుల నోట్లో అప్పుడే మట్టిపడింది. ‘అమూల్’ను రంగం నుంచి తప్పిస్తున్నారు. పోటీ లేకపోవడంతో హెరిటేజ్ తదితర సంస్థలు సేకరణ ధరను తగ్గిస్తున్నాయి. రెండున్నర మాసాల్లోనే ’95 మోడల్’ చూపెట్టిన చిన్న ఝలక్ మాత్రమే ఇది. ముందున్నది అసలైన నిజరూప దర్శనం.

పేదలకు ఉచితంగా ఏదీ ఇవ్వకూడదు, ప్రైవేట్ గద్దలకు మాత్రం సమస్త వనరులను దోచిపెట్టాలన్నది ఆ మోడల్ నిత్యం జపించే తిరుమంత్రం. అందుకే ‘అమ్మ ఒడి’ ఆగిపోయింది. అందుకే ‘రైతు భరోసా’ ఆగిపోయింది. ‘విద్యా దీవెన’, ‘విద్యా కానుక’లు ఆగిపోయాయి. పంటల బీమా, మత్స్యకార భరోసా వెనక్కు మళ్లాయి. ఇంటి దగ్గర దర్జాగా పెన్షన్లు తీసుకున్న అవ్వాతాతలను నాయకుల ఇళ్ల ముందు నిలబెట్టుకుంటున్నారు. నిరుపేదల బిడ్డలు సైతం సంపన్న శ్రేణితో సమానంగా అంతర్జాతీయ స్థాయి విద్యను అభ్యసించడానికి అందివచ్చిన అవకాశాన్ని ఈ ’95 మోడల్ వచ్చీరాగానే తన్ని తగలేసింది. ఐబీ సిలబస్‌ను అటకెక్కించారు. ఇంగ్లిషు మీడియం ఉపసంహరణకు రంగం సిద్ధమైంది.

పేదలు, బలహీనవర్గాలు, మహిళల సాధికారత కోసం కార్యక్రమాలు చేపట్టినందుకే మాజీ ముఖ్యమంత్రిని మన ’95 మోడల్’ భూతంగా పరిగణిస్తున్నది. ఈ ధోరణి కొత్త కాదు. పేద ప్రజల పక్షాన నినదించిన ప్రతి గొంతుకనూ దయ్యాలు, భూతాల గొంతుకగా బ్రాండింగ్ చేయడం, దుష్ప్రచారానికి ఒడిగట్టడం శతాబ్దాలకు పూర్వమే ప్రారంభమైంది. 1848లో కార్ల్ మార్క్స్ ప్రచురించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో ‘యూరోప్‌ను కమ్యూనిస్టు భూతం వెంటాడుతున్నది’ అనే వాక్యంతో ప్రారంభమైంది. కమ్యూనిస్టు భావజాలాన్ని భూతంగా భావించే నాటి పాలక ప్రతిపక్ష పార్టీలకు హెచ్చరికగా మార్క్స్ ఈ వాక్యాన్ని రాశారు.

ఇప్పుడూ అంతే! ఐదేళ్ల కాలంలో రెండు లక్షల డెబ్బయ్ వేల కోట్ల ప్రజా ధనాన్ని ప్రజల అకౌంట్లలోకే బదిలీ చేసి అణగారిన జీవితాలనూ, వాటితోపాటు ఆర్థిక వ్యవస్థను కూడా ఉద్దీపింపజేసిన దార్శనిక పాలనను భూతాల పరిపాలనగా

మాజీ ముఖ్యమంత్రిని భూతంతో పోల్చారు చంద్రబాబు. ఆ భూతం మళ్లీ వస్తా వస్తా అంటున్నదనీ, దాన్ని భూస్థాపితం చేయాలంటూ చెలరేగిపోయారు. ఇంకా కిందకు జారి మాట్లాడారు. మొన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసి, ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి హోదాతో ఉన్న వ్యక్తిని భూతంతో పోల్చితే అవే హోదాలు ఇంకా ఎక్కువకాలం అనుభవించిన తాను ఏమవుతారు? భూతమా... దయ్యమా? ఆయనీమధ్య తాను ’95 మోడల్ ముఖ్యమంత్రినని పదేపదే చెప్పుకుంటున్నారు. ఆ 95 మోడల్ అంటే నిజంగా జనాన్ని పీల్చి పిప్పిచేసిన దయ్యాలమర్రి పాలనే!

ప్రజలకు ఉచితంగా ఏదీ ఇవ్వకూడదంటూ నీతి శతకాలు రచించిన పాలకుడే నైన్టీ ఫైవ్ మోడల్. ధర్మాస్పత్రిలో జ్వరం బిళ్లకు సైతం యూజర్ ఛార్జీలు వసూలు చేసిన చేటుకాలమే 95 టూ 2004. ఆ తొమ్మిదేళ్ల కాలం ఉమ్మడి రాష్ట్ర రైతాంగ చరిత్రలో ఒక భీతావహ అధ్యాయం. నాగేటి చాళ్లలో క్షుద్ర విత్తనాలు మొలకెత్తిన కాలం. చేలల్లో చావు కంకులు విరగ్గాసిన కాలం. వేలాది రైతన్నలు ఉరికొయ్యలకు వేలాడిన రోజులు. 95 మోడల్‌కు వ్యవసాయం ఓ దండగమారి పని. అందువల్లనే ఆ మోడల్ అమలు చేసిన విధానాలు వ్యవసాయ రంగంలో విధ్వంసాన్ని సృష్టించాయి.

’95 మోడల్‌నని చెప్పుకోవడమే కాదు, ఆ దారిలో ఇప్పుడు కూడా పయనిస్తున్నారు! ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో ఎరువుల కోసం రైతుల క్యూలైన్లు కన్పిస్తున్నాయి. ‘అమూల్’ రంగప్రవేశంతో అధికాదాయం సంపాదించిన పాడి రైతుల నోట్లో అప్పుడే మట్టిపడింది. ‘అమూల్’ను రంగం నుంచి తప్పిస్తున్నారు. పోటీ లేకపోవడంతో హెరిటేజ్ తదితర సంస్థలు సేకరణ ధరను తగ్గిస్తున్నాయి.

ప్రచారం చేస్తున్నారు. వైద్యాన్ని ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ, ప్రజా వైద్య విధానాన్ని రూపొందించిన ప్రభుత్వానిది భూతాల పాలనట! దాన్నిప్పుడు ప్రైవేట్ పెట్టుబడికి తాకట్టు పెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలు ప్రగతిశీలమట! దయ్యాలు వేదాలు వల్లించడమంటే అచ్చంగా ఇదే కదా! ఈ ముఖ్యమంత్రి ఇప్పుడు అదే పని చేస్తున్నారు.

ఏ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేసిందనే అంశంపై చర్చ జరపడం ఒక భాగం. ఎవరిది ప్రజాస్వామ్య రాజకీయమో, ఎవరిది దయ్యాలు – భూతాల రాజకీయమో తేల్చడానికి ఇంకో చర్చ కూడా ఉన్నది. వారు ఏ రకంగా అధికారంలోకి వచ్చారన్నది పరిశీలించడానికి ఈ చర్చ జరగాలి. ఈ ముఖ్యమంత్రి తొలి రౌండ్‌లో ఏవిధంగా అధికారంలోకి వచ్చారన్నది జగమెరిగిన వెన్నుపోటు కథ. పార్టీ ఆయన స్థాపించినది కాదు. ఎమ్మెల్యేలను గెలిపించిందీ ఆయన కాదు. వదంతులను ప్రచారం చేసి, ఎమ్మెల్యేలను ‘వైస్రాయ్’లో నిర్బంధించి, మీడియాతో కుమ్మక్కయి, రాజ్యాంగ వ్యవస్థలను మచ్చిక చేసుకుని దొడ్డిదారిన అధికార పీఠమెక్కారు. మాజీ ముఖ్యమంత్రి రాజకీయ ప్రస్థానం ఇందుకు పూర్తిగా భిన్నమైన ప్రయాణం.

ఆయనే స్వయంగా పార్టీని నిర్మించుకున్నారు. ఇందుకు భారీ మూల్యాన్ని ఆయన చెల్లించుకోవలసి వచ్చింది. అయినా తలొగ్గకుండా జనంలోకి వెళ్లారు. అలవికాని వాగ్దానాలను చేయడానికి నిరాకరించి కోరి ఓటమిని తెచ్చుకున్నారు. ప్రతిపక్షంలో ఐదేళ్ల గట్టిగా నిలబడి ఒంటరి పోరాటంతోనే ముఖ్యమంత్రి అయ్యారు. భూతం ఎవరు? రాచబాటలో వచ్చినవారా? దొడ్డిదారిన ప్రవేశించిన వారా?

ప్రస్తుత ముఖ్యమంత్రి ఈ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో నాలుగో దఫా ఎలా అధికారంలోకి వచ్చారు? పెంపుడు మీడియాను ఉసిగొలిపి పాత ప్రభుత్వంపై అవాకులు చెవాకులు ప్రచారం చేశారు. సరిపోలేదు. కాళ్లావేళ్లా పడి ఎన్డీఏ కూటమిలో చేరారు. ఎన్నికల సంఘాన్ని అదుపులో పెట్టుకున్నారు. ఇది కూడా సరిపోలేదని స్వతంత్ర పరిశోధకులు, సంస్థలు బల్లగుద్ది చెబుతున్నాయి. పోలింగ్ జరిగిన రోజు రాత్రి 8 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లో 68 శాతానికి పైగా ఓట్లు పోలైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ తర్వాత తీరిగ్గా నాలుగు రోజుల సమయం తీసుకొని 81 శాతం పోలైనట్టు ప్రకటించింది. ఇది అసాధారణమని ‘ఓట్ ఫర్ డెమోక్రసీ’ (వీఎఫ్‌డీ) అనే సంస్థ వాదిస్తున్నది. గతంలో ఎన్నడూ ఈ తేడా ఒక శాతం కన్నా అధికంగా ఉండేది కాదు. ఈసారి ఏపీలో అది 12.5 శాతంగా నమోదైంది. ఈవీఎమ్‌ల మాయాజాలమే ఈ అధిక ఓట్ల నమోదుకు ప్రధాన కారణమని వీఎఫ్‌డీ ఆరోపిస్తున్నది. ఎన్డీఏ మౌత్‌పీస్‌గా పనిచేసే ఓ జాతీయ చానల్ కూడా నిన్న ప్రసారం చేసిన ఒక సర్వే వివరాల్లో చంద్రబాబుకు 44 శాతం ప్రజల మద్దతున్నట్టు తేల్చింది. కూటమికి పడిన 56 శాతం ఓట్లలో ఇది 12 శాతం కోత. వీఎఫ్‌డీ చెబుతున్న అక్రమ ఓట్లకు ఈ నంబర్ సరిపోతున్నది.

వీఎఫ్‌డీ ఈ వ్యవహారంపై ఒక సమగ్రమైన రిపోర్టును విడుదల చేసి, నెలరోజులు దాటినా ఇప్పటివరకూ ఎన్నికల సంఘం స్పందించలేదు. ఈ కృత్రిమ అధిక ఓట్ల నమోదు కారణంగా కేంద్రంలోనూ, ఏపీ, ఒడిషాల్లోనూ గెలవాల్సిన పక్షాలు ఓడిపోయాయి. పోలింగ్ శాతంపై కొన్ని రోజుల తర్వాత చేసిన తుది ప్రకటనకూ, లెక్కించిన ఓట్లకూ కూడా తేడాలున్నాయి. సుమారు 390 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈ తేడాలున్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. కొన్ని నియోజకవర్గాల్లో లెక్కించిన ఓట్లు పోలయినట్టు ప్రకటించిన ఓట్ల కంటే తక్కువున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎక్కువున్నాయి. ఇదెలా సాధ్యం? ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్లలో దయ్యాలు, భూతాలు దూరితేనే సాధ్యమవుతుంది.

ఆ దయ్యాలూ, భూతాలు ఎట్లా దూరాయన్న రహస్యం విజేతలకు మాత్రమే తెలుస్తుంది. వారికి అనుబంధంగా పనిచేసిన ఎన్నికల సంఘానికి మాత్రమే తెలుస్తుంది. దేశవ్యాప్తంగా ఈ అంశంపై పలువురు మేధావులు గొంతెత్తి మాట్లాడారు. చర్చోపచర్చలు జరుగుతున్నాయి. అయినా ఎన్నికల సంఘం మాత్రం నోరు విప్పలేదు. పైపెచ్చు, అనుమానం ఉన్న నియోజకవర్గాల్లో 5 శాతం వీవీ ప్యాట్లను లెక్కించాలని సుప్రీంకోర్టు చెప్పిన విషయంపై కూడా ఈసీ వక్రభాష్యాలు చెబుతున్నది. ఈవీఎమ్‌లపై అధికారికంగా ఫిర్యాదులు చేసిన అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తేవడం కూడా పలు అనుమానాలకు తావిచ్చింది. ఏపీలో ఎన్డీఏ కూటమి కూడా ఈ అంశంపై నోటికి తాళం వేసుకున్నది. కచ్చితంగా ఏదో జరిగిందన్నది అఖిలాంధ్ర ప్రజల నిశ్చితాభిప్రాయం. ఎన్నికల హామీల నుంచి, ఈవీఎమ్‌ల బాగోతం నుంచి పక్కదారి పట్టించే ప్రయత్నాల్లో కూటమి పెద్దల మాటలూ, చేతలు అదుపు తప్పుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థిని భూస్థాపితం చేసి పైకి రాకుండా కాంక్రీట్ పోయాలనే పైశాచిక ఆలోచనలు చెలరేగుతున్నాయి.

vardhelli1959@gmail.com

# చరిత్ర కుహరాల నుంచి...



అభిప్రాయం

చల్లపల్లి స్వరూపరాణి

అణగారిన ప్రజలు తమకి ఓ గొప్ప పోరాట చరిత్ర ఉందని తెలిస్తే యథాతథ వాదాన్ని అంగీకరించరు. వర్తమానంలో తమపై అమలయ్యే వివక్షను కచ్చితంగా ఎదిరిస్తారు. అది తమ తలరాత అని ఊరుకోకుండా తమపై రుద్దిన బానిసత్వంపై తిరగబడి తమదైన కొత్త సమాజాన్ని నిర్మించుకుంటారని మహాత్మా జ్యోతిరావు పూలే ఎప్పుడో చెప్పాడు.

పూలే చెప్పిన పోరాటాల చరిత్రను... ప్రాచీన భారత దేశ చరిత్ర అంతా బౌద్ధానికి– వైదిక హిందూ మతానికి మధ్య జరిగిన ఘర్షణ అని బాబాసాహెబ్ అంబేడ్కర్ విశదీకరించాడు. ఇంతకాలం కట్టుకథలు, పిట్టకథలు చరిత్రగా చలామణి అయినట్లే మన సినిమాలు కూడా ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు మసిపూసి మారేడుకాయ చేస్తూ కొందరి జీవితాన్నే అందరి జీవితంగా కాకమ్మ కథలతో జనం కంట్లో కారం కొట్టి బతికేస్తున్నాయి.

అయితే సింహాల నుంచి చరిత్రకారుడు పుట్టుకొచ్చాడు. వర్ణ అంధత్వంతో కునారిల్లిన నూరేళ్ళ వెండి తెరను బదబదాలుగా చించి పోగులు పెడుతూ సరికొత్త దారిని వేసుకుంటూ పోతున్నాడు పా. రంజిత్. అవును పా. రంజిత్ అసలైన చరిత్రను రక్తమాంసాలతో సిల్వర్ స్క్రీన్ మీద పరుస్తున్నాడు. తంగలాన్ ఈ దేశ మూలవాసుల అసలు చరిత్ర... చూసినవాళ్లకి కంటి మీద కునుకు పడనీయని చరిత్ర!

తంగలాన్ అందర్నీ తీవ్రంగా డిస్టర్బ్ చేస్తున్నాడు. కడుపులో చేయిపెట్టి దేవుతున్నాడు. కొందరు బాహాటంగానే వాంతులు చేసుకుంటున్నారు. మరికొందరికి రక్తం మరుగుతుంది, కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. చారెడు భూమి కోసం, కాసింత గౌరవం కోసం తమవాళ్ళు చేసిన హాహాకారాలు, కొండలు గుట్టలు దాటి నడిచిన యోజనాలు, కడచిన దారులు, చరిత్ర పొడవునా పారిన నెత్తురు కళ్ళముందు కదులుతూంటే గుండె చెరువవుతోంది.

ఎవరు కాదని బుకాయించినా ఈ దేశ సాంస్కృతిక వారసత్వం బౌద్ధంలో ఉంది. నేటి దళితులు బౌద్ధ సాహిత్యంలో పేర్కొన్న నాగుల సంతతివారు. వారే బౌద్ధాన్ని అవలంబించి బుద్ధుని మార్గంలో నడిచిన శాంతి కాముకులు. కానీ బౌద్ధాన్ని చంపి, బౌద్ధులపై అంటరాని తనాన్ని రుద్దుతూ వారి మెడలో ముంతలు కట్టింది వైదిక బ్రాహ్మణ మతం. తర్వాత తన సంఖ్యాబలాన్ని పెంచుకోవడానికి దళితుల మెడలో ముంతను అంతే ఉంచి జంధ్యం వేసింది. వైష్ణవ మతంలోకి వెళ్ళిన దళితులను వెళ్లని వారి నెత్తిన కూర్చోబెట్టింది. ఈ చరిత్రను తంగలాన్‌లో పా. రంజిత్ కళ్ళకు కట్టించాడు.



‘తంగలాన్’ చిత్రీకరణ సమయంలో నటుడు విక్రమ్ - దర్శకుడు పా. రంజిత్

బౌద్ధంలో ‘హారీతి’ అనే దేవత ఉన్నట్టు తెలుగు శాసనాల్లో కూడా ఉంది. ఆమె ఒక ప్రకృతి దేవత. వజ్రయానంలో సిద్ధులు చేసిన ప్రయోగాలు, సిద్ధుల రసవాదం పక్కన పెట్టి వారిని ‘క్షుద్ర’ విద్యలు తెలిసిన మాంత్రికులనీ, బుద్ధుడిని అశుభానికి గుర్తుగా ప్రచారం చేసింది పూజారి వర్గం. బౌద్ధాన్ని అవలంబించేవారిని ఉలిపి కట్టెలుగా, సమాజానికి కీడు చేసేవారిగా చిత్రించి వారిపట్ల ద్వేష భావం పెంచడాన్ని ఈ సినిమాలో సందర్భానుసారంగా చూపించాడు.

తమిళనాడు నుంచి కోలార్ బంగారు గనులకు కూలికోసం గని తవ్వకం పనికి వెళ్లి అక్కడే స్థిరపడిన దళితులు 19వ శతాబ్దం చివరికి కేజీఎఫ్‌లో ఓ కొత్త సమాజాన్ని నిర్మించుకున్నారు. పండిత అయోతీదాసు కేజీఎఫ్ కేంద్రంగా ఆది ద్రావిడ ఉద్యమాన్ని నిర్మించాడు. దళితులు హిందువులు కాదు, ఆది బౌద్ధులని చెప్పి వారిలో ఆత్మగౌరవాన్ని నూరిపోసి ‘శాక్య బౌద్ధ సమాజాన్ని’ స్థాపించిన అయోతీదాసుకి కేజీఎఫ్ ఒక లిబరేటెడ్ లాండ్ (విముక్త భూమి). దీనికి కొనసాగింపుగా పెరియార్ 1932లో ద్రావిడ ఉద్యమాన్ని కేజీఎఫ్ నుంచే ప్రారంభించడం విశేషం.

కేజీఎఫ్‌లో దళితులు ఇప్పటికీ కులానికీ, మత తత్వానికీ ఎదురు నిలుస్తూ ప్రత్యామ్నాయ రాజకీయాలు కూడా నిర్మిస్తున్నారు. దాని వెనుక ఉన్న త్యాగాల చరిత్రను పట్టుకున్నాడు పా. రంజిత్.

తంగలాన్ దళిత సమస్య తాలూకు ప్రతి అంశాన్నీ తడిమిందని చెప్పాలి. దళిత స్త్రీలు ఒకప్పుడు పైవస్త్రం రవిక వేసుకునే వీలు లేదు. అది కొన్ని ప్రాంతాలలో నిషేధం అయితే మరికొన్ని చోట్ల తమ పేదరికం వలన కూడా వారికి అది దక్కేది కాదు. వారు రవిక ధరించడం తమ జనంలో ఓ గొప్ప ఉత్సవం. ఈ సినిమాలో అటువంటి సన్నివేశం ఒకటి అద్భుతంగా చిత్రించాడు పా. రంజిత్.

అలాగే దళితుల ఆహారం! వారంతా గని తవ్వకం పనికి కోలార్ వెళ్లినాక కథానాయకుడు తంగలాన్‌తో అతని భార్య గంగమ్మ ‘మావా చింతపండు పులుసు పోసి నెత్తళ్ళ కూర వొండేదా?’ అంటే అతడు ‘కాదుమే, ఎండు తునకలు కూర చెయ్’ అంటాడు. వారు తిండిలేక అలమటిస్తున్నప్పుడు ఒక అడవి దున్న కనిపిస్తే దానిని నరికి మాంసం తిని తిరిగి శక్తి తెచ్చుకుని పని మొదలు పెట్టాలి అనుకుంటారు. ఇవన్నీ వారి జీవితాలలో సహజాతి సహజం. దళిత సమాజంలో స్త్రీ–పురుష సంబంధాలలో ఒకప్పుడు కనిపించే అరమరికలు లేనితనం, గుంపులో ఒకరిపట్ల మరొకరికి ఉండే కన్సర్న్, సామూహికత, చక్కటి సంభాషణలు తంగలాన్ సినిమాకు గొప్ప సౌందర్యాన్ని అద్దాయనవచ్చు.

తెగిపడిన శాక్యముని తలని అతికించడం, చరిత్రలో కానరాకుండా పోయిన బంగారం లాంటి మూలవాసుల చరిత్రను వెలికితీయడం... అనే రెండు ముఖ్యమైన కర్తవ్యాలను తంగలాన్ శక్తిమంతంగా నిర్వహించింది. భూమి కోసం, భుక్తికోసం, ఆత్మగౌరవం కోసం చరిత్ర పొడవునా దళితులు వేసిన పొలికేకలు ఈ సినిమాలో మనకి అడుగడుగునా వినిపిస్తాయి. చరిత్ర కళ్ళకు కట్టినట్టు వాస్తవికంగా కనిపించడం తంగలాన్ విజయం!

నూరేళ్ళ వెండితెరపై మట్టి పాదాల్ని తన సంతకంగా ముద్రించిన సిసలైన తంగలాన్ పా. రంజిత్, తంగలాన్ పాత్రలో పూర్తిగా నిమగ్నమై గొప్పగా దానికి జీవం పోసిన హీరో విక్రమ్, అతని భార్యగా నటించిన పార్వతి, ప్రకృతి దేవత ‘ఆరతి’గా నటించిన మాళవిక, ఇతర నటీనటులు; ఒళ్ళు గగుర్పొడిచే సంగీతాన్ని అందించిన జీవీ ప్రకాష్, ‘అంటారానోళ్ల’ చరిత్రని సంగర్వంగా సమర్పించిన జ్ఞానవేల్... అందరికీ జై భీమ్!

తమిళనాడు నుంచి కోలార్ బంగారు గనులకు కూలికోసం గని తవ్వకం పనికి వెళ్లి అక్కడే స్థిరపడిన దళితులు 19వ శతాబ్దం చివరికి కేజీఎఫ్‌లో ఓ కొత్త సమాజాన్ని నిర్మించుకున్నారు. పండిత అయోతీదాసు కేజీఎఫ్ కేంద్రంగా ఆది ద్రావిడ ఉద్యమాన్ని నిర్మించాడు. దళితులు హిందువులు కాదు, ఆది బౌద్ధులని చెప్పి వారిలో ఆత్మగౌరవాన్ని నూరిపోసి ‘శాక్య బౌద్ధ సమాజాన్ని’ స్థాపించిన అయోతీదాసుకి కేజీఎఫ్ ఒక లిబరేటెడ్ లాండ్ (విముక్త భూమి). దీనికి కొనసాగింపుగా పెరియార్ 1932లో ద్రావిడ ఉద్యమాన్ని కేజీఎఫ్ నుంచే ప్రారంభించడం విశేషం.

కేజీఎఫ్‌లో దళితులు ఇప్పటికీ కులానికీ, మత తత్వానికీ ఎదురు నిలుస్తూ ప్రత్యామ్నాయ రాజకీయాలు కూడా నిర్మిస్తున్నారు. దాని వెనుక ఉన్న త్యాగాల చరిత్రను పట్టుకున్నాడు పా. రంజిత్.

వ్యాసకర్త ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్



చంపయ్ సోరేన్ (జేఎంఎం)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

“మనింట్లోనే మనకు ఘోరమైన అవమానం జరిగినప్పుడు ఇంట్లోంచి మనం బయటికి వచ్చేయటం అన్నది మన ఆత్మాభిమానాన్ని మాత్రమే కాదు, మనింటి గౌరవాన్ని కూడా నిలబెడుతుంది కదా...” అని నేను అన్నప్పుడు – ఏ భావమూ లేని కళ్లతో నా వైపు బ్లాంక్‌గా చూశారు బాబూలాల్ మరాండీ! జార్ఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆయన.

అవే మాటల్ని రిపీట్ చేశాన్నేను.

నా వైపు మళ్లీ బ్లాంక్‌గా చూసి, “మీరేదో అర్థవంతంగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తోంది కానీ, నిజానికి నాకేమీ అర్థం కావటం లేదు...” అన్నారు మరాండీ!

ఆయనకు మరింత వివరంగా చెప్పే ప్రయత్నంగా – “జార్ఖండ్ రాజకీయాలను మీరు నిశితంగా పరిశీలిస్తూ ఉండి ఉంటారనే నేను భావిస్తున్నాను మరాండీజీ...” అన్నాను.

ఆయనలో చలనం లేదు!

“మరాండీజీ! ఈ ఏడాది ఆరంభంలో హేమంత్ సోరేన్ అరెస్ట్ అయ్యారు. ఆయన స్థానంలో జార్ఖండ్‌కి నేను సీఎంని అయ్యాను. ఐదు నెలల తర్వాత హేమంత్ బెయిల్ మీద వచ్చారు. వచ్చీ రావటంతోనే నన్ను సీట్లోంచి లేపేసి తను కూర్చున్నారు. ఇవన్నీ మీ కళ్ల ముందు జరిగినవే కదా...” అన్నాను.

నేనామాట అంటున్నప్పుడు ఆయన కళ్లు మూసుకుని ఉన్నారు!

తిరిగి ఆయన కళ్లు తెరిచేవరకు వేచి ఉండి, “మీ కళ్ల ముందు జరిగినవే కాకుండా, ఎవరికీ కనిపించకుండా జరిగినవి కూడా కొన్ని ఉన్నాయి మరాండీజీ! నేను సీఎంగా ఉన్న ఐదు నెలల్లో ఒక్క రోజు కూడా నన్ను నేను సీఎంగా ఫీలయ్యే అవకాశం లేకుండా రోజుకో రకంగా నన్ను అవమానించారు. నాకు కార్యక్రమాలు లేకుండా చేశారు. కార్యక్రమాల్లో నేను లేకుండా చేశారు. నన్ను అవమాన పరిచింది నా సొంత పార్టీనే కదా అని నేను పార్టీలోనే ఉండిపోవచ్చు. కానీ అలా ఉండిపోతే పార్టీ చేసిన అవమానాన్ని చిన్నబుచ్చినట్లు అవుతుంది. అందుకే బయటికి వచ్చేద్దామనుకుంటున్నాను...” అన్నాను.

మరాండీ దీర్ఘంగా కళ్లు నులుముకుని, ఆఖర్న అనాసక్తిగా నా వైపు చూశారు!

“చంపయ్‌జీ! నున్నితమూ, ఉన్నతమూ అయిన మీ మనోభావాలను అలా ఉంచితే... మీరు మీ పార్టీ నుంచి బయటికి రావాలని అనుకోవటం కానీ, బయటికి వచ్చి బీజేపీలో చేరాలని ఆశిస్తూ ఉండటం కానీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఇప్పటికిప్పుడు ఏ విధంగానూ నేను



నిశితంగా పరిశీలించవలసిన రాజకీయ పరిణామాలైతే కాదు...” అన్నారు మరాండీ!

జేఎంఎం నుంచి మీరు బయటికి వచ్చి బీజేపీలో చేరటం వల్ల జేఎంఎంకి పోయేది కానీ, బీజేపీకి వచ్చేది కానీ ఏమీ లేదు అని నేరుగానే చెబుతున్నారాయన!

“సరే, మరాండీజీ...” అని లేచి నిలబడ్డాను.

వారం క్రితం ఢిల్లీలో నేను సెంట్రల్ మినిస్టర్ శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసినప్పుడు ఆయన కూడా ఇలాగే అన్నారు! ఆ ముందురోజు కోల్‌కతాలో అపోజిషన్ లీడర్ సువేందును మీట్ అయినప్పుడు కనీసం ఆయనైనా... ‘మా పార్టీలోకి వచ్చేస్తారా?’ అని ఒక్కమాటా అడగలేదు!

ఉన్నదిక రెండే ఆప్షన్‌లు. అవమానాన్ని దిగమింగుకుని పార్టీలోనే ఉండిపోవటం. లేదా కొత్త పార్టీ పెట్టే పనిలోకి దిగిపోవటం.

ఇంట్లోంచి వచ్చేశాక ఇంకొకరు రమ్మని అనకపోవటం కూడా అవమానమే. పొమ్మన్న వారికి, రమ్మని అనని వారికి గట్టి సమాధానంగా నిలబడాలంటే సొంతంగా ఒక ఇల్లు కట్టుకోవాలి. ఆ కొత్తింట్లోకి వస్తానన్న పాతింటి వారినీ సగౌరవంగా ఆహ్వానించాలి.

జేఎంఎం నా పుట్టిల్లు. ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా జన్మించిన నవంబర్ 15న జేఎంఎం ఆవిర్భవించింది. నవంబర్‌లోనే ఇంకొక ప్రత్యేకత కూడా ఉంది. 1న నా పుట్టిన రోజు. ఆ రోజున నా కొత్త పార్టీని ప్రారంభిస్తే?!

బిర్సా ముండా ఆశీస్సులు లేకపోతాయా? జార్ఖండ్ ప్రజలు అండగా ఉండకపోతారా?

## సహజాభరణాలు

సమాజంలో మనుషులు చెవులకు పెద్ద పెద్ద కర్ణాభరణాలు, మెడలలో బరువైన హారాలు; చేతులకు కడియాలు, ఉంగరాలు ధరిస్తారు. ఎంత ఎక్కువ నగలు ధరిస్తే అంత అంతస్తు ఉన్నట్లు! అంత గౌరవం సమాజంలో లభిస్తుంది. కాని, దైవం దృష్టిలో నిజమైన, సహజమైన ఆభరణాలు వేరు. వాటిని ధరిస్తేనే దైవానికి మనం దగ్గర వుతాము. ఆ ఆభరణాలు ఏమిటంటే: భగవంతుని గురించి మహిమాన్విత కథలు వింటే అవి చెవులకు పెద్ద పోగుల జతలు పెట్టుకున్నట్లు అవుతుంది. చేతులతో దేవునికి పూజ చేయగలిగితే మంచి కడియాలు ధరించినట్లవుతుంది. శిరసు వంచి దేవునికి మొక్కినట్లయితే అందమైన తురాయి పెట్టుకున్నట్లవుతుంది. గొంతు నొప్పి పుట్టేటట్లు భగవంతుని కథలు పలికితే, నామస్మరణ చేస్తే చాలు కంఠ మాలలు వేసుకున్నట్లవుతుంది. వీటన్నింటి సారాంశం ఒక్కటే... భగవంతుని మనస్ఫూర్తిగా సేవించటమే అన్ని ఆభరణాలను ధరించటంతో సమానం. ఇంక వేరే ఆభరణాలు ఎందుకు అంటాడు నరసింహ శతక కవి.

జ్యోతిర్మయం

అసలు భగవంతునిపై నిజమైన భక్తి ఉంటే నగలపైకి మనసు మనసు పోతుందా? భగవంతుని పైన ఏకాగ్రత కుదిరిన కొద్దీ లౌకికమైన, భౌతికమైన నగలు, సంపదలు, అంతస్తులపై ఆసక్తి, మమకారం వాటంతట అవే తొలగిపోతాయి. నిరాడంబర జీవితానికే ప్రాధాన్యమిస్తాము. భగవంతుని సాన్నిధ్యంలో అనంతమైన తృప్తి, శాంతి లభిస్తాయి.

అంతేకాదు, జీవిక కోసం మనుషులు నిత్యం తమ పనులు చేసుకుంటూనే దైవ స్మరణ చేయవచ్చు. భగవంతుని స్తుతించలేని నోరు... పాడుబడిన బావి లాంటిది. భగవంతుని సేవ చేయని శరీరం... తోలు తిత్తి లాంటిది. భగవంతుని కథలు ఆసక్తితో వినని చెవులు... కఠిన శిలలలో ఏర్పడే రంధ్రాల వంటివి అంటారు నరసింహ శతక కవి.

ఊరికే వృథా మాటలతో, ప్రయోజనం లేని పనులతో కాలక్షేపం చేయకుండా భగవంతుడు ఇచ్చిన ఇంద్రియాలను మనుషులు ఆయన సేవకే వినియోగిస్తే అవి జీవితానికి సహజాభరణాలుగా భాసిస్తాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.10.42 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** భరణి రా.10.31 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.8.58 నుండి 10.26 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.39 నుండి 5.27 వరకు, **అమృతఘడియలు:** సా.6.07 నుండి 7.34 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.17.

## క్లుప్తంగా...

### గురుకుల విద్య భేష్

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు అద్భుతమైన పనితీరును కనబరుస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. సమాజంలో మార్పు కోసం ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను సంక్షేమ శాఖలు వినియోగించుకోవడాన్ని ఆయన కొనియాడారు. ఆయన శనివారం విద్యాశాఖ అధికారులతో రాజ్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి అందుతున్న నిధుల సమర్థ వినియోగానికి తీసుకుంటున్న చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ కార్యకలాపాలు, కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### చట్టసభలు ప్రోరోగ్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి వాయిదా పడిన నేపథ్యంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రోరోగ్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు చట్టసభల ప్రోరోగ్ శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### గ్రేటర్‌లో విద్యుత్ ఎస్ఈల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ పరిధిలోని పలువురు సూపరింటెండింగ్ ఇంజనీర్ల (ఎస్ఈ)ను బదిలీ చేస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈగా టి.చంద్ర శేఖర్, రాజేంద్రనగర్‌కు డి.ఎస్. మోహన్, మేడ్చల్‌కు ఎం.రవికుమార్, హైదరాబాద్ సౌత్‌కు డి.సోమిరెడ్డి, సరూర్‌నగర్‌కు సి.మాధవరెడ్డి, సికింద్రాబాద్‌కు ఎల్.గోపయ్య, బంజారాహిల్స్‌కు పి.కరుణాకర్ బాబు, హైదరాబాద్ సెంట్రల్‌కు పి.వెంకన్న, సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈగా శ్రీనాథ్‌లను బదిలీ చేశారు. కొద్దిరోజుల క్రితం హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈగా బ్రహ్మంని బదిలీ చేశారు.

### వయనాడ్ బాధితులకు మంత్రి సీతక్క అండ


**వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన**




సాక్షి, హైదరాబాద్: ప్రకృతి విపత్తుతో తీవ్రంగా నష్టపోయిన కేరళలోని వయనాడ్‌లో మంత్రి సీతక్క పర్యటించారు. శనివారం ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలసి ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ...బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీనిచ్చారు. తనకు ఎంతో అనుబంధం ఉన్న వయనాడ్ ప్రజలకు నైతిక మద్దతు పలకానికి వచ్చినట్లు తెలిపారు. నేటికీ 24 గంటలూ పనిచేస్తున్న రెస్క్యూ టీమ్‌లు, స్థానిక అధికారులు, వాలంటీర్ల ప్రయత్నాలను అభినందించారు. అంతకుముందు బాధిత కుటుంబాల సహాయార్థం తాను సేకరించిన రూ.20 లక్షల చెక్‌ను స్థానిక ఎమ్మెల్యే టి.సిద్దిఖీకి అందజేశారు. బాధితులకు దుస్తులు, నిత్యావసర వస్తువులను అందించారు. వందల సంఖ్యలో మృతులను సామూహిక ఖననం చేసిన ముండక్కై శ్మశాన వాటికలో మృతులకు సీతక్క శ్రద్ధాంజలి ఘటించారు. అదేసమయంలో తన తల్లిని ఇక్కడే ఖననం చేశారని తెలుసుకున్న ఓ యువతి ఆ ప్రాంతానికి చేరుకుని..చివరి చూపునకు కూడా నోచుకోలేకపోయానంటూ తన తల్లి సమాధి వద్ద బోరున విలపిస్తుండగా ఆమెను దగ్గరకు తీసుకుని సీతక్క ఓదార్చారు.


### మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లపై టాస్క్‌ఫోర్స్

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నాణ్యమైన వైద్య విద్యను అందించడంతోపాటు మెడికల్ యూజీ, పీజీ అడ్మిషన్లపై టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయన శనివారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనను పర్యవేక్షించడంతో పాటు బోధన సిబ్బంది నియామకాలు, యూజీ, పీజీ అడ్మిషన్ల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ కమిటీకి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను మెంబర్ కన్వీనర్‌గా నియమించారు. కమిటీలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్), కేఎన్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌లను సభ్యులుగా నియమిస్తూ మంత్రి రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జీవో ఉత్తర్వులను జారీ చేసింది. సమీక్షా సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య కార్యదర్శి డాక్టర్ డా.క్రిస్టినా జెడ్ చొంగ్తూ, ఉప కార్యదర్శి వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.





## అందాల కోట.. అభివృద్ధికి పడేనా బాట?

చుట్టూ పచ్చదనం.. ఆహ్లాదం పంచే ప్రకృతి.. జలజలపారే సెలయేరు.. అద్భుతమైన ప్రాచీన కళాఖండాలతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది రామగిరి ఖిల్లా. కొండపై శత్రుదుర్భేద్యమైన బురుజులు, ఫిరంగులు.. చరిత్రకు ఆనవాళ్లు. రాముడు వనవాస సమయంలో ఇక్కడ నడయాడారని చరిత్రకారుల కథనం. శ్రీసీతారాముల పాదుకలు, శివలింగం, కొలను, హనుమాన్, నంది విగ్రహాలతో ఆధ్యాత్మిక శోభ.. ఔషధ మూలికల దట్టమైన అడవి.. పెద్దపల్లి జిల్లాలోని రామగిరి సమీపంలోనివీ అద్భుతాలు.. పెద్దపల్లి జిల్లా తొలి కలెక్టర్ అలుగు వర్షిణి స్వయంగా అధికార యంత్రాంగంతో కలిసి ఈ ఖిల్లాపై పర్యటించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తుండటంతో పర్యాటకుల్లో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

# ప్రభాకర్‌రావుపై రెడ్‌కార్నర్ నోటీసు ఇవ్వండి

**సీబీఐ డైరెక్టర్‌ను కోరిన నగర కొత్వాల్ శ్రీనివాసరెడ్డి**

- కేసు తీవ్రత దృష్ట్యా బ్లూకార్నర్‌తో లేని ఉపయోగం
- పరారీలో ఉన్న ఇద్దరి అరెస్టు తర్వాత నేతలకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడు శ్రావణ్ రావుపై ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకున్న వీరిపై బ్లూకార్నర్ నోటీసులు జారీ చేయించాలని గతంలో భావించాం. అయితే వాటి వల్ల కేవలం వారి ఆచూకీ మాత్రమే తెలుస్తుంది. నిందితులను తమకు అప్పగించాలంటూ అమెరికాను కోరలేం. ఈ నేపథ్యంలోనే రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయించేందుకు కృషి చేస్తున్నాం. దీనికోసం ఇటీవల ఢిల్లీ వెళ్లి నోడల్ ఏజెన్సీ అయిన సీబీఐ డైరెక్టర్‌ను కలిశాం. ఆయనకు కేసు పూర్వాపరాలు, ప్రాధాన్యత వివరించాం.''అని వెల్లడించారు. న్యాయస్థానాలు సైతం ఇది తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నాయనీ, ఈ కారణంగానే నిందితులు ఎంతగా ప్రయత్నించినా వారికి బెయిల్ రావట్లేదన్నారు. ఈ కేసులో రాజకీయ నాయకులకు నోటీసులు ఇస్తారా..? అంటూ విలేకరులు ప్రశ్నించగా... 'ఇస్తాం. ఇప్పుడూ ఇవ్వచ్చు. అయితే పరారీలో ఉన్న కీలక నిందితులు అరెస్టు అయిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటాం. ఎప్పుడైనా సరే ఒక్కో మెట్టు ఎక్కుతూ వెళ్లాలి. అలా కాకుండా ఒకేసారి పైకి ఎగిరితే కింద పడిపోయే ప్రమాదం ఉంది'అని వ్యాఖ్యానించారు.

**రోజుకు రూ.2 కోట్లు స్వాహా చేస్తోన్న సైబర్ నేరగాళ్లు**

సైబర్ నేరగాళ్లు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్న వారి నుంచి రోజుకు రూ.2 కోట్లు చొప్పున స్వాహా చేస్తున్నట్లు సీపీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఓ పక్క ప్రజల్లో అవగాహన పెరుగుతున్నా.. నష్టపోయే మొత్తం కూడా పెరగడం ఆందోళనకరమన్నారు. గతంలో రోజుకు నష్టపోయే మొత్తం రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉండేదని, ఇప్పుడది రూ.2 కోట్లకు చేరిందన్నారు. 'సూడో పోలీసు/కస్టమ్స్ అధికారులు చేసే ఫెడెక్స్ ఫ్రాడ్ వంటి నేరాల్లో మోసపోయారంటే అర్థం చేసుకోవచ్చు. అయితే ఇప్పటికీ ఇన్వెస్టిమెంట్, ట్రేడింగ్ ఫ్రాడ్స్‌లో విద్యాధికులూ భారీ మొత్తాలు కోల్పోవడం శోచనీయం. దీనిబట్టి సైబర్ నేరాలు అనేవి వీక్‌నెస్ కాదని, సిక్‌నెస్ అని అర్థమవుతోంది.

ఈ కేసుల్లో ఆధారాలు, నిందితులు చిక్కడం కష్టసాధ్యంగా మారింది. సూత్రధారులంతా దుబాయ్, చైనా, సింగపూర్ తదితర దేశాల్లో ఉండి కథ నడుపుతున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీలను పోలీసులే నియంత్రించగలరు. కానీ సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు మాత్రం ప్రజల సహకారం అవసరం. అనునిత్యం అత్యంత అప్రమత్తంగా ఉండటమే వాళ్లు అందించే సహకారం'అని శ్రీనివాసరెడ్డి వివరించారు.

## నా మొహం ఎలా చూపించను

- కుటుంబంతో గొప్పగా బతకాలనుకున్నా...
- ఎన్నో ప్రయత్నాలు చేశా.. సక్సెస్ కాలేదు
- ఏడెనిమిది లోన్‌యాప్‌ల ఈఎంఐలు కట్టలేదు
- సెల్ఫీ వీడియోలో కారణాలు చెప్పి యువకుడి ఆత్మహత్య



శ్రీరాంపూర్: జీవితంలో సక్సెస్ కావాలి..డబ్బు సంపాదించాలి.. కుటుంబ సభ్యులను ఉన్నత స్థితిలో ఉంచాలంటూ ఆ యువకుడు ఎన్నో కలలు కన్నాడు. మొదట్లో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి లాభాలు బాగానే వచ్చాయి. ఆ తర్వాత తెలిసిన వారి వద్ద, లోన్‌యాప్‌లలో అప్పు చేసి పెట్టిన పెట్టుబడులు ఆవిరయ్యాయి. మూడేళ్లుగా ట్రేడింగ్ చేస్తున్నా కలిసి రావడం లేదని.. లోన్‌యాప్‌ల వేధింపులు తాళలేక.. ఉరేసుకొని ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్‌కు చెందిన నమ్మబాజీ శ్రీకాంత్(29) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య శ్రుతి, 9 నెలల కుమారుడు ఉన్నారు. భార్య కొడుకుతో కలిసి రాఖీ పండుగకు ఊరెళ్లింది. దీంతో ఇంట్లో ఒక్కడే ఉన్న సమయంలో శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు వైరుతో ఉరేసుకున్నాడు. ఇంటి సమీపంలోనే తల్లిదండ్రులు ఉంటారు. శనివారం ఉదయం శ్రీకాంత్ తమ్ముడు సాయికుమార్ ఇంటికొచ్చి తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో బలవంతంగా త లుపులు తెరిచి చూడగా, ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు శ్రీకాంత్ సెల్‌ఫోన్‌ను పరిశీలించగా, ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడయ్యాయి.

**సెల్ఫీ వీడియో తీసుకొని..**

శ్రీకాంత్ ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 'నేను ఒక కొడుకుగా, అన్నగా, భర్తగా, తండ్రిగా ఫెయిల్ అయ్యాను. లైఫ్‌లో సక్సెస్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాను. సక్సెస్ కాకపోగా, లోన్‌యాప్స్‌లో లోన్ తీశాను. బయట కూడా అప్పు తీసుకొచ్చాను. ఇంట్లో వారిని గొప్పగా ఉంచాలి. మంచిగా చూసుకోవాలనే ఉద్దేశంతో ఎలాగైనా డబ్బు సంపాదించాలని స్టాక్ మార్కెట్‌లో డబ్బులన్నీ పెట్టా. ట్రేడింగ్ చేసి డబ్బులన్నీ పోగొట్టుకున్నాను. మా ఫ్రెండ్ వాళ్ల అన్న దగ్గరి నుంచి రూ.3 లక్షలు తీసుకున్నా. మా డాడీ దగ్గర రూ.2 లక్షలు అట్లనే వేర్వేరు దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నా. అన్నీ పోగొట్టుకున్నా. నాకు చాలా అప్పులున్నాయ్. దానికి తోడు ఈ లోన్‌యాప్స్. ప్రతి నెలా ఈఎంఐలు కచ్చితంగా కట్టేసిన. ఈ నెలొక్కటే కట్టలేదు. ఏడెనిమిది యాప్‌ల దాకా కట్ట లేదు. ఫోన్లలో టార్చర్ తట్టుకోలేకపోతున్నాను. ఇంటికి వస్తామని వేధించారు. కుటుంబ సభ్యుల వద్ద మొహం చూపెట్టలేక ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని ఆ వీడియోలో శ్రీకాంత్ పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

## ఫార్మా కంపెనీలో పనిచేసి.. అల్ప్రాజోలం తయారీ కేంద్రం పెట్టి..

- చిక్కిన 'అల్ప్రాజోలం' తయారీ ముఠా
- ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కమలాసన్‌రెడ్డి

పోచారం(హైదరాబాద్): అల్ప్రాజోలం తయారు చేసే ముఠా గుట్టు రట్టయ్యింది. శనివారం దివ్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన మేన శ్రీనివాస్ బీఎస్సీ చదివి ఓ ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా కెరీర్ ప్రారంభించాడు. కొంతకాలం తర్వాత ఉద్యోగం నచ్చక మరో కంపెనీలోకి మారాడు. 1998లో జీవనోపాధి కోసం హైదరాబాద్ వచ్చి.. ప్రముఖ ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా పనిచేస్తూ భార్యాపిల్లలతో నాచారం రాఘవేంద్రనగర్‌లో ఉంటున్నాడు. 2016 వరకు పలు కంపెనీల్లో పనిచేశాడు. డబ్బు సంపాదించాలనే అత్యాశ ఉన్న గాజులరామారానికి చెందిన కాకర చంద్రశేఖర్, నాగోల్‌కు చెందిన పోలిశెట్టి రాంబాబు, వనస్థలిపురం నివాసి తాటి లక్ష్మణ్‌లను సంప్రదించాడు. వీరంతా శ్రీనివాస్ మిత్రులు. అల్ప్రాజోలం డ్రగ్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. కంపెనీ ఏర్పాటుకు రాంబాబు పెట్టుబడి పెట్టగా, చంద్రశేఖర్‌కు మేనేజర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో అల్ప్రాజోలం తయారీ విధానాన్ని పర్యవేక్షిస్తానని, లక్ష్మణ్ మెయింటెనెన్స్ చూస్తానని అంగీకరించారు. కూకట్‌పల్లిలోని నర్మదా కెమికల్స్ యజమాని రాజేశ్వరరావు నుంచి లక్ష రూపాయలకు అల్ప్రాజోలం తయారీ ఫార్ములాతోపాటు తయారీకి కావాల్సిన ముడిసరుకు కొనుగోలు చేశారు. అల్ప్రాజోలంను విక్రయించేందుకు నిజామాబాద్ జిల్లాలోని సునీల్‌ను ఎంపిక చేసుకున్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక మేడ్చల్ మల్కాజిగిరిజిల్లా కాచవానిసింగారంలోని దివ్యానగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఈ నెల 5న తయారీ కేంద్రం స్థాపించారు. ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో అల్ప్రాజోలం తయారు చేస్తున్నారన్న సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో సిబ్బంది నిఘా పెంచాలని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, స్టేట్ టాస్క్‌ఫోర్స్‌టీం అడిషనల్ ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు తనిఖీలు చేసి రూ. 30 లక్షల విలువైన అల్ప్రాజోలంతోపాటు, ఉత్పత్తికి వినియోగించే ముడిసరుకుని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులు మేన శ్రీనివాస్, కాకర చంద్రశేఖర్, పోలిశెట్టి రాంబాబు, తాటి లక్ష్మణ్, రాజేశ్వరరావులను అరెస్ట్ చేశారు.

## కాంగ్రెస్ హామీల్లో వేగం పెంచాలి

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**
**ముగిసిన సీపీఐ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు**



న్యూశాయంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో వేగం పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మూడు రోజులుగా హనుమకొండలో జరుగుతున్న పార్టీ రాష్ట్ర నిర్మాణ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల్లో ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్న రీతిలో సాగుతున్నాయన్నారు. తక్షణం అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ధరణి స్థానంలో కొత్త ఆర్ఓఆర్ చట్టం తీసుకురావాలని సూచించారు. తక్షణమే ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి ఎటువంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రూపాయల రుణ మాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు.

## భూమాతతో భూములు పోతాయి

**సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూమాత పోర్టల్ అమలులోకి తెస్తే.. పేదలు, గిరిజనులు, చిన్న రైతుల భూములు ఎవరెవరికో పోతాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అనంతరం రాఘవులు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, అన్యాక్రాంతమైన భూములకు పెద్దవారు కంక్లూజివ్ గ్యారంటీ టైటిల్ పొందుతారని, అక్రమాలు చట్టబద్ధం అవుతాయని చెప్పారు. జాగ్రత్తలు తీసుకోకపోతే పేద రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ధరణిపై కమిటీ వేశారని, ఆ నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దానిపై రైతులతో చర్చించాలని కోరారు. కౌలురైతులు, చిన్న రైతులు, అన్యాక్రాంతమైన భూములను సేద్యం చేసుకుంటున్న వారికి, అసైన్డ్ భూముల రైతులకు నష్టం కలుగుతుందన్నారు. కబ్జా భూములు సొంతం చేసుకునే అవకాశముందని చెప్పారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

**భూ సమస్యలపై అఖిలపక్షాన్ని పిలవాలి: తమ్మినేని**



భూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని, అఖిలపక్షాన్ని పిలవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల్లోపు అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనకు వెళితే సీపీఎం నాయకుల అరెస్టులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ వెళ్లినా ఇదే తరహాలో ఉండేదన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ప్రజాసమస్యలపై మాట్లాడేది సీపీఎం నాయకులేనని అర్థమవుతుందని చెప్పారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. రైతుభరోసా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైడ్రా.. డ్రామా కావొద్దని, ఆక్రమణలను కూల్చివేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ఆస్పత్రి రికార్డు

**24 గంటల్లో 17 శస్త్రచికిత్సలు పూర్తి**

వేములవాడ అర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో 24 గంటల్లో 17 ఆపరేషన్లు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, డెలివరీలు 6, సాధారణ ఆపరేషన్లు 3, గర్భసంచిలో గడ్డ 1, కంటి ఆపరేషన్లు 2, ఆర్థో ఆపరేషన్లు 5 చేసినట్లు వివరించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నమాల, ఆర్థో డాక్టర్ అనిల్‌కుమార్, మత్తు వైద్యనిపుణులు రాజశ్రీ, డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## రుణమాఫీ చేయకుంటే ఉద్యమం ఉధృతం

**వచ్చే నెల 15 వరకే గడువు.. ఆర్మూర్‌లో రైతుల ధర్నా**

ఆర్మూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రుణ మాఫీ చేస్తానంటూ దేవుళ్లపై ఒట్లు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పినందున వచ్చే నెల 15 వరకు సమయం ఇస్తామని అప్పటికీ రుణ మాఫీ చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో సెయింట్ పాల్ స్కూల్ వద్ద శనివారం ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించారు. బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లను తెలియజేస్తూ ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు రైతులు వినతి పత్రాన్ని సమర్పించారు.

## డిమాండ్‌కు తగ్గట్లుగా ఎరువుల కోటా ఉండాలి

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో డిమాండ్‌కు తగినట్లుగా ఎరువుల కోటాను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎరువులను అవసరం మేరకు జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు, గ్రామాలకు అడ్వాన్స్‌గా పంపించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ రైతులకు సక్రమంగా ఎరువులు అందేవిధంగా చూడాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా డీలర్లు బ్లాక్ చేసినట్లు తేలితే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి అంచనా వేసిన ఎరువులు, అందుబాటులో ఉన్న ఎరువులు, లభ్యత వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. సీజన్‌కు 10,41,000 టన్నుల యూరియా, 2.40 లక్షల టన్నుల డీఏపీ, 10 లక్షల టన్నుల కాంప్లెక్సు, 0.60 లక్షల టన్నుల పొటాష్ ఎరువులు అవసరమని గుర్తించినట్లు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వీటిలో ఇప్పటివరకు 10.88 లక్షల టన్నుల యూరియా, 2.34 లక్షల టన్నుల డీఏపీ, 9.18 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.45 లక్షల మెట్రిక్ టన్నుల పొటాష్ కోటా రాష్ట్రానికి తెప్పించినట్లు వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతును హతమార్చిన మావోయిస్టులు

**ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని లేఖ**

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని పేర్కొంటూ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు శుక్రవారం అర్ధరాత్రి ఓ గిరిజన రైతును హతమార్చారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి పూస్నార్ గ్రామానికి చెందిన గిరిజన రైతు లచ్చు పూనెం (60) ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి వచ్చిన మావోయిస్టులు మాట్లాడే పని ఉందని బయటకు పిలిచారు. దీంతో బయటకు వచ్చిన ఆయనను ఇంటి ఆవరణలోనే కత్తులు, గొడ్డళ్లతో దారుణంగా నరికి చంపారు. 'ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తూ మావోయిస్టు పార్టీ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడు. ఇప్పటికే నాలుగుసార్లు ప్రజాకోర్టు నిర్వహించి ప్రజల కోరిక మేరకు విడిచిపెట్టాం. అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో హతమార్చాల్సి వచ్చింది' అని చెబుతూ మావోయిస్టు పార్టీ గంగులూరు ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు. ఈ ఘటనతో పూస్నార్ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి.

# గళానికీ సంకెళ్లు!


కాబూల్ మార్కెట్‌లో మహిళల నేటి పరిస్థితి

## మహిళలు బహిరంగంగా మాట్లాడొద్దు!

- అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ల కొత్త నిబంధనలు
- ముఖం ఏమాత్రం కన్పించడానికి వీల్లేదు
- అమ్మాయిలు ఇప్పటికే చదువుకు దూరం

"నానాటికీ మా మహిళలపై నిర్బంధాలు మితిమీరు తున్నాయి. దీనికంటే గృహనిర్బంధమే ఎన్నో రెట్లు మేలు"
- మర్జాన్, 23 ఏళ్ల మహిళా జర్నలిస్టు


1979లో ఆంక్షలు లేని కాబూల్ వీధుల్లో...

మిగతా ప్రపంచమంతా కాలంతో పందెం వేస్తూ దూసుకెళ్తుంటే అఫ్గానిస్తాన్ మాత్రం కాలంతో పాటు వెనక్కు పయనిస్తోంది. మూడేళ్ల క్రితం పాలన తాలిబన్ల చేతిలోకి వెళ్లినప్పటి నుంచీ అక్కడ రాతియుగపు పాలన నడుస్తోంది. మహిళల మనుగడ దినదిన గండంగా మారింది. ఆంక్షల కొలిమిలో నిలువునా కాలడం వారికి నిత్యకృత్యమైపోయింది. తాజాగా మహిళల గళానికి కూడా సంకెళ్లు పడ్డాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

అడుగు కదిపితే ఆంక్షలు. ఊపిరి కూడా ఆడని రీతిలో చుట్టూ నిబంధనల చట్రం. అఫ్గాన్‌లో మహిళలపై తాలిబన్లు పాల్పడుతున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. వాళ్లు పెద్ద చదువులు చదివేందుకు వీల్లేదు. ఆరో తరగతి తర్వాత ఇంటికే పరిమితం కావాలి. ఒళ్లంతా పూర్తిగా కప్పుకుంటే తప్ప ఇంట్లోంచి కాలు బయట పెట్టడానికి లేదు. ఈ అణచివేతను పరాకాష్టకు తీసుకెళ్తూ తాలిబన్లు తాజాగా మరో మతిలేని నిర్ణయం తీసుకున్నారు. ఇకపై మహిళలు బహిరంగ స్థలాల్లో మాట్లాడటానికి కూడా వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. ప్రసార మాధ్యమాల్లో కూడా వారి స్వరం పొరపాటున కూడా విన్పించకూడదని ఆదేశించారు! అంతేకాదు, ఇల్లు దాటాలంటే ఒంటితో పాటు ముఖాన్ని కూడా పూర్తిగా కప్పుకోవడం తప్పనిసరంటూ మరో నిబంధన విధించారు!! మహిళల అస్తిత్వానికే గొడ్డలిపెట్టు వంటి ఈ ఆటవిక నిర్ణయాలపై అంతర్జాతీయ సమాజంలో విస్మయం వ్యక్తమవుతోంది. 'సద్గుణాల వ్యాప్తి, దుర్గుణాల కట్టడి' పేరిట తాలిబన్లు మూడేళ్ల క్రితం ఏకంగా ఒక శాఖనే ఏర్పాటు చేశారు. మహిళలపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ తాజాగా తీసుకున్న నిర్ణయాలతో 114 పేజీల డాక్యుమెంట్‌ను ఆ శాఖ విడుదల చేసింది. అందులో 35 రకాల నూతన నిబంధనలను పొందుపరిచారు. మహిళలు ఇకపై బహిరంగ స్థలాల్లో మాట్లాడేందుకు వీల్లేదన్నది వాటిలో ప్రధానమైనది. ఈ నిబంధనలకు తాలిబన్ పాలకుడు హిబతుల్లా అఖుంద్‌జాదా ఇటీవలే ఆమోదముద్ర వేశారు. ఆగస్టు 21 నుంచి అవి అమల్లోకి వచ్చాయి. 'మంచిని పెంచేందుకు, చెడును తుంచేందుకు ఈ నూతన ఇస్లామిక్ నిబంధనలు ఎంతగానో దోహదపడుతాయి' అంటూ సంబంధిత శాఖ అధికార ప్రతినిధి అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గొప్పగా చెప్పుకొచ్చారు!

### కొత్త ఆంక్షలు ఇలా...

- ఇకపై మహిళలు బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడటానికి ఏమాత్రం వీల్లేదు.
- బహిరంగ ప్రదేశాల్లో గట్టిగా చదవొద్దు. పాటలు పాడొద్దు. రాగాలు తీయొద్దు.
- మీడియాలో కూడా మహిళల గొంతు ఏ రకంగానూ విన్పించకూడదు.
- రక్త సంబంధీకులను, భర్తను తప్ప మరే పురుషుని వైపూ కన్నెత్తి కూడా చూడొద్దు.
- బహిరంగ ప్రదేశాలలో మహిళలు మగవాళ్లతో మాట్లాడటం నిషిద్ధం.
- మహిళలను బయటికొచ్చినప్పుడు ముఖం పూర్తిగా కవరయ్యేలా కప్పుకోవాలి. లేదంటే వాళ్లను చూసి మగవాళ్లు ఉద్రేకానికి లోనయ్యే ఆస్కారముంది.
- కనుక మహిళలు ఇకపై ముఖంపై పూర్తిగా మేలిముసుగు ధరించాల్సిందే. కేవలం జుత్తు, మెడను మాత్రమే కవర్ చేసే హిజాబ్ మాత్రం ధరిస్తే చాలదు.
- మహిళలు ఇకనుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ సంగీత వాయిద్యాలను ముట్టుకోకూడదు.
- వాహనదారులెవరూ మగవాళ్లు తోడు లేనిదే మహిళలను ఎక్కించుకోకూడదు.
- పురుషులు గడ్డం చేసుకోకూడదు. నియమిత వేళల్లో విధిగా ఉపవాసముండాలి.
- అఫ్గాన్ మీడియా ఇకపై షరియా చట్టాలను తూ.చా. తప్పకుండా పాటించాలి.
- మీడియాలో ఎవరి ఫొటోలూ చూపించడానికి, ప్రచురించడానికి వీల్లేదు.

"తాజా నిబంధనలు చాలా వరకు అఫ్గానిస్తాన్‌లో ఇప్పటికే అనధికారికంగా అమలవుతూనే ఉన్నాయి. వాటిపై ఇప్పుడు అధికారిక ముద్ర పడిందంతే. అఫ్గాన్ బాలికలు, మహిళల మనుగడను తాలిబన్లు నానాటికీ మరింత దుర్భరంగా మారుస్తున్నారు"
- ఫియోనా ఫ్రేజర్, అఫ్గాన్‌లోని ఐరాస మానవహక్కుల సేవా సంఘం చీఫ్

### శిక్షలు ఇలా...

- నూతన నిబంధనలను ఉల్లంఘించే మహిళలకు...
- తొలుత హెచ్చరికల జారీ.
- అనంతరం ఆస్తుల జప్తు.
- మూడు రోజులదాకా నిర్బంధం.
- అనంతరం అవసరాన్ని బట్టి కఠిన శిక్షలు.
- నిబంధనలను ఉల్లంఘించిన కేసుల్లో వేలాది మంది అఫ్గాన్ మహిళలు ఇప్పటికే నిర్బంధంలో మగ్గుతున్నారు.

### ఇప్పటికే ఈ ఆంక్షలు...

- బాలికలు ఆరో తరగతితోనే చదువు ఆపేయాలి.
- మహిళలు ఎటువంటి స్వచ్ఛంద సంస్థల్లోనూ పని చేయడానికి వీల్లేదు.
- హిజాబ్ లేకుండా వాళ్లు ఇల్లు దాటకూడదు.

# మహిళల భాగస్వామ్యంతోనే 'అభివృద్ధి చెందిన భారత్'

- 2047 నాటికి అదనంగా 40 కోట్ల మంది మహిళా శ్రమశక్తి కావాలి
- నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక



**న్యూఢిల్లీ:** 2047 నాటికి పూర్తి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మరో 23 ఏళ్లలో 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్నది ఆశయం. ఇది సాకారం కావాలంటే దేశ శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం రెట్టింపు కావాలని నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఈ మేరకు తాజాగా 'లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ డిస్టిలేసన్ రిపోర్టు' విడుదల చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం శ్రామిక శక్తిలో మహిళల వాటా 37 శాతంగా ఉంది. 2047 నాటికి దీన్ని 70 శాతానికి చేర్చాల్సిన అవసరం ఉందని తెలియజేసింది. అంటే అదనంగా 40 కోట్ల మంది మహిళలు శ్రమశక్తిలో చేరాలని వివరించింది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ఆధారంగా ఈ అంచనాకు వచ్చింది. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఉద్ఘాటించింది. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థకు మరో 14 ట్రిలియన్ డాలర్లను జోడించాలంటే అదనంగా 40 కోట్ల మంది మహిళల భాగస్వామ్యం అవసరమని తెలిపింది. అయితే, 2047 నాటికి అదనంగా కేవలం 11 కోట్ల మంది మహిళలు మాత్రమే శ్రమశక్తిలో చేరుతారన్న అంచనాలున్నాయి. 40 కోట్ల మందిని అదనంగా శ్రమశక్తిలో చేర్చడం అనేది ప్రభుత్వాలకు నిజంగా ఒక సవాలే.

# భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించే యత్నం.. బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అరెస్టు



**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి, భారత్‌లో తలదాచుకోవడం.. తదనంతరం తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో చాలామంది బంగ్లాదేశ్ వీడి వెళ్తున్నారు. కొందరు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశిస్తున్నారు. బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శంషుద్దీన్ చౌదరి మాణిక్ సైతం భారత్‌లోకి ప్రవేశిస్తూ బంగ్లాదేశ్ సైనికులకు దొరికిపోయారు. సిల్హెట్ వద్ద దేశం దాటి, భారత్‌లో అడుగుపెట్టేందుకు ఆయన ప్రయత్నించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. సిల్హెట్‌లోని కనైఘాట్ సరిహద్దు నుంచి భారత భూభాగంలో అడుగుపెట్టేందుకు ప్రయత్నించిన శంషుద్దీన్ చౌదరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలియజేశారు.

# నేడు జల్గావ్‌కు ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం మహారాష్ట్ర, రాజస్తాన్‌లలో పర్యటించనున్నారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగే కార్యక్రమంలో 11 లక్షల నూతన 'లఖ్‌పతి దీదీస్'ను ఆయన సన్మానిస్తారు. ఇదే కార్యక్రమంలో 4.3 లక్షల స్వయం సహాయక బృందాలకు రివాల్వింగ్ ఫండ్ కింద రూ.2,500 కోట్లను విడుదల చేస్తారు. మరో రూ.5 వేల కోట్ల రుణాలను పంపిణీ చేస్తారు. అనంతరం, ఆయన రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ వెళ్తారు. అక్కడ జరిగే రాజస్తాన్ హైకోర్టు ప్లాటినం జూబిలీ వేడుకల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరవుతారని పీఎంవో తెలిపింది.

# 2026 నాటికి నక్సలిజం అంతం

## హోం మంత్రి అమిత్ షా



**రాయ్‌పూర్:** 2026 మార్చినాటికి దేశాన్ని వామపక్ష తీవ్రవాద రహితంగా మారుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. మావోయిస్ట్ తీవ్రవాదులపై తుది దాడికి నిర్ణాయక, కఠిన వ్యూహం అవసరం ఉందని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శనివారం షా మీడియాతో మాట్లాడారు. హింసావాదాన్ని వీడాలని ఆయన నక్సల్స్‌కు పిలుపునిచ్చారు. లొంగుబాట పట్టిన నక్సల్స్ పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒకట్రెండు నెలల్లో కొత్త విధానాన్ని ప్రకటిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారిన నక్సలిజం మహమ్మారి కారణంగా దేశంలో ఇప్పటివరకు 17 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2004–14 సంవత్సరాలతో పోలిస్తే 2014–24ల నాటికి దేశంలో నక్సల్ సంబంధిత ఘటనల్లో సగానికి పైగా, అంటే 53 శాతం తగ్గుదల నమోదైందన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని తుదిదెబ్బ తీసేందుకు భద్రతా లోపాలను సరిచేస్తున్నామని, భద్రతా సిబ్బందిని కూంబింగ్ ఆపరేషన్లతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వాములను చేస్తున్నామన్నారు. మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌ను దెబ్బతీసేందుకు ఎన్ఐఏ, ఈడీ వంటి విభాగాలను భద్రతా విభాగాలతో సమన్వయ పరుస్తున్నామని చెప్పారు. బహుముఖ వ్యూహంతో 2026 మార్చి కల్లా వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలతో అమిత్ షా భేటీ**

అంతకుముందు, కేంద్ర మంత్రి అమిత్ షా రాయ్‌పూర్‌లో మావోయిస్ట్ నక్సల్స్ ప్రభావిత ఏడు రాష్ట్రాల అధికారులతో భేటీ అయ్యారు. ఈ అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్, డిప్యూటీ సీఎం విజయ్ శర్మ, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్‌తోపాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీలు, డీజీపీలు హాజరయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా పాలుపంచుకున్నారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలపై వేధింపులు

- ఆరోపణలున్న వ్యక్తి ఇంటిని కూల్చివేయడం అమానవీయం, అన్యాయం
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం



**న్యూఢిల్లీ:** బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలను పదేపదే టార్గెట్‌గా చేసుకొని వేధిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఛతార్‌పూర్ జిల్లాలో హింసకాండలో పాలుపంచుకున్నట్లు ఆరోపణలున్న ఓ వ్యక్తి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేసిన ఘటనను ఆయన తప్పుపట్టారు. ఇంటిని కూల్చివేయడం, ఆ కుటుంబం రోడ్డున పడేలా చేయడం అమానవీయం, అన్యాయం అని పేర్కొన్నారు. చట్టబద్ధ పాలన అమల్లో ఉన్న సమాజంలో ఇలాంటి అనుచిత చర్యలకు, అన్యాయాలకు తావులేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఖర్గే శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలను భయాందోళనకు గురి చేయడానికి బుల్డోజర్లు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాల రాజ్యాంగ విరుద్ధ చర్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని తేల్చిచెప్పారు. ఎవరైనా నిజంగా తప్పు చేస్తే చట్టబద్ధంగా విచారించి, శిక్షించాలని సూచించారు. అంతేతప్ప రాష్ట్ర ప్రభుత్వాలే సొంతంగా శిక్షలు విధించడం ఏమిటని నిలదీశారు.

## పునర్వినియోగ రాకెట్ రూమీ-1

# ప్రయోగం విజయవంతం




**చెన్నై:** పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ రూమీ–1ను భారత్ మొట్టమొదటిసారిగా ప్రయోగించింది. 80 కిలోల ఈ రాకెట్ తమిళనాడులోని చెన్నై తీరం నుంచి శనివారం ఉదయం హైడ్రాలిక్ మొబైల్ కంటైనర్ లాంచ్‌ప్యాడ్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. అతి తక్కువ బరువున్న మూడు క్యూబ్ ఉపగ్రహాలు, 50 పికో ఉపగ్రహాలను కక్ష్యలోకి మోసుకెళ్లింది. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిస్థితులు, ఓజోన్ పొరలో మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వంటి అంశాలపై ఈ ఉపగ్రహాలు అధ్యయనం చేస్తాయి. భూమిపైకి విలువైన సమాచారం చేరవేస్తాయి. తమిళనాడులోని స్పేస్‌జోన్ అనే స్టార్టప్ కంపెనీ మార్టిన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌తో కలిసి రూమీ–1 రాకెట్‌ను అభివృద్ధి చేసింది. మిషన్ రూమీ–2024 విజయవంతం కావడం వెనుక ఆయా సంస్థ కృషి ఉంది. ఈ ప్రయోగంలో 1,500 మంది పాఠశాల విద్యార్థులు సైతం పాలుపంచుకున్నారు. రూమీ–1 రాకెట్ 35 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుందని, ఉపగ్రహాలను ఉపకక్ష్య ప్రాంతంలో విడిచిపెట్టిందని స్పేస్‌జోన్ ప్రతినిధులు చెప్పారు. సాధారణంగా ఉపగ్రహ ప్రయోగం పూర్తయిన తర్వాత రాకెట్ వాతావరణంలో మండిపోవడమో లేక సముద్రంలో కూలిపోవడమో జరుగుతుంది. కానీ, పారాచూట్ల సాయంతో రాకెట్‌ను భూమికి చేర్చి, మళ్లీ వినియోగించుకోవడం పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ ప్రత్యేకత. రాకెట్ ప్రయోగాల ఖర్చును తగ్గించాలన్న లక్ష్యంతో పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్‌ను తయారు చేసినట్లు స్పేస్‌జోన్ కంపెనీ వెల్లడించింది.

# అస్సాంలో ఆ కిరాతకుడు మృతి

## చెరువులో దూకి చనిపోయిన ప్రధాన నిందితుడు

- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లగా తప్పించుకున్నాడు: పోలీసులు
- బాలికపై అత్యాచారం కేసులో మరో ఇద్దరి కోసం గాలింపు



**గౌహతి:** ఈశాన్య రాష్ట్రం అస్సాంలో సంచలనం సృష్టించిన 14 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు మరణించాడు. నాగావ్ జిల్లాలోని ధింగ్ గ్రామంలో శనివారం ఉదయం అతడు చెరువులో దూకి మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. నిందితుడిని శుక్రవారమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అతడికి బేడీలు వేసి, అత్యాచార ఘటన జరిగిన స్థలానికి తీసుకెళ్లారు. నిందితుడు హఠాత్తుగా పోలీసులపై దాడి చేసి తప్పించుకొని సమీపంలోని చెరువులో దూకాడని నాగావ్ జిల్లా ఎస్పీ చెప్పారు. చెరువులో రెండు గంటల పాటు గాలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడి దాడిలో ఒక పోలీసుకు గాయాలయ్యాయని, అతడిని ఆసుపత్రిలో చేర్చామని వెల్లడించారు. మైనర్ బాలికపై అత్యాచారం కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు ముమ్మరం చేశామని ఎస్పీ వెల్లడించారు. చెరువులో దూకి చనిపోయిన నిందితుడి అంత్యక్రియలను తమ గ్రామ ఖబ్రస్తాన్‌లో నిర్వహించడానికి వీల్లేదని అతడి సొంత గ్రామమైన బార్పేటి ప్రజలు తేల్చిచెప్పారు. అంతేకాకుండా అతడి కుటుంబానికి సామాజిక బహిష్కరణ శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అంత్యక్రియలకు ముందు జరిగే ప్రార్థనలకు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నారు.

పదో తరగతి చదువుతున్న బాలిక గురువారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా, ముగ్గురు వ్యక్తులు బంధించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు, హింసను సహించే ప్రసక్తే లేదని అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ శనివారం తేల్చిచెప్పారు. మహిళల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కు లై డిటెక్టర్ పరీక్ష



**కోల్‌కతా/న్యూఢిల్లీ:** పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన సమయంలో ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ ఘోష్‌కు సీబీఐ శనివారం లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించింది. అదే కాలేజీకి చెందిన ఇంటర్న్‌లు, డాక్టర్లతో సహా మొత్తం ఐదుగురికి లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష శనివారం సాధ్యపడలేదు. లై డిటెక్టర్ పరీక్షలు బాగా సమయం తీసుకునేవి కావడం, రెండే పరికరాలు అందుబాటులో ఉండటంతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. కాగా సందీప్ ఘోష్ హయాంలో ఆర్.జి.కర్ ఆసుపత్రిలో జరిగిన ఆర్థిక అవకతవకలపై శనివారం సీబీఐ కేసు నమోదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ నుంచి ఈ కేసును సీబీఐ స్వీకరించింది. వైద్యురాలిపై పాశవిక హత్యాచారం ఘటనపై దర్యాప్తులో భాగంగా సీబీఐ శనివారం 15 మందిని విచారించింది. ఇందులో 10 మంది పోలీసులు, సివిల్ వాలంటీర్లు ఉన్నారు.

# సునీత రాక ఫిబ్రవరిలోనే!

## స్టార్‌లైనర్ సేఫ్ కాదు: నాసా

- స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలో తిరిగి రానున్న సునీత, విల్మోర్
- ఆటోపైలెట్ మోడ్‌లో ఖాళీగా స్టార్‌లైనర్ తిరుగుప్రయాణం



**కేప్‌కనావెరాల్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమికి తిరిగి రావడానికి బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్ సురక్షితం కాదని నాసా తేల్చిచెప్పింది. వారిని అందులో వెనక్కు తీసుకురావడం అత్యంత ప్రమాదకరమని శనివారం పేర్కొంది. ఆ రిస్క్ తీసుకోరాదని నిర్ణయించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ షటిల్ డ్రాగన్ క్యాప్సూల్‌లో వారిని తీసుకురావాలని నిర్ణయించింది.

పలు వైఫల్యాల తర్వాత బోయింగ్ స్టార్‌లైనర్ గత జూన్‌లో సునీత, విల్మోర్‌లను అంతరిక్ష కేంద్రానికి చేర్చడం తెలిసిందే. థ్రస్టర్లు మొరాయించడం, హీలియం లీకేజీ తదితర సమస్యల నడుమ అతికష్టమ్మీద స్టార్‌లైనర్ ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. వారం కోసమని వెళ్లిన సునీత, విల్మోర్ అక్కడే చిక్కుకుపోయారు. ఫిబ్రవరిలో తిరుగు ప్రయాణమంటే ఎనిమిది నెలలకు పైగా ఐఎస్ఎస్‌లోనే గడపనున్నారు. స్టార్‌లైనర్‌కు మరమ్మతులు చేయడానికి బోయింగ్ ఇంజనీర్లతో కలిసి నాసా తీవ్రంగా శ్రమించింది. మూడునెలల ప్రయత్నాల అనంతరం.. మానవసహిత తిరుగు ప్రయాణానికి స్టార్‌లైనర్ సురక్షితం కాదని తేల్చేసింది. అది ఒకటి, రెండు వారాల్లో ఐఎస్ఎస్ నుంచి విడివడి ఆటోపైలెట్ మోడ్‌లో ఖాళీగా భూమికి తిరిగి రానుంది. తమ విమానాల భద్రతపై ఇప్పటికే ఇబ్బందులను ఎదుర్కొంటున్న బోయింగ్‌కు స్టార్‌లైనర్ వైఫల్యం గట్టి ఎదురుదెబ్బే.

స్పేస్ ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ ప్రస్తుతం అంతరిక్ష కేంద్రంలోనే ఉంది. మార్చి నుంచి ఐఎస్ఎస్‌లో ఉన్న నలుగురు వ్యోమగాములను తీసుకుని సెప్టెంబరు నెలాఖరులో భూమికి తిరిగివస్తుంది. అత్యవసరమైతే తప్ప అందులో మరో ఇద్దరిని ఇరికించడం సురక్షితం కాదని నాసా తెలిపింది. రష్యాకు చెందిన సోయుజ్ క్యాప్సూల్ కూడా ఐఎస్ఎస్‌లోనే ఉన్నా అందులోనూ ముగ్గురికే చోటుంది. ఏడాదిగా ఐఎస్ఎస్‌లో ఉన్న ఇద్దరు రష్యా వ్యోమగాములు అందులో తిరిగొస్తారు. డ్రాగన్ సెప్టెంబరులో ఇద్దరు వ్యోమగాములతో ఐఎస్ఎస్‌కు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో సునీత, విల్మోర్‌లను కూడా తీసుకొస్తుంది.

# వ్యవస్థకు బయటే 90 శాతం మంది

## వారికోసం కులగణన: రాహుల్

**ప్రయాగ్‌రాజ్:** దేశవ్యాప్తంగా కుల గణన ప్రారంభించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. "దేశంలో 90 శాతం మంది ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. వ్యవస్థకు బయటే ఉండిపోతున్నారు. వారి ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. విధానాల రూపకల్పనకు కుల గణన పునాది అవుతుంది" అన్నారు. శనివారం యూపీలోని 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్'లో రాహుల్ ప్రసంగించారు. దేశంలో 90 శాతం మంది ప్రజలకు నైపుణ్యాలు, విజ్ఞానం ఉన్నప్పటికీ వ్యవస్థతో అనుసంధానం కావడం లేదని పేర్కొన్నారు. అందుకే కుల గణన కోసం తాము గళమెత్తుతున్నామని స్పష్టంచేశారు. సమాజంలోని వివిధ వర్గాలను వ్యవస్థలో భాగంగా మార్చాలంటే వారి జనాభా ఎంత ఉందో తేల్చాల్సిన అవసరముందని రాహుల్ అభిప్రాయపడ్డారు. కులాల వాస్తవ గణాంకాలు లేకుండా విధానాలు, పథకాలు రూపొందించలేమన్నారు. రాజ్యాంగం తరహాలోనే కుల గణన సైతం ఒక విధానపరమైన ఫ్రేమ్‌వర్క్, ఒక మార్గదర్శి అని వివరించారు. కుల గణన డిమాండ్‌ను లేవనెత్తడం ద్వారా రాజ్యాంగ పరిరక్షణ కోసం తాము కృషి చేస్తున్నామని ఉద్ఘాటించారు. పేదలు, కూలీలు, కార్మికులు, దళితులు, గిరిజనులే రాజ్యాంగాన్ని కాపాడుతున్నారు తప్ప అదానీ వంటి పారిశ్రామిక వేత్తలు కాదన్నారు.

# జమ్మూకశ్మీర్‌కు పూర్వ హోదా

## మేనిఫెస్టోలో పీడీపీ హామీ



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌కు పూర్వహోదా కోసం పాటుపడతామని, భారత్– పాకిస్తాన్ మధ్య ప్రాంతీయ సహకారానికి తోడ్పడతామని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పీడీపీ) ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ శనివారం మేనిఫెస్టో విడుదల చేశారు. "ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను చట్టవిరుద్ధంగా రద్దు చేయడం కశ్మీర్ సమస్యను జటిలం చేసింది. తమను పరాయివాళ్లుగా చూస్తున్నారనే కశ్మీరీల భావనను మరింత పెంచింది" అని మేనిఫెస్టో పేర్కొంది. అర్థవంతమైన చర్చలే ఏకైక పరిష్కారమార్గమని పీడీపీ బలంగా నమ్ముతోందని తెలిపింది. భారత్–పాక్ సంబంధాలను మెరుగుపర్చడం, నియంత్రణ రేఖ వద్ద స్వేచ్ఛా వాణిజ్యం తమ ప్రాథమ్యాలని పేర్కొంది. ప్రజాభద్రత చట్టం (పీఎస్ఏ), ఉపా, ఎనిమీ యాక్ట్, ఏఎఫ్ఎస్‌పీఏ రద్దుకు కృషి చేస్తామని పేర్కొంది. ప్రభుత్వ టెండర్లలో, గనుల కాంట్రాక్టుల్లో స్థానికులకే తొలి హక్కు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దినసరి వేతనాలు తీసుకుంటున్న 60 వేల మందిని ఏడాదిలో రెగ్యులరైజ్ చేస్తామని తెలిపింది.

**ఒంటరిగానే పోటీ: మెహబూబా**

అసెంబ్లీ ఎన్నికల్లో తమది ఒంటరి పోరేనని మెహబూబా తెలిపారు. బీజేపీతో పొత్తుండదని స్పష్టం చేశారు. గతంలో బీజేపీ–పీడీపీ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపాయి. "కశ్మీర్ సమస్యకు పరిష్కారం, నియంత్రణ రేఖ వద్ద వాణిజ్యానికి మార్గాలు తెరవడమే మా ప్రధాన డిమాండ్లు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వాటికి అంగీకరిస్తే వారికే పూర్తి మద్దతు తెలుపుతాం. అన్ని సీట్లనూ వారికే వదిలేస్తాం" అని మెహబూబా అన్నారు.

# ఆప్‌తో పొత్తు ఉండదు

## ఒంటరిగానే కాంగ్రెస్ పోటీ: సెల్జా



**న్యూఢిల్లీ:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు ఉండదని సీనియర్ కాంగ్రెస్ నేత, ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు. హరియాణాలో కాంగ్రెస్ బలంగా ఉందని, ఒంటరిగా పోటీచేస్తుందని తెలిపారు. హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశమే లేదని, కాంగ్రెస్‌కు అద్భుత మెజారిటీ వస్తుందని పేర్కొన్నారు. 90 సీట్లున్న హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 1న ఎన్నికలు జరగనున్నాయి. జననాయక జనతాపార్టీ (జేజేపీ) ప్రజామద్దతును కోల్పోయిందని, ముక్కలవుతోందని, వచ్చే ఎన్నికల్లో జేజేపీకి ఏమాత్రం అవకాశాలు లేవని సెల్జా అన్నారు. కిందటిసారి జేజేపీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేల్లో అత్యధికులు కాంగ్రెస్‌కు చెందిన వారేనన్నారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ)– బీఎస్పీ పొత్తు పెట్టుకున్నా వారితో ప్రమాదమేమీ లేదని, ఇరుపార్టీలు క్షేత్రస్థాయిలో బలహీనపడ్డాయని పేర్కొన్నారు. పదేళ్ల బీజేపీ పాలన తర్వాత హరియాణా ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు.

**ఎన్నికలు వాయిదా వేయండి: బీజేపీ**

ఎన్నికల తేదీకి అటూ, ఇటూ పలు పండుగలు ఉన్నాయని, అందుకని ఎన్నికలను కొద్దిరోజులు వెనక్కి జరపాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. సెప్టెంబరు 28 శనివారం చాలామందికి సెలవు రోజని, 29 ఆదివారం, మళ్లీ అక్టోబరు 1న పోలింగ్ సెలవు, 2న గాంధీజయంతి, 3న మహారాజ అగ్రసేన్ జయంతి సందర్భంగా సెలవు ఉన్నాయని బీజేపీ ఈసీ దృష్టికి తెచ్చింది. ఇలా వరుస సెలవులు వస్తే ప్రజలు వెకేషన్‌కు వెళతారని, ఊళ్లకు వెళ్లిపోతారని, అందువల్ల ఓటింగ్ శాతం తగ్గుతుందని బీజేపీ పేర్కొంది. 2వ తేదీన అసోజ్ అమావాస్య ఉందని, హరియాణాలోని బిష్ణోయ్‌లు రాజస్తాన్‌లోని బికనేర్‌లో జరిగే వార్షిక మేళాకు వెళతారని వివరించింది. అందువల్ల కొత్త తేదీని ఖరారు చేయాలని కోరింది.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



**రోడ్డు విస్తరణను కుదించండి**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి రోడ్డు విస్తరణ పరిమితిని కుదించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. -10లో



**పెట్.. న్యూట్రిషన్ ఫిట్**
పెట్స్ ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. సాధు జంతువుల ఎదుగుదల, ఆరోగ్యానికి ఉపకరించే పోషకాహార ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి. - సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
28.0/23.0

**వాతావరణం**
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టం గా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## కోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించండి

– గణేష్ ఉత్సవ నిర్వాహకులకు నగర కొత్వాల్ సూచన



**సాక్షి, సిటీబ్యూరో:** గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉత్సవాల నిర్వాహకులకు స్పష్టం చేశారు. వచ్చే నెల 7 నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం కానుండటం... 17న సామూహిక నిమజ్జనం జరగనుండటంతో నగర పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో కొత్వాల్ శనివారం జీహెచ్ఎంసీతో పాటు మూడు కమిషనరేట్ల అధికారులతో పాటు ఇతర విభాగాలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ గణేష్ సమితి ప్రతినిధులతో సమావేశమయ్యారు. అందరం సమన్వయంతో ముందుకెళ్దామని ఆయన పేర్కొన్నారు. రహదారులపై ఉన్న గోతులు, ఎగుడుదిగుడుగా ఉన్న పాట్‌హోల్స్ సమస్యలు తీర్చడంతో పాటు నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో వాహనాలు, ట్రాలీలు సమకూర్చాలని నిర్వాహకులు పోలీసులను కోరారు. చెట్ల కొమ్మల నరికివేత, రోడ్ల మరమ్మతులు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రవాణా, విద్యుత్, ఎంఎంటీఎస్, మెట్రో రైల్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొని తాము తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పసుపు, కుంకుమలతో సత్కారం



సత్కారం పొందిన పారిశుద్ధ్య కార్మికులు

**రాంగోపాల్‌పేట్:** శ్రావణ మాసం సందర్భంగా శనివారం మహిళా పారిశుద్ధ్య కార్మికులకు మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, జేసీఐ సికింద్రాబాద్ సంయుక్తాధ్వర్యంలో సత్కరించారు. సెల్యూట్ ద సైలెంట్ వర్క్ నినాదంతో మహిళ కార్మికులకు, పసుపు, కుంకుమ తాంబూలాలతో గౌరవించడంతో పాటు ఎఫ్ఎస్ఏ, జవాన్లకు గౌరవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ.. నగరం పరిశుభ్రంగా ఉండటానికి పారిశుద్ధ్య కార్మికుల కృషి అమోఘమన్నారు. వీరి సేవలు వెలకట్టలేనివని, ప్రతి ఒక్కరూ వీరిని గౌరవించాలని సూచించారు. తెల్లవారుజాము మొదలుకుని, అర్ధరాత్రి వరకు వీధుల్లోకి చేరి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడుతుంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనాగౌడ్, జేసీఐ సికింద్రాబాద్ అధ్యక్షుడు సుదన్వా, ప్రతినిధులు గోవింద్, హరి, వరుణ్, నవీన్, జగన్, బీజేపీ నాయకులు బీఆర్ రామకృష్ణ, జిత్తు, సుభాష్, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జలమండలి మేనేజర్ సస్పెన్షన్

**మణికొండ:** నీటి కనెక్షన్‌ల కోసం లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కిన జలమండలి మణికొండ డివిజన్ –18 మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి శనివారం సస్పెండ్ చేశారు. ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కేసు నమోదు చేయటం, కోర్టు 14 రోజుల కస్టడీ విధించటంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌కు రెండు నీటి కనెక్షన్‌లు ఇచ్చేందుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కుమార్ రూ.30 వేలు లంచం డిమాండ్ చేయటంతో బాధితుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించిన విషయం విదితమే. వీరిద్దరికి సెప్టెంబర్ 4 వరకు రిమాండ్ విధించటంతో సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్టు ఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డిస్కంలో ఎస్ఈల బదిలీ

**సాక్షి, సిటీబ్యూరో:** గ్రేటర్ పరిధిలోని పలువురు ఎస్ఈలను బదిలీ చేస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. సైబర్ సిటీ సర్కిల్ ఎస్ఈగా టి.చంద్ర శేఖర్, రాజేంద్ర నగర్ సర్కిల్ ఏస్ఈ డి.ఎస్ మోహన్, మేడ్చల్ సర్కిల్ ఎస్ఈగా ఎం.రవి కుమార్, హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్ఈగా డి.సోమిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈగా సి.మాధవరెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఎస్ఈగా ఎల్.గోపయ్య, బంజారాహిల్స్ సర్కిల్ ఎస్ఈగా పి.కరుణాకర్ బాబు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈగా పి.వెంకన్న, సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈగా శ్రీనాథ్‌లను బదిలీ చేశారు. కొద్ది రోజుల క్రితం హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈగా బ్రహ్మంను బదిలీ చేశారు.

## 23 రోజులు.. 4056 కేసులు

నగర ట్రాఫిక్ కాప్స్‌కు చిక్కిన 'నిషా'చరులు



**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే 'నిషా'చరులపై ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 23 వరకు చేపట్టిన తనిఖీల్లో మొత్తం 4056 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కినట్లు అదనపు సీపీ (ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో 3,495 మందిపై కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశామన్నారు. మొత్తం 300 మందికి జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు మొత్తం అందరికీ కలిపి కోర్టు రూ.76.43 లక్షలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. డ్రంక్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కిన వారి మద్యం తీసుకున్న మోతాదు తదితరాలు పరిశీలించిన కోర్టు 19 మంది డ్రైవింగ్ లైసెన్సుల్ని సస్పెండ్ చేసినట్లు విశ్వప్రసాద్ పేర్కొన్నారు.



## సంబ'రన్'గా..

నన్నాహక పరుగు సంబరంగా సాగింది. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ కర్టెన్‌రైజర్ 5కే మారథాన్ హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం వేడుకగా జరిగింది. ఈ రన్నింగ్ ఈవెంట్‌లో 8 వేల మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. 14 కార్పొరేట్ కంపెనీల నుంచి ఉద్యోగులు హుషారుగా పరుగెత్తారు. ఆదివారం ఉదయం అసలైన హాఫ్, ఫుల్ మారథాన్ పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. –సాక్షి, సిటీబ్యూరో

## వారం వారం.. హైడ్రా భయం

- చెరువుల పరిరక్షణలో వ్యూహాత్మక వైఖరి
- శని, ఆదివారాల్లోనే కూల్చివేత కార్యక్రమం
- ఎన్–కన్వెన్షన్ ఉదంతంతో హాట్ టాపిక్‌గా



**సాక్షి, సిటీబ్యూరో:** మహా నగరంలోని చెరువుల పరిరక్షణకు నడుం కట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఈ వ్యవహారంలో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. తొలినాళ్లల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతల నేపథ్యంలో తలెత్తిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని తన పంథా మార్చింది. భారీ, సున్నితమైన కూల్చివేతల్ని కేవలం శని, ఆదివారాల్లో మాత్రమే చేపట్టాలని నిర్ణయించింది.

### మూడు దశల్లో కార్యాచరణ..

- హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మరునాడే సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ ఆ విభాగం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తక్షణం చెరువుల పని ప్రారంభించిన ఆయన వరుసపెట్టి క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులు, కోర్టు కేసులతో పాటు తమకు వస్తున్న ఫిర్యాదు ఆధారంగా చెరువులు, కుంటలు, నాలాల్లో ఆక్రమణల్ని గుర్తించారు. చెరువుల పరిరక్షణకు మూడు దశల్లో కార్యాచరణ అమలు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. మొదటి దశలో ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఒక్క చదరపు అడుగు కూడా ఆక్రమణ కాకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- అందులో భాగంగానే నోటీఫై అయిన ఆయా ప్రాంతాల్లోని నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. వనస్థలిపురం, బాచుపల్లి తదితర చోట్ల ఉన్న వాటిని ఇతర వారాల్లో కూల్చేశారు. ఆ అనుభవాల నేపథ్యంలోనే శని–ఆదివారాల్లోనే కూల్చివేతలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ కారణంగానే శివరాంపల్లిలోనివి ఈ నెల 10 (శనివారం), ఉస్మాన్‌సాగర్‌కు సంబంధించి గండిపేట, శంకర్‌పల్లిలో ఉన్నవి ఈ నెల 18 (ఆదివారం) కూల్చేశారు. తాజాగా ఎన్–కన్వెన్షన్‌ను సైతం శనివారమే కూల్చేయడం గమనార్హం. ఈ చర్యతో హైడ్రా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.
- చెరువుల పరిరక్షణలో రెండో దశలోగా ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో ఉన్న అనుమతి ఉన్న, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటారు. మూడో దశలో ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న మాదిరిగా చెరువుల పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి దశ నడుస్తోంది. నగరంలో ఉన్నవి అన్నీ గొలుసుకట్టు చెరువులే కావడంతో ఒకటి అలుగు పారితే ఆ నీరు నాలాలు, వాగుల ద్వారా మరో దాంట్లోకి వెళ్లాలి. ఆ పరిస్థితి తీసుకురావడానికి కృషి చేయాలని హైడ్రా నిర్ణయించింది.
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న నిర్మాణాలు, లేఔట్లలో ప్రజలు ప్లాట్లు, స్థలాలు ఖరీదు చేయవద్దు. త్వరలో ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. ఇప్పటికే ఇలా ఖరీదు చేసి నష్టపోయిన వాళ్లు ఉంటే బిల్డర్‌పై కేసు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపైనా విచారణ చేసి, చర్యలకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం ఎన్–కన్వెన్షన్ కూల్చివేతతో దాదాపు 9 బుకింగ్స్ రద్దయినట్లు తెలిసింది.

## ఆహార నాణ్యతపై ఆరా

- రంగంలోకి విజిలెన్స్‌తో పాటు కలెక్టర్
- సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో తనిఖీలు
- అన్నం నుంచి మెనూ వరకు పరిశీలన

**సాక్షి, సిటీబ్యూరో:** సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. వారం రోజులుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి కలెక్టర్ వరకు రంగంలోకి దిగి క్షేత్రస్థాయి తనిఖీలు చేపడుతున్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సరఫరా అయ్యే బియ్యం నుంచి వండి పెట్టే మెనూ వరకు పరిశీస్తుండటంతో విస్తుపోయే అంశాలు బహిర్గతం కావడం విస్మయానికి గురి చేస్తోంది. పలు హాస్టళ్లు, గురుకులాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నట్లు తనిఖీలో వెల్లడైంది. నాణ్యమైన భోజనం అందే పరిస్థితి కనిపించలేదు. నాణ్యత లేని, కాలం చెల్లిన వస్తువులు, పురుగులు పట్టిన పప్పులు, పల్లీలను అధికారులు గుర్తించారు.

### తనిఖీలు ఇలా..

- శనివారం సికింద్రాబాద్ తిరుమలగిరి మండలం బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమీ వసతి గృహాన్ని హైదరాబాద్ జిల్లా అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలోని వంట గది, స్టోర్‌రూం, కంప్యూటర్ ల్యాబ్, పిల్లల విశ్రాంతి గదులు, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ స్టాక్ నిల్వలు పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పిల్లలకు సన్న బియ్యంతో పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు.
- పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం హైదరాబాద్ జిల్లాలోని 44 సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం 21 బృందాలు రంగంలోకి దిగి సన్న బియ్యం నాణ్యత, సన్న బియ్యం పరిమాణం,సన్న బియ్యం నిల్వ, వంట విధానానాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు.
- నగర శివారులోని మహేశ్వరంలోని పలు సంక్షేమం వసతి గృసాలు, గురుకులాల్లో రంగారెడ్డి జిల్లాపౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.
- రెండు రోజుల క్రితం జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు 28 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. భోజనం, టిఫిన్ల తయారీకి వినియోగిస్తున్న ఆహార పదార్థాల్లో నాణ్యత లేదని గుర్తించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన కూరలు, సాంబారు కొన్ని చోట్ల నాణ్యతలేమిగా తేలింది.



బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ఫైన్ తప్పదు!

- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు
- చర్యలకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ

**సాక్షి, సిటీబ్యూరో:** స్వచ్ఛ ర్యాంకుల్లో అవార్డులు వస్తున్నా.. నగరంలో పారిశుద్ధ్యం పరమ అధ్వానంగా ఉంటోంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు.. వాటిపై ముసురుతున్న దోమలతో వ్యాధులు.. పరిసరాల్లో దుర్గంధంతో నగర పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ చందంగా మారింది. ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరించే కార్మికులు రాకపోవడంతో ప్రజలు రోడ్ల పక్కనే ఇళ్ల చెత్తను పారబోస్తున్నారు. గతంలో డంపర్‌బిన్లు ఉన్నప్పుడు వాటిలో చెత్త వేసేవారు. స్వచ్ఛ ర్యాంకుల కోసం వాటిని తొలగించడంతో ఇప్పుడు రోడ్ల పక్కనే పడేస్తున్నారు. ఈ పరిస్థితి నివారణకు జరిమానాల కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది.

**ఏం చేసినా..**

ప్రజలు చెత్త వేసే బహిరంగ ప్రదేశాలను గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీ)గా గుర్తించి అక్కడ శుభ్రం చేసి ముగ్గులు, రంగవల్లుల వంటి కార్యక్రమాలతో పాటు బర్త్‌డే వేడుకలు వంటివి సైతం నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జరిమానాల విధింపు ద్వారానే ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉంటారని భావిస్తున్నారు. జరిమానాల గురించి ఇప్పటికే కొన్ని జోన్లలో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. పోస్టర్లతో పాటు గోడలపై రాతలు రాస్తున్నారు. అంతే కాకుండా ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ ఈ అంశాన్ని ప్రచారం చేస్తున్నారు.

**సీసీ కెమెరాలతో గుర్తింపు**

మరోవైపు జీవీపీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే యోచనలో జీహెచ్ఎంసీ అధికారులున్నారు. ఒకటి రెండు ప్రాంతాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేశారు. వాటి ద్వారా తరచూ అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి, జరిమానాలు విధించే యోచనలో ఉన్నారు. జరిమానాల గురించి ముందస్తుగా విస్తృతంగా ప్రచారం చేసి విధించాలనుకుంటున్నారు. అధికారుల ఈ ఆలోచన బాగానే ఉన్నప్పటికీ, అంతకంటే ముందు ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ సవ్యంగా జరగనిదే ప్రజల నుంచి విమర్శలు తప్ప కార్యక్రమం విజయవంతం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## గడువులోపే పట్టాలపైకి..

- అంతర్జాతీయ హంగులతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్
- 2025 నవంబర్ నాటికి సకల సదుపాయాలతో పునరభివృద్ధి
- ఇప్పటి వరకు 27 శాతం పనులు పూర్తి..
- కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రవణీత్‌సింగ్ వెల్లడి

**సాక్షి, సిటీబ్యూరో:** అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి ప్రాజెక్టును నిర్ణీత గడువులోగానే పూర్తి చేయనున్నట్లు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి రవణీత్ సింగ్ వెల్లడించారు. వచ్చే ఏడాది నవంబర్ నాటికి పనులు పూర్తవుతాయని, 2026 నుంచి సకల సదుపాయాలతో అధునాతన సికింద్రాబాద్ స్టేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. శనివారం ఆయన సికింద్రాబాద్ స్టేషన్‌లో పర్యటించారు. పునరభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం సికింద్రాబాద్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన మాట్లాడారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి

### పర్యావరణ హితంగా..

- సుమారు రూ.699.77 కోట్లతో సికింద్రాబాద్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 27 శాతం పనులు పూర్తయ్యాయని, 36 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు చెప్పారు. 'ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేసే సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రతిరోజూ సుమారు 2 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. దేశంలోనే ఇది ప్రధానమైన రైల్వేస్టేషన్. అధునాతన సదుపాయాలతో, అంతర్జాతీయ హంగులతో స్టేషన్ పునరభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రయాణికులు, రైళ్ల రాకపోకలతో పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ సకాలంలోనే పూర్తి చేస్తాం' అని మంత్రి పేర్కొన్నారు.
- పర్యావరణహిత భవన సముదాయంగా సికింద్రాబాద్‌స్టేషన్ రూపుదిద్దుకోనుందని చెప్పారు. విద్యుత్ వినియోగం కోసం సోలార్ పలకలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరోవైపు రైళ్లలో సాధారణ బోగీల కొరతతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మంత్రి స్పందించారు. ప్రస్తుతం కొన్ని రైళ్లలో అదనపు బోగీలను ఏర్పాటు చేశామని, దశలవారీగా ప్రయాణికుల డిమాండ్ మేరకు అన్ని రైళ్లలో బోగీలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### త్వరలో చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం..

దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ, అమృత్‌భారత్ పథకం కింద దక్షిణమధ్యరైల్వేలో 119 స్టేషన్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు, సికింద్రాబాద్‌తో పాటు నాంపల్లి,కాచిగూడ స్టేషన్‌లను కూడా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్ పూర్తయిందని, త్వరలోనే ప్రయాణికులకు వినియోగంలోకి రానుందని పేర్కొన్నారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో 'సిటీ సైబర్' ఎటాక్

స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఏడు బృందాలు

- 20 కేసుల్లో నిందితులుగా ఉన్న 36 మంది అరెస్ట్
- కటకటాల్లోకి చేరిన వారిలో ఒక చార్టెర్డ్ అకౌంటెంట్
- వివరాలు వెల్లడించిన నగర కొత్వాల్ శ్రీనివాసరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో డీసీపీ శ్వేత, దార కవిత తదితరులు



నిందితుల చిత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: కొన్ని రకాలైన సైబర్ నేరాలకు అడ్డాగా మారిన గుజరాత్‌పై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఏడు ప్రత్యేక బృందాలు పది రోజులపాటు ఆ రాష్ట్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 36 మంది చిక్కారు. వీరిలో ఒక చార్టెర్డ్ అకౌంటెంట్ కూడా ఉన్నట్లు కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. డీసీపీ ఎన్.శ్వేత, దార కవిత, ఏసీపీలు ఆర్‌జీ శివమారుతి, చాంద్ బాషాలతో కలిసి బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. మూడు కీలక కేసుల పూర్వాపరాలు ఆయన ప్రకటించారు.

### పెట్టుబడుల పేరుతో రూ.2 కోట్లు స్వాహా...

రాజ్‌కోట్ జిల్లాకు చెందిన యోగిరాజ్ స్పిన్నింగ్ మిల్ నిర్వాహకుడు చుడాశమ కుల్దీప్ సింగ్ అనూప్ సింగ్, ప్రైవేట్ ఉద్యోగి జడేజా దైవత్సింగ్, డ్రైవర్ సినో జీయా కేతన్ సురేష్ భాయ్ ఓ ముఠాగా ఏర్పడ్డారు. బోగస్ కంపెనీల పేర్లతో కరెంట్ ఖాతాలు తెరిచారు. కొన్ని యాప్స్ రూపొందించిన ఈ త్రయం వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా అనేకమందికి ఎరవేశారు. తమ ద్వారా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయంటూ నమ్మబలికారు. ఇలా నగరానికి చెందిన ఓ వ్యాపారి వద్ద నుంచి రూ.2 కోట్లు స్వాహా చేయడంతో కేసు నమోదైంది.

### ముంబై పోలీసుల పేరు చెప్పి రూ.1.6 కోట్లు...

విదేశాల్లో ఉంటున్న కోల్‌కతా వాసి దీపక్ రావత్ గుజరాత్‌కు చెందిన సాగర్ ప్రజాపతి, పర్మార్ కిరిత్ నాథుబాయ్‌లను తన ముఠాలో చేర్చుకున్నాడు. నగరానికి చెందిన ఓ మహిళ డాక్టర్ (74)కు కాల్ చేసిన దీపక్ రావత్ ముంబైలోని అంధేరీ పోలీసునని పరిచయం చేసుకున్నాడు. ఆమె పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగిందని, దీనిపై సీబీఐలో కేసు నమోదైందని భయపెట్టాడు. ఆమెకు వాట్సాప్ ద్వారా నకిలీ ఎఫ్ఐఆర్, ఇతర పత్రాలు పంపాడు. దీంతో బాధితురాలు భయపడి రెండు విడతల్లో రూ.1.6 కోట్లు చెల్లించింది. కొన్నాళ్లకు పరిచయస్తుల సలహాతో సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో ప్రజాపతి, పర్మార్‌లను అరెస్టు చేసిన పోలీసులు దీపక్‌పై ఎల్ఓసీ జారీ చేశారు.

### ట్రేడింగ్ పేరుతో రూ.60 లక్షలు టోకరా...

గుజరాత్‌కు చెందిన కనానీ నికుంజ్ కిషోర్ భాయ్ చార్టెడ్ అకౌంటెన్సీలోని ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఫైనల్‌లో ఫెయిల్ అయిన ఇతడు ప్రవీణ్ భాయ్ వసోయతో కలిసి మెటాల్.కామ్ పేరుతో యాప్ రూపొందించాడు. ట్రేడింగ్ పేరుతో అనేక మంది వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ఎర వేశాడు. ఆసక్తి చూపిన వారికి ఈ యాప్ లింకులు పంపి డౌన్‌లోడ్ చేయించాడు. తొలినాళ్లలో లాభాలు ఇచ్చాడు. ఓ దశలో యాప్ పని చేయకుండా చేసి మోసం చేశాడు. బేగంపేటకు చెందిన ఓ వ్యాపారి వీరి బారినపడి రూ.60.88 లక్షలు నష్టపోవడంతో కేసు నమోదైంది. వీళ్లు మొత్తం 226 బ్యాంకు ఖాతాలు నిర్వహించారని, వీటి ద్వారా చేసిన నేరాలపై దేశ వ్యాప్తంగా 142 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

### 20 కేసుల్లో 12.49 కోట్లు నష్టం

ఈ మూడు కీలక కేసుల్లో ఏడుగురితో సహా మొత్తం 36 మందిని అరెస్టు చేశాం. వీరిలో ఏడుగురు కీలక నిందితులు ఉన్నారు. 20 కేసుల్లో కలిపి బాధితులు రూ.12,49,53,316 నష్టపోయారు. నిందితుల నుంచి రూ.38.28 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్స్ స్వాధీనం చేసుకున్నాం. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన మొత్తం నుంచి రూ.1,51,40,344 బాధితులకు అందించగా... మరో రూ.2,89,63,753 అందించాల్సి ఉంది. ఈ 36 మందిపై దేశ వ్యాప్తంగా 983 కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో తెలంగాణకు సంబంధించినవే 101 ఉన్నట్లు గుర్తించాం. నిందితులను అరెస్టు చేసిన బృందాలకు నేతృత్వం వహించిన ఇన్‌స్పెక్టర్లు కె.మధుసూదన్‌రావు, కె.ప్రసాదరావు కృషి అభినందనీయం.

– కొత్తకోట శ్రీనివాసరెడ్డి, కొత్వాల్

## విద్యార్థి హత్య కేసులో ఏడుగురి రిమాండ్

పహాడీషరీఫ్: ప్రేమించిన యువతి వద్ద తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నాడన్న అనుమానంతో ఓ యువకుడిని స్నేహితుడే హత్య చేసినట్లు బాలాపూర్ పోలీసులు నిర్ధారించారు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న ఏడుగురిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి తెలిపిన వివరాల ప్రకారం... బీటెక్ చదువుతున్న ప్రశాంత్ (21)కు, బాలాపూర్‌కి చెందిన పాలు విక్రయించే పోచబోయిన మాధవ్ యాదవ్ (24)తో మొదట స్నేహం కుదిరింది. ఆ తర్వాత కొద్దిరోజులకు ఇద్దరి మధ్య చిన్నచిన్న గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తన ప్రేయసి వద్ద ప్రశాంత్ చెడుగా చెప్పాడనే అనుమానంతో మాధవ్ కక్ష పెంచుకున్నాడు. ప్రశాంత్‌ను అంతమొందించాలని స్నేహితులతో కలిసి కుట్రపన్నాడు. పథకం ప్రకారం ఈ నెల 22న హత్య చేశాడు. మాధవ్‌తో పాటు హత్యలో పాల్గొన్న చింతల మహేశ్ యాదవ్ (25), రామోజు సుమంత్ చారి (21), నల్లపూసల మహేశ్ (24), దొడ్డి హరీష్ (23), మాడపురం అఖిల్ కిరణ్ కుమార్ (20), కోహెడ యశ్వంత్(19)లను పోలీసులు శుక్రవారం రాత్రి కుర్మల్‌గూడలో తలదాచుకోగా అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కత్తి, రక్తపు దుస్తులు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



# సమస్యల చిత్రణ రచయితల బాధ్యత



సీతారాంకు దేవులపల్లి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: సమాజ సంస్కరణ, సమస్యల చిత్రణ రచయితల బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు 107వ జయంతి సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ సీతారాంకు దేవులపల్లి రామానుజరావు సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పరిషత్తు ప్రాంగణంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఉత్సవంలో జస్టిస్ లక్ష్మణ్ పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డితో కలిసి సీతారామ్‌ను రూ.25 వేల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ 80 ఏళ్ల సారస్వత పరిషత్తు తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పరిషత్తు అభ్యుదయంలో లోకనంది శంకర నారాయణరావు, సురవరం ప్రతాప్‌రెడ్డి, దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి పెద్దల కృషి ఎంతో ఉందన్నారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ సారస్వత పరిషత్తు కృషి వెనుక డాక్టర్ దేవులపల్లి రామానుజరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి కృషి కీలకమన్నారు. పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు మాట్లాడుతూ రామానుజరావు ఏస్థాయిలో ఉన్నా క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థ సేవా గుణం అనుసరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురస్కార స్వీకర్త డాక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్సీల వర్గీకరణ సరికాదు'

కాచిగూడ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను చేపట్టడం తగదని, అదే జరిగితే రెండు రాష్ట్రాలోనూ రాజకీయ సంక్షోభం తీసుకువస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అనేది ఎస్సీల్లో కాదని, రాజకీయాల్లో, ప్రభుత్వ పదవుల్లో జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. వర్గీకరణ అంతం..దళితుల పంతం పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు. సెప్టెంబర్ 2వ తేదీన మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, 11వ తేదీన అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద నిరసన ప్రదర్శనలు, 16వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, నిరసన ప్రదర్శనలు, 27వ తేదీన ఛలో హైదరాబాద్ పేరుతో లక్షలాదిమందితో రాష్ట్ర సచివాలయం ముట్టడి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటీషన్ వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గవ్వల శ్రీకాంత్, పి.మోహన్‌రావు, గోలి నరేష్, వాడాల భాస్కర్, సిహెచ్ రోజలీలా తదితరులు పాల్గొన్నారు.

## హెచ్చార్సీ కార్యదర్శికి వీడ్కోలు



డి.ఆర్.గార్గ్‌ను సత్కరిస్తున్న అధికారులు

నాంపల్లి: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి డి.ఆర్.గార్గ్ పదవీకాలం ముగిసింది. శనివారం ఆయనకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డీఆర్ గార్గ్‌ను ఘనంగా సత్కరించారు. కమిషన్ కార్యదర్శిగా ఆయన 2022న బాధ్యతలు స్వీకరించారు. నేటికీ ఆయన పదవీకాలం రెండేళ్లు పూర్తయింది.

## మాదకద్రవ్యాన్ని విక్రయించేందుకు యత్నించిన నైజీరియన్ అరెస్ట్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సన్‌సిటీ ప్రాంతంలో ఓ నైజీరియన్‌ను ఎస్ఓటీ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని 40 గ్రాముల ఎన్‌డీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఓ నైజీరియన్ సన్‌సిటీ ప్రాంతంలో మాదకద్రవ్యాన్ని విక్రయించేందుకు శనివారం రాత్రి వచ్చాడు. అప్పటికే సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు సన్‌సిటీ వద్ద కాపు కాశారు. విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. 40 గ్రాముల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.

# నగలు, నగదు కోసం వృద్ధురాలి హత్య



కేసు వివరాలను వెల్లడిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: వృద్ధురాలిని హత్య చేసి నగదు, నగలను దొంగిలించి పారిపోయిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం నవరంపూర్ జిల్లా కోసగుండా తహసీల్, ఆవిరి గ్రామానికి చెందిన డోంబు బోత్రా అలియాస్ దుము(30) నగరానికి వలస వచ్చి సెంట్రింగ్ లేబర్‌గా పనిచేస్తూ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అదే ప్రాంతంలో చీమల బాలమ్మ(63) ఒంటరిగా ఉండటం, ఆమె ప్రతిరోజు డబ్బులు లెక్కపెట్టడాన్ని గమనించిన దుము ఎలాగైనా ఆమెను హతమార్చి డబ్బులతోపాటు వెండి నగలను తీసుకుని పారిపోవాలని పథకం రచించాడు. ఈ నెల ఐదవ తేదీ బాలమ్మ ఉన్న గదిలోకి వెళ్లి ఆమెను బండరాయితో తలపై మోది హత్య చేసి 8 వేల రూపాయలతోపాటు ఏడు తులాల వెండి నగలను తీసుకుని పారిపోయాడు. గమనించిన కాలనీకి చెందిన చింతకాయల హరిబాబు వనస్థలిపురం పోలీసులుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దుముగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. బాలమ్మను డబ్బులు, వెండి నగలకోసం హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. దుమును శనివారం అరెస్ట్ చేసి ఏడు తులాల వెండి నగలను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించారు.

## సెల్‌ఫోన్ వివాదం.. ఒకరి హత్య

కేపీహెచ్‌బీకాలనీ: అరటిపండ్ల బండి వద్ద జరిగిన చిల్లర దొంగతనం పంచాయతీ చివరకు హత్యకు దారితీసింది. కేపీహెచ్‌బీ సీఐ ఎం. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా బెంజరస్‌పల్లికి చెందిన పందికొండ దత్తు(24) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అడ్డగుట్ట సొసైటీ పరిధిలోని ఓ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా హోటల్స్, దుకాణాలకు మినరల్ వాటర్ సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే శంకర్‌విలాస్ పక్కన ఫుట్‌పాత్‌పై అరటిపండ్ల వ్యాపారం చేస్తున్న నర్సాపూర్‌కు చెందిన మహమ్మద్ ఉస్మాన్‌తో పరిచయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన ఉస్మాన్ తన వద్ద నుంచి లాక్కున్న సెల్‌ఫోన్, 400 రూపాయల నగదు తిరిగి ఇచ్చేయాలని దత్తును అడగటంతో ఇరువురి నడుమ వివాదం మొదలైంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఉస్మాన్ తన అరటిపండ్ల బండి వద్ద ఉన్న దుడ్డు కర్రను తీసుకొని దత్తు తలపై, ఇతర అవయవాలపై బలంగా కొట్టాడు. దీంతో దత్తు రోడ్డు మీద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## తల్లిదండ్రులు మందలించారని.. ముంబై పారిపోతుండగా..

బాలికను చేరదీసిన ఆర్‌పీఎఫ్ పోలీసులు

నాంపల్లి: తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఓ బాలిక గుట్టు చప్పుడు కాకుండా ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా నాంపల్లి ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్ కుమార్తె(17) కుటుంబ సమస్యలు, తల్లిదండ్రులు మందలిస్తున్నారని మనస్తాపం చెందింది. గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి పారిపోయేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో రైలెక్కి ఒంటరిగా ముంబైకి వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి వివరాలను సేకరించారు. బాలికను ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు.

# రెండోసారి చిక్కితే జైలుకే..!

- ఆవారాలపై పెట్టీ కేసులు
- పూర్తి వివరాలు రికార్డు చేస్తున్న పోలీసులు
- అర్ధరాత్రి విస్తృతంగా తనిఖీలు
- ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే తీవ్ర పరిణామాలు
- బంజారాహిల్స్ పోలీసుల వినూత్న శైలి

**బంజారాహిల్స్:** అర్ధరాత్రుల్లో ఏ పని లేకుండా రోడ్లపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు గురిచేసే ఆవారాలపై పోలీసులు దృష్టిపెట్టి కేసులు నమోదు చేయడంతోపాటు జైలుకు కూడా పంపుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇద్దరు ఎల్ఎల్‌బీ విద్యార్థులు మాదాపూర్‌లో మద్యం సేవించి బిల్లు చెల్లింపు విషయంలో గొడవ పడ్డారు. దారిలో వస్తూనే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఒకరిపై మరొకరు పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వారిద్దరిపై సీఆర్‌పీసీ 70(బీ) కింద పెట్టీ కేసు నమోదు చేసి వారి సమగ్ర వివరాలను పోలీసు రికార్డుల్లో నమోదు చేశారు.

◆ నాలుగు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని ఇందిరానగర్‌లో ఓ ర్యాపిడో డ్రైవర్‌కు మరో స్కూటరిస్టుకు మధ్య గొడవ జరుగుతుండగా అదే సమయంలో అటు నుంచి వెళ్తున్న జెప్టో డెలివరీ బాయ్ వీరిద్దరినీ విడిపించి సముదాయించేందుకు యత్నిస్తుండగా ఆ ఇద్దరూ కలిసి మరో ముగ్గురిని పిలిచి జెప్టో బాయ్‌ను కొట్టారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ర్యాపిడో డ్రైవర్, జెప్టో బాయ్, స్థానిక యువకులను స్టేషన్‌కు పిలిపించి వీరందరిపై పెట్టీ కేసు నమోదు చేసి ఫొటోలతో సహా పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేశారు.

◆ వారం రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ముగ్గురు యువకులు ఓ వీధిలో బైక్‌పై కూర్చొని సిగరెట్ తాగుతున్నారు. ఇంతరాత్రి బయట ఎందుకు తిరుగుతున్నారని పోలీసులు ప్రశ్నించగా తిక్క సమాధానం చెప్పారు. దీంతో ముగ్గురినీ స్టేషన్‌కు పిలిపించి పెట్టీ కేసు నమోదు చేసి వివరాలు తీసుకుని పోలీసు రికార్డుల్లోకెక్కించారు.

◆ గత మూడు నెలల నుంచి బంజారాహిల్స్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తూ ఆవారాగా తిరుగుతున్న యువకులపై, అర్ధరాత్రి సంచరిస్తున్న స్కూటరిస్టులపై, రోడ్ల పక్కన నిలబడి తాగుతున్న మందుబాబులపై అకారణంగా గొడవకు దిగుతున్నారు. యువకులపై సీఆర్‌పీసీ 70(బీ) కింద పెట్టీ కేసులు నమోదు చేస్తున్నారు. కేవలం పెట్టీ కేసులు నమోదు చేసి గంట సేపట్లో ఇంటికి పంపించే కార్యక్రమానికి స్వస్తి పలికారు. తాజాగా గొడవకు దిగినా, ఆవారాగా తిరిగినా, అనవసరంగా బయటకు వచ్చినా యువకులు, వ్యక్తులపై పెట్టీ కేసులు నమోదు చేయడమే కాకుండా వారి సమగ్ర వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. పేరు, వయస్సు, అడ్రెస్, ఫోన్‌నెంబర్, ఘటన జరిగిన సమయం, బంధువుల ఫోన్ నెంబర్లు, తల్లిదండ్రుల వివరాలు రికార్డులో నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా తీవ్ర గొడవలకు పాల్పడిన వారి ఫొటోలను రికార్డుల్లోకెక్కిస్తున్నారు. ఇలా గొడవల్లోకి మరోసారి దూరి పోలీసులకు చిక్కితే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. ఈనెల రోజుల వ్యవధిలో 148మంది యువకులపై పెట్టీ కేసులు నమోదు చేశారు. తరచూ పోలీసులకు చిక్కుతున్న ఐదు మందిని కేసుల్లో జైలుకు తరలించారు. అర్ధరాత్రి ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలతో సహా బీసీ, పెట్రోలింగ్ పోలీసులు బస్తీలు, కాలనీలు అని తేడా లేకుండా అంతటా తిరుగుతూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ న్యూసెన్స్‌రాయుళ్లపై కొరడా ఝళిపిస్తున్నారు. అర్ధరాత్రి రోడ్ల పక్కన కూర్చొని సిగరెట్లు తాగుతూ యూట్యూబ్ విజువల్స్ చూసుకుంటూ, మద్యం సేవిస్తూ చుట్టుపక్కల వారి హక్కులకు భంగం కలిగిస్తున్న వీరిని ఏమాత్రం ఉపేక్షించడం లేదు. ఇటీవల కాలంలో బస్తీల్లో పోలీసుల తనిఖీలు ఎక్కువగా జరుగుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్, అన్నపూర్ణ స్టూడియో, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీ నగర్, శ్రీరామ్‌నగర్, సయ్యద్‌నగర్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఉదయ్‌నగర్, సింగాడికుంట, గౌరీశంకర్‌కాలనీ, జహీరానగర్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వెంకటేశ్వరనగర్, నందినగర్, లంబాడా బస్తీ తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి తనిఖీలు జోరుగా సాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి స్థానికులతో కలిసి మద్యం, సిగరెట్లు సేవిస్తూ గొడవలకు పాల్పడుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయడమే కాకుండా వారికి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. పోలీసుల తనిఖీలు చాలా వరకు సత్ఫలితాలు ఇస్తుండడంతో ఈ తనిఖీల జోరు ఇంకా పెంచుతున్నారు.


పెట్టీ కేసుల్లో ఇరుకున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ పోలీసులు


యువకులను ప్రశ్నిస్తున్న బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర

## పండుగలు, ఎన్నికల సమయాల్లో పిలిపిస్తాం

పెట్టీ కేసులు నమోదైన వారి పూర్తి వివరాలను రికార్డుల్లో చేరుస్తున్నాం. వారి అడ్రస్, ఫోన్‌నెంబర్లు, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువుల వివరాలను కూడా నమోదు చేయడం జరుగుతుంది. ఈ రికార్డులతో బోనాలు, నిమజ్జనం, ఎన్నికలు తదితర సమయాల్లో వీరందరినీ స్టేషన్‌కు పిలిపించి వీరి కదలికలపై దృష్టి పెట్టడం జరుగుతుంది. ఒక్కసారి పెట్టీ కేసు నమోదైన వ్యక్తి రెండోసారి కూడా గొడవలో ఇరుక్కుంటే జైలుకు పంపిస్తున్నాం. పనులు చేసుకునే వారు, ఉద్యోగాలు చేసుకునేవారు, వ్యాపారాలు చేసుకునే వారు, ఆస్పత్రులకు వెళ్లేవారు, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు అర్ధరాత్రి రాకపోకలు సాగించినా ఏమాత్రం ఇబ్బంది లేదు. కానీ ఏ పనీ లేకుండా గంజాయి, మద్యం, సిగరెట్లు సేవిస్తూ వీధుల్లో ఇళ్లముందు కూర్చొని సిగరెట్లు తాగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న వారి పైనే ఉక్కుపాదం మోపుతున్నాం. పద్ధతి మార్చుకోకుండా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– కేఎం రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్, బంజారాహిల్స్

## హైడ్రా పనితీరు ప్రశంసనీయం

**రహమత్‌నగర్:** భూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా పనితీరు ప్రశంసనీయమని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం రహమత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగరంలో చెరువులు, కుంటలు ఆక్రమించుకుని యథేచ్ఛగా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా తొలగిస్తుండటం అభినందనీయమన్నారు. నగర వ్యాప్తంగా ఆక్రమణకు గురైన విలువైన భూములను తిరిగి ప్రభుత్వానికి అప్ప చెబుతున్న హైడ్రా అంటేనే కబ్జాదారులు భయపడుతున్నారని ఆయన కొనియాడారు. హైడ్రాను నగరానికే పరిమితం కాకుండా జిల్లాల్లో సైతం ఏర్పాటు చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మన్సూర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా అమ్మవారికి మారు నైవేద్యం

**ఫిలింనగర్:** ఫిలింనగర్‌లోని బాబూనాయుడునగర్ బస్తీలో కొలువుదీరిన శ్రీముత్యాలమ్మ తల్లి బోనాలు ఇటీవలే ముగిశాయి. బోనాల అనంతరం జరిగే మారు నైవేద్యం, ఒడిబియ్యం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకురాలు భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు కనుల పండువగా జరిగాయి. బస్తీ మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీవీబీపీ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కనులపండువగా జరిగాయి. ప్రీ ప్రైమరీ బిల్డింగ్‌లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. రంగరంగుల దుస్తులు ధరించిన చిన్నారులు చేతిలో పిల్లనగ్రోవి, తలపై నెమలి పింఛం, వెన్న దొంగ తదితర వేషధారణలో ఆహుతులను అలరించారు. కృష్ణాష్టమి నేపథ్యంగా నిర్వహించిన నృత్యాలు, ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

**వెంగళరావునగర్:** ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌లో నివాసం ఉంటున్న నరేష్‌కు 2012లో వివాహం అయింది. నరేష్‌కు ముగ్గురు సంతానం, పెద్ద కుమార్తె కొంతకాలం కిందట మృతి చెందింది. అమీర్‌పేటలో నరేష్ వస్త్ర దుకాణం వ్యాపారం చేసేవాడు. సరిగ్గా నడవకపోవడంతో మూడేళ్ళ కిందట మూసివేశాడు. నాటి నుంచి ఉద్యోగం లేక, ఏ పని చేయకుండా ఖాళీగా ఉన్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు మొదలుకావడంతో మద్యానికి అలవాటు పడ్డాడు. శనివారం తెల్లవారుజాము వేరే గదిలోనికి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు. అనుమానం వచ్చి అతని తండ్రి, భార్య తలుపు కొట్టినా తెరవలేదు. దీంతో తలుపు పగలకొట్టి చూడగా చున్నీతో ఉరేసుకుని కనిపించాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నరేష్ తండ్రి ఎస్.నారాయణ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మసాజ్ ముసుగులో వ్యభిచారం

### పోలీసుల అదుపులో నిర్వాహకులు, విటుడు, సెక్స్‌వర్కర్లు

**వెంగళరావునగర్:** సెలూన్ మసాజ్ ముసుగులో వ్యభిచారం చేస్తున్న వారిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మధురానగర్‌కాలనీ సమీపంలోని ఇంజినీర్స్‌కాలనీ రెయిన్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో గత కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో గత శుక్రవారం రాత్రి పోలీసులు పగడ్బందీగా రెయిన్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచారం చేస్తున్న విటుడు ఆర్.విజయ్, మరో మహిళను పట్టుకున్నారు. అనంతరం వారి ద్వారా ప్రధాన వ్యభిచార నిర్వాహకుడైన బోడ ప్రవీణ్, సబ్ నిర్వాహకులైన బాల్‌రాజ్, రజితలతో పాటుగా వరంగల్, రామ్‌నగర్, విజయవాడకు చెందిన ముగ్గురు మహిళా సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్‌లో ఉన్న వివిధ రకాల 11 కండోమ్ పాకెట్లు, ఒక పేటీఎం స్కానర్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని శనివారం కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్‌కు పంపారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సొంత సంస్థకే కన్నం

### బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో భారీ మోసం

**బంజారాహిల్స్:** నమ్ముకున్న సంస్థకే కన్నం పెట్టిన ఉద్యోగిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో గత కొంతకాలంగా మార్కా శివకుమార్ డిస్పాచ్ డ్యూటీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన బజాజ్ ఆడిట్ టీమ్ ఇక్కడ తనిఖీలు నిర్వహించింది. ఇందులో పెద్ద ఎత్తున టీవీలు, ఏసీలు, సెల్‌ఫోన్లు మాయమైనట్లు తేలింది. రూ.17లక్షలు విలువ చేసే సరుకులు మాయం కావడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రశ్నించారు. మార్కా శివకుమార్ ఈ స్టాక్‌ను ఒక ఆటోలో మేనేజ్‌మెంట్‌కు తెలియకుండా గత ఏడాది నవంబర్‌లో తరలించినట్లుగా గుర్తించారు. శివకుమార్‌ను ప్రశ్నించగా టీవీలు, ఏసీలను బయట విక్రయించానని ఒప్పుకున్నాడు. శివకుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా బజాజ్ ఎలక్ట్రానిక్స్ హెడ్ సీహెచ్.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌బీటీనగర్‌లో చోరీ

### 30 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని ఎత్తుకెళ్లిన దుండగులు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో ఓ రిటైర్ ఉద్యోగి ఇంట్లో దొంగలుపడి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఎన్‌బీటీనగర్‌లో నివసించే రిటైర్డ్ ఉద్యోగి ఎం.శ్రీహరిగౌడ్ (67) గత జులై 21వ తేదీన తన భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లాడు. రెండు రోజులు ఆస్పత్రిలోనే ఉండి నారపల్లిలో నివసించే తన కొడుకు మహేష్‌గౌడ్ ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 22వ తేదీన రాత్రి తన ఇంటికి వచ్చి చూడగా బెడ్‌రూమ్ డోర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలు కూడా తెరిచి ఉండి వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. అందులో ఉండాల్సిన సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, ఇతర వస్తువులు కనిపించలేదు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## నా ప్రతిభను గుర్తించింది తెలుగు సినీ పరిశ్రమే

### ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్

**పంజగుట్ట:** తనకు కొరియోగ్రఫీలో జాతీయ అవార్డు రావడానికి తెలుగు సినీ పరిశ్రమనే కారణమని, తనవద్ద ప్రతిభ ఉందని మొదట గుర్తించింది తెలుగు ఇండస్ట్రీనే అని ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ అన్నారు. తెలంగాణ యువత ఆధ్వర్యంలో జాతీయ అవార్డు గ్రహీత కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు సన్మాన కార్యక్రమం శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. తెలంగాణ యువత అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్, దైవజ్ఞశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జానీ మాస్టర్ మాట్లాడుతూ ప్రభుదేవ మాస్టర్ తనకు తమిళ, తెలుగులో తిరు సినిమాలో హీరో ధనుష్, హీరోయిన్‌లు నిత్యామినన్, రాశీఖన్నలకు మేఘం కరిగేనా అనే పాటకు అవకాశం ఇచ్చారని దానికి తనకు జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సినీహీరో ధనుష్ పాటపాడిన తీరు, సంగీత దర్శకుడు అనిరుధ్ మంచి మ్యూజిక్ అన్ని కలిసొచ్చాయి కావునే పాట అంత బాగా వచ్చిందని అన్నారు. గణేష్ మాస్టర్, దైవజ్ఞశర్మలు మాట్లాడుతూ ఓ సినిమా విజయవంతం అయ్యేందుకు దర్శకుని ప్రతిభతోపాటు కొరియోగ్రాఫర్ నైపుణ్యం కూడా అవసరమన్నారు. డ్యాన్స్ మాస్టర్స్ యూనియన్‌లో మొదటి ప్యాన్ ఇండియా కొరియోగ్రాఫర్, మొదటి జాతీయ అవార్డు గ్రహీత కూడా జానీ మాస్టర్ కావడం ఎంతో సంతోషమని గణేష్ మాస్టర్ అన్నారు.


జానీ మాస్టర్‌ను సన్మానిస్తున్న గణేష్ మాస్టర్, ఇమ్మడి సతీష్ తదితరులు

## శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు





**వెంకటేశ్వరకాలనీ:** బ్రహ్మోత్సవాలకు ముందు శ్రీవారి ఆలయాల్లో జరిగే పవిత్రోత్సవాలు శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నాలుగు రోజులపాటు శ్రీవారి పవిత్రోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం సుప్రభాతం, నిత్యారాధన, ద్వార తోరణ పూజ, పవిత్రారోహణ, తులసీతో సహస్రనామార్చన, ఉత్సవ జపం, హోమం, ప్రాయశ్చిత హోమం, నిత్య పూర్ణాహుతి, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, పంచసూక్త హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ కూడా పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

## పెరుగు కోసమని వచ్చి.. రూ.6 వేలు ఎత్తుకెళ్లాడు

**రహమత్‌నగర్ (బోరబండ):** మాటల్లో దింపి దుకాణంలోని గల్లాపెట్టెలోని డబ్బులను చోరీ చేసిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మోతీనగర్ బీఎస్‌పీ కాలనీ ప్రధాన రహదారి పక్కన సుదర్శన్‌రెడ్డి పాల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి తనకు 20 కేజీల పెరుగు కావాలని దుకాణంలో ఉన్న సుదర్శన్‌రెడ్డి నాన్నను మాటల్లో దింపాడు. అనంతరం గల్లా పెట్టెలో ఉన్న రూ. 6000 వేలు తీసుకుని ఉడాయించాడు. ఆ తరువాత చోరీ జరిగిన విషయాన్ని గమనించిన సుదర్శన్ రెడ్డి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## పలువురు ఉద్యోగులకు పదోన్నతులు

**లక్డీకాపూల్:** నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) పలువురు ఉద్యోగులకు పదోన్నతి కల్పించింది. ఈ మేరకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఉత్తర్వులు జారీ చేశారు. నిమ్స్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న ఆరుగురికి పదోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో ఎం. రామారావు నిమ్స్ సెక్యూరిటీ అధికారిగా పదోన్నతి లభించింది. అదే విధంగా కె. శేఖర్‌కు కూడా సెక్యూరిటీ అధికారిగా షరతులతో కూడిన పదోన్నతి కల్పించారు. ఆయనకు రెండు సంవత్సరాల కాలపరిమితిని యాజమాన్యం విధించింది. అంతే కాకుండా నిమ్స్ సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న కె. సుబ్బారావు, డి. కమల్, మాజీ సైనిక ఉద్యోగి కే.టీ.రెడ్డి, ఏ. శంకర్‌లకు అసిస్టెంట్ సెక్యూరిటీ అధికారులుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు శనివారం డైరెక్టర్ బీరప్ప చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన్ని ఘనంగా సత్కరించారు.


నిమ్స్ సెక్యూరిటీ గార్డులకు పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న డైరెక్టర్ బీరప్ప

## రాజకీయ శిక్షణ తరగతులు

**రహమత్‌నగర్:** తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఎస్పీఆర్ హిల్స్‌లోని దళిత స్టడీ సెంటర్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమంలో టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం పాల్గొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా అధ్యక్షులు ఈ శిక్షణా తరగతులకు హాజరైయ్యారు. రెండు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని టీజేఎస్ నాయకులు తెలిపారు.

## ఉమ్మడి కుటుంబ వ్యవస్థలను కాపాడుకోవాలి

**లిబర్టీ:** ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కె.వీ.శ్రీధర్ అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి నేటి తరానికి వివరించాలని కోరారు. లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో 62వ సత్సంగ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ కుటుంబ విలువలు నైతిక విలువల గురించి భావితరాలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ రోజురోజుకూ తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉంటున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం వృద్ధాశ్రమాల్లో ఉంటున్నారన్నారు. మాతృ ప్రేమతో తల్లిదండ్రులను పూజించే సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, నాగిళ్ల నవీన్‌కుమార్, వేణు, పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.


## డాక్టర్ సుజాతకు పీహెచ్‌డీ ప్రదానం

### నిమ్స్ పీహెచ్‌డీ ప్రోగ్రాం వివలో అవార్డును అందజేసిన డైరెక్టర్


సుజాతకు పీహెచ్‌డీ ప్రదానం కార్యక్రమంలో డైరెక్టర్ బీరప్ప తదితరులు

**లక్డీకాపూల్:** నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వైద్యురాలు సుజాత మహారధికి పీహెచ్‌డీ ప్రదానం చేసింది. రిహాబిలిటేషన్ మెడిసిన్ విభాగంలో ఆమె ఈ అవార్డును పొందారు. శనివారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రాం వివ జరిగింది. ఈ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లీజ రాజశేఖర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీకాంత్, భువనేశ్వర్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అధికారి డాక్టర్ మంతు జైన్, డాక్టర్ పతిత పాబన మొహంతీ (కటక్), డాక్టర్ రాజు అయ్యంగార్, డాక్టర్ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజాతకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

## జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



**రహమత్‌నగర్ (బోరబండ):** జూబ్లీహిల్స్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గాన్ని బోరబండ డివిజన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా రెవరండ్ కేఎమ్ ఆండ్రిపాల్, ప్రధాన కార్యదర్శిగా రెవరండ్ స్వామిదాస్, ట్రెజరర్‌గా రెవరెండ్ సత్యానందం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ ఎన్. శ్రీనివాస్ చిన్నారావు, చంద్రశేఖర్, రాజులను, వైస్ ప్రెసిడెంట్లుగా రెవరెండ్ పి. మోస్, రెవరెండ్ డి.ప్రభాకర్, పాస్టర్లు టీసీ సామ్యేల్, యం.హేమలతలు, జాయింట్ సెక్రటరీలుగా రెవరెండ్ సీహెచ్ పరంజ్యోతి, పాస్టర్లు ప్రవీణ్, కె. వినోద్‌కుమార్, కేయం దానీయల్, జాయింట్ ట్రెజరర్‌గా పాస్టర్ ఆశీర్వాదం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజ్‌పాల్, సామ్యేల్, రవికుమార్, సుధాకర్, స్వరూప్, సునీల్‌లతోపాటు మిగతా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేహెచ్‌పీఎఫ్ ఫౌండర్ రెవరెండ్ డా.టి. కృపాసన్నిధి పాల్గొన్నారు. కాగా జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం ప్రతినిధులు జేపీఎఫ్ కార్యవర్గానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## ఓటర్లను యజమానులుగా చేయడమే లక్ష్యం


పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా సంజయ్ ఆనంద్‌కు నియామక పత్రం ఇస్తున్న జావిద్ రాజా

**పంజగుట్ట:** ఓటర్లను యజమానులుగా చెయ్యడం, నాయకులు, పార్టీని, అధికారులకు జీతగాళ్ళలా సేవచేసేలా చెయ్యడమే లక్ష్యమని లోక్ తంత్రిక్ జనతా దళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జావిద్ రాజా తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా సంజయ్ ఆనంద్‌ను నియమించి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అన్నిస్థానాల్లో నిలబడి సత్తా నిరూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ పేదవానికి విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారిందని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో కనీస వసతులు, సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము దేశమంతటా సమాన విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ కోఆర్డినేటర్ బి.రత్నం, శ్యామ్ పాల్, బబ్బిలి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించండి

**వెంకటేశ్వరకాలనీ:** వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన మంచినీటి, సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కోరారు. జలమండలి జీఎం హరిశంకర్‌తో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఎక్కడెక్కడ పైప్‌లైన్ పనులు మంజూరయ్యాయో వాటి వివరాలను అందజేశారు. పనులను ప్రారంభించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రారంభించడం ద్వారా సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. జలమండలి బంజారాహిల్స్ డీజీఎం ఇంద్రశీల, సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శివకుమార్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



## వేడుకలకు కృష్ణ మందిరం ముస్తాబు

**రహమత్‌నగర్:** కృష్ణాష్టమి వేడుకలకు ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్2 బస్తీలోని శ్రీకృష్ణ మందిరం ముస్తాబవుతుంది. స్థానిక యాదవ సంఘం నాయకులు ఈ. మల్లేశ్‌యాదవ్, పల్లె గురుమూర్తి యాదవ్, లక్ష్మణ్ యాదవ్, లింగయ్యయాదవ్‌ల సహాయంతో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రహరీకి రంగులు, బేస్‌మెంట్ పనులను బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య, ఉపాధ్యక్షుడు చెన్నయ్యలు దగ్గరుండి పనులను చేయిస్తున్నారు. సోమవారం జరిగే కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా అన్నదానం, రథం ఊరేగింపు, ఉట్టికొట్టుట లాంటి కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే ఈ ఆలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.


కొనసాగుతున్న ఆలయ పనులు

## ఉచిత కంటి, దంత వైద్య శిబిరం



**సాక్షి, సిటీబ్యూరో:** రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్‌స్టిట్యూట్, సికింద్రాబాద్, ప్రభుత్వ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో మాదాపూర్‌లోని నచికేత్ విద్యామండిలో ఉచిత కంటి, దంత పరీక్షా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. మొత్తం 230 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని పరీక్షించారు. దృష్టి సమస్య ఉన్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఉచితంగా కళ్ల జోడు అందజేయనున్నారు. విద్యార్థులందరికీ పరిశుభ్రత విధానాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ డెంటల్ కళాశాల, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు టూత్‌పేస్ట్, బ్రష్‌లను అందజేశారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి, ఆర్టీఎన్ లక్ష్మీ విసిరెడ్డి, ఆర్టీఎన్ రమాదేవి, ఆర్టీఎన్ కుమార స్వామి, ఆర్టీఎన్ కాజ్లా రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీవర్‌లో.. జూడాల సమ్మె విరమణ

**నల్లకుంట:** కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెను విరమించారు. తమ ఆందోళనకు అక్కడి ఉన్నతాధికారుల నుంచి స్పందన వచ్చిందని, నింధితులను కఠినంగా శిక్షిస్తామని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో సమ్మె విరమించి విధుల్లో పాల్గొన్నట్లు జూనియర్ వైద్యులు తెలిపారు. ట్రైనీ వైద్యుల సమ్మె కారణంగా కొద్ది రోజులుగా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నిలిచిపోయిన సాధారణ ఓపీ సేవలు శనివారం తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం 600లకు పైగా రోగులు ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందారని ఫీవర్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి చెప్పారు.

## గురుకుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



బీసీ సంక్షేమ భవనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ తదితరులు

**విజయనగర్‌కాలనీ:** ఎనిమిది లక్షల మంది విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచడంతో పాటు 16 లక్షల కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌ను వందలాది మంది విద్యార్థులతో కలిసి శనివారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం నాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్‌ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లు నేటికీ కొనసాగిస్తున్నారని, ఇటీవల నిత్యవసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ ఛార్జీలను రూ.1500 నుంచి రూ.3 వేల వరకు, పాఠశాల హాస్టల్ విద్యార్థుల మెస్ ఛార్జీలు రూ.950 నుంచి రూ.2 వేలకు పెంచడంతో పాటు కాస్మోటిక్ ఛార్జీలు నెలకు రూ.500 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, మల్లేష్, సతీష్, దామోదర్, నీలా, వీరన్న, చంద్రశేఖర్ గౌడ్, బాలస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ సేవలు పొందాలి

- స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ భాస్కర్‌రెడ్డి



మణికొండ లాలమ్మ గార్డెన్‌లో స్టార్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

**మణికొండ:** ప్రజలకు అవసరమైన అత్యున్నత స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను స్థానికంగానే అందించాలనే ఉద్దేశంతో స్టార్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నామని స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ వి.భాస్కర్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డెన్స్‌లో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెటిస్ క్లినిక్ సహకారంతో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌లో వివిధ వైద్య విభాగాల్లో సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు క్లినిక్ పనిచేస్తుందన్నారు. ఉత్తమ వైద్యులతో అధునాతన వైద్య సేవలను మణికొండ మున్సిపల్ ప్రజలు పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బి.మీనముత్యాలు, కె.లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు కిరణ్‌కుమార్, సి.బీరప్ప, డాక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, చిన్నబాబు, యోగలక్ష్మీ, నళినితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

- బోర్డు సమావేశంలో హెచ్‌ఎండీఏ అధికారులకు సూచన
- కంటోన్మెంట్ బోర్డులో ఎలివేటెడ్ కారిడార్లపై ప్రత్యేక చర్చ
- 200 ఫీట్లకు విస్తరించనున్నట్లు అధికారుల వెల్లడి
- ప్రైవేటు స్థలాల వద్ద 120 ఫీట్లు కుదించాలని ఎంపీ విజ్ఞప్తి



# రోడ్డు విస్తరణను కుదించండి

**కంటోన్మెంట్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని రెండు ప్రధాన రహదారులపై చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి రోడ్డు విస్తరణ పరిమితిని కుదించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హెచ్‌ఎండీఏ అధికారులకు సూచించారు. ఎంపీగా గెలిచాక తొలిసారిగా శనివారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో జరిగిన బోర్డు సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయన హాజరయ్యారు. ప్రధాన ఎజెండాపై చర్చ ప్రారంభానికి ముందు, ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి సంబంధించిన ప్రజెంటేషన్‌ను హెచ్‌ఎండీఏ అధికారులు బోర్డు సమావేశంలో ప్రదర్శించారు.

**ఆ రోడ్లను కూడా విస్తరించండి..**

ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు ఆర్మీ స్థలాల మీదుగా మల్కాజిగిరి ప్రాంతానికి వెళ్లే రోడ్లను సైతం విస్తరించాలని ఈటల కోరారు. ఈ మేరకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, ఆర్మీ సూత్రప్రాయ అంగీకారం తెలిపిందని సీఈఓ మధుకర్‌నాయక్ వివరించారు. ఆర్‌కే పురం - తిరుమలగిరి, సఫిల్‌గూడ- మారేడుపల్లి ప్రత్యామ్నాయ మార్గాల ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం వద్దే పెండింగ్ ఉందని వివరించారు. సమావేశంలో బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యుడు రామకృష్ణ, సీఈఓ మధుకర్‌నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వన్షీ, డిప్యూటీ సీఈఓ వీకే నాయర్, హెచ్‌ఎండీఏ అధికారులు హుస్సేన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌హెచ్-44 మార్గంలో మెట్రోకు అనుగుణంగా..**

ప్యారడైజ్, టివోలీ చౌరస్తాల నుంచి ప్రారంభం కానున్న ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం రోడ్డును 200 ఫీట్లకు(60 మీటర్లు) విస్తరించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మార్చి నెలలోనే నిర్మాణ అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. తదనుగుణంగా తాము నిర్మాణానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నేషనల్ హైవే-44 మార్గంలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ రోడ్డు వరకు 5.4 కిలోమీటర్ల మేరకు, రాష్ట్ర రహదారి-1 (రాజీవ్ రహదారి) మార్గంలో టివోలీ జంక్షన్ నుంచి శామీర్‌పేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు 18.124 కిలో మీటర్ల వరకు రోడ్డు విస్తరించనున్నామని పేర్కొన్నారు. రాజీవ్ రహదారి మార్గంలో కార్ఖానా, తిరుమలగిరి, అల్వాల్ చౌరస్తాల్లో ప్రతిపాదిత స్కైవేలను కలుపుతూ ర్యాంపు మార్గంలో రోడ్లు నిర్మిస్తామన్నారు. ఎన్‌హెచ్-44 మార్గంలో బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ర్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. రాజీవ్ రహదారి మార్గంలో హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వద్ద 0.450 కిలో మీటర్లు, ఎన్‌హెచ్-44 మార్గంలో బేగంపేట ఎయిర్ పోర్టు స్థలం మీదుగా 0.600 కిలోమీటర్ల పొడవులో టన్నెల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

- ఎన్‌హెచ్-44 మార్గంలో భవిష్యత్‌లో మెట్రో నిర్మాణానికి అనుగుణంగా ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యుడు రామకృష్ణ తమ అభ్యంతరాలను తెలిపారు. ఆర్మీ స్థలాలను సేకరించే చోట రోడ్డు విస్తరణ యథావిధిగా కొనసాగిస్తూ, ప్రైవేటు స్థలాలు ఉన్న చోట 40 మీటర్లు(సుమారు 120 ఫీట్లు) మాత్రమే విస్తరించాలని ఎంపీ సూచించారు. అదేవిధంగా కార్ఖానా చౌరస్తాలో ర్యాంపు లేకుండా చూడాలని కోరారు. రోడ్డు విస్తరణ వల్ల వందలాది మంది జీవనోపాధి కోల్పోతారని, ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణను కాస్త కుదించాలన్నారు. అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విస్తరణ కోసం స్థలం సేకరిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం తర్వాతే తగిన నిర్ణయం తీసుకునే అవకాశముందని హెచ్‌ఎండీఏ అధికారులు స్పష్టం చేశారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మమతల ఏకైక కుమార్తె శ్రేయరెడ్డి నిశ్చితార్థం ఆదిత్యతో రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీష్‌రావు, మల్లారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. మర్రి అరుంధతి, మర్రి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



## ఏడాది పొడవునా ముస్లిం రిజర్వేషన్ల సంబరాలు

టీపీసీసీ అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్

**సాక్షి, సిటీబ్యూరో:** ముస్లిం రిజర్వేషన్ల కల్పనకు మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ వెల్లడించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ వలీవుల్లా సమీర్, టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ జావీద్, సీనియర్ నేత మతీన్ షరీఫ్‌తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా 1994 ఆగస్టు 25న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ముస్లిం రిజర్వేషన్ ప్రక్రియ చారిత్రక ప్రాముఖ్యతపై వీడియోను విడుదల చేస్తూ వేడుకలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మూడు దశాబ్దాల ముస్లిం రిజర్వేషన్ల యాత్రను ఆయన గుర్తుచేశారు. 1994 నుంచి 2004 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. 2004లో వైఎస్ఆర్ ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ 58 రోజుల్లోనే ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్ల అమలుకు సిద్ధమైందని గుర్తు చేశారు. కోర్టులో న్యాయపరమైన అడ్డంకులు కారణంగా 2005 నుంచి 2007 వరకు తాత్కాలికంగా అమలు నిలిచిపోయిందన్నారు. కోర్టు ఆదేశానుసారం 4 శాతం రిజర్వేషన్ 2007-08 నుంచి మళ్లీ అమలు ప్రారంభమైందని పేర్కొన్నారు. ఈ 18 సంవత్సరాల్లో 4 శాతం రిజర్వేషన్‌తో సుమారు 20 లక్షల పేదముస్లిం కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. ముస్లిం రిజర్వేషన్ల అమలు కోసం చేసిన న్యాయ పోరాటాలను గుర్తు చేసుకునేందుగా ఏడాది పొడువునా మైలురాయిగా సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ వేడుకను ఈ నెల 25న ప్లాన్ చేసినప్పటికీ, అది గ్రాండ్ ఈవెంట్‌గా ఉండేలా సెప్టెంబర్ రెండవ వారానికి రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల చారిత్రక ప్రాధాన్యతను మరింత చాటిచెప్పేలా ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు వివరించారు.

# బాలగోపాల్ రచనలు ఎస్సీ వర్గీకరణకు దారిచూపాయి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



**సాక్షి, సిటీబ్యూరో:** ఎస్సీ వర్గీకరణకు మానవ హక్కుల నేత బాలగోపాల్ రచనలు ఎంతో దోహదం చేశాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ పోరాటం విజయతీరాలకు చేరిన సందర్భంగా ఆయన శనివారం బాలగోపాల్ ఇంటికి వెళ్లి ఆయన సహచరి వసంతలక్ష్మిని పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రజా దృక్పథంతో అభిప్రాయాలను నిర్దిష్టంగా, నిక్కచ్చిగా చెప్పడంలో బాలగోపాల్‌ను మించిన మేధావి లేరని మంద కృష్ణమాదిగ అభిప్రాయపడ్డారు. 2004లో ఎస్సీ వర్గీకరణను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తప్పుపడుతూ అద్భుతమైన వ్యాసాలు రాసి, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా ఎంత న్యాయమైందో, రాష్ట్రాలు ఎలా అధికారాలను కలిగి ఉన్నాయో స్పష్టంగా తెలియజేశారని చెప్పారు. ఆయన రాసిన రచనలే ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునకు దారి చూపాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం సఫలీకృతం అయినందుకు బాలగోపాల్ ఉండి ఉంటే ఎంతో సంతోషించే వారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే కుహనా మేధావులకు ధీటైన జవాబు ఇచ్చే వారన్నారు. ఈనాటి సమాజానికి ఆయన లేనిలోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల మీద బాలగోపాల్ రాసిన పుస్తకాన్ని మంద కృష్ణ మాదిగకు వసంతలక్ష్మి బహూకరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ పాల్గొన్నారు.

## నగరంలో నేడు..

1. బ్రహ్మకుమారీస్ సంస్థ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో పలు సేవా కార్యక్రమాలను ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చేతులమీదుగా ప్రారంభిస్తారు. శాంతి సరోవర్ డైరెక్టర్ రాజయోగిని బీకే కుల్‌దీప్ దీదీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.
2. శ్రీనగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవాలు ఉదయం సుప్రభాత సేవలతో మొదలవుతాయి.
3. రుబీనా పర్వీన్ రచించిన 'జమిలి పోగు కథలు' పుస్తకావిష్కరణ సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ, సజయ, వీక్షణం వేణుగోపాల్ తదితరులు హాజరవుతారు.
4. బి.పి మండల్ జయంతి ఉత్సవం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేశారు. తెలంగాణ బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ సూరజ్ మండల్ తదితరులు పాల్గొంటారు.

**గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.**

## ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

**పంజగుట్ట:** అన్యాయానికి, అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వస్తాయని, నాయకులు మాత్రం కేవలం రాజకీయ కక్షతో ఉద్యమకారులపై కేసులు పెడతారని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. స్వాతంత్ర్యం మా జన్మహక్కు అన్నందుకు బాలగంగాధర్ తిలక్‌పై కేసులు పెట్టి జైలులో ఉంచారని గుర్తుచేశారు. జేఏసీ తెలంగాణ లౌకిక ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలి, 2014 నుంచి వివిధ ఉద్యమకారులపై పెట్టిన కేసులన్నీ ఉపసంహరించుకోవాలి, ఉద్యమకారులకు 240 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, ఎమ్మెల్సీ కోదండరామ్‌పై కూడా కేసులు నమోదయ్యాయని, మీపై కూడా న్యాయంగా కేసులు పెట్టారా..? అన్యాయంగా కేసులు పెట్టారా ఒకసారి ఆలోచించాలన్నారు. ఉద్యమాల పేరు చెప్పుకుని బ్లాక్‌మెయిల్ చేసి సంపాదించుకునే వారిపై కేసులు ఎత్తివేయాలని తాము చెప్పడంలేదని, తెలంగాణ కోసం సర్వస్వం కోల్పోయి ఇప్పటికీ కేసుల చుట్టూ తిరుగుతున్న వారి, గత ప్రభుత్వ అన్యాయాలు ప్రశ్నించిన వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు మహిళా జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని, వ్యతిరేక వార్తలు వస్తే స్వాగతించాలని, మనం చేస్తున్న తప్పులను తెలుసుకుని వాటిని సరిచేసుకోవచ్చు అని తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, మన్నారం నాగరాజు, డాక్టర్ ఇస్లాముద్దీన్, సోగరాబేగం, అంబు రాథోడ్, సైరాబాను, ఇంద్రవెల్లి రమేష్, మోహన్ బైరాగి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు

**గన్‌ఫౌండ్రీ:** ఈ నెల 25వ తేదీ నుంచి అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టెంపుల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ కన్వీనర్ వరద కృష్ణదాస్ తెలిపారు. శనివారం అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నగరంలో అతిపెద్ద ధార్మిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ.. వారి సంఖ్యకు తగ్గట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. భక్తుల వాహనాలకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం, అబిడ్స్ బల్దియా కార్యాలయ స్థలాలను పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఇస్కాన్ టెంపుల్ జనరల్ మేనేజర్ శంభు వైష్ణవ దాస్ పాల్గొన్నారు.

# శాంతి సరోవర్‌కు 20 ఏళ్లు

- నేడు నాలుగు కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులకు శ్రీకారం
- రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు, పలువురు మంత్రుల రాక




గచ్చిబౌలిలోని శాంతిసరోవర్

**రాయదుర్గం:** విలువలతో కూడిన జీవనం, శాంతి, ఆధ్యాత్మిక శక్తి ప్రతిధ్వనించే ఆహ్లాదకరమైన వాతావరణంలో బ్రహ్మకుమారీస్ సంస్థ వివిధ కోర్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు విస్తృతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 110 దేశాల్లో బ్రహ్మకుమారీస్ సంస్థ తమ సేవా కార్యక్రమాలను, మెడిటేషన్, రాజయోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2001 సంవత్సరంలో గచ్చిబౌలిలో 34 ఎకరాల స్థలాన్ని సంస్థకు కేటాయించడంతో ఆ తర్వాత శాంతిసరోవర్ భవనాల నిర్మాణం చేపట్టి 2004లో పూర్తిస్థాయిలో శాంతి సరోవర్ ప్రాంగణంలో బ్రహ్మకుమారీస్ సంస్థ తమ కార్యక్రమాలను ప్రారంభించింది. దీంతో సంస్థ ఇక్కడ పని చేయడం ఆరంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని శాంతిసరోవర్ డైరెక్టర్ రాజయోగిని బికె కుల్‌దీప్ దీదీ పర్యవేక్షణలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు.

**4 కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులకు శ్రీకారం**

బ్రహ్మకుమారీస్ సంస్థ శాంతిసరోవర్ ప్రాంగణంలో కార్యక్రమాలు ఆరంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నాలుగు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని శాంతిసరోవర్ డైరెక్టర్ రాజయోగిని బికె కుల్‌దీప్ దీదీ పర్యవేక్షణలో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొంటారు.

**నాలుగు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు ఇవే..**

అడిక్షన్ ఫ్రీ క్యాంపెయిన్', నాచురల్ ఫార్మింగ్ ప్రాక్టిసెస్ అండ్ సుసైడ్ ప్రివెన్షన్, యూత్ ఫర్ పాజిటివ్ చేంజ్, ఐ కెన్ డు ఇట్-దివ్యాంగ్ సేవా పేరిట ప్రాజెక్టులను రూపొందించారు. వీటిని ఇద్దరు సీఎంలు ఆదివారం ప్రారంభిస్తారు.

## న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

**యాకుత్‌పురా:** న్యాయవాదులపై ఇటీవల పోలీసులు చేసిన దాడుల నేపథ్యంలో అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్ మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసులు చేసిన దాడికి నిరసనగా అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వరుస దాడులు జరుగుతుండంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా బార్ అసోసియేషన్లు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించామన్నారు. దాడులు అరికట్టేందుకు ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఏర్పాటు చేసే వరకు జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో హైకోర్టు బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, సభ్యులు శంకర్, అనంతసేన్‌రెడ్డి, రామారావు, మాజీ అడ్వొకేట్ జనరల్ బీ.ఎస్ ప్రసాద్, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు ప్రవీణారెడ్డి, సంయుక్త కార్యదర్శి బర్క రాజేష్ కుమార్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండాలి



- ఎంపీ రవిచంద్ర, ప్రభుత్వ విప్ శ్రీనివాస్

**సాక్షి, సిటీబ్యూరో:** రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపులంతా ఐక్యతతో ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మనమంతా సంఘటితంగా ఉంటేనే న్యాయమైన హక్కులు, డిమాండ్లను సాధించుకోగలమన్నారు. మున్నూరు కాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ నగరంలోని రాజరాజేశ్వరీ గార్డెన్స్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలంగా కోరుతున్న మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారని తెలిపారు. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న తమకు మంత్రివర్గంలో చోటు లేకపోవడం విచారకరమన్నారు. మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు తప్పకుండా అవకాశం వస్తుందని భావిస్తున్నామన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అపెక్స్ కౌన్సిల్ గౌరవ చైర్మన్‌గా కొనసాగేందుకు అంగీకరించడంపై సమావేశం హర్షం ప్రకటించింది. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.50 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి అపెక్స్ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా సుంకరి బాలకిషన్, సంఘానికి చెందిన వివిధ కుల సంఘాలను సమన్వయం చేసే బాధ్యత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి అప్పగిస్తూ సబ్ కమిటీ కన్వీనర్ బాధ్యతలు అప్పగిస్తూ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించారు. కార్యక్రమంలో అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తమరావు, కౌన్సిల్ కోర్ కమిటీ సభ్యులు సీ.విఠల్, రౌతు కనకయ్య, మీసాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 25 ఆగస్టు 2024



నగరంలో పెట్ కల్చర్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.. స్థానిక బ్రీడ్స్‌తో పాటు.. వేలు, లక్షలు వెచ్చించి మరీ ముద్దొచ్చే పెట్స్‌ని కొంటున్నారు. ఐతే విభిన్న రకాల సాధుజంతువులను కొనడం మాత్రమే కాదు, వాటి జీవన పరిస్థితులకు అనుగుణంగా సాకడం కూడా పెట్ కల్చర్‌లో భాగమే. ముఖ్యంగా కుక్కలు, పిల్లులు వంటి పెట్స్ ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఒకప్పుడు నగరవాసులు పెడిగ్రీ వంటి న్యూటిప్రన్లు అందించగా ప్రస్తుతం బ్రీడ్‌కు అనువైన న్యూట్రిషన్‌ను ఎంచుకుంటున్నారు. దీనికి అనుగుణంగానే సాధు జంతువుల ఎదుగుదల, ఆరోగ్యానికి ఉపకరించే పోషకాహార ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి.
- సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్

# పెట్ న్యూట్రిషన్ ఫిట్

## సమగ్ర పోషకాహారంపై పెట్ లవర్స్ ఆసక్తి

- నగరంలో పెట్స్ న్యూట్రిషన్‌కు డిమాండ్
- సాల్మన్, స్పిరులినా వంటి పదార్థాలతో ట్రీట్స్, ఫుల్లర్స్
- పెట్ కల్చర్‌లో న్యూట్రిషన్ భాగమే : వెటర్నరీ వైద్యులు
- కోట్ల రూపాయల్లో వ్యాపార వృద్ధి



పెట్స్ ఎదుగుదలలో ఆహారంతో పాటు వాటి ఎమోషన్స్ కూడా ప్రధానమైన అంశం. అయితే వాటి భావోద్వేగాలు పెంచుకునే వారి లాలనతో పాటు వారిచ్చే పోషకాహారంపై ఆధారపడి ఉంటుంది. అంతే కాకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వాటి ఆహారంలో కూడా వైవిధ్యం ఉండాలి. ఇలాంటి తరుణంలో సంపూర్ణ పోషకాలతో సమతుల్యమైన ఆహారాన్ని అందించడం చాలా ముఖ్యం. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని వాటి కోసం ప్రత్యేకంగా న్యూట్రియంట్ స్నాక్స్, మాంసంతో చేసిన ఉత్పత్తులు, అంతర్గతంగా పోషకాలు ఇమిడి ఉన్న ఇతర ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. భారత్ వేదికగా 2022లో రూ.3,300 కోట్ల టర్నోవర్ ఉన్న పెంపుడు జంతువుల ఆహార ఉత్పత్తుల మార్కెట్ 2027 నాటికి దాదాపు రూ.8,400 కోట్లకు (1 బిలియన్) చేరుతుందని ఒక అంచనా. ముఖ్యంగా ట్రీట్‌ల విభాగం వృద్ధి 2027 నాటికి రూ. 650 కోట్ల నుంచి రూ.1,900 – 2,000 కోట్లకు చేరుకోనుందని పరిశ్రమ వర్గాల నిపుణుల అభిప్రాయం.



### ఆహారం, ఆత్మీయత..

సాల్మన్, స్పిరులినా (బ్లూ–గ్రీన్ ఆల్గే) వంటి మంచి పోషకాలున్న పదార్థాలతో వీటిని తయారు చేస్తున్నారు. ఈ పెట్స్ న్యూట్రియంట్స్ తయారీలో పలు విభాగాల్లో పరిశోధనలు, పరీక్షల అనంతరం మార్కెట్లోకి అనుమతులు పొందుతాయి. వెటర్నరీ వైద్యులు, సాధు జంతువుల ఆరోగ్య నిపుణుల సూచనలతో పెట్ న్యూట్రిషన్ కొనసాగిస్తారు. ఆహారంతో పాటు వాటి ఉల్లాసానికి, ఉత్సాహానికి మనమేం చేస్తున్నాం, వాటికి ఎంత సమయం కేటాయిస్తున్నాం, ఆత్మీయతను ఎంత వరకూ అందిస్తున్నామనే అంశాలు కూడా పోషకాలు పనిచేసే విధానం పై ప్రభావం చూపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### ఫుల్ ఆన్ న్యూట్రిషన్‌తో 'ఫుల్లర్స్'..

మనుషుల ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకున్నట్టుగానే పెట్స్ ఆహారంలో కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే పెట్ సంక్షేమానికి సంపూర్ణ న్యూట్రిషన్‌ను అందించేలా ఫుల్లర్, డాట్ గుడ్ అనే ఉత్పత్తులను గ్రోవెల్ గ్రూప్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నాం. వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణలో అభివృద్ధి చేసిన ఫుల్లర్ పెట్స్‌కు సమగ్ర ఆహారంగానూ, అంతే కాకుండా పెంపుడు జంతువుల సంరక్షణలో ఒక వినూత్న మార్పును సూచిస్తుంది. ఇందులో అవిసె గింజలు, బ్లూబెర్రీస్, బచ్చలికూర, సాల్మన్, స్పిరులినా (బ్లూ–గ్రీన్ ఆల్గే), చమోమిలే (చామంతి), పసుపు, అల్లం, గ్రేప్ సీడ్ వంటి శక్తివంతమైన పదార్థాలను సమతుల్య మిశ్రమంతో కలుపుతాము. జంతువుల ఒక్కో ఆరోగ్య ప్రయోజనం కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన సమ్మేళనం ఇది.

### రుచిలో రాజీపడకుండా..



కోల్డ్ ప్రెస్డ్ టెక్నాలజీని ఉపయోగించి తయారు చేసిన ఫుల్లర్ ట్రీట్ గరిష్ఠ పోషకాహారాన్ని అందించడంతో పాటు జీవశక్తిని ప్రోత్సహిస్తుంది. 'ఫుల్ ఆన్ న్యూట్రిషన్' అనే ట్యాగ్ లైన్‌తో పెంపుడు జంతువుల విందు కోసం, రుచిలో రాజీ పడకుండా తయారు చేశాం. కుక్కలకు ఆనందాన్నిచ్చే రుచులుగా డాట్ గుడ్ పనిచేస్తుంది. సాధారణంగా మానవ వంటకాల్లో కనిపించే గొప్ప వైవిధ్యం నుండి ప్రేరణ పొంది డాట్ గుడ్‌ను రూపొందించాం. స్మోకీ బార్బెక్యూ, స్మోకీ లాంబ్, చికెన్, ఎగ్ వంటి వివిధ రకాల రుచుల్లో రుచికరమైన బిస్కెట్‌లను అందిస్తున్నాం. ఈ రుచులు కుక్క జిహ్వను ఇట్టే ఆకర్షిస్తాయి. ట్రీట్, డాట్ గుడ్ బిస్కెట్లు అవసరమైన విటమిన్లు, మినరల్స్‌తో సమృద్ధిగా ఉంటాయి. సంపూర్ణ పోషకాహారాలతో పాటు రుచిని మిళితం చేస్తాయి. 'రుచి, ప్రేమ, వాగ్' అనే ట్యాగ్‌లైన్‌తో.. పెంపుడు జంతువులు, వాటి ప్రేమికులకు అనుసంధానంగా ఈ ఉత్పత్తులు పనిచేస్తాయి. నగరంలో ఈ ఉత్పత్తులకున్న ఆదరణ దృష్ట్యా నగరం వేదికగానే వీటి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేశాం. మరికొద్ది రోజుల్లో పిల్లుల కోసం కూడా ప్రత్యేకంగా పోషకాలున్న న్యూట్రిషన్ తీసుకొచ్చే యోచనలో ఉన్నాం. – జేఎస్ రామకృష్ణ, బిజినెస్ హెడ్, గ్రోవెల్ గ్రూప్





## హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్ నటి మీనాక్షీ దీక్షిత్, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకొనున్నాయని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు, ఫ్యాషన్ వేర్, గృహాలంకరణ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు మోడల్స్, డిజైనర్లు పాల్గొన్నారు.



## హెల్త్ ఈజ్ వెల్త్

సినీనటి లావణ్య త్రిపాఠి

ఏపీ, తెలంగాణలో 'ఫియోనా' ఆయిల్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ ఆరోగ్య సంరక్షణలో సురక్షితమైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ సినీనటి లావణ్య త్రిపాఠి తెలిపారు. ఇందులో భాగంగా దాదాపు అన్ని ఆహార పదార్థాల వంటకాల్లో వినియోగించే నూనెల్లో స్వచ్ఛతా ప్రమాణాలు పరిశీలించాలని ఆమె సూచించారు. ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ఆధ్వర్యంలో నూతనంగా విడుదల చేస్తున్న 'ఫియోనా' రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్‌ను లావణ్య త్రిపాఠి ఆవిష్కరించారు. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ ఫియోనా ప్రధాన ఎంపికగా మారనున్నదని అన్నారు. ఈ ఆయిల్‌లో కీలకమైన విటమిన్లు ఏ, డీ, ఈ లు ఉన్నాయని బంగే ఇండియా ఫియోనా వైస్ ప్రెసిడెంట్ వినయ్ శ్రీవాస్తవ అన్నారు. సాధారణంగా వంట ప్రక్రియలో ఈ విటమిన్లు గణనీయంగా నాశనమవుతాయని, ఫలితంగా ఆహారాన్ని చేరుకోలేవని చాలా మందికి తెలియదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఫియోనా రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్‌ను 'వీటో ప్రొటెక్ట్' అనే నూతన శాస్త్రీయ ఫార్ములాతో ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫార్ములా కారణంగా దాదాపు 50 శాతం విటమిన్‌లను ఆహారానికి అధికంగా అందిస్తుందని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఏకకాలంలో ఈ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్నామని ఆయన వివరించారు.



# వేగనిజం.. మా ఇజం..

- జంతు జాతి మనుగడకు నడుం బిగించిన యువత
- వేగన్ ఆహారపు అలవాట్లు పెంపొందించడమే ధ్యేయం
- నెక్లెస్ రోడ్డుపై వందలాదిమంది ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: జంతువులను హింస నుంచి కాపాడాలనే ఉద్దేశంతో కొందరు యువత నడుం బిగించారు. మాంస ఉత్పత్తుల మార్కెట్లో జంతువులను తీవ్ర హింసకు గురిచేస్తున్నారని, ఆ హింసను ఆపాలని కోరుతూ సీఎస్ఎంఈ ఫౌండేషన్ అనే సంస్థ భారీ ర్యాలీ నిర్వహించింది. మానవుల్లాగే జంతువులూ స్వేచ్ఛగా జీవించేలా చూడాలని నినదించారు. వందలాది మంది ఈ ర్యాలీలో పాల్గొని జంతువుల హక్కుల కోసం గళమెత్తారు. ఈ ర్యాలీలో మేజర్ సినిమా డైరెక్టర్ శశికిరణ్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు.

# పచ్చటి పొదరిల్లు..

## చిట్టడవిని తలపిస్తున్న ఇల్లు

- పర్యావరణ పరిరక్షణకు దోహదం
- స్థానికులకు, నగర ప్రజలకు ఆదర్శంగా..
- శ్రమిస్తున్న విశ్రాంత శాస్త్రవేత్త



చుట్టూ గుబురు చెట్లు.. ఎటుచూసినా పచ్చదనం పరిఢవిల్లుతోంది.. ప్రకృతి ప్రేమికులు ఎవరైనా అటుగా వెళ్లారంటే చూసి ఔరా అనక మానరు.. గుబురు పొదలు.. పక్షుల కిలకిలా రావాలు వినిపిస్తుంటాయి.. తీక్షణంగా చూస్తేగానీ ఆ చెట్ల పొదల్లో ఓ ఇల్లు ఉందని, అదీ ప్రకృతి ఒడిలో తల దాచుకుంటున్నట్లు ఉంటుంది. ఇంతకీ చెప్పాలనుకున్నది ఏమిటంటే..? జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడలో వీధి నం-8 లో వసంత విహారి నగర్‌లో విశ్రాంత ఎన్ఎఫ్‌సీ శాస్త్రవేత్త సావంత్ ఇల్లు.. రకరకాల మొక్కలు, రంగురంగుల పూల మొక్కలతో పచ్చదనం ఉట్టి పడేలా ఉంటుంది. చూసిన కొద్దీ తనివి తీరా చూడాలనిపిస్తోంది. దీని గురించిన మరిన్ని వివరాలు... - ఉప్పల్



ప్రకృతి మనకు ఎంతో ఇచ్చింది. మనం కూడా తిరిగి ఇచ్చేయాలి... లేదంటే పర్యావరణం దెబ్బతింటుంది.. సరిగ్గా ఇదే ప్రశ్న విశ్రాంత శాస్త్రవేత్త సావంత్ మదిలో మెదిలింది. 2008లో ఉద్యోగ విరమణ పొందిన తరువాత పర్యావరణ అభివృద్ధిపై దృష్టి సారించారు. తాను ఉంటున్న ప్రాంతంలో ఎటు చూసినా చెట్లు కనిపించలేదు. ఆలోచన వచ్చిందే మొదలు తన ఇంటి నుంచే మార్పుకు శ్రీకారం చుట్టారు. వెనువెంటనే మొక్కల పెంపకం ప్రారంభించారు. ఒక్కో మొక్కను వెతికి పట్టుకొచ్చి ఇంటి ఆవరణలో నాటారు. నాటిన ప్రతి మొక్కకూ సరైన పోషణ అందేలా వాటి ఆలన పాలన చూసుకున్నారు. ఒకటి కాదు రెండు కాదు వందలాది చెట్లు సావంత్ ఇంటి చుట్టూ ఏపుగా పెరిగాయి.



### పక్షులకు ఆవాసంగా..

ఇంట్లో వెలువడే వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చి మొక్కలకు వాడుతాడు. దీంతో క్రిమిసంహారకాలు లేని సహజసిద్ధమైన ఎరువుల కారణంగా.. ఆ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి.. వీటిపై పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. సహజసిద్ధ ఎరువులు కారణంగా ఉత్పత్తయ్యే పురుగులు పిచ్చుకలకు ఆహారంగా మారుతుంటాయి. దీంతో వదలాది పక్షులు చూట్టు చేరుతున్నాయి. అలా వచ్చిన పక్షులకు ఆహారం అందించడం, మొక్కలకు నీరు పెట్టడం తన దినచర్యగా మారింది.

### వెయ్యికి పైగా పక్షులకు ఆహారం..

ఇంటిపై ఉదయాన్నే దాదాపు వెయ్యికి పైగా పావురాలు వివిధ రకాల పక్షులు సావంత్ వేసే ఆహారం కోసం వేచి ఉంటాయి. ప్రతిరోజు ఐదుకిలోల గింజలు, రెండు బక్కెట్ల నీరు డాబాపై పెడుతుంటాడు. వేసిన ప్రతిగింజనూ తిని వెళ్లి పోతాయి. ఒక రోజు మరిచిపోయినా ఆహారం పెట్టే వరకూ ఎదురుచూస్తాయి. ప్రతినెలా తన పింఛన్ డబ్బుల్లో దాదాపు పది శాతం వరకూ వీటికోసం వెచ్చిస్తాడు. చీమలకు సైతం ఆహారం అందిస్తూ వాటిని సంరక్షిస్తాడు.

### 17 ఏళ్లుగా ఇల్లు వదలకుండా..

దాదాపు 17 ఏళ్లుగా మొక్కలు, పక్షుల కోసం.. ఇల్లు విడిచి బయటకు వెళ్లలేదు సావంత్. తాను బయటకు వెళ్తే మొక్కలకు నీరు పోసే వారుండరు. పక్షులు ఆహారానికి ఇబ్బంది పడతాయన్న ఆలోచనతో శుభకార్యాలకు సైతం స్వస్తి పలికారు.

### భావితరాల కోసం..

భావితరాలకు మంచి వాతావరణం ఇవ్వాలన్నదే నా తపన. ఎవరికి వారు నాకెందుకులే అనుకుంటే భావితరాలకు మిగిలేదేమీ ఉండదు. పర్యావరణానికి హాని కలిగితే ఎన్నో అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పర్యావరణానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించి వాడుతున్నారు. దీంతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిని కాలుష్యానికి కారణమవుతోంది. ప్రస్తుత రెడీమేడ్ వ్యవస్థ కారణంగా మనుషుల్లో రోగ నిరోధక శక్తి తగ్గి అనేక జబ్బుల బారినపడుతున్నారు.

## నార్సింగిలో 430 అడుగుల హెరిటేజ్ టవర్

ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ఆధ్యాత్మిక శోభతో.. హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నేపథ్యంలో ఈ ఆధ్యాత్మిక కేంద్రం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణభగవానుడు భక్తులకు నాలుగు విభిన్న రూపాల్లో దర్శనమిచ్చేలా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శ్రీరాధా గోవిందం, శ్రీగోదా కృష్ణ, శ్రీరాధా గోపీనాథ్, శ్రీలడ్డూ గోపాల్ లేదా ముఖన్ కృష్ణగా దర్శనమివ్వనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీలడ్డూ గోపాలుని ఊంజల సేవలో భక్తులు పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నారు. హరే కృష్ణ మూమెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నేడు, రేపు హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ వేదికగా ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ తెలిపింది.

హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెంపుల్ ప్రాజెక్ట్ 'హరే కృష్ణ హెరిటేజ్ టవర్' కోసం నేడు అనంత శేష స్థాపన వేడుకను నిర్వహించనుంది. ఈ ఐకానిక్ స్మారక చిహ్నం 430 అడుగుల (130 మీటర్లు) ఎత్తుతో నగరంలో సాంస్కృతిక మైలురాయిగా నిలువనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హరే కృష్ణ మూమెంట్ చైర్మన్, అక్షయ పాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు పండిట్ దాస ప్రభుజీతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు. నార్సింగిలోని గోష్పాద క్షేత్రం వద్ద ఆరు ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. తిరుమలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం స్ఫూర్తితో శ్రీ శ్రీనివాస గోవిందానికి అంకితం చేసిన ఒక పెద్ద ప్రాకారంతో, సంప్రదాయ రాతితో చెక్కిన ఆలయం ఉంటుంది. ప్రైడ్ ఆఫ్ తెలంగాణగా నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్ వారసత్వ వైభవానికి ప్రతీకగా కాకతీయ, చాళుక్య, ద్రావిడ తదితర పురాతన శైలుల నుంచి తీసుకోవడం విశేషం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక విద్య కోసం లైబ్రరీ, మ్యూజియం, మల్టీ విజన్ థియేటర్, భగవద్గీత హాల్స్ వంటి సదుపాయాలకు ప్రణాళికలు చేశారు. హోలోగ్రామ్‌లు, లేజర్ ప్రొజెక్షన్ వంటి సరికొత్త సాంకేతికతలతో వినూత్నంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక స్మారక చిహ్నం..



## క్లుప్తంగా...

### రెండెకరాల భూమి కేటాయించండి

**అర్బన్ హెల్త్–ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుపై రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ**



సాక్షి, న్యూఢిల్లీ: ఎయిమ్స్ బీబీనగర్‌కు అనుబంధంగా అర్బన్ హెల్త్–ట్రైనింగ్ సెంటర్ (యూహెచ్‌టీసీ)ను ఏర్పాటు చేయడానికి హైదరాబాద్ నడిబొడ్డున రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అప్పటివరకు తాత్కాలికంగా ఏదైనా ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన శనివారం లేఖ రాశారు. దేశంలో మెరుగైన వైద్య సేవలను చేరువ చేసేందుకు మోదీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే దేశంలోని అనేక రాష్ట్రాలలో ఎయిమ్స్ ఆసుపత్రులను మోదీ ప్రభుత్వం నెలకొల్పుతోందని పేర్కొన్నారు. తెలంగాణలోనూ 2019లో బీబీనగర్‌లో రూ.1,300 కోట్లతో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. ప్రస్తుతం ఎయిమ్స్ బీబీనగర్‌లో ఓపీడీ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని దీంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్ మెడికల్ కాలేజీలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఈ ఏడాది జూలై 26న ఎయిమ్స్ బీబీనగర్ డిప్యూటీ డైరెక్టర్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖ కూడా రాశారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

### వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించండి

**రేవంత్‌ను కోరిన అసదుద్దీన్, రహ్మానీ**



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ ఖలీద్ సైఫుల్లా రహ్మానీ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై తమ అభిప్రాయాలను సీఎంకి తెలియజేశారు. బిల్లును వ్యతిరేకించాలని కోరారు. టీఎంఆర్ఐఈఎస్ చైర్మన్ ఫహీం ఖురేషీ కూడా పాల్గొన్నారు.

## పుణే వద్ద కూలింది ఏపీ సీఎం హెలికాప్టరే!

- సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోవాల్సిన హెలికాప్టర్
- ముంబై నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ప్రమాదం
- పుణే సమీపంలో చెట్టును ఢీకొని కూలిపోయినట్లు అధికారుల వెల్లడి



సాక్షి, అమరావతి/పుణే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సేవల కోసం తీసుకువస్తున్న ప్రైవేటు హెలికాప్టర్ శనివారం పుణే సమీపంలో కూలిపోయింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు వినియోగిస్తున్న హెలికాప్టర్ వీటీ–జీవీకే/బీ412ను మెయింటెనెన్స్ కోసం దాని నిర్వహణ సంస్థ అయిన గ్లోబల్ వెక్ట్రా ఏవియేషన్ కంపెనీ శుక్రవారం తీసుకెళ్లింది. వెంటనే మరో హెలికాప్టర్ పంపాలని ఏపీ సీఎం కార్యాలయం ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దీంతో వీటీజీవైఐ/ఏడబ్ల్యూ139 హెలికాప్టర్‌ను ఆ సంస్థ శనివారం పంపింది. ఇందులో 15 సీట్లు ఉంటాయి. ఈ హెలికాప్టర్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి సాయంత్రం 4.15కి విజయవాడ చేరుకోవాల్సి ఉంది. ఈ మేరకు గన్నవరం విమానాశ్రయంలో ల్యాండింగ్, పార్కింగ్, ఇంధనం నింపుకోవడానికి అనుమతి తీసుకుంది. వాస్తవంగా ఈ హెలికాప్టర్ కూడా మెయింటెనెన్స్‌లోనే ఉందని, అది పూర్తి కాకుండానే తీసుకురమ్మని సీఎం కార్యాలయం ఒత్తిడి చేయడమే ప్రమాదానికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ పైలట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కో పైలట్, ఇద్దరు సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు.

**వాతావరణం అనుకూలించక..**

ఈ హెలికాప్టర్ ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకోవాల్సి ఉంది. శనివారం మధ్యాహ్నం ముంబైలో బయల్దేరింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పుణేకు 35 కిలోమీటర్ల దూరంలో ముల్షీ తాలూకాలోని కోంద్‌వాలే గ్రామం వద్ద ప్రతికూల వాతావరణం కారణంగా నేలకూలినట్లు తెలుస్తోంది. భారీ వర్షం, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో హెలికాప్టర్‌ను కిందికి దించేందుకు పైలట్ ప్రయత్నించగా, అది చెట్టును ఢీకొట్టి కూలిపోయినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన హెలికాప్టర్ పైలట్ కెప్టెన్ ఆనంద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. స్వల్ప గాయాలైన వీర్ భాటియా, అమర్‌దీప్ సింగ్, ఎస్‌పీ రామ్ పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బృందం వెళ్లింది. ప్రమాదానికి కారణాలపై ఈ బృందం ప్రాథమిక విచారణ జరుపుతున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



## టైముకు రాని బస్సు.. యువకుల వెకిలిచేష్టలు

**విసుగెత్తి రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు**

మేడిపల్లి (వేములవాడ): సమయపాలన లేని బస్సు.. స్కూల్ పక్కనే ఉన్న క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ ఆడేందుకు వచ్చే యువకుల వెకిలి చేష్టలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు రోడ్డెక్కారు. జగిత్యాల జిల్లా భీమారం మండలం వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాల ఎదుట శనివారం ఆర్టీసీ బస్సును ఆపి నిరసన తెలిపారు. జగిత్యాల–ఒడ్యాడ్ రూట్‌లో వెంకట్రావుపేటకు వచ్చే బస్సు నిత్యం ఆలస్యంగా రావడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 4.30 గంటలకు స్కూల్ సమయం ముగిస్తే, 6.30 గంటల వరకు కూడా బస్సు రాక తమ గ్రామాలకు చేరుకోవడం ఆలస్యం అవుతోందని, దీంతో ఇంటి వద్ద తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. బస్సు ఆలస్యంగా రావడం వల్ల చదువుకోవడం కష్టంగా ఉందని పదో తరగతి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ సమయం ప్రకారం బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. వెంకట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఉండటంతో కొందరు యువకులు వాలీబాల్ ఆడేందుకు వచ్చి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. క్రీడా ప్రాంగణాన్ని స్కూల్ వద్ద నుంచి మరో చోటకు తరలించాలని కోరుతున్నారు. కాగా, విద్యార్థినులు బస్సులో ఇంటికి బయలుదేరే వరకు మహిళా అధ్యాపకులు వారికి తోడుగా ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



## కొంతమంది వృద్ధులు.. వేధింపుల్లో పోకిరీలు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక బృందాలు పనిచేస్తుండగా రాష్ట్ర స్థాయిలో స్టేట్ షీ–టీమ్ మాడ్యూల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**మఫ్టీలో ఉంటారు.. మాటువేసి పట్టేస్తారు..**

- కేవలం ఫిర్యాదులకే పరిమితం కాకుండా తరచూ ఆకతాయిల బెడద ఉండే హాట్‌స్పాట్స్‌లో మహిళా పోలీసులతో కూడిన షీ–టీమ్స్ బృందాలు సీక్రెట్ రికార్డింగ్ కెమెరాలతో మాటువేస్తున్నాయి.
- ఆకతాయిలు వేధింపులకు పాల్పడటం, మహిళలు, విద్యార్థినులను కామెంట్ చేస్తుండటాన్ని గమనిస్తే దాన్ని తగిన ఆధారాల కోసం రికార్డు చేస్తున్నారు. ఆ తర్వాత వారిని అదుపులోకి తీసుకుంటున్నారు.
- షీ–టీమ్స్‌కు పట్టుబడే ఆకతాయిలకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సహా కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- ఆకతాయిలు మారేందుకు తొలిసారి అవకాశం ఇస్తున్న షీ–టీమ్స్.. వారు బుద్ధి మార్చుకోకపోతే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నాయి.
- విద్యార్థినులు, యువతుల కోసం షీ–టీమ్స్ బృందాలు నిరంతరం అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నాయి.

అచ్చంపేట పట్టణంలోని ఓ ప్రైమరీ స్కూల్‌లో షీ–టీమ్స్ బృందం మహిళా భద్రతపై అవగాహన శిబిరం ఏర్పాటు చేయగా నర్సింహ అనే టీచర్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని ఆరుగురు ఐదో తరగతి విద్యార్థినులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో ఆ టీచర్‌పై 74 బీఎన్ఎస్, పోక్సో యాక్ట్ సెక్షన్ 9, 10 కింద అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఈసీఐఎల్‌లో కుషాయిగూడ బస్‌స్టాప్ నుంచి బస్సులో ఉద్యోగానికి వెళ్లే తనను రోజూ ఇద్దరు వేధిస్తున్నారని ఓ యువతి షీ–టీమ్స్‌కు ఫిర్యాదు ఇచ్చింది. వెంటనే అక్కడ డెకాయిట్ ఆపరేషన్ చేపట్టిన షీ–టీమ్స్ ఇద్దరు ఈవ్ టీజర్లను అరెస్టు చేశాయి.

**గోప్యతకు అత్యంత ప్రాధాన్యత**

కొందరు యువతులు, మహిళా ఉద్యోగులు తమకు ఎదురయ్యే వేధింపులను నేటికీ మౌనంగానే భరిస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. పోలీసులకు చెబితే ఎదుటివారు కక్ష పెంచుకుంటారని.. పోలీసు స్టేషన్‌కు వెళ్తే అందరికీ తెలిసి పరువుపోతుందన్న అనవసర భ్రమల్లో ఉంటున్నారు. అలాంటి వారి కోసం షీ–టీమ్స్ బృందాలు.. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ ఇలా సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. బాధితుల గోప్యతకు షీ–టీమ్స్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. బాధితుల వివరాలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే ఆకతాయిల భరతం పడుతున్నాయి.

**షీ–టీమ్స్ ఏర్పాటైన 2014 అక్టోబర్ 24 నుంచి ఈ నెల 22 వరకు..**

| మొత్తం అందిన ఫిర్యాదులు | నమోదైన ఎఫ్ఐఆర్‌లు |
|---|---|
| 64,025 | 6,122 |

**షీ–టీమ్స్‌కు వివిధ మార్గాల్లో అందిన ఫిర్యాదులు ఇలా..:**

| అంశం | అందిన ఫిర్యాదుల సంఖ్య |
|---|---|
| డయల్ 100 | 3,775 |
| ఫేస్‌బుక్ | 386 |
| వాట్సాప్ యాప్ | 41,254 |
| హాక్ఐ యాప్ | 1,527 |
| ఈ మెయిల్ | 973 |
| ఎక్స్ (ట్విట్టర్) | 127 |

**షీ–టీమ్స్‌కు ఎన్ని విధాలుగా ఫిర్యాదు చేయవచ్చు?**

- ప్రతి పోలీస్ స్టేషన్‌లో షీ–టీమ్స్ యూనిట్ సిబ్బందికి నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.
- 'డయల్ 100' ద్వారా సంప్రదించొచ్చు.
- womensafety&ts@tspolice.gov.in ద్వారా ఈ–మెయిల్ చేయొచ్చు.


**సోషల్ మీడియా ద్వారా అయితే..**

- వాట్సాప్ నంబర్ 8712656856
- ఎక్స్ (ట్విట్టర్) @TG& SheTeams
- ఫేస్‌బుక్ @TelanganaSheTeams
- ఇన్‌స్టాగామ్ @TelanganaSheTeams

## అచ్యుతాపురం ఘటన బాధితులకు వైఎస్సార్‌సీపీ అండ

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున సాయం**

- గాయపడిన ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున అందజేత
- సహాయక చర్యల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్న బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మాలో పేలుడు ఘటనలో బాధితులకు వైఎస్సార్‌సీపీ ఆర్థికంగా అండగా నిలబడుతుందని ఏపీ శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికీ రూ.లక్ష చొప్పున పార్టీ తరఫున సహాయం చేస్తున్నట్టు చెప్పారు. శనివారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో బొత్స మాట్లాడుతూ.. పేలుడు తర్వాత సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, మంత్రులెవరూ సక్రమంగా స్పందించలేదని వాపోయారు. పరిశ్రమల్లో రక్షణ చర్యల్లోనూ అంతులేని నిర్లక్ష్యం చూపుతున్నారని, ఎంతసేపూ గత ప్రభుత్వంపై నిందలు మోపడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పనిచేస్తోందని ఆక్షేపించారు.

## పర్యాటక రంగానికి చేయూతనివ్వండి

- కేంద్ర మంత్రులు గడ్కరీ, షెకావత్‌తో మంత్రి జూపల్లి భేటీ
- కృష్ణాపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ ప్రక్రియ వేగమయ్యేలా చూడండి
- అలంపూర్ ఎక్స్ రోడ్ – నల్లగొండ రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని విజ్ఞప్తి



గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న జూపల్లి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. కేంద్రం తమకు సహకరిస్తే రాష్ట్రాన్ని టూరిజంలో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈమేరకు శనివారం ఈ ఇద్దరితో ఢిల్లీలో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఆయా మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పలు విజ్ఞప్తులను ఆ ఇద్దరికీ రాతపూర్వకంగా ఇచ్చారు. అనంతరం మీడియాకు ఆ వివరాలను వెల్లడించారు. కేంద్రం నుంచి నిధులు అందితే రాష్ట్రంలో టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కించేలా ప్రయత్నిస్తామని షెకావత్‌ను కోరినట్లు జూపల్లి తెలిపారు. కృష్ణానదిపై సోమశిల(తెలంగాణ) సంగమే శ్వర (ఆంధ్రప్రదేశ్) మధ్య డబుల్ డెక్కర్ కేబుల్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మా ణ ప్రక్రియను వేగవంతమయ్యే లా చూడాలని రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు చెప్పారు. కొల్లా పూర్ నియోజకవర్గ పరిధిలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మా ణంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య రూ.1,082.56 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న ఐకానిక్ తీగల వంతెన ప్రక్రియ వివిధ కారణాల వల్ల గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉందని, దీని నిర్మాణం త్వరగా అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరినట్టు జూపల్లి తెలిపారు. అలంపూర్ ఎక్స్ రోడ్(ఎన్‌హెచ్–44) నుంచి నల్లగొండ (ఎన్‌హెచ్–565) వరకు 203.5 కి.మీ. మేర రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కూడా మంత్రి జూపల్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

## జీతాల కంటే అప్పులకే ఎక్కువ ఖర్చు

- గత ప్రభుత్వం తీసుకున్న బడ్జెట్‌యేతర రుణాల వల్లనే ఇప్పుడు పెనుభారం
- కేంద్రం సహకరించి వడ్డీ రేట్లు తగ్గించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతి
- ఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీకి బడ్జెట్‌యేతర రుణాలు తీసుకున్న కారణంగా తమ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. నాటి బీఆర్ఎస్ సర్కారు నిర్వాకం వల్లనే ఈ రోజు జీతాల కంటే అప్పులు, వడ్డీలకే ప్రతినెలా ఎక్కువ డబ్బును వెచ్చిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన భేటీలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతరత్రా సహాయ, సహకారాలు అందించాలని, ఎనిమిది అంశాలతో కూడిన విజ్ఞప్తులను రాతపూర్వకంగా కోరినట్లు ఆయన తెలిపారు. నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు.

**వడ్డీ రేట్లు తగ్గించకుంటే డబ్బులన్నీ అప్పులకే సరి**

గత ప్రభుత్వం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌ల కింద 10.75 శాతం –11.25 శాతంతో రూ. 31.795 కోట్ల రుణాలను తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కారణంగానే జీతాలకంటే వాళ్లు చేసిన అప్పులకే ఎక్కువ డబ్బులు కడుతున్నట్లు చెప్పారు. వీటికి సంబంధించిన వడ్డీ రేట్లు తగ్గించి, రీ స్ట్రక్చరింగ్ చేసుకునే వెసులుబాటును కల్పించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో కేంద్ర సహకారం లేకపోతే తాము జీతాల కంటే అప్పులకే ఎక్కువ కట్టాల్సిన పరిస్థితి కొనసాగుతూనే ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేశానని చెప్పారు. అదేవిధంగా సెంట్రల్ స్కీం, విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు రాష్ట్రానికి రావాల్సిన నిధుల పరిష్కారం ఇంకా పెండింగ్‌లోనే ఉందని, దీనిని పరిష్కరించి రాష్ట్రానికి వాటి నుంచి రావాల్సిన నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి రెండు రాష్ట్రాలకు మధ్య జరిగిన లావాదేవీల్లో రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఏపీ నుంచి రాలేదనే విషయాన్ని ఆమె దృష్టికి తీసికెళ్లి, ఆ నిధులను ఇప్పించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కేంద్రం గుర్తించిన వెనుకబడిన జిల్లాల గ్రాంటును కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి అంశాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

### వేదాలను అనువదించిన ఘనత రంగాచార్యదే

సాక్షి, న్యూఢిల్లీ: వేదాలను తెలుగులోకి అనువదించిన ఘనత దాశరథి రంగాచార్యదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సాహితీవేత్త దాశరథి రంగాచార్య జయంతిని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో ఎంపీలు బలరాం నాయక్, రఘువీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డిలతో కలిసి సీఎం నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న రంగాచార్య.. తదనంతర కాలంలో నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు తన 'చిల్లర దేవుళ్లు', 'జీవనయానం' రచనలతో వివరించారని గుర్తు చేశారు.

### కర్ణాటక వాల్మీకి స్కామ్‌తో తెలంగాణ నేతలకు ఏం సంబంధం? : కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న వాల్మీకి స్కామ్‌లో తెలంగాణకు చెందిన రాజకీయనేతలు, వ్యాపారవేత్తల హస్తముందని వార్తలొస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్‌ను కాపాడుతున్న అదృశ్యశక్తి ఎవరో బయట పెట్టాలన్నారు. ఈ స్కామ్‌లో వస్తున్న ప్రశ్నలకు కాంగ్రెస్ అగ్రనేతలు సమాధానం చెప్పాలని 'ఎక్స్'వేదికగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తొమ్మిది బ్యాంకు ఖాతాలకు కర్ణాటక ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.45 కోట్లు బదిలీ చేశారని, ఆ ఖాతాలు ఎవరివో చెప్పాలన్నారు. 'వీ6' బిజినెస్ సంస్థకు రూ.4.5 కోట్లు బదిలీ అయ్యాయని, ఆ సంస్థ యజమాని ఎవరో చెప్పాలన్నారు. వాల్మీకి స్కామ్‌కు సంబంధించి హైదరాబాద్‌లో సీఐడీ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్, ఈడీ దాడులు చేసినా ఈ వార్తలు బయటకు రావడం లేదని చెప్పారు.

## సోనియాదే నిర్ణయం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆధారంగా మధుయాష్కీకి పార్టీ బాధ్యతలు అప్పగించాలని భట్టి, ఉత్తమ్ బలంగా కోరినట్లు సమాచారం. మహేశ్‌గౌడ్ ఇప్పటికే పార్టీ సంస్థాగత వ్యవహారాలతోపాటు ఎమ్మెల్సీగా కొనసాగుతున్నందున మధుయాష్కీకి బాధ్యతలు అప్పగిస్తే పూర్తిస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని వారు పేర్కొన్నట్లు తెలియవచ్చింది. దీనికితోడు 2004 నుంచే తెలంగాణవాదం బలంగా వినిపించిన నేతగా మధుయాష్కీకి పేరున్నందున.. రాష్ట్రంలో విపక్ష బీఆర్ఎస్, బీజేపీలను ఎదుర్కొనేందుకు ఆయన బలమైన ఆయుధంగా మారతారని వారు కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. ఇక మహేశ్‌కు మద్దతుగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. తొలి నుంచీ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యవహారాలను సమన్వయం చేసిన నేతగా, పార్టీ క్రమశిక్షణకు లోబడి ఎమ్మెల్యే సీటును వదులుకున్న వ్యక్తిగా మహేశ్‌గౌడ్‌ను చూడాలని కోరినట్లు సమాచారం. కార్యకర్త మొదలు, ప్రతి నేతతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న దృష్ట్యా మహేశ్ గౌడ్‌ను పీసీసీ చీఫ్‌గా నియమిస్తే పార్టీకి, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా ఉంటారని రేవంత్ వివరించినట్లు సమాచారం. అయితే నేతల భిన్నాభిప్రాయాల నేపథ్యంలో నిర్ణయం తీసుకోలేకపోయిన ఏఐసీసీ నేతలు.. సోనియా నిర్ణయం మేరకు నడుచుకోవాలని సూచించినట్లు తెలిసింది. దీనికి ముగ్గురు రాష్ట్ర నేతలూ అంగీకరించినట్లు తెలిసింది.

**ఢిల్లీలో యాష్కీ, బలరాం నాయక్..**

పీసీసీ అధ్యక్ష రేసులో ఉన్న మధుయాష్కీ, ఎంపీ బలరాం నాయక్ ఢిల్లీలో మకాం వేసి వేర్వేరుగా లాబీయింగ్ చేస్తున్నారు. బీసీ నేతల మధ్య పోటీ నేపథ్యంలో మధ్యేమార్గంగా తనకు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టాలని బలరాం నాయక్ కోరుతున్నారు. శనివారం ఉదయం సైతం ఆయన సీఎం రేవంత్‌ను కలిసి ఇదే విషయాన్ని విన్నవించారు.

## పెన్షన్ భద్రత!

▶ మొదటి పేజీ తరువాయి

విధివిధానాలను రూపొందించినట్టు వైష్ణవ్ వెల్లడించారు. ఈ పథకం వచ్చే ఆర్థిక సంవత్సరం (2025 ఏప్రిల్ 1) నుంచి అమల్లోకి వస్తుందని సోమనాథన్ తెలిపారు.

**యూపీఎస్ విశేషాలివీ...**

- **అష్యూర్డ్ పెన్షన్:** ఉద్యోగులు రిటైర్మెంట్‌కు ముందు తమ చివరి 12 నెలల సగటు బేసిక్ వేతనంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా అందుకుంటారు. ఇందుకోసం కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి. అంతకంటే తక్కువైతే సర్వీసు కాలాన్ని బట్టి పెన్షన్ మొత్తం నిర్ధారణ అవుతుంది.
- **అష్యూర్డ్ మినిమం పెన్షన్:** కనీసం పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి రిటైర్మెంట్ అనంతరం నెలకు రూ.10 వేల కనీస పెన్షన్ అందుతుంది. తద్వారా అల్ప వేతనాలుండే దిగువ స్థాయి ఉద్యోగులకు ఇది ఆర్థిక భద్రత కల్పిస్తుంది.
- **అష్యూర్డ్ ఫ్యామిలీ పెన్షన్:** పెన్షనర్ మరణిస్తే కుటుంబానికి అతని పెన్షన్‌లో 60 శాతాన్ని అందజేస్తారు. తద్వారా ఆ కుటుంబానికి కనీస ఆర్థిక భద్రత కలుగుతుంది.

**కొత్తగా ఏకమొత్త ప్రయోజనం**

- ప్రతి ఆర్నెల్ల సర్వీసుకూ నెలవారీ వేతనం (జీతం+డీఏ)లో పదోవంతు చొప్పున రిటైర్మెంట్ సమయంలో ఏకమొత్తంగా అందజేస్తారు. గ్రాట్యుటీ తదితర బెనిఫిట్లకు ఇది అదనం.
- సర్వీసులో ఉన్న ఉద్యోగుల మాదిరిగా యూపీఎస్ పెన్షనర్లకు కూడా ద్రవ్యోల్బణ సూచిక, డీఆర్ ప్రయోజనాలను వర్తింపజేస్తారు.
- ఇప్పటికే ఎన్‌పీఎస్ కింద రిటైరైన వారితో పాటు 2025 మార్చి 31 నాటికి రిటైరయ్యే ఉద్యోగులకు కూడా యూపీఎస్ వర్తిస్తుంది. వారికి గత బకాయిలను పీపీఎఫ్ వడ్డీరేటుతో చెల్లిస్తారు.
- ఉద్యోగులు ఎన్‌పీఎస్, యూపీఎస్‌ల్లో దేన్నయినా ఎంచుకోవచ్చు.
- యూపీఎస్ బెనిఫిట్ల నిమిత్తం ఉద్యోగులపై అదనపు భారమేమీ పడబోదు. పెన్షన్ ఖాతాకు వారి చెల్లింపుల వాటా 10 శాతంగానే కొనసాగుతుంది. కేంద్రం వాటా ఇప్పుడున్న 14 శాతం నుంచి 18.5 శాతానికి పెరగనుంది. దీనివల్ల కేంద్రంపై రూ.6,250 కోట్ల దాకా భారం పడనుందని సోమనాథన్ వెల్లడించారు. బకాయిల రూపేణా మరో రూ.800 కోట్ల భారం పడుతుందన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యూపీఎస్‌ను అమలు చేయాలని కేంద్రం సూచించింది. తద్వారా 90 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొంది.

**ఉద్యోగుల గౌరవం, ఆర్థిక భద్రత: మోదీ**

యూపీఎస్‌తో ప్రభుత్వోద్యోగులకు గౌరవం, ఆర్థిక భద్రత పెరుగుతాయని ప్రధాని మోదీ అన్నారు. ''జాతి ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వోద్యోగులు మనకు గర్వకారణం. వారి సంక్షేమానికి, భావి జీవిత భద్రతకు కేంద్రం కట్టుబడి ఉంది'' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

**కేబినెట్ ఇతర నిర్ణయాలు**

బయో ఈ–3, విజ్ఞాన్‌ధారతో పాటు 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పథకాలకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. విజ్ఞాన్‌ధారలో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ, రీసెర్చ్, ఇన్నోవేషన్లకు సంబంధించి మూడు ప్రస్తుత పథకాలను ఒకే గొడుగు కిందకు తెచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం, విద్యా, పరిశ్రమల రంగాల మధ్య పరస్పర సహకారాన్ని మరింతగా పెంచేలా ప్రోత్సహిస్తారు. ఈ పథకానికి రూ.10,579 కోట్లు కేటాయించారు. బయో ఈ–3 కింద ఆర్థిక, పర్యావరణ, ఉపాధి రంగాల్లో బయో టెక్నాలజీకి మరింత ప్రోత్సాహమందిస్తారు. దీన్ని ఒక చరిత్రాత్మక ముందడుగుగా ప్రధాని మోదీ అభివర్ణించారు. విజ్ఞాన్‌ధార పథకం యువతను శాస్త్రీయ పరిశోధనల వైపు మరింతగా మళ్లించి ఆ రంగంలో భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుపుతుందని అభిప్రాయపడ్డారు.



రాజధాని ప్రాంతంలో తాళ్లాయపాలెం సమీపంలో ఇసుక బుకింగ్ కోసం వేచి ఉన్న లారీ యజమానులు, జనం

## ఇసుక కష్టం ఇంతింత కాదయా..!

**అస్తవ్యస్తంగా మారిపోయిన ఇసుక సరఫరా**

- బుకింగే కష్టం.. సామాన్యుడికి దొరకడమే గగనం
- ఏపీ వ్యాప్తంగా పెరిగిపోయిన ఇసుక కష్టాలు.. బుక్ చేసుకున్నా లోడింగ్‌కు 2, 3 రోజుల సమయం
- తడిసిమోపెడవుతున్న రవాణా చార్జీలు
- బుకింగ్ పాయింట్లు, స్టాక్ యార్డుల వద్ద టీడీపీ నేతల హవా
- ప్రజల ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం
- ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటూ ప్రచారం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి








అన్నపూర్ణ

రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతంపై అన్నపూర్ణ

# నగధీర

> ప్రతి అమ్మాయిలోను ఏదో ఒక టాలెంట్ ఉంటుంది. ఆత్మవిశ్వాసమే తోడుగా ముందడుగు వేయాలి

**''పర్వతారోహణ నాలో ఆత్మ విశ్వాసం పెంచింది. పర్వతారోహణ అంటే మన కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి సవాళ్లను అధిగమించడమే'' అన్నారు మౌంటనీర్ అన్నపూర్ణ. ఆమె వృత్తిరీత్యా టీచర్. సాహసం ఆమె ప్రవృత్తి. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన అన్నపూర్ణ ప్రపంచంలో ఎత్తైన పర్వతాలు అధిరోహించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. యూరప్ ఖండంలోని ఎల్‌బ్రస్ పర్వత శిఖరం మీద మన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నారు.**

**అమ్మ చేతి సున్నుండ**

''మా నాన్న చెట్లు, పొలాల వెంట తిప్పుతూ నాలో ప్రకృతి పట్ల ప్రేమను పెంచారు. మహిళల పర్వతారోహణ వార్తలు చదివినప్పుడు నేను కూడా అలా సాధించాలనే పట్టుదల పెరిగేది. మా అమ్మ చేతి సున్నుండలు, రాగి జావ నాలో బలం పెంచాయి. భర్త ప్రోత్సాహం నన్ను పర్వతాలు ఎక్కేలా ముందుకు నడిపించింది. మంగళగిరి పానకాల స్వామి కొండను రోజుకు రెండుసార్లు ఎక్కి దిగడం పర్వతారోహణ మీద పట్టునిచ్చింది.

**కేథార్‌కాంతతో తొలి అడుగు**

2015లో వివాహం చేసుకుని భర్త ఉద్యోగ రీత్యా సౌదీ(యూఏఇ)కి వెళ్ళిపోయాను. అక్కడి ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్ జెడ్డా (ఐఐఎస్‌జే)లో సైన్స్ టీచర్‌గా ఉద్యోగం చేశాను. కోవిడ్ సమయంలో తాడేపల్లికి వచ్చిన నాకు ఇంటికే పరిమితమైపోవడం ఇబ్బందికరంగా అన్పించింది. విజయవాడ ఎడ్వెంచర్ క్లబ్ (బీఏసీ) ద్వారా విజయవాడ పరిసర ప్రాంతాల్లో మిత్రులతో కలిసి ట్రెక్కింగ్‌కి వెళ్లేదాన్ని. 2020లో హిమాలయాలలోని కేథార్ కాంత శిఖరాన్ని చేరాను. గత ఏడాది ఆగస్టు 15వ తేదీన ఆఫ్రికాఖండంలో ఎత్తైన కిలిమంజారో పర్వతం మీద జాతీయ జెండా ఆవిష్కరించడం నాకు అందమైన జ్ఞాపకం.

**మూడవ అడుగు ఎల్‌బ్రస్ మీద**

యూరప్‌లో ఎత్తైన పర్వతమైన ఎల్‌బ్రస్ అధిరోహణ పెద్ద సవాల్‌గా మారింది. సముద్ర మట్టానికి 18,510 అడుగుల ఎత్తులో ఉన్న ఒక నిద్రాణమైన అగ్నిపర్వతం ఇది. దీన్ని అధిరోహించే క్రమంలో మైనస్ 18 నుంచి మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుని లోయలాంటి ప్రదేశంలో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగు వేయాలి. అక్కడి చలి, పరిస్థితులను తట్టుకోలేక ఏడ్చేశాను. కొద్దిసేపటికి ధైర్యం తెచ్చుకుని ముందుకు సాగిపోయాను. ఎనిమిది మందిలో ముగ్గురమే శిఖరాన్ని చేరాం.

**పర్వతారోహణ పెద్ద సవాల్**

సాహసం అంటేనే కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి సవాళ్లను అధిగమించడం. ఇంట్లో ఉన్నట్టుగా సౌకర్యాలు ఉండవు. వాతావరణం ప్రతికూలంగా ఉంటుంది. ఆరోగ్యం, దేహదారుఢ్యం లేకపోతే ముందుకు సాగలేం. పట్టుదల, కఠోర శ్రమ ఉంటేనే పర్వతారోహణ సాధ్యం. ఎల్‌బ్రస్ నుంచి రాగానే ఇంట్లో వాళ్ల హారతులిచ్చి, స్వీట్స్ తినిపించి స్వాగతం పలికారు. ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేను'' అన్నారు అన్నపూర్ణ.

– యిర్రింకి ఉమామహేశ్వరరావు, సాక్షి, అమరావతి
ఫొటోలు: కందుల చక్రపాణి

డొనాల్డ్ ట్రంప్ తులసి గబార్డ్



# తులసీదళం

**'పలుకు ఒక్కటి చాలు పది వేల సైన్యం' అనుకుంటే తులసీ గబార్డ్ అక్షరాలా ఆ మాటకు సరిపోతుంది. చర్చావేదికలలో తన వాక్చాతుర్యంతో ప్రత్యర్థిని ముప్పు తిప్పలు పెట్టడంలో తులసికి ఘన చరిత్ర ఉంది. ఆ ప్రతిభే ఆమెను అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలోకి తీసుకువచ్చింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 'డిబేట్' అనేది కీలక ఘట్టం. ఓటర్ల అభిప్రాయాలు, ఆలోచనలను ప్రభావితం చేసే చర్చావేదిక. వచ్చే నెలలో జరగబోయే డోనాల్డ్ ట్రంప్-కమలా హారిస్ డిబేట్ కోసం ట్రంప్‌కు శిక్షణ ఇస్తున్న మహిళగా తులసి వార్తల్లోకి వచ్చింది. కమలా హారిస్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న ట్రంప్‌కు తులసికి ఉన్న బహుముఖ ప్రజ్ఞ, ఆమె బృందంలోని ప్రతిభ విలువైన ఆస్తులుగా కనిపిస్తున్నాయి. 'హూ ఈజ్ షీ?' అని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది తులసి గబార్డ్ గురించి ఆరా తీస్తున్నారు.**

తులసి తండ్రి మైక్ గబార్డ్ సమోవా-అమెరికన్. రాజకీయ నాయకుడు. తల్లి కరోల్ పోర్టర్ ఇండియానా రాష్ట్రంలో పుట్టింది. టీనేజీలో హిందూమతాన్ని స్వీకరించింది. హిందూ మతం పట్ల ఆమెకు ఉన్న ఆసక్తితో కుమార్తెకు 'తులసి' అని పేరు పెట్టింది.

సెప్టెంబర్ 10న ట్రంప్, కమలా హారిస్ మధ్య తొలి డిబేట్ జరగనుంది. ఇద్దరు అభ్యర్థులు ఒకరినొకరు సవాలు చేసుకోవడానికి, పై చేయి సాధించడానికి సిద్ధమవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తన ప్రిపరేషన్‌కు సంబంధించి తులసి, ఆమె బృందం సహాయం తీసుకున్నాడు డోనాల్డ్ ట్రంప్.

తులసి సహాయంతో కమలా హారిస్‌పై పై చేయి సాధించి తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని, ఓటర్లను ప్రభావితం చేయాలని ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు.

2020 అధ్యక్ష ఎన్నికల తరువాత డెమొక్రాటిక్ పార్టీని వీడిన తులసి ట్రంప్ మద్దతుదారులలో బలమైన వ్యక్తిగా గుర్తింపు పొందింది. 'ఆమె మాటను ట్రంప్ తు.చ. తప్పకుండా పాటిస్తాడు' అని చెప్పుకుంటారు.

'రాజకీయ చరిత్రలో ఉత్తమ వక్తలలో ఒకరిగా ట్రంప్ గుర్తింపు పొందాడు. ట్రంప్‌కు సంప్రదాయ డిబేట్ ప్రిపరేషన్ అవసరం లేదు. అయితే గతంలో కమలా హారిస్‌ను విజయవంతంగా ఎదుర్కొన్న తులసి గబార్డ్ లాంటి గౌరవ సలహాదారుల అవసరం ఎంతో ఉంది' అంటుంది ట్రంప్ అధికార ప్రతినిధి కరోలిన్. గత అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో జాతీయ దృష్టిని ఆకర్షించింది తులసి. దీనికి కారణం 'డెమోక్రటిక్ డిబేట్స్'లో కమలా హారిస్‌తో పోటీపడి తన సత్తా చాటింది. హవాయి ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పని చేసినప్పటి నుంచి రాజకీయాల వరకు తులసి అనేక సవాళ్లను ఎదుర్కొంది. 'నేనే సర్వస్వం' అనుకునే డోనాల్డ్ ట్రంప్‌ను గ్రేట్ డిబేట్ కోసం సన్నద్ధం చేయడం అతి పెద్ద సవాలు. చిన్నప్పటి నుంచి 'భగవద్గీత' శ్లోకాల్లో మునిగి తేలిన తులసికి సవాళ్లను ఎదుర్కొనే వ్యూహం ఉంది. మాటలతో సత్తా చాటే శక్తి ఉంది.

కమలా హారిస్ మాయా హారిస్



# మాయా బలం

**ఎన్నికల ప్రసంగాలు ఫక్తు ఎన్నికల ప్రసంగాలలాగే ఉండనక్కర్లేదు అనిపిస్తుంది మాయా హారిస్ ప్రసంగాలు విన్న వారికి. కమలా హారిస్ చెల్లెలు మాయా హారిస్‌కు తన ప్రసంగాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే శక్తి ఎక్కడి నుంచి వచ్చింది? ఒక్క ముక్కలో చెప్పాలంటే కుటుంబ బంధాల్లో నుంచి! ఆమె ప్రసంగాలలో తన తల్లి ప్రస్తావన ఉంటుంది. ఆమె తన తల్లి గురించి చెప్పే భావోద్వేగపూరిత ప్రసంగాలు ట్రంప్‌పై చేసే రాజకీయ విమర్శల కంటే బలమైన ప్రభావం చూపుతాయి. ఆ అద్భుత నైపుణ్యమే మాయను అక్క కమలా హారిస్‌కు కీ అడ్వైజర్‌ని చేసింది.**

షికాగోలో జరిగిన డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్ (డిఎన్‌సీ)లో అక్క కమలా హారిస్‌కు మద్దతుగా మాట్లాడిన మాయా హారిస్ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. తన ప్రసంగంలో భారతీయురాలైన తన తల్లి డా. శ్యామల గోపాలన్‌ను స్మరించుకుంది.

'అమ్మ స్వయం నిర్ణయాధికార శక్తి మాకు స్ఫూర్తి. మేము స్వతంత్రంగా ముందడుగు వేయడంలో ఆమె పాత్ర ఎంతో ఉంది. ఈ హాల్‌లో అమ్మ ఉండి ఉంటే అక్కను చూసి ఎంత సంతోషించేది. నాకు తెలుసు... ఆమె దివి నుంచి చిరునవ్వుతో మమ్మల్ని ఆశీర్వదిస్తుంది.' అంటుంది మాయ.

'మీ జీవిత కథకు మీరే రచయిత్రులు' అని తల్లి చెప్పిన మాటను ఎప్పుడూ గుర్తు చేసుకుంటుంది మాయాహారిస్. అక్క పోరాట స్ఫూర్తి ఆమెకు ఎంతో ఇష్టం. స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్‌లో చదువుకున్న మాయా హారిస్ 'స్టాన్‌ఫోర్డ్ లా రివ్యూ' కు ఎడిటర్‌గా కూడా పనిచేసింది. విషయ విశ్లేషణ, ఒక అంశాన్ని అనేక కోణాల్లో చూడడం అనేది అక్కడి నుంచే అలవడింది. సామాజిక ఉద్యమాల్లోనూ చురుగ్గా పాల్గొనేది మాయ. 'డొమెస్టిక్ వయొలెన్స్ క్లినిక్'కు కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించింది. లా స్కూల్‌లో పట్టా పుచ్చుకున్న తరువాత లా క్లర్క్‌గా పనిచేసింది. ఆ తరువాత 'జాక్సన్' లా ఫర్మ్‌లో చేరి సివిల్, క్రిమినల్ కేసులపై పనిచేసింది.

రాజకీయ విషయాలకు వస్తే... డెమొక్రటిక్ పార్టీలో హిల్లరీ క్లింటన్ ప్రచార ప్రతినిధిగా, తన సోదరి కమలా హారిస్ కోసం 2020లో 'క్యాంపెయిన్ ఫర్ ప్రెసిడెంట్'గా పనిచేసింది.

'వ్యక్తులను తక్కువ అంచనా వేసే వారికి ఎలా జవాబు చెప్పాలో అక్కకు తెలుసు. అండర్ డాగ్‌గా ఉండడం ఎలా ఉంటుందో కూడా ఆమెకు తెలుసు. ఇప్పటికీ ఎన్నో అడ్డంకులను అధిగమించింది. ఆశావాదంతో ముందుకు వెళుతోంది. ఈ చారిత్రక సందర్భంలో ఆమె నాయకత్వం మనకు అవసరం' అంటుంది మాయా హారిస్.

అయితే అక్కలో ఉన్నాయని చెబుతున్న సుగుణాలన్నీ మాయలో కూడా ఉన్నాయి. ఆమె గుర్తింపు 'కమలా హారిస్ సోదరి'కి మాత్రమే పరిమితమైనది కాదు. న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా, రచయిత్రిగా, ఉపన్యాసకురాలిగా యూఎస్‌లో తనకంటూ సొంత గుర్తింపు ఉంది. ఎన్నికల ప్రచారం, వ్యూహాల విషయంలో కమలా హారిస్ ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. చెల్లి తనకు ఎంతో అండ. ఉత్తేజిత శక్తి.

## హెల్త్

# నత్తిపై ఒత్తిడి వద్దు!

పిల్లలు మాట్లాడుతున్నప్పుడు నత్తి రావడాన్ని స్టామరింగ్ లేదా స్టట్టరింగ్ అంటారు. ఈ కండిషన్ ఉన్న పిల్లలు ఒకే మాటను పదే పదే పలుకుతూ ఉండటం, లేదా వెంటనే తక్కున అనలేక దాన్ని నత్తినత్తిగా మాట్లాడటం, ఒక్కోసారి మాట పలకలేక ఆగిపోవడం వంటి సమస్యలు కొందరు పిల్లల్లో కనిపిస్తాయి.

ఈ సమస్యకు ఫలానా అంశం కారణమవుతుందని నిర్దిష్టంగా చెప్పలేకపోయినా జన్యుపరమైన, నరాలకు సంబంధించిన (న్యూరోఫిజియలాజికల్) మార్పుల వల్ల కొందరు చిన్నారుల్లో ఈ సమస్య కనిపించవచ్చు. ఇలాంటి పిల్లలు కొందరిలో వినికిడి సమస్యలూ ఉండే అవకాశముంది. పిల్లల పరిస్థితిని అర్థం చేసుకోకుండా వారిని ఇతరులతో పోల్చిచూడటం, బాగా రాణించాలని కోరుతూ ఒత్తిడి పెంచడం వంటి కారణాలతో స్టామరింగ్ ఇంకా ఎక్కువయ్యే అవకాశాలుంటాయి.

మాటలు నేర్చుకునే వయసు పిల్లల్లో స్టామరింగ్ అన్నది చాలా సాధారణంగా కనిపించే సమస్య. అయితే వాళ్ల వయసు పెరుగుతున్నకొద్దీ సమస్య తగ్గుతూ ఉంటుంది. పిల్లల్లో ఒకవేళ స్టామరింగ్ ఉన్నప్పటికీ... ఐదేళ్లు వచ్చేనాటికి 65 శాతం మంది పిల్లల్లో, యుక్తవయసు వచ్చేదానికి ముందర (అర్లీ టీన్స్‌లో) 75 శాతం మందిలోనూ ఈ సమస్య దానంతట అదే తగ్గిపోతుంది.

ఇలాంటి పిల్లలను తొందరపెట్టకుండా వాళ్లు చెప్పదలచుకున్నది పూర్తిగా చెప్పేలా ప్రోత్సహించాలి. పిల్లలందరికీ నిర్దిష్టంగా ఒకే రకమైన చికిత్స లేదా ప్రక్రియతో సమస్య పూర్తిగా తగ్గిపోవడం సాధ్యం కాదు. అవసరాన్ని బట్టి స్పీచ్ ఫ్లుయెన్సీ, స్టామరింగ్ మాడిఫికేషన్ వంటి స్పీచ్‌థెరపీ ప్రక్రియల ద్వారా చాలావరకు ప్రయోజనం ఉంటుంది. ఈ పిల్లలను తొలుత ఈఎన్‌టీ, తర్వాత స్పీచ్ థెరపిస్ట్ వంటి నిపుణులకు చూపించాలి.



• శోభి

# మాయని మచ్చ కాదు



**శరీరంపై వచ్చే తెల్లటి మచ్చలను శోభిమచ్చలు లేదా తెల్లమచ్చలు అని పిలుస్తుంటారు. చాలా వరకు నిరపాయకరమే అయినా లుక్స్‌పరంగా ఇది ఇబ్బందిని కలిగిస్తుంది. ఈ సమస్య ఒక రకమైన ఫంగల్ ఇన్ఫెక్షన్‌గా వస్తుంటుందన్నది నిపుణుల మాట. వైద్యపరిభాషలో 'టీనియా వెర్సికలర్' అని పిలిచే ఈ సమస్య పెద్దవయసు వారిలోను, మధ్యవయసు వారిలోను ఎక్కువగా కనిపిస్తుంది.**
**ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.**

ఈ సమస్య ఉన్నవారిలో చర్మం తన సహజరంగును కోల్పోయి ముదురు ఎరుపువర్ణం, లేత గోధుమ వర్ణం, తెలుపురంగులో వచ్చే ఈ మచ్చలు ప్రధానంగా వీపు, భుజాలు, చేతులు, ఛాతీ, మెడ ప్రాంతాలలో కనిపిస్తాయి. అప్పుడప్పుడు ముఖం మీద కూడా కనిపిస్తాయి. కొందరిలో ఈ మచ్చలకు చుట్టూ ఓ అంచులాంటిది కనిపిస్తుంటుంది. ఒక్కోసారి మచ్చల్లో విపరీతమైన దురద వచ్చి చాలా చికాకుగా కూడా ఉండవచ్చు. ఈ మచ్చల తీరూ, తీవ్రత ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో తెల్ల రంగులో చిన్న చిన్న చుక్కలుగా కనిపిస్తూ, అంత సమస్యాత్మకంగా ఉండవు గానీ కొందరిలో ఇవి చాలా ఎక్కువగా ఉండి సమస్యాత్మకంగా మారతాయి. బాగా వేడిగా ఉన్నప్పుడు వాతావరణ ప్రభావం ఈ మచ్చల మీద ఎక్కువగా ఉంటుంది. ఇది కొంతమేరకు అంటువ్యాధి అనే చెప్పవచ్చు.

**కారణాలు:** చర్మం లోపల ఉండే మెలసీజియా ఫర్‌ఫర్ అనే ఫంగస్ వల్ల ఈ వ్యాధి వస్తుందని తేలింది. చర్మం మీద ఉండే నూనెలను, మృతకణాలను ఈ ఫంగస్ ఆహారంగా తీసుకుంటుంది. అయితే ఈ ఫంగస్ మానవులందరిలోనూ ఉన్నప్పటికీ కొంత మందిలో అది ఈ రూపంలో ఇబ్బందులు కలగజేస్తుంది.



డా. స్వప్నప్రియ,
సీనియర్ డర్మటాలజిస్ట్
హైదరాబాద్

**ఎవరిలో ఎక్కువ..!** • ఎక్కువగా చెమటలు పట్టడం, అధికవేడి కారణంగా (ఇలాంటివారిలో ఈ మచ్చలున్నచోట దురదలూ రావచ్చు) • స్టెరాయిడ్స్ తీసుకునేవారిలో • గర్భవతులలో • హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారిలో • జిడ్డు చర్మం ఉండే వారిలో • తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని వారిలో • కొందరిలో వంశపారంపర్యంగా వస్తుంటుంది.

**తామరగా పొరబడటం సాధారణం...** కొందరు శోభిని చూసి తామర (రింగ్‌వార్మ్) గా భ్రమపడుతుంటారు. తామర వ్యాధి సోకిన భాగంలో మచ్చకు చుట్టూ అంచులు స్పష్టంగా కనపడతాయి. అలాగే దురద కూడా ఉంటుంది. వీటినే కొందరు విటిలిగో, పిటీరియాసిస్ ఆల్బా, సోరియాసిస్‌గా కూడా పొరబడుతుంటారు. అందువల్ల డెర్మటాలజిస్టులు కేవోహెచ్ పరీక్ష ద్వారా ఇది ఏ రకమైన చర్మవ్యాధి అనే విషయాన్ని నిర్ధారణ చేసి, తగిన చికిత్స సూచిస్తారు.

**నివారణ / జాగ్రత్తలు...** • ఇది తేలిగ్గా నివారితమయ్యే ప్రమాదరహిత సమస్య • చర్మాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచుకోవాలి • మచ్చలు తొందరగా తగ్గిపోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వ్యాయామం తర్వాత తప్పనిసరిగా స్నానం చేయాలి • చర్మం బాగా జిడ్డుగా ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు చర్మాన్ని శుభ్రం చేసుకుంటూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. అయితే మరీ పొడిబారేలా చేయకూడదు • శరీరం మీద నూనెగానీ, లేదా నూనెకు సంబంధించిన జిడ్డు పదార్థాలను కాని పూయకూడదు • బాగా బిగుతుగా, గాలిచొరకుండా ఉండే దుస్తులు ధరించకూడదు. ఒకింత ఒదులుగా, సౌకర్యంగా ఉండే దుస్తులే ధరించాలి • ఇది మళ్లీ మళ్లీ తిరగబెట్టకుండా ఉండటానికి ఎక్కువ చెమట పట్టకుండా చూసుకుంటూ, కెటొకోనటోల్ ఉండే సబ్బులను కొన్ని నెలలు వాడటం మంచిది.

**చికిత్స:** ఈ సమస్య ఉన్నవారిందరికీ ఒకేలాంటి చికిత్స ఉండదు. డర్మటాలజిస్టులు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. చర్మపు పైపొర మీద ఫంగస్ వస్తుంది కాబట్టి చర్మంపైన పైపూతగా వాడే మందులు బాగా పనిచేస్తాయి. మచ్చలు ఎక్కువగా ఉంటే, యాంటీ ఫంగల్ మందులనూ కడుపులోకి తీసుకోవలసి ఉంటుంది. మందులు వాడాక మొదట్లో తగ్గినట్టు అనిపించినప్పటికీ, కొంతకాలం తరవాత మళ్లీ వచ్చే అవకాశం ఉంటుంది. కనక ఈ ఫంగస్ పూర్తిగా తగ్గడానికి డాక్టర్ పేర్కొన్న కాలం వరకు వాడడం తప్పనిసరి. ఇందుకోసం కొన్నిరకాల యాంటీ ఫంగల్ క్రీములనూ, అలాగే క్లోట్రిమాజోల్, కెటొకొనజోల్ వంటి క్రీమ్సునూ వాడాల్సి రావచ్చు.

• ఫేషియల్ పెరాలసిస్

# కొద్ది రోజుల్లోనే కోలుకోవచ్చు

ముఖంలో ఒక పక్క పక్షవాతం వచ్చినట్లుగా వాలిపోయే కండిషన్‌ను ఫేషియల్ పెరాలసిస్ అంటారు. పక్షవాతంలో ఒకవైపు దేహభాగం అచేతనమై పోయినట్టే... ఫేషియల్ పెరాలసిస్‌లో కేవలం ముఖం వరకే చచ్చుబడినట్లుగా అయిపోతుంది. నిజానికి లక్షణాల పరంగా ఇది చాలా ఆందోళనకరంగా అనిపించినా చాలా వరకు సాధారణ సమస్యగానే పరిగణించవచ్చు.

**కారణాలు:** మెదడు నుంచి బయల్దేరిన వెన్నుపాము నుంచి 12 నరాలు బయటకు వస్తాయి. అవి పుర్రె భాగం నుంచి బయటకు వస్తాయి కాబట్టి వాటిని క్రేనియల్ నర్వ్స్ అంటారు. ఇందులో ఏడవ నరం దెబ్బతినడం వల్ల ఒకవైపున ముఖం కండరాలు పనిచేయవు. దీనివల్ల ముఖం వంకరగా కనపడుతుంది. నవ్వినప్పుడు, మాట్లాడినప్పుడు ఈ వంకర దనం ఎక్కువగా కనిపిస్తుంది. ఇది కూడా హెర్పిస్ సింప్లెక్స్ లాంటి ఏదైనా వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చాక, ఆ పరిణామం వల్ల ఉత్పన్నమైన యాంటీబాడీస్ ఫేషియల్ నర్వ్ అనే ముఖానికి సంబంధించిన నరాన్ని దెబ్బతీస్తాయి. దాంతో ఆ నరంతో కనెక్ట్ అయిన ముఖ భాగాలు చచ్చుబడిపోయినట్లు కనిపిస్తాయి.

**లక్షణాలు :** మూతి, ముఖం వంకరపోవడం, ఆ వైపు కంట్లోంచి నీరు కారడం, నీళ్లు ఒకవైపు నుంచే పుక్కిలించగలగడం... దాంతో నోటికి ఒకవైపు నుంచే నీళ్లు బయటకు రావడం, ఒకవైపు కనురెప్ప వాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**చికిత్స:** డాక్టర్లు అవసరాన్ని బట్టి ప్రెడ్నిసలోన్ వంటి స్టెరాయిడ్స్‌తో చికిత్స చేస్తారు. ఇది కేవలం కొద్ది రోజుల్లోనే తగ్గిపోతుంది. పూర్తిగా తగ్గిపోయే ఈ సమస్యతో ఆందోళన అవసరం లేదు.



కరెంట్‌షాక్‌కు గురైతే...

# ప్రథమ చికిత్స ఇలా...



• ఎలక్ట్రిక్ కరెంట్ ఫ్లో అవుతున్న వైర్‌నుంచి కరెంట్‌షాక్‌కు గురైన వ్యక్తిని వీలైనంత త్వరగా వేరు చేయాలి. ఇందుకోసం మెయిన్ ఆఫ్ చేయడం మంచిది • షాక్‌కు గురైన వ్యక్తి స్పృహ కోల్పోకుండా ఉంటే అతడు స్థిమితపడేలా ధైర్యం చెప్పాలి • ఒకవేళ అపస్మారక స్థితిలో ఉంటే ముందుగా పల్స్ చూడాలి. పల్స్ అందకుండా ఉంటే కార్డియో పల్మునరీ రిససియేషన్ (సీపీఆర్) చేయాలి. అంటే... శ్వాస ఆగిపోతే నోటి ద్వారా కాస్త ఒత్తిడితో గాలిని ఊపిరితిత్తుల్లోకి పంపాలి. గుండె స్పందనలు ఆగిపోతే కనీసం రెండు అంగుళాలలోతుగా ప్రభావం పడేట్లుగా ఛాతీపైన చేతులు ఉంచి ప్రెషర్ ఇవ్వాలి. ఈ రెండు చేస్తూ వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తరలించాలి. ఎందుకంటే షాక్‌కు గురైన వారికి గుండె స్పందనల్లో తేడా రావచ్చు. ఆ కండిషన్ ను వెంట్రిక్యులార్ అరిథ్మియా అంటారు. దాన్ని మానిటర్ ద్వారానే గుర్తించడం సాధ్యం. కాబట్టి వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించాలి • ఎలక్ట్రిక్ షాక్ వల్ల అయ్యే కాలిన గాయాలకు (ఎలక్ట్రిక్ బర్న్స్‌కి) ఆయింట్‌మెంట్స్‌గాని, పూతమందులు గానీ రాయకూడదు • ఎలక్ట్రిక్ షాక్‌కు గురైన వారు ఎత్తునుంచి పడిపోయే ప్రమాదం ఉంది కాబట్టి అకస్మాత్తుగా కదిలించకూడదు. గాయాలను బట్టి వాటికి ప్రథమ చికిత్స చేయాలి.

• అల్జైమర్స్-గుండె జబ్బులు

# జీన్ రిలేషన్!

**గుండెజబ్బులకూ, అల్జైమర్స్‌కు జన్యువుల రీత్యా సంబంధం ఉన్నట్లు ఓ అధ్యయనం నిరూపించింది. రక్తంలో కొవ్వులను పెంచేందుకూ, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యేందుకు తోడ్పడే కామన్ జన్యువులతోనే గుండెజబ్బులూ అలాగే అల్జైమర్స్ పెరుగుతాయంటూ ఈ అధ్యయనం తెలిపింది.**



ఈ అధ్యయనం పేర్కొంటున్న దాన్ని బట్టి గుండెజబ్బులున్నవారిలో నేర్చుకునే లేదా అభ్యసించే నైపుణ్యాలతో పాటు ఆలోచనశక్తి తగ్గడం, మతిమరపు వంటి అంశాల పెరుగుదల 26 శాతం ఎక్కువంటూ ఈ అధ్యయనం తెలుపుతోంది. అల్జైమర్స్ వ్యాధిలో మతిమరపు వస్తుందన్న విషయం తెలిసిందే. అంతేకాదు అల్జైమర్స్ వల్ల బాధితుల రోజువారీ పనులు చాలా ఎక్కువగా ప్రభావితమవ్వడమే కాకుండా వారు చాలా తీవ్రమైన పరిణామాలూ ఎదుర్కొంటుంటారు.

కరోనరీ ఆర్టరీ డిసీజ్ అనే జబ్బులో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు సన్నబారడం వల్ల గుండెకు తగినంతగా రక్తం అందదు. అలాగే రక్తంలో కొవ్వుల మోతాదులు పెరగడం కూడా కరోనరీ ఆర్టరీ డిసీజ్‌తో పాటు అల్జైమర్స్‌ల ముప్పులను పెంచుతుంది.

ఈ అధ్యయనం నిర్వహించిన బృంద సభ్యులు కేవలం కరోనరీ ఆర్టరీ డిసీజ్ వరకే పరిమితం కాకుండా యాంజైనా, చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్‌లతోపాటు మరో పదమూడు రకాల కొవ్వులూ అల్జైమర్స్‌పై వాటి ప్రభావాలను కూడా అధ్యయనం చేశారు.

''మా అధ్యయనంలో అల్జైమర్స్‌కూ, గుండెజబ్బులకూ వాటిని ప్రభావితం చేసే చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్, మొత్తం కొలెస్ట్రాల్ వంటి అంశాలపై జన్యుపరంగా వాటి మధ్యనున్న సంబంధాలపై సమగ్రంగా విశ్లేషణ జరిపాం. ఇందులో కొన్నిరకాల కొవ్వులకూ అల్జైమర్స్‌కూ సంబంధం ఉన్నట్లు తేలింది. (అయితే కొన్ని రకాల కొవ్వులకు మాత్రం మినహాయింపు ఉంది).

నిర్దిష్టంగా చెప్పాలంటే కరొనరీ ఆర్టరీ డిసీజ్‌కు కారణమయ్యే చెడు కొవ్వులూ (ఎల్‌డీఎల్), ట్రైగ్లిజరైడ్స్, మంచి కొవ్వులూ (హెచ్‌డీఎల్), మొత్తం కొవ్వుల (టోటల్ కొలెస్ట్రాల్) వంటి అంశాలకూ, అల్జైమర్స్‌కూ ఒకే జన్యుప్రాతిపదిక ఉందనేది వాస్తవమని తేలింది'' అంటూ వారు వివరించారు. ''ఈ జన్యుపరమైన ప్రాతిపదికను నొక్కిచెప్పడం ద్వారా అల్జైమర్స్‌కూ, కరొనరీ ఆర్టరీ డిసీజ్ కు జన్యుపరంగా ఏదో సంబంధం ఉందనీ దాని ద్వారా సమస్యలను మరింత లోతుగా పరిశీలించి, తగిన పరిష్కారాలను వెతకడం మరింత నిర్దిష్టంగా సాధ్యపడుతుం''దంటూ ఆస్ట్రేలియాలోని ఎడిత్ కోవన్ యూనివర్సిటీకి చెందిన ఈ అధ్యయన బృంద సభ్యుడు ఎమ్మాన్యువల్ ఆడెవూయి పేర్కొంటున్నారు. ఈ అధ్యయన ఫలితాలను ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మాలెక్యులార్ సైన్సెస్‌లో నమోదు చేశారు.




## ప్రజ్ఞానంద, గుకేశ్ గేమ్‌లు డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఆర్.ప్రజ్ఞానంద, గుకేశ్‌లకు మళ్లీ 'డ్రా' ఫలితాలే ఎదురయ్యాయి. ఈ గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న తుది అంచె పోటీల్లో ఐదు రౌండ్లు ముగిసినా... భారత ఆటగాళ్లు మాత్రం గెలుపు బోణీ కొట్టలేకపోయారు. శనివారం అమెరికాకు చెందిన వెస్లీ సోతో జరిగే ఐదో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద ఒక దశలో గెలిచే స్థితిలో నిలిచాడు. కానీ ప్రత్యర్థి ఎత్తులకు అనుగుణంగా పైఎత్తులు వేయలేక చివరికి భారత గ్రాండ్‌మాస్టర్ మరో 'డ్రా'తో సరిపెట్టుకున్నాడు. దీంతో 2.5 పాయింట్లతో ఉమ్మడిగా ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. గుకేశ్ (2.5) కూడా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నొదిర్బెక్ అబ్‌సటొరొవ్ (2 పాయింట్లు)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఈ టోర్నీలో ఫ్రాన్స్‌కు చెందిన అలిరెజా ఫిరౌజా 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఐదోరౌండ్లో అతను... అనిశ్ గిరి (నెదర్లాండ్స్: 1.5)పై గెలుపొందాడు.

భారత వన్డే క్రికెట్‌లో దశాబ్ద కాలం పాటు తనదైన ముద్ర వేసి కీలక విజయాల్లో ప్రధాన పాత్ర పోషించిన శిఖర్ ధావన్ మైదానం వీడాడు... కెరీర్ ఆరంభం నుంచి ఓపెనర్‌గా అద్భుత షాట్లతో శుభారంభాలు అందించి చిరస్మరణీయ ప్రదర్శన కనబర్చిన ఈ ఢిల్లీ స్టార్ తన ఆటను ముగించాడు... గ్రౌండ్‌లో చెరగని చిరునవ్వుతో, వివాదాల్లేని కెరీర్‌తో అందరివాడుగా నిలిచిన ధావన్ అటు అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఇటు దేశవాళీ క్రికెట్ నుంచి కూడా రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు... ఐసీసీ టోర్నీల్లో 'తొడగొట్టిన' ధావన్ సుదీర్ఘకాలం భారత్‌కు ఆడగలిగాననే సంతృప్తితో తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు.

# 'గబ్బర్' గుడ్‌బై

## క్రికెట్‌కు వీడ్కోలు పలికిన శిఖర్ ధావన్

- అన్ని స్థాయిల నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటన
- భారత అత్యుత్తమ ఓపెనర్లలో ఒకడిగా గుర్తింపు




**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులను తనదైన దూకుడైన ఆటతో అలరించిన భారత ఆటగాడు శిఖర్ ధావన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే కాకుండా దేశవాళీ క్రికెట్‌నుంచి కూడా తప్పుకుంటున్నట్లు అతను శనివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. 2010 నుంచి 2022 మధ్య టీమిండియా వన్డే విజయాల్లో ఓపెనర్‌గా కీలక పాత్ర పోషించిన ధావన్ టెస్టు, టి20 ఫార్మాట్‌లో కూడా సత్తా చాటాడు. పలు ఘనతలను తన పేరిట లిఖించుకొని ఆటకు గుడ్‌బై చెప్పాడు. 39 ఏళ్ల ధావన్ చివరిసారిగా 2022 డిసెంబర్‌లో భారత జట్టు తరఫున బరిలోకి దిగాడు. పంజాబ్ కింగ్స్ తరఫున ఈ ఏడాది ఐపీఎల్‌లో అతను తన చివరి మ్యాచ్ ఆడాడు. ఫామ్ కోల్పోవడంతో పాటు గిల్, యశస్వి వంటి కొత్త కుర్రాళ్ల రాకతో భారత జట్టులో తన స్థానాన్ని పోగొట్టుకున్న తర్వాత ధావన్ పునరాగమనం చేయడంలో సఫలం కాలేకపోయాడు.




**ఐసీసీ హీరో...**

అక్టోబర్ 20, 2010...శిఖర్ ధావన్ భారత జట్టు తరఫున విశాఖపట్నంలో తన తొలి వన్డే ఆడాడు. అంతకు నాలుగు నెలల క్రితమే టి20ల్లో కూడా అతను అరంగేట్రం చేశాడు. అయితే వైజాగ్ మ్యాచ్‌లో 'డకౌట్'తో అతని వన్డే కెరీర్ మొదలైంది. మరో నాలుగు వన్డేల తర్వాత అతను జట్టులో చోటు కోల్పోయాడు. అయితే రెండేళ్లు గడిచిన తర్వాత ధావన్ తిరిగొచ్చాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీతో కొత్త ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. ఈ టోర్నీలో ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి 2 సెంచరీలు ఒక అర్ధ సెంచరీ సహాయంతో 363 పరుగులు చేశాడు. 90.75 సగటుతో వచ్చిన ఈ పరుగులు టీమిండియాను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించాయి. ఆ తర్వాత ధావన్ ఎదురులేని ఆటతో దూసుకుపోయాడు. భారత్ ఆడిన తర్వాతి ఐదు వన్డే టోర్నీల్లోనూ అతనే జట్టు తరఫున టాప్ స్కోరర్ కావడం విశేషం. 2014 ఆసియా కప్, 2015 వన్డే వరల్డ్ కప్, 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2018 ఆసియా కప్‌లలో ధావన్ చెలరేగాడు. ముఖ్యంగా 2013–2019 మధ్య కాలంలో అతని అద్భుత ఫామ్ కొనసాగింది. భారత టాప్–3 ధావన్, రోహిత్, కోహ్లి కలిసి జట్టు అరుదైన విజయాలు అందించారు. 2019 వరల్డ్ కప్‌లో కూడా ఆస్ట్రేలియాపై ఓవల్‌లో శతకంతో తనేంటో చూపించాడు. అయితే గాయంతో రెండు మ్యాచ్‌లకే వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించిన అతను ఆ తర్వాత గత ప్రదర్శనను చూపించలేకపోయాడు. అప్పుడప్పుడు తన బ్యాటింగ్‌తో మెరిసినా...మునుపటి జోరు కనిపించలేదు.

**టెస్టుల్లో ఘనారంభం...**

వన్డే స్పెషలిస్ట్‌గా ముద్ర పడినా శిఖర్ అసలు సత్తా టెస్టులతోనే ముందుగా చూపించాడు. ఫామ్ కోల్పోయిన వీరేంద్ర సెహ్వాగ్ స్థానంలో తొలి సారి జట్టులో అవకాశం దక్కించుకున్న అతను మొదటి టెస్టులోనే చెలరేగాడు. మొహాలీలో ఆస్ట్రేలియాతో జరిగిన ఈ మ్యాచ్‌లో 85 బంతుల్లోనే సెంచరీ సాధించి... భారత్ తరఫున అరంగేట్ర టెస్టులో వేగవంతమైన సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో 187 పరుగులు సాధించిన అతను తొలి టెస్టులో భారత ఆటగాడి అత్యుత్తమ స్కోరును కూడా నమోదు చేశాడు. శ్రీలంకలో గాలేలో చేసిన 190 పరుగులు, న్యూజిలాండ్‌పై ఆక్లాండ్‌లో చేసిన 115, వెల్లింగ్టన్‌లో చేసిన 98 పరుగులు అతని కెరీర్‌లో చెప్పుకోదగ్గ టెస్టు ఇన్నింగ్స్‌లుగా నిలిచాయి. అంతర్జాతీయ టి20ల్లో కూడా భారత్ విజయాల్లో ఓపెనర్‌గా ధావన్ ప్రధాన పాత్ర పోషించాడు.

**ఐపీఎల్‌లో సూపర్...**

2004లో అండర్–19 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో శిఖర్ సభ్యుడిగా ఉన్నాడు. ఈ టోర్నీలో 505 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచి అతను తొలిసారి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ తరఫున సత్తా చాటాడు. 2007–08లో రంజీ ట్రోఫీ గెలిచిన ఢిల్లీ జట్టులో అతను సభ్యుడిగా ఉన్నాడు. ఐపీఎల్‌లో ధావన్ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున మొదలు పెట్టి ముంబై ఇండియన్స్, దక్కన్ చార్జర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ తరఫున ఆడాడు. వీటితో పాటు సన్‌రైజర్స్ జట్టుకు ఆడి కెప్టెన్‌గా కూడా వ్యవహరించిన ధావన్ 2016లో టైటిల్ నెగ్గిన టీమ్‌లో సభ్యుడు. మొత్తం 222 ఐపీఎల్ మ్యాచ్‌లలో 6769 పరుగులు చేసిన శిఖర్...కోహ్లి తర్వాత ఈ లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఐపీఎల్‌లో అత్యధిక ఫోర్లు (768) కొట్టిన రికార్డు అతని పేరిటే ఉంది.

**వ్యక్తిగతంగా మంచి పేరు...**

ముద్దు పేరు 'గబ్బర్'తో ప్రసిద్ధుడైన శిఖర్ మైదానంలో ఎప్పుడూ సరదాగా ఉండే తత్వం అతడిని ప్రత్యేకంగా నిలబెట్టింది. ఫీల్డింగ్‌లో, క్యాచ్ పట్టిన సమయంలో తొడగొట్టి మీసం మెలేసే శైలి అతడి బ్రాండ్‌గా మారినా...వ్యక్తిగతంగా ఏనాడూ అతను వివాదాల జోలికి పోలేదు. టీమ్‌లో చోటు కోల్పోయినప్పుడు ఏదైనా వ్యంగ్య మెసేజ్ కానీ, పరోక్ష వ్యాఖ్యలు కానీ ఎప్పుడూ చేయలేదు. పైగా తన స్థానంలో గిల్ ఎంపికైన తర్వాత అతనికి కూడా బెస్ట్ విషెస్ చెప్పగలగడం శిఖర్ వ్యక్తిత్వానికి నిదర్శనం. తాను జట్టుకు దూరమైనా ప్రతీసారి టీమ్ విజయాన్ని కాంక్షిస్తూ అతను ట్వీట్‌లు చేశాడు. వ్యక్తిగత జీవితం ఎన్నో ఒడిదుడుకులకు లోనైన సమయంలోనూ శిఖర్ ధావన్ ఎంతో హుందాగా వ్యవహరించాడు.

శిఖర్ ధావన్ కెరీర్‌కు సంబంధించిన మరిన్ని విశేషాలు e-paper క్రీడా పేజీలో

**శిఖర్ ధావన్ కెరీర్**

| ఫార్మాట్ | మ్యాచ్‌లు | పరుగులు | అత్యధిక స్కోరు | సగటు | సెంచరీలు | అర్ధసెంచరీలు |
|---|---|---|---|---|---|---|
| టెస్టులు | 34 | 2315 | 190 | 40.61 | 7 | 5 |
| వన్డేలు | 167 | 6793 | 143 | 44.11 | 17 | 39 |
| టి20లు | 68 | 1759 | 92 | 27.92 | 0 | 11 |

## జ్ఞానదత్తుకు కాంస్య పతకం


- మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తాన్వి
- ఆసియా బ్యాడ్మింటన్ జూనియర్ చాంపియన్‌షిప్



**న్యూఢిల్లీ:** ఆసియా బ్యాడ్మింటన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ షట్లర్ జ్ఞానదత్తు కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. పురుషుల అండర్–17 విభాగంలో పోటీపడిన జ్ఞానదత్తు.. శనివారం సెమీఫైనల్లో 21–9, 13–21, 13–21తో రాదిత్య వర్ధన (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల అండర్–15 విభాగంలో యువ షట్లర్ తాన్వి పత్రి ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం సింగిల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ తాన్వి 21–19, 21–10తో కుంగ్‌కే కకనిక్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించింది. అరగంట పాటు సాగిన పోరులో పూర్తి ఆధిపత్యం కనబర్చిన భారత షట్లర్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరస గేమ్‌ల్లో సత్తా చాటింది. గతంలో భారత్ నుంచి సామియా ఇమాద్ ఫారూఖీ (2017లో), తస్నీమ్ మిర్ (2019లో) ఈ టోర్నీలో చాంపియన్స్‌గా నిలిచారు. ఫైనల్లో వియత్నాం షట్లర్ నుయెన్ థి హ్యూజెన్‌తో తన్వీ తలపడనుంది. గత ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత్ రెండు (ఒక స్వర్ణం, ఒక రజతం) పతకాలు సాధించింది.

## కాంస్య పోరులో ఓడిన జస్‌పూరన్

- పురుష రెజ్లర్లందరికి నిరాశ
- అండర్–17 ప్రపంచ చాంపియన్‌షిప్



**అమన్ (జోర్డాన్):** భారత మహిళా రెజ్లర్లు టీమ్ చాంపియన్‌షిప్ సాధించిన టోర్నీలో పురుష రెజ్లర్లు నిరాశపరిచారు. జస్‌పూరన్ సింగ్ కాంస్య పతక పోరులో ఓడిపోవడంతో భారత పురుష రెజ్లర్లందరికీ అండర్–17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిరాశ ఎదురైంది. పురుషుల ఫ్రీస్టయిల్ 110 కేజీల కేటగిరీలో కాంస్య పతక పోరులో జస్‌పూరన్... మొహమ్మద్ నెజహద్ (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. నిజానికి జస్‌పూరన్ తొలిరౌండ్ బౌట్‌లోనే ఓటమి పాలయ్యాడు. కానీ అతని ప్రత్యర్థి ఫైనల్‌కు చేరడంతో భారత రెజ్లర్‌కు రెపిచాజ్ రూపంలో పోరాడేందుకు అవకాశం లభించింది. ఇందులో 6–0తో జపాన్‌కు చెందిన యూకి యమమొతోపై గెలుపొందడం ద్వారా కాంస్య పతక పోరుకు అర్హత సంపాదించాడు. 45 కేజీల క్వార్టర్ ఫైనల్లో శివమ్ 0–10తో దమల్ బాకెవ్ (తటస్థ రెజ్లర్) చేతిలో ఓడిపోయాడు. ఒకవేళ బాకెవ్ సెమీస్‌లో గెలుపొందితే శివమ్‌కు రెపిచాజ్ చాన్స్ ఉంటుంది. 51 కేజీల తొలిరౌండ్ బౌట్‌లో కార్తీక్ 4–10తో టర్కీకి చెందిన తుగ్రుల్ డెమిర్సి చేతిలో కంగుతిన్నాడు. 60 కేజీల విభాగంలో సితెందర్ తొలి మ్యాచ్‌లో అంద్రెయి కుజ్నియత్సొపై గెలుపొందాడు. కానీ ప్రిక్వార్టర్స్‌లో 3–5తో బెకసిల్ అసంబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడాడు. కుజ్నియత్సొ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) గొడుగుకింద తటస్థ రెజ్లర్‌గా పోటీపడుతున్నారు. 92 కేజీల్లో సన్నీ 1–15తో అమిర్ రెజా (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. 71 కేజీల్లో నిషాంత్ 4–6తో మార్క్ లపాసా (హంగేరి) చేతిలో కంగుతిన్నాడు.

# సినిమా

## కాస్త ఆలస్యంగా స్పిరిట్?


● ప్రభాస్

'స్పిరిట్' సినిమా సెట్స్‌లోకి కాస్త ఆలస్యంగా అడుగుపెట్టనున్నారట ప్రభాస్. ఆయన హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాదే ప్రారంభించాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానుందట. ఇక ప్రస్తుతం మారుతి దర్శకత్వంలోని 'రాజా సాబ్' సినిమాతో బిజీగా ఉన్నారు ప్రభాస్. త్వరలో హను రాఘవపూడి దర్శకత్వం వహించనున్న 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూట్‌లో పాల్గొంటారు ప్రభాస్.

**అర్షద్ పిల్లలకు టాయ్స్ పంపుతా: నాగ్ అశ్విన్**



'కల్కి 2898 ఏడీ'లోని ప్రభాస్ పాత్రను తక్కువ చేస్తూ ఇటీవల బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన అభ్యంతరకరమైన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. అర్షద్ కామెంట్స్‌పై ఇప్పటికే పలువురు తెలుగు హీరోలు, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా 'కల్కి 2898 ఏడీ' దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. ''నార్త్ వర్సెస్ సౌత్, టాలీవుడ్ వర్సెస్ బాలీవుడ్ వంటి అంశాలకు తావు లేదు. అంతా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీనే. అర్షద్ సాబ్ మెరుగైన పదాలు వాడి ఉండాల్సింది... అయినా ఫర్వాలేదు. ఆయన పిల్లలకు బుజ్జి టాయ్స్ ('కల్కి 2898 ఏడీ' సినిమాలో కనిపిస్తాయి) పంపిస్తాను. నేను మరింత కష్టపడతాను. 'కె 2' (కల్కి 2898 ఏడీ సినిమా రెండో భాగాన్ని ఉద్దేశించి) సినిమా అన్ని థియేటర్లలో ఫస్ట్ డే ఫస్ట్ షో పూర్తి కాగానే ప్రభాస్ పాత్ర చాలా గొప్పగా ఉందంటూ ట్వీట్స్ వస్తాయి'' అని ఓ నెటిజన్ పోస్ట్‌కు 'ఎక్స్' ద్వారా స్పందించారు నాగ్ అశ్విన్. అలాగే మరో నెటిజన్ పోస్ట్‌కు స్పందిస్తూ –''ఆల్రెడీ ప్రపంచంలో ఎంతో నెగిటివిటీ ఉంది. మనం దాన్ని పెంచకూడదు. ప్రభాస్‌గారు అలానే అనుకుంటారని నేను అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు నాగ్ అశ్విన్. ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది జూన్ 27న విడుదలైంది. ఈ సినిమాకి సీక్వెల్ రానుంది.


● కల్యాణ్, దానయ్య, ఎస్‌జె సూర్య, వివేక్ ఆత్రేయ, నాని, ప్రియాంక

## ఈసారి మిస్సయ్యేదే లేదు - హీరో నాని

''ఈ మధ్య కొన్ని చోట్ల గమనించాను. ఏంటి సార్... కోవిడ్ తర్వాత ప్రేక్షకులు సినిమాలకు రావడం లేదంటున్నారు. మంచి సినిమాలు ఉన్నప్పుడు తప్పకుండా వస్తారు సార్. వస్తూనే ఉంటారు. మనమే అప్పుడప్పుడు మిస్ అవుతుంటాం. ఈసారి మిస్ అయ్యేదే లేదు. డిస్ట్రిబ్యూటర్స్‌కి, ఎగ్జిబిటర్స్‌కు ఏదైనా మాట చెప్పాల్సి వస్తే మనదో సామెత ఉంది. 'కలిసొచ్చే కాలం వస్తే... నడిచొచ్చే సినిమా వస్తుంది'' అంటారు కదా. సినిమా పట్ల ఎంతో నమ్మకంగా ఉన్నాం. ఆగస్టు 29.. పోతారు.. మొత్తం పోతారు... థియేటర్స్‌కు పోతారు'' అని నాని అన్నారు. నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ కథానాయికగా నటించారు. డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో **నాని మాట్లాడుతూ–** ''దయా పాత్రను మేం ఊహించినదానికన్నా ఎక్కువగా చేశారు ఏస్‌జే సూర్యగారు. దానయ్యగారు పాజిటివ్ పర్సన్. అందుకే మంచి కథలు ఆయన్ను వెతుక్కుంటూ వస్తాయి. నిర్మాత కల్యాణ్‌కు ఈ సినిమా ట్రైనింగ్ గ్రౌండ్ అనుకోవచ్చు. వివేక్ ఆత్రేయ శివతాండవం ఏంటో థియేటర్స్‌లో చూస్తారు. ఈ సినిమా టీమ్ అందరికీ థ్యాంక్స్'' అని చెప్పారు. **వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ–** ''అంటే.. సుందరానికీ!' సినిమా రిలీజ్ డే రోజు నేను కన్ఫ్యూజ్ అయ్యాను. కొందరు ల్యాగ్ అన్నారు. మరికొందరు బాగుంది అన్నారు. అయితే నానీగారు నాకు మళ్లీ చాన్స్ ఇచ్చారు. చాన్స్ అన్నది చాలా చిన్న పదం. నానీగారు నాకు కాన్ఫిడెన్స్ ఇచ్చారు'' అని తెలిపారు. **డీవీవీ దానయ్య మాట్లాడుతూ–** ''కథల ఎంపికలో నానీగారు నంబర్ వన్. కథ నచ్చితే కొత్త దర్శకులకూ అవకాశం ఇస్తారు. నానీగారితో సినిమా చేస్తే నిర్మాతకు టెన్షన్ ఉండదు. సాధారణంగా నేను ఏ సినిమా వేదికపైనా ఇంత మాట్లాడలేదు. సినిమా మాట్లాడిస్తుంది. 'సరిపోదా శనివారం' సినిమా చూశాను. పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ సినిమాతో వివేక్ ఆత్రేయ ఓ పెద్ద కమర్షియల్ డైరెక్టర్ అవుతాడు'' అని చెప్పారు. ''సరిపోదా శనివారం' కాన్సెప్ట్ నచ్చి ఓకే చేప్పాను. తెలుగు ప్రేక్షకుల కోసం సొంత డబ్బింగ్ చెప్పాను'' అని వెల్లడించారు **ఎస్‌జే సూర్య.** ''సూర్య (నాని పాత్ర), చారులత (ప్రియాంక పాత్ర)లను గుర్తు పెట్టుకుంటారు'' అని తెలిపారు **ప్రియాంకా అరుళ్.** ''నాని కష్టపడి స్టార్ అయ్యాడు. ఆస్కార్ వేదికపై మన ఖ్యాతి చాటారు డీవీవీ దానయ్య, రాజమౌళిగార్లు'' అని పేర్కొన్నారు **నటుడు అలీ.** అతిథులుగా పాల్గొన్న దర్శకులు దేవా కట్టా, ప్రశాంత్ వర్మ , శైలేష్ కొలను, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్ ఈ సినిమా విజయాన్ని ఆకాంక్షించారు. నాని తండ్రి రాంబాబు, సంగీత దర్శకుడు జేక్స్, కెమెరామేన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఓటీటీ ఇది చూడొచ్చు

### ఊహకందనిది... ఊహించలేనిదీ గోళం....

**ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'గోళం' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.**




ప్రపంచంలో ఎన్ని కథలు ఉన్నాయని అడిగితే... ప్రపంచ జనాభా ఎంత మంది ఉంటే అన్ని కథలు ఉన్నాయన్నట్టు... ప్రతి వ్యక్తికి సంబంధించిన జీవితం ఓ సినిమా కథే. కాకపోతే ఆ కథలను ఎంచుకోవడంలోనే ఉంటుంది అసలు ఆయువుపట్టు. ఈ విషయంలో మలయాళ దర్శకులు చాలా ముందుంటారు. ఈ మధ్య కాలంలో ఓటీటీ వేదికగా వస్తున్న పలు చిత్రాలు మలయాళ దర్శకుల ఆలోచనా పటిమకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వాటిలో 'గోళం' ఒకటి. సమ్జాద్ దర్శకత్వంలో రూపొందిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రకథ ఆయువు పట్టును చివరి వరకూ ప్రేక్షకులు కనిపెట్టలేరు. అంతగా రక్తి కట్టించే స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది సినిమా. ఈ చిత్ర కథ విషయానికొస్తే... ఓ ఆఫీసులో బాస్ అనుకోకుండా బాత్రూంలో చనిపోయినపుడు ఆఫీసులో స్టాఫ్ తప్ప ఇంకెవరూ ఉండరు. దీనిని ఇన్వెస్టిగేట్ చేయడానికి సందీప్ కృష్ణ తన టీమ్‌తో ఆఫీస్‌కు వస్తాడు. డే టైమ్ ఆఫీసులో బాస్ ఎలా చనిపోయాడు? హంతకుడు ఎవరు? ఇదే 'గోళం' సినిమా. ఇన్వెస్టిగేషన్ ఊహకందని ట్విస్టులతో, ఊహించని క్లైమాక్స్‌తో సాగుతుందీ సినిమా. ఆద్యంతం రక్తి కట్టే ఈ సినిమా చూశాక నేటి ఆఫీసుల్లో రిజిష్టర్ పంచ్ వేసేందుకు ఉపయోగించే మెషీన్‌ను చూడడానికి కూడా భయపడవచ్చు. ఎందుకో ఏమిటో ప్రైమ్ ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న 'గోళం' చూసేయండి. 'గోళం'... వర్త్ టు వాచ్ ఇట్.

– ఇంటూరు హరికృష్ణ


● వెట్రి, శివానీ

## బంపర్ లాటరీ

వెట్రి, శివానీ నారాయణన్ నటించిన తమిళ చిత్రం 'బంపర్'. ఎం. సెల్వకుమార్ దర్శకత్వంలో ఎస్. త్యాగరాజా, టి. ఆనంద జోతి నిర్మించిన ఈ సినిమా గత ఏడాది జూలైలో విడుదలైంది. ఈ సినిమా తెలుగులో సెప్టెంబరులో విడుదల కానుంది. తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాతలు మాట్లాడుతూ –'' లాటరీ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఫ్రెండ్స్‌తో కలిసి అయ్యప్ప మాల వేసుకుని కేరళ వెళ్లిన ఓ యువకుడికి అక్కడ కొన్న ఓ లాటరీ టిక్కెట్ ప్రైజ్ మనీ వస్తుంది. ఈ మనీని దక్కించుకునేందుకు అతను పడ్డ కష్టాలు, స్నేహితులతో ఎదుర్కొన్న ఇబ్బందులు వంటి అంశాలను థ్రిల్లింగ్‌గా చూపించాం. తమిళంలో విజయం సాధించిన ఈ సినిమా తెలుగులోనూ సక్సెస్ అవుతుందన్న నమ్మకం ఉంది'' అని దర్శక –నిర్మాతలు పేర్కొన్నారు.

## ప్రశాంతమైన సిత్రాలు


● భ్రమరాంబిక, లక్ష్మణ మూర్తి, ఆకాశ్

లక్ష్మణ మూర్తి రతన, భ్రమరాంబిక తూటిక లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సీతారం సిత్రాలు'. డి. నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి. పార్థసారథి, డి. నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన హీరో ఆకాశ్ జగన్నాథ్ మాట్లాడుతూ– ''ప్రతి ఇండస్ట్రీ మన తెలుగు ప్రేక్షకుల వైపే చూస్తోంది. సినిమా బాగుంటే పెద్ద విజయాన్ని అందిస్తారు. 'సీతారం సిత్రాలు'ని ప్రేక్షకులు సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''గుడికి వెళితే ఎంత ప్రశాంతత లభిస్తుందో, ఈ సినిమా చూస్తే ప్రేక్షకులకు అంతే ప్రశాంతత లభిస్తుంది'' అని తెలిపారు లక్ష్మణ మూర్తి. ''జంధ్యాల, ఈవీవీ సత్యనారాయణ, రేలంగిగార్ల సినిమాల్లా మా 'సీతారం సిత్రాలు' ప్రేక్షకులకు మంచి స్ట్రెస్ రిలీఫ్ అవుతుంది'' అన్నారు నాగ శశిధర్ రెడ్డి. ''మా చిన్న సినిమాను ప్రేక్షకులు ఆదరించి, పెద్ద సక్సెస్ చేయాలి'' అని పేర్కొన్నారు నిర్మాతలు.



## కష్టాన్ని గుర్తించండి

– రుహానీ శర్మ

''సినిమా గొప్పతనాన్ని అర్థం చేసుకోండి. కళాకారుల కష్టాన్ని గుర్తించండి'' అంటున్నారు హీరోయిన్ రుహానీ శర్మ. కను బెహ్ల్ దర్శకత్వంలో రుహానీ శర్మ ఓ లీడ్ రోల్‌లో నటించిన హిందీ చిత్రం 'ఆగ్రా' (2023). ఈ చిత్రం గత ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కాగా ప్రశంసలతో పాటు అవార్డులు కూడా వచ్చాయి. తాజాగా ఫ్రాన్స్ దేశంలో అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో ఫ్రెంచ్ భాషలో స్ట్రీమ్ అవుతోంది. అందులోని శృంగార సన్నివేశాలు పలు పైరసీ సైట్లలో వైరల్‌గా మారాయి. రుహానీ శర్మ ఇలాంటి బోల్డ్ సీన్స్ చేసిందేంటి? అంటూ ఆమెని ట్రోల్ చేస్తున్నారు నెటిజన్లు. ఈ విమర్శలపై రుహానీ శర్మ స్పందించి, ఓ లేఖ విడుదల చేశారు. ''ఆగ్రా' సీన్లు లీక్ కావడంతో నిరుత్సాహంగా ఉన్నాను. నా బాధను వివరించడానికి నిరుత్సాహం అనేది చిన్న మాటే. ఆర్ట్ చిత్రాలను రూపొందించడం పెద్ద సవాల్. అలాంటి చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి రక్తాన్ని చెమటగా మార్చాలి. కన్నీళ్లను అర్థం చేసుకోకుండా కొందరు దాని గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. కొన్ని సీన్ల ఆధారంగా సినిమాపై ఓ నిర్ణయానికి రాకూడదు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ సినిమా శైలిని అందరూ గుర్తించాలి. కళ ఎన్నో భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది'' అని పేర్కొన్నారు రుహానీ శర్మ.

## సోలో బాయ్ చాలెంజ్


● గౌతమ్, శ్వేత

'బిగ్ బాస్ 7' (తెలుగు) కంటెస్టెంట్ గౌతమ్ కృష్ణ హీరోగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. పి. నవీన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్వేతా అవస్థి హీరోయిన్. సెవెన్‌హిల్స్ సతీష్ కుమార్ నిర్మాత. జుడా షాండి సంగీతం అందించిన ఈ సినిమా టైటిల్ సాంగ్ 'సోలో బాయ్..'ని రిలీజ్ చేశారు. ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ మాట్లాడుతూ– ''నా తమ్ముడు గౌతమ్ కృష్ణ హీరోగా పరిచయమవుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''సోలో బాయ్' సాంగ్ హుక్ స్టెప్ చాలెంజ్‌లో విజేతలుగా నిలిచేవారికి బహుమతులు ఇస్తాం'' అని గౌతమ్ కృష్ణ చెప్పారు. ''ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు పి. నవీన్ కుమార్.

# సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 25-8-2024

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.





ఎస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సుమ దంపతుల కూతురు సంజన.. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కమల దంపతుల కుమారుడు గౌతమ్ రిసెప్షన్ శనివారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. - మడికొండ

# వీఆర్వోలకు ‘పరీక్ష’

- పరీక్ష ద్వారా 10,954 గ్రామాలకు ఒక్కో ఉద్యోగిని నియమించే యోచన
- గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పని చేసిన వారికి అవకాశం
- ఇంటర్ లేదా డిగ్రీ కనీస విద్యార్హతగా నిర్ధారణ

సాక్షి, హైదరాబాద్: గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలనే యోచనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నియమించబోయే కొత్త సిబ్బందికి ‘పరీక్ష’పెట్టాలని భావిస్తోంది. గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)గా పనిచేసిన వారికి ఈ వ్యవస్థలో భాగం కల్పించనున్నట్టు తెలుస్తోంది. అయితే, దాదాపు 23 వేల మందికి పైగా పాత రెవెన్యూ సిబ్బందిని గత ప్రభుత్వం తొలగించిన నేపథ్యంలో వారిని ఏ మేరకు సర్దుబాటు చేయాలన్న దానిపై ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారికి గ్రామీణ రెవెన్యూ వ్యవస్థలో ప్రాతినిధ్యం కల్పించడం ఖాయమయినా పరీక్ష పెట్టిన తర్వాతే మెరిట్ ప్రాతిపదికన వారిని తీసుకోవాలనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారిలో ఇంటర్ లేదా డిగ్రీ అర్హత ఉన్న వారిని ఈ పరీక్ష రాసేందుకు ఎంపిక చేయాలని, పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి కొత్త వ్యవస్థలో స్థానం కల్పించాలని ప్రాథమికంగా ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ పరీక్ష నిర్వహించి, రాష్ట్రంలోని 10,954 గ్రామాలకు ఒకరి చొప్పున రెవెన్యూ ప్రతినిధులను ఎంపిక చేయనున్నట్టు సమాచారం. కనీస విద్యార్హతను నిర్ధారించే క్రమంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన 15 వేల మందికి పైగా పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారని, వీరిలో పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి అవకాశం కల్పించగా, మిగిలిన పోస్టులను కొత్త నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసే యోచనలో ఉన్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## 11 మంది విద్యార్థుల ఉన్నత చదువులకు భారీ విరాళం

**రూ.85లక్షల చెక్కును మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శికి అందించిన సీడ్ సంస్థ**

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థ విద్యార్థుల ఉన్నత చదువులకు సపోర్ట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్(సీడ్) సంస్థ భారీ విరాళాన్ని ప్రకటించింది. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ ఎం.హుస్సేనీ శనివారం మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానమ్‌కు రూ.85 లక్షల చెక్కును అందించారు. మైనార్టీ గురుకులానికి చెందిన 11 మంది విద్యార్థులు దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ప్రవేశాలు సాధించగా...వారికి సొసైటీ ద్వారా రూ.8.51 లక్షలు ట్యూషన్ ఫీజు కింద చెల్లించింది. సాయం అందుకున్న విద్యార్థులు ఐఐపీఈ వైజాగ్, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ గ్వాలియర్, వి స్మార్ట్ అకాడమీ, స్వప్నిల్, టార్గెట్ అకాడమీ, లక్ష్యా ఇన్‌స్టిట్యూషన్, ఎన్‌ఐటీ గోవా, బిట్-మేస్రా(రాంచి)లో ఉన్నత చదువులు చదువుతున్నారు.





హైదరాబాద్-1 డిపో డీఎం బి.కృష్ణారెడ్డికి ‘రోల్ ఆఫ్ హానర్’ పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

# ఆర్టీసీ సిబ్బందికి ప్రగతిచక్ర పురస్కారాలు

**124 మందికి అవార్డులు అందజేసిన మంత్రి పొన్నం**

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవం శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అవార్డు గ్రహీతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్, బ్యాడ్జీలు, నగదు రివార్డులతో ఆయన సత్కరించారు. అన్ని విభాగాలకు చెందిన 124 మందికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తమ ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహించడం వల్ల సంస్థ అంతర్గత సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదరహిత డ్రైవర్లను గుర్తించి.. జోనల్‌స్థాయిలో అవార్డులు అందజేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులకు సూచించారు. ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు వల్లే రాఖీపౌర్ణమినాడు రికార్డు స్థాయిలో 63 లక్షల మందిని గమ్యస్థానాలకు సంస్థ చేర్చినట్టు చెప్పారు. ఆ ఒక్కరోజులోనే రూ.32 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కృష్ణకాంత్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, తదితరులు పాల్గొన్నారు.

- ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మరణించిన వరంగల్-2 డిపోకు చెందిన డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబ సభ్యులకు రూ.1.15 కోట్ల విలువ గల ప్రమాదబీమా చెక్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.

# ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చండి

- చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు



చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో బైఠాయించిన భూ నిర్వాసితులు

చౌటుప్పల్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలంటూ బాధితులు శనివారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. అనంతరం హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ ఓఆర్‌ఆర్‌కు ట్రిపుల్‌ఆర్ 40 కిలోమీటర్ల దూరంలో ఉండాల్సి ఉందన్నారు. కానీ చౌటుప్పల్‌లో మాత్రం 28 కిలోమీటర్ల దూరంలోనే రోడ్డు వేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయం భవిష్యత్‌లో ఈ ప్రాంత అభివృద్ధిపై చాలా ప్రభావం చూపుతుందన్నారు. తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకోవాలనికోరారు. బహిరంగ మార్కెట్‌లోని ధరలను పరిహారంగా చెల్లించాలని, ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లాకార్యదర్శి మాటూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించాలి

**హైకోర్టు జడ్జి ఎన్.తుకారాంజీ**



జిల్లాల జడ్జీలతో రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎన్.తుకారాంజీ

జగిత్యాలజోన్: జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జ్యుడీషియల్ ఆఫీసర్స్ మీట్ శనివారం జగిత్యాల జిల్లా కోర్టులో జరిగింది. సమావేశంలో రెండు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులతో పాటు ఆయా జిల్లాల పరిధిలోని వివిధ కోర్టుల జడ్జీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి ఎస్.తుకారాంజీ హాజరయ్యారు. శనివారం ఉదయం జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా హైకోర్టు జడ్జిని కలిశారు. అనంతరం జిల్లా పరిస్థితులపై చర్చించారు. అలాగే, జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సైతం హైకోర్టు జడ్జిని కలిసి పలు సమస్యలపై విన్నవించారు. తర్వాత జగిత్యాల కోర్టులో జరిగిన జ్యుడీషియల్ మీట్‌లో హైకోర్టు జడ్జి మాట్లాడారు. కోర్టులపై పెండింగ్ కేసుల భారం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు జ్యుడీషియల్ ఆఫీసర్స్ చొరవ చూపాలని కోరారు. రెండు జిల్లాల్లోని కోర్టుల పరిధిలో ఉన్న కేసులు, పరిష్కారం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం జ్యుడీషియల్ ఆఫీసర్స్‌తో పాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో విడివిడిగా ఫొటో సెషన్స్‌లో పాల్గొన్నారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నీలిమ, ప్రేమలత, జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి నారాయణ, రెండు జిల్లాల జడ్జీలు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై స్పందన వ్యవస్థను ఏర్పాటు చేయాలి

**పలు మీడియా సంస్థల మహిళా జర్నలిస్టుల డిమాండ్**

సాక్షి, హైదరాబాద్: మహిళా జర్నలిస్టుల సమస్యలపై ఫిర్యాదు చేయగానే తక్షణమే స్పందించే విధానాన్ని ఏర్పాటు చేయాలని పలు మీడియా సంస్థల మహిళా పాత్రికేయులు కోరారు. నకిలీ అకౌంట్స్ నుంచి వచ్చే ట్రోల్స్‌కు ఆయా రాజకీయపార్టీలనే బాధ్యులను చేయాలని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టుల మీద జరుగుతున్న దాడులు, ట్రోల్స్ చూస్తుంటే పదేళ్ల తర్వాత తెలంగాణలో మహిళా జర్నలిస్టులు ఉంటారా అనే ఆందోళన కలుగుతుందన్నారు. మీడియా కవరేజ్ కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టులపై పోలీసులే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అఖిలపక్ష సమావేశానికి వినతి

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా రాష్ట్ర స్థాయిలో అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథికి టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ శనివారం లేఖ రాశారు. ఓటర్ జాబితా ముసాయిదా తయారీ ప్రక్రియ గురించి వివరించి, వివిధ పార్టీల సందేహాలను నివృత్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రిలీవ్ చేయడంలేదని ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- సిరిసిల్ల జిల్లా కిష్టారావుపల్లె జీపీలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఉద్యోగి
- పోటీపరీక్షల ఫలితాల్లో తొమ్మిది ఉద్యోగాలకు ఎంపిక

ఇల్లంతకుంట(మానకొండూర్): ఉన్నత ఉద్యోగం వచ్చినా తనను రిలీవ్ చేయడం లేదని ఓ ప్రభుత్వ ఉద్యోగి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలం ఫరీదాపూర్‌తండాకు చెందిన లంబాడి శ్రీనివాస్ 2022 నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లె గ్రామపంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. 317 జీవోలో భాగంగా ఇల్లంతకుంట మండలానికి బదిలీపై వచ్చాడు. మూడు నెలల క్రితం రాసిన పోటీపరీక్షల ఫలితాల్లో తొమ్మిది ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. దీంతో మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరేందుకు అవసరమైన ఎన్‌వోసీ, ఎల్‌పీసీ(లాస్ట్ పే సర్టిఫికెట్) ధ్రువపత్రాల కోసం మండల పరిషత్‌లో సంప్రదించాడు. అయితే గ్రామపంచాయతీలో వసూలు చేసిన పన్నులకు సంబంధించిన డబ్బులు ఏమైనా ఉంటే వాటి చలాన్ కట్టిన రసీదులు తీసుకురమ్మని ఎంపీవో తెలిపారు. అధికారులు తనను రిలీవ్ చేయడంలో తాత్సారం చేస్తున్నారని శనివారం మండల పరిషత్‌కు వచ్చి గడ్డిమందు తాగాడు. గమనించిన ఎంపీడీవో, ఎంపీవోలు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఈ విషయమై ఎంపీడీవో శశికళను వివరణ కోరగా తమకు ఈ నెల 22న డీపీవో నుంచి ఉత్తర్వులు వచ్చాయని, అతనికి ఇవ్వాల్సిన సర్టిఫికెట్లు తయారు చేస్తున్నామని కొద్దిసేపు వేచి ఉండాలని చెప్పినట్లు తెలిపారు. అంతలోనే గడ్డిమందు తాగినట్లు వివరించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం, ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

# కొనుక్కునే పెన్షన్ మేం ఒప్పుకోం

**ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ**



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగి తన చందా ఇచ్చి కొనుక్కునే పెన్షన్ విధానానికి తాము ఒప్పుకొనేది లేదని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగికి పాత విధానంలోనే పెన్షన్ నిర్ణయం జరగాలని, ప్రభుత్వ ఉద్యోగి తన నెల జీతం కంట్రిబ్యూషన్‌తో సర్వీస్ కాలంలో 50 శాతం జమ చేస్తే 20 శాతం తీసుకుని 30 శాతం తిరిగి ఇచ్చే పెన్షన్‌తో ప్రయోజనం లేదని శనివారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పెట్టుబడి పెట్టిన 25 ఏళ్ల తర్వాత 20 శాతం నష్టంతో ఇస్తారని తెలిసి ఎవరైనా పెట్టుబడి పెడతారా అని ప్రశ్నించారు. ఈ విషయంలో కేంద్రం పునరాలోచించాలని స్థితప్రజ్ఞ కోరారు. తెలంగాణ రాష్ట్రం కేంద్ర విధానం నుంచి వైదొలగి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# భాగ్యమంతా నగరికే..!



రాష్ట్రంలోని బ్యాంకుల్లో ఉన్న నగదు డిపాజిట్లలో సింహభాగం గ్రేటర్ పరిధిలోనివే

అప్పులు తీసుకున్నది కూడా ఎక్కువగా ఇక్కడివారే.. బ్యాంకు శాఖలూ ఇక్కడే ఎక్కువ

రాష్ట్రంలో అన్ని రకాల బ్యాంకు లావాదేవీలు కలిపి 80 శాతం భాగ్యనగరంలోనే

ఈ ఏడాది మార్చి 31 నాటి ఎస్ఎల్‌బీసీ గణాంకాల్లో వెల్లడి

| బ్యాంకుల్లో డబ్బుల లెక్కలివీ.. | | |
|---|---|---|
| **6,415** రాష్ట్రంలోని మొత్తం బ్యాంకు శాఖలు | రూ.**7.8** లక్షల కోట్లు రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో కలిపి నగదు డిపాజిట్లు | రూ.**6.09** లక్షల కోట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని డిపాజిట్లు |
| **2,579** గ్రేటర్ హైదరాబాద్, శివార్లలో ఉన్న శాఖలు | రూ.**9.79** లక్షల కోట్లు రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు | రూ.**7.08** లక్షల కోట్లు ఇందులో గ్రేటర్ పరిధిలోని 3జిల్లాల్లో తీసుకున్న అప్పులు |

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డబ్బులన్నీ హైదరాబాద్ చుట్టూనే తిరుగుతున్నాయి. ముఖ్యంగా బ్యాంకుల్లో డిపాజిట్లు అయినా, అప్పులైనా.. ఏ రూపంలోని బ్యాంకు లావాదేవీలైనా.. 80 శాతానికిపైగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే జరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023–24)కు సంబంధించి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఆ విశేషాలు ఇవీ..

→ తెలంగాణలో జాతీయ, ప్రైవేట్, రాష్ట్ర బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్, పేమెంట్ బ్యాంకులు కలిపి 50 వరకు పనిచేస్తున్నాయి. వాటన్నింటికీ కలిపి మొత్తం 6,415 శాఖలున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,874, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 1,541, అర్బన్ ప్రాంతాల్లో 3,000 శాఖలు పనిచేస్తున్నాయి. అత్యధికంగా స్టేట్ బ్యాంకు శాఖలే 1,215 ఉన్నాయి.

→ జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా 1,135 బ్యాంకు శాఖలు ఒక్క హైదరాబాద్ రెవెన్యూ జిల్లాలోనే ఉన్నాయి. తర్వాత రంగారెడ్డిలో 779, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 665 శాఖలు పనిచేస్తున్నాయి. అంటే మొత్తం బ్యాంకు శాఖల్లో 2,579 గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయన్న మాట.

→ ఇక గ్రామీణ జిల్లాల విషయానికి వస్తే.. నిజామాబాద్‌లో 283, ఖమ్మంలో 253, సంగారెడ్డిలో 249, నల్లగొండలో 234, కరీంనగర్‌లో 220 బ్యాంకు శాఖలు పనిచేస్తున్నాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో 38 మాత్రమే ఉంటే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 49 శాఖలు ఉన్నాయి.


→ బ్యాంకుల్లోని నగదు డిపాజిట్లను పరిశీలిస్తే.. రాష్ట్రంలోని మొత్తం 12 జాతీయ బ్యాంకులకు ఉన్న 3,134 శాఖల్లో కలిపి రూ.4.17 లక్షల కోట్ల నగదు డిపాజిట్లు ఉన్నాయి. ఇక 21 ప్రైవేట్ బ్యాంకులకు సంబంధించిన 1,741 శాఖల్లో మరో 3.07 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. మిగతా అన్ని రకాల ఫైనాన్షియల్ సంస్థల్లో కలిపి రూ.54 వేల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి.

→ అప్పుల విషయానికి వస్తే.. జాతీయ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు బ్యాంకుల నుంచే స్వల్పంగా ఎక్కువ అప్పులు తీసుకుంటున్నారు. నగదు డిపాజిట్లతో పోలిస్తే జాతీయ బ్యాంకుల్లో అప్పులు 124.46% ఉండగా.. ప్రైవేటు బ్యాంకుల్లో ఇది 128.54%గా నమోదైంది.

→ ప్రాంతాల వారీగా పరిశీలిస్తే అప్పులు, నగదు డిపాజిట్లు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో రూ.6.49 లక్షల కోట్ల డిపాజిట్లు, రూ.7.74 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.58,215 కోట్ల డిపాజిట్లు, రూ.88,854 కోట్ల అప్పులు ఉన్నాయి.


→ జిల్లాల వారీగా చూస్తే గ్రేటర్ హైదరాబాద్ తర్వాత సంగారెడ్డి జిల్లాలోని బ్యాంకుల్లో ఎక్కువగా నగదు డిపాజిట్లు ఉన్నాయి. ఇక్కడ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి రూ.18,663 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. తర్వాత హనుమకొండ జిల్లాలో 13,165 కోట్లు, కరీంనగర్‌లో రూ.12,465 కోట్లు, వరంగల్‌లో రూ.10,012 కోట్లు, ఖమ్మంలో రూ.10,248 కోట్లు, నల్లగొండలో రూ.9,069 కోట్ల మేర నగదు డిపాజిట్లు ఉన్నాయి.

గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో బ్యాంకుల్లో డిపాజిట్లు, అప్పుల గణాంకాలివీ.. (రూ.కోట్లలో)




→ బ్యాంకుల నుంచి తీసుకునే అప్పులు కూడా గ్రేటర్ హైదరాబాద్ తర్వాత అత్యధికంగా సంగారెడ్డిలోనే ఎక్కువగా ఉన్నాయి. ఈ జిల్లాలో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు రూ.27 వేల కోట్లకుపైగా ఉన్నాయి. తర్వాత ఖమ్మం జిల్లాలో రూ.20 వేల కోట్లు, నల్లగొండలో రూ.19వేల కోట్లపైన అప్పులు ఉన్నాయి.

→ నగదు డిపాజిట్లు, అప్పుల్లో ములుగు జిల్లా చివరి స్థానంలో ఉంది. ఈ జిల్లాలోని బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు రూ.1,135 కోట్లుకాగా.. అప్పులు రూ. 1,676 కోట్లు.



ఈ చిత్రం ఐఫోన్ ఫొటోగ్రఫీ అవార్డులు–2024లో గ్రాండ్ ప్రైజ్ విజేతగా నిలిచింది. అమెరికాకు చెందిన ఎరిన్ బ్రూక్స్ తన ఐఫోన్ 15 ప్రో మాక్స్‌తో 'బాయ్ మీట్స్ షార్క్' పేరిట ఈ ఫొటో తీశారు.

## మా తుజే సలాం..

వార్ధక్యంతో శరీరం సహకరించకపోయినా.. చెప్పులేకపోవడంతో అరికాళ్లు మండిపోతున్నా.. కన్నబిడ్డ ఆకలిదప్పులు తీర్చడమే ధ్యేయంగా బతుకు 'బండి'నెట్టుకొస్తున్న ఈ మాతృమూర్తి.. అమ్మ అనే పదానికి అసలుసిసలు అర్థంలా కనిపిస్తోంది కదూ! సిద్దిపేట శరభేశ్వరాలయం వద్ద నివసించే ఎల్లవ్వ(65) కొడుకు గాంధీ దివ్యాంగుడు. వారికి ఎలాంటి ఆసరా లేకపోవడంతో కొడుకు ట్రైసైకిల్‌ను ఇలా నెట్టుకుంటూ పట్టణ వీధుల్లో భిక్షాటన చేస్తూ అతడి పొట్ట నింపుతోంది. కన్నతల్లికి పట్టెడన్నం పెట్టడం కూడా బరువుగా భావించి అనాథల్లా నడిరోడ్డుపై వదిలేసి చేతులు దులుపుకొంటున్న కొడుకులందరికీ ఇది కనువిప్పు కావాలి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట






## త్వరలో సాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీలు?

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లతోపాటు శ్రీశైలం మల్లన్నను చూసి తరించాలనుకునే వారికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీలో 2 రోజుల టూర్‌కు సన్నాహాలు చేస్తోంది. ఉన్నతాధికారుల అనుమతి కోసం ఫైల్ పంపేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. సాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణానది నిండుగా ఉంది. సాగర్ జలాశయ నీటిమట్టం 570 అడుగులకు తగ్గేంత వరకు నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం.ఇప్పటికే శ్రీశైలం నుంచి సోమశిలకు వెళ్లే లాంచీ ట్రిప్పును ఖరారు చేశారు.

### ప్రయాణం ఇలా ఉండేలా..

మొదటి రోజు హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు రోడ్డుమార్గాన కోచ్‌లో ప్రయాణం. ఆ తర్వాత నాగార్జునసాగర్ నుంచి లాంచీలో శ్రీశైలం ప్రయాణం. అక్కడి హరిత హోటల్‌లో లేదా మరో దగ్గర బస. మల్లికార్జునస్వామి దర్శనం, రాత్రి భోజనం. మరుసటి రోజు ఉదయాన ఆలయ సందర్శన. అల్పాహారం. పాతాళగంగ, రోప్‌వే సదుపాయం, గిరిజన మ్యూజియం సందర్శన, మధ్యాహ్నం భోజనం. ఫర్హాబాద్ అటవీ(టైగర్ వ్యూపాయింట్) సందర్శన అనంతరం హైదరాబాద్‌కు రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం. హైదరాబాద్ నుంచి శ్రీశైలం మీదుగా నాగార్జునసాగర్‌కు వెళ్లి తిరిగి వచ్చే వారికి కూడా ప్యాకేజీ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

# డెంగీపై ఆందోళన వద్దు

- గతేడాది కంటే కేసులు పెరిగాయి
- కానీ ఇప్పటివరకు ఒక్క మరణం నమోదు కాలేదు
- హైదరాబాద్ పరిధిలోనే ఎక్కువగా డెంగీ పాజిటివ్ కేసులు
- ప్రజారోగ్య విభాగం సంచాలకుడు డాక్టర్ బి.రవీందర్ నాయక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య గతేడాది కంటే కాస్త పెరిగినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రజారోగ్య విభాగం సంచాలకులు బి.రవీందర్ నాయక్ స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 66,589 శాంపిల్స్ పరీక్షిస్తే 4,648 పాజిటివ్ కేసులు వచ్చాయని, పాజిటివిటీ రేటు ఏడు శాతంగా ఉందన్నారు. ఒక్క మరణం కూడా నమోదు కాలేదని చెప్పారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం నమోదవుతున్న డెంగీ పాజిటివ్ కేసుల్లో వైరల్ లోడ్ తక్కువగా ఉంటోందనీ, ప్రమాదకరమైన పరిస్థితి లేదని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు, గుండె, ఇతర అవయవ సంబంధిత సమస్యలున్న వారు మాత్రం ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగీ కేసుల్లో అత్యధికంగా హైదరాబాద్‌లో 1,697 కేసులు నమోదయ్యాయని రవీందర్ నాయక్ తెలిపారు. ఆ తర్వాత సూర్యాపేటలో 416, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 405 కేసులు నమోదైనట్లు వివరించారు. దాదాపు అన్ని జిల్లాల్లో కూడా డెంగీ కేసులు ఉన్నాయన్నారు.

### జ్వరాల నమోదు కూడా తక్కువే

సీజనల్ వ్యాధుల పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖతో పాటు అనుబంధ శాఖలు కూడా అప్రమత్తంగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల తీవ్రతను గుర్తిస్తున్నట్లు రవీందర్ చెప్పారు. ప్రస్తుతం జ్వరాల నమోదు తక్కువగానే ఉందన్నారు. రాష్ట్రంలో చికున్‌గున్యా కేసులు అక్కడక్కడా నమోదయ్యాయని, మంకీపాక్స్ కేసులు మాత్రం ఇప్పటివరకు నమోదు కాలేదని వివరించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటోందన్నారు.

## డెంగీతో ఇద్దరు మృతి..

సిద్దిపేట జిల్లాలో బాలుడు.. మహబూబాబాద్ జిల్లాలో బీటెక్ విద్యార్థి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ బాలుడి కుటుంబీకుల ఆందోళన

సిద్దిపేటజోన్/తొర్రూరు: రాష్ట్రంలో డెంగీ వ్యాధికి మరో ఇద్దరు బలైపోయారు. సిద్దిపేట జిల్లాలో ఐదేళ్ల బాలుడు డెంగీతో మృతి చెందగా మహబూబాబాద్ జిల్లాలో బీటెక్ విద్యార్థి చనిపోయాడు. శనివారం వేర్వేరు జిల్లాల్లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రం చిన్నకోడూర్ మండలం అల్లీపూర్‌కు చెందిన రాజు, రజితలకు ఇద్దరు కుమారులు. రాజు పెద్ద కుమారుడు ఆయాన్ష్‌కు జ్వరం రాగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు డెంగీగా నిర్ధారణ చేసి ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అయితే బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా...అక్కడ శనివారం ఉదయం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంగానే ఆయాన్ష్ చనిపోయాడని ఆరోపిస్తూ బాలుడి కుటుంబసభ్యులు తొలుత చికిత్స పొందిన ఆస్పత్రికి తీసుకువచ్చి ఆందోళన చేపట్టారు.

### సాఫ్ట్‌వేర్ కోర్సు నేర్చుకుందామని వచ్చి...

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీరప్పనగర్‌కు చెందిన బేతమల్ల రమేశ్, లక్ష్మీకాంత కుమారుడు ప్రేమ్‌కుమార్(23) వరంగల్ జిల్లా బొల్లి కుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువు తున్నాడు. అయితే సాఫ్ట్‌వేర్ కోర్సు నేర్చుకునేందుకు ప్రేమ్‌కుమార్ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చాడు. అక్కడ జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఇంటికి పిలిపించారు. తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించి కుదుటపడ్డాక ఇంటికి తీసుకెళ్లారు. శనివారం ఉదయం తీవ్ర జ్వరం, వాంతులతోపాటు ఫిట్స్ రాగా అతడిని పట్టణంలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## చెత్త వేస్తే.. చెప్పుల దండే..

హనుమకొండ: నివాసితులు రోడ్లపై విచ్చలవిడిగా వ్యర్థాలను పడేస్తుండడంతో అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త, వ్యర్థాలు వేయొద్దని స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వినలేదు. దీంతో వ్యర్థాలు పడేస్తున్న వారికి జ్ఞానోదయమయ్యేలా.. హనుమకొండ గోకుల్‌నగర్ వాసులు వినూత్న నిరసన తెలిపారు. చెత్త కుమ్మరించే ప్రాంతంలో ముగ్గులు వేసి అందంగా తీర్చి దిద్దారు. చెత్త వేస్తే చెప్పుతో కొట్టినట్లనే అర్థం వచ్చేలా.. అక్కడ చెప్పుల దండలు కట్టారు. హనుమకొండ గోకుల్ నగర్‌లో సివిల్ సప్లై గోదాములు, అంబేడ్కర్ భవన్ వెనకాల, బీసీ కాలేజీ హాస్టల్ రోడ్డుపై కనిపించిందీ దృశ్యం.



# అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

| |
|---|
| అక్టోబరు 4 నుండి 12 వరకు నిర్వహణ |
| భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు |
| అక్టోబరు 4న శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ |
| ఆయా రోజుల్లో కాటేజి దాతలకు గదుల కేటాయింపు ఉండదు |
| టీటీడీ ఈఓ శ్యామలరావు వెల్లడి |



తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అక్టోబరు 4 నుండి 12 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈఓ జె. శ్యామలరావు చెప్పారు. అన్నివిభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పురటాసి మాసం కూడా వస్తున్నందువల్ల భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందన్నారు. అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మంలతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈఓ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సాలకట్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబరు 4న ధ్వజారోహణం ఉంటుందని, అదేరోజు సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ వేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు.

### ఈఓ వెల్లడించిన ఇతర వివరాలు

→ ఉ.8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 వరకు వాహన సేవలు జరుగుతాయి. గరుడ వాహన సేవ సా.6.30 గంటలకు ప్రారంభమవుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు.

→ సుమారు 7 లక్షల లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచనున్నారు.

→ టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, జిల్లా పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు.

→ అక్టోబరు 4 నుండి 12 వరకు కాటేజి దాతలకు గదుల కేటాయింపు ఉండదు.

→ 4,000 మంది శ్రీవారి సేవకులు, తిరుమలలోని అన్ని విభాగాల్లో భక్తులకు సేవలందిస్తారు.

→ భక్తి చానల్ ద్వారా వాహన సేవల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. ఫొటో ఎగ్జిబిషన్, ఫలపుష్ప ప్రదర్శనశాల, ఆయుర్వేద, శిల్ప ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తారు.

→ టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఇతర ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల కళాబృందాలతో వాహన సేవల్లో ప్రదర్శనలుంటాయి.

→ అక్టోబరు 8న గరుడసేవ సందర్భంగా ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు.

→ అలిపిరి పాత చెక్‌పోస్టు, శ్రీవారి మెట్టు వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు.

### తిరుమలలో నీటి లభ్యతపై అపోహలొద్దు..

ఇదిలా ఉంటే.. శనివారం నాటికి తిరుమలలో కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం డ్యాంలలో కలిపి 4,592 లక్షల గ్యాలన్ల నీరు అందుబాటులో ఉందని.. నీటి లభ్యతపై అపోహలొద్దని ఈఓ శ్యామలరావు కోరారు. తిరుపతిలోని కల్యాణి డ్యాంలో 5,608 లక్షల గ్యాలన్ల నీరు అందుబాటులో ఉన్నందున శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అదనపు నీటి అవసరాలతో సహా 130 రోజుల వరకు ఈ నీరు సరిపోతుందని ఆయన చెప్పారు. అలాగే, కల్యాణి డ్యాం నుండి 11 లక్షల గ్యాలన్ల నీటిని అదనంగా సరఫరా చేయడానికి తిరుపతి మున్సిపల్ కమిషనర్ అంగీకరించారని.. తద్వారా అదనంగా మరో నెలరోజులు తిరుమల నీటి అవసరాలు తీరుతాయని ఆయన చెప్పారు. అంతేకాక.. కైలాసగిరి రిజర్వాయర్ నుండి మరో 10 ఎంఎల్డీ నీరు తిరుపతికి సరఫరా కానుందని ఆయన వివరించారు.

## ఆఖరి మజిలీకి చచ్చేచావు



భీమారం: అడుగు తీసి అడుగేయలేని బురద రోడ్డుపై మృతదేహాన్ని మోసుకెళ్లి.. వాగులో తీసుకెళ్లి అష్టకష్టాలు పడి అంత్యక్రియలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఎలకేశ్వరం గ్రామానికి చెందిన బొమ్మని రాజుబాయి (65) అనే మహిళ శనివారం అనారోగ్యంతో చనిపోయింది. ఆరెపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఎలకేశ్వరం వరకు మట్టిరోడ్డే. వర్షాకాలంలో గ్రామం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని శ్మశాన వాటిక వరకు కాలు తీసి కాలు వేయలేని పరిస్థితులు న్నాయి. శుక్రవారం రాత్రి నుంచి వర్షం పడుతుండడంతో బురదమయమైన రోడ్డులోనే రాజుబాయి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మధ్యలో వాగు దాటి శ్మశాన వాటిక చేరుకుని దహన సంస్కారాలు నిర్వహించారు.



## ఫినిష్..!

ఎంతో ఓపికతో నీటి వైపు అదే పనిగా చూస్తోందా పక్షి.. అంతలోనే ఓ చేప నీటిపైన తచ్చాడుతూ కనిపించింది. అంతే.. ఒక్క ఉదుటున నీటిలోకి దూకి చేపను నోట కరుచుకుంది. నోటికి సరిగా అందలేదోమో.. ఒక్కసారి గాల్లోకి అలా విసిరి కిందికి వస్తున్న చేప పిల్లను ఒడుపుగా నోట్లోకి తీసుకుని గుటుక్కున మింగేసింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో నిత్యం కనిపించే దృశ్యాలివి.. - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

## 'ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలి'

సాక్షి, హైదరాబాద్: బడి ఈడులో ఉన్న బాలబాలికలందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని, జాతీయ ఆదాయంలో కొఠారీ కమిషన్ సూచించిన విధంగా 6 శాతం నిధులు విద్యకు కేటాయించాలని అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్ఈఏ) డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఏఐఎఫ్ఈఏ కార్యవర్గ సమావేశం జరిగింది.

# తొండ, ఉడుత, కోతి..

**14%** కరెంట్ అంతరాయాలకు కారణం ఈ మూగజీవాలే..

ట్రాన్స్‌ఫార్మర్‌పై కదులుతూ విద్యుదాఘాతాలకు లోనవుతూ..

నివారణ కోసం ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంప్‌ల వినియోగానికి నిర్ణయం

సరఫరా అంతరాయాలతో పాటు మూగజీవాల మరణాలకు నివారణ

సాక్షి, హైదరాబాద్: బల్లి, పిల్లి, తొండ, ఉడుత, ఉడుము, పావురం, కోతులు వంటి మూగజీవాలే 14% కరెంట్ అంతరాయాలకు కారణమట. అవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఎక్కి ఫ్యూజ్ సెట్లు, బ్రేకర్స్, లింబ్స్, ఇన్సులేటర్ల(పింగాణి)పై పాకుతున్నప్పుడు/వెళ్తున్నప్పుడు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై చనిపోతుంటాయి. దీంతో ఫీడర్ ట్రిప్ అయి ఆ ప్రాంతం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లపై కదిలే సమయంలో ఈ జీవాలు లైవ్ కరెంట్ పాయింట్, ఎర్త్ పాయింట్లు రెండింటినీ తాకితే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఫీడర్లు ట్రిప్ అయి విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలకు కారణాలను విశ్లేషించిన అనంతరం 14 శాతం మూగజీవాలే కారణమని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) గుర్తించింది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండే హార్న్ గ్యాప్ ఫ్యూజ్‌లకు మెటల్ క్లాంప్‌లను వినియోగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారించింది. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ (ఎఫ్ఆర్‌బీ) సిలికాన్ క్లాంప్‌లను ఏర్పాటు చేయాలని టీజీఎస్పీడీసీఎల్ నిర్ణయించింది. ఈ సిలికాన్ క్లాంప్‌లు విద్యుత్ ప్రవాహకాలుగా పనిచేయవు. దీంతో లైవ్ కరెంట్ పాయింట్ల నుంచి ఎర్త్ పాయింట్ల మీదకు మూగజీవాలు పాకే/వెళ్లే సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసు కోవు. ప్రాథమిక దశలో చెట్లు అధికంగా వుండి సరీసృపాల బెడద అధికంగా వున్న ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకి సంబంధించిన ఫ్యూజులు, బ్రేకర్స్, లింబ్స్ ఉండే చోట 3,000 సిలికాన్ క్లాంప్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించడంతో పాటు మూగజీవాలకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతానికి గురైన ఉడుము (ఫైల్ ఫొటో)



ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్లపై బిగిస్తున్న ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్, సిలికాన్ క్లాంప్‌లు

## ఇక్కడ డోలీనే అంబులెన్స్!

డోలీనే వారి పాలిట అంబులెన్స్ అయింది. అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ బూసుపాడు కొండ శిఖర గ్రామానికి చెందిన కేరెంగి రమేష్ భార్య చిన్నమ్మి మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు రోడ్డు మార్గం లేకపోవడంతో శనివారం భర్త, కుటుంబ సభ్యులు డోలీలో ఏడు కిలోమీటర్ల మేర మోసుకుని కొత్తూరు వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో సమీప విజయనగరం జిల్లా ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. - అనంతగిరి (అరకులోయ రూరల్)



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 

# వన్స్ మోర్

తెలుగు,
తమిళ, కన్నడ, మలయాళం,
హిందీ... ఇలా భాష ఏదైనా ప్రస్తుతం 'వన్స్ మోర్' అంటూ రీ రిలీజ్‌ల ట్రెండ్ కొనసాగుతోంది. మరీ ముఖ్యంగా ఈ ట్రెండ్ తెలుగులో ఇంకాస్త ఎక్కువగా ఉంది. గతంలో సూపర్ హిట్‌గా నిలిచిన చిత్రాలను రీ రిలీజ్ చేసేందుకు మేకర్స్ అమితాసక్తి చూపిస్తున్నారు. స్టార్ హీరోల పుట్టినరోజు కావచ్చు లేదా ఆ సినిమాకి ఏదైనా ప్రత్యేకమైన రోజు కావచ్చు... సందర్భం ఏదైనా రీ రిలీజ్‌కి హీరోలు, దర్శకులు, నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా రీ రిలీజ్‌లో కూడా ఆయా సినిమాలు భారీగానే కలెక్షన్స్ కొల్లగొడుతుండటం కూడా ఓ కారణం. ఆయా హీరోల అభిమానులు, ప్రేక్షకులు కూడా 'వన్స్ మోర్' అంటూ ఆ సినిమాలను బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గత చిత్రాలను 4కె క్వాలిటీతో అందిస్తుండటంతో ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పొందుతున్నారు. చిరంజీవి 'ఇంద్ర' ఈ నెల 22న విడుదల కాగా, నాగార్జున 'శివ', పవన్ కల్యాణ్ 'గబ్బర్ సింగ్', ప్రభాస్ 'ఈశ్వర్, డార్లింగ్', ధనుష్ 'త్రీ' వంటి సినిమాలు రీ రిలీజ్‌కి రెడీ అవుతున్నాయి.
ఆ విశేషాల్లోకి...


● చిరంజీవి, సోనాలీ బింద్రే


## మొక్కే కదా అని...

'వీరశంకర్ రెడ్డి... మొక్కే కదా అని పీకేస్తే పీక కోస్తా', 'షౌకత్ అలీఖాన్... తప్పు నావైపు ఉంది కాబట్టి తల దించుకుని వెళుతున్నా... లేకుంటే తలలు తీసుకెళ్లేవాణ్ణి', 'సింహాసనం మీద కూర్చునే అర్హత అక్కడ ఆ ఇంద్రుడిది... ఇక్కడ ఈ ఇంద్రసేనుడిది'.. వంటి డైలాగులు 'ఇంద్ర' సినిమాలో చిరంజీవి చెబుతుంటే అభిమానుల, ప్రేక్షకుల ఈలలు, కేకలు, చప్పట్లతో థియేటర్లు దద్దరిల్లిపోయాయి. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'ఇంద్ర'. బి. గోపాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆర్తీ అగర్వాల్, సోనాలీ బింద్రే హీరోయిన్లుగా నటించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ సినిమా చిరంజీవి బర్త్ డే కానుకగా 2002 జూలై 22న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రత్యేకించి మణిశర్మ సంగీతం, పాటలకు తగ్గట్టు చిరంజీవి డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 'ఇంద్ర' విడుదలైన 22 ఏళ్లకు సరిగ్గా చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆగస్టు 22న ఈ సినిమాని మళ్లీ విడుదల చేశారు మేకర్స్. రీ రిలీజ్‌లోనూ థియేటర్లలో మెగా ఫ్యాన్స్ సందడి మామూలుగా లేదు. ప్రత్యేకించి పాటల సమయంలో స్క్రీన్ వద్దకు వెళ్లి డ్యాన్సులు వేస్తున్నారు. 22 ఏళ్లకు రీ రిలీజైన 'ఇంద్ర' మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకెళుతుండటం విశేషం.

## సైకిల్ చైన్‌తో...

నాగార్జున నటించిన చిత్రాల్లో రెండు సూపర్ హిట్ చిత్రాలు మళ్లీ వెండితెర పైకి రానున్నాయి. ఒకటి 'శివ', మరోటి 'మాస్'. సైకిల్ చైన్ చేతికి చుట్టి విలన్లను రఫ్ఫాడించే ట్రెండ్ సెట్ చేసిన చిత్రం 'శివ'. నాగార్జున హీరోగా నటించిన ఈ చిత్రంలో అమల హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా ద్వారా రామ్‌గోపాల్ వర్మ దర్శకునిగా పరిచయమయ్యారు. కాలేజీలో విద్యార్థుల మధ్య గొడవలు, గ్యాంగ్‌లు, రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం స్టూడెంట్స్‌ని ఎలా ఉపయోగించుకుంటారు? విద్యార్థుల మధ్య ఎలాంటి గొడవలు సృష్టిస్తారు? ఇలాంటి సామాజిక అంశాల నేపథ్యంలో ఈ సినిమాని తెరకెక్కించి సరికొత్త ట్రెండ్‌ని సృష్టించారు వర్మ. అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర నిర్మించిన ఈ సినిమా 1989 అక్టోబర్ 5న రిలీజై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇళయరాజా సంగీతంలో ఈ సినిమా మ్యూజికల్ హిట్‌గానూ నిలిచింది. ఈ సినిమాని 'శివ' (1990) పేరుతోనే హిందీలో రీమేక్ చేసిన రామ్‌గోపాల్ వర్మ అక్కడ కూడా హిట్ అందుకున్నారు. ఇదిలా ఉంటే దాదాపు 35 ఏళ్లకి 'శివ' మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 29న నాగార్జున బర్త్ డే సందర్భంగా 'శివ' సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. అంటే.. మరోసారి సైకిల్ చైన్ చేతికి చుట్టి బాక్సాఫీస్ వద్ద వసూళ్లు సాధించేందుకు రానున్నాడు శివ. 'మాస్, శివ' చిత్రాల రిలీజ్ కోసం అక్కినేని ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.


● అమల, నాగార్జున


● నాగార్జున, జ్యోతిక

## మమ్మమ్మాస్

'వచ్చే నెల ఒకటో తారీఖుకి నువ్వు ఉండవ్.. పదిహేనో తారీఖుకి నీకు భయమంటే ఏంటో తెలుస్తుంది.. ఇరవయ్యో తారీఖుకి నిన్ను ఎదిరించడానికి ఒక మగాడు వచ్చాడని జనానికి తెలుస్తుంది.. ఇరవైఅయిదో తారీఖుకి పబ్లిక్‌కి నువ్వంటే భయం పోతుంది.. ఒకటో తారీఖు నువ్వు ఫినిష్' అంటూ తనదైన స్టైల్‌లో నాగార్జున చెప్పిన డైలాగ్స్ 'మాస్' చిత్రం లోనివి. కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ దర్శకునిగా పరిచయమైన చిత్రం 'మాస్'. ఈ మూవీలో జ్యోతిక, ఛార్మీ కౌర్ హీరోయిన్లు. అక్కినేని నాగార్జున నిర్మించిన ఈ సినిమా 2004 డిసెంబరు 23న విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ సినిమాకి అదనపు ఆకర్షణగా నిలిచింది. కాగా దాదాపు 20 ఏళ్లకు మమ్మమ్మాస్ అంటూ 'మాస్' మూవీ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 29న నాగార్జున పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ నెల 28న 'మాస్' సినిమాని రీ రిలీజ్ చేస్తోంది యూనిట్.

## తిక్క చూపిస్తా...

'నాక్కొంచెం తిక్కుంది... కానీ దానికో లెక్కుంది... నా తిక్కేంటో చూపిస్తా... అందరి లెక్కలు తేలుస్తా' అంటూ 'గబ్బర్ సింగ్' సినిమాలో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్స్ మెగా అభిమానులకు ఫుల్ కిక్ ఇచ్చాయి. పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'గబ్బర్ సింగ్'. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన హిందీ బ్లాక్ బస్టర్ మూవీ 'దబాంగ్'కి తెలుగు రీమేక్‌గా తెరకెక్కిన 'గబ్బర్ సింగ్'లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. బండ్ల గణేశ్ నిర్మించిన ఈ సినిమా 2012 మే 11న విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలన్నీ ప్రేక్షకులను అలరించాయి. కాగా 12 ఏళ్ల తర్వాత 'గబ్బర్ సింగ్' మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సెప్టెంబర్ 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాని విడుదల చేస్తున్నారు.


● పవన్ కల్యాణ్, శ్రుతీహాసన్


● ప్రభాస్, శ్రీదేవి

## ధూల్‌పేట్ ఈశ్వర్

ప్రభాస్ నటించిన రెండు సూపర్ హిట్ చిత్రాలు మళ్లీ విడుదల కానున్నాయి. ఒకటి... ఆయన తొలి చిత్రం 'ఈశ్వర్'. మరోటి 'డార్లింగ్'. నటుడు కృష్ణంరాజు వారసుడిగా ప్రభాస్ చిత్రసీమలో అడుగు పెట్టిన తొలి చిత్రం 'ఈశ్వర్'. ఈ మూవీతో టాలీవుడ్‌లో హీరోగా పరిచయమైన ప్రభాస్ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్‌గా నటించారు. యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో ధూల్‌పేట్ ఈశ్వర్‌గా ప్రభాస్ తన మాస్ హీరోయిజమ్‌ను చూపించారు. కె. అశోక్ కుమార్ నిర్మించిన ఈ సినిమా 2002 నవంబరు 11న విడుదలై, ఘన విజయం సాధించింది. ఆర్పీ పట్నాయక్ సంగీతం ఈ చిత్ర విజయానికి ప్లస్ అయింది. దాదాపు 22 ఏళ్లకు మరోసారి 'ఈశ్వర్' మూవీ విడుదలకు ముస్తాబవుతోంది. అక్టోబరు 23న ప్రభాస్ బర్త్ డే. ఈ సందర్భంగా 'ఈశ్వర్'ని రీ రిలీజ్ చేయనున్నారని తెలుస్తోంది.

## లవర్ బాయ్ డార్లింగ్

ప్రభాస్ లోని లవర్ బాయ్‌ని చక్కగా తెర్పై చూపించిన చిత్రం 'డార్లింగ్'. ఎ. కరుణాకరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం 2010 ఏప్రిల్ 23న విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రత్యేకించి ప్రభాస్–కాజల్ ఒకరినొకరు ఆట పట్టించుకునే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం కూడా ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలిచింది. పద్నాలుగేళ్ల తర్వాత 'డార్లింగ్' మరోసారి విడుదలకు సిద్ధమవుతోంది. అక్టోబరు 23న ప్రభాస్ బర్త్ డేని పురస్కరించుకుని 'డార్లింగ్'ని రిలీజ్ చేస్తున్నారు. సో.. తన బర్త్‌డే సందర్భంగా 'ఈశ్వర్, డార్లింగ్' సినిమాలతో ఫ్యాన్స్‌కి డబుల్ ధమాకా ఇవ్వనున్నారు ప్రభాస్.


● ప్రభాస్, కాజల్

## మళ్లీ కొలవెరి

ధనుష్ నటించిన రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం '3'. రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించారు. కస్తూరి రాజా విజయ లక్ష్మి నిర్మించిన ఈ చిత్రం 2012 మార్చి 30న రిలీజై హిట్‌గా నిలిచింది. రామ్‌గా ధనుష్, జననిగా శ్రుతీహాసన్‌ల నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రత్యేకించి టీనేజ్ ప్రేమికుడిగా, మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిగా ధనుష్ నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమా హిట్‌ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకి అనిరుధ్ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా ధనుష్ పాడిన 'వై దిస్ కొలవెరి డి' పాట సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. కాగా పన్నెండేళ్ల తర్వాత 'త్రీ'ని మరోసారి పాన్ ఇండియా స్థాయిలో రీ రిలీజ్ చేయనుంది యూనిట్. సెప్టెంబర్ 14న రిలీజ్ చేయనున్నారని టాక్.
ఇవే కాదు.. మరికొన్ని చిత్రాలు కూడా రీ రిలీజ్ కానున్నాయని టాక్.

– దేరంగుల జగన్


● శ్రుతీహాసన్, ధనుష్

# రజనీకాంత్‌కు విలన్‌గా?


● రజనీకాంత్, ఉపేంద్ర

'కూలీ' సినిమాలో ఉపేంద్ర విలన్‌గా నటించనున్నారా? అంటే ప్రస్తుతానికి అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నాగార్జున, శ్రుతీహాసన్, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని కోలీవుడ్ సమాచారం. అయితే తాజాగా ఉపేంద్ర పేరు తెరపైకి వచ్చింది. 'కూలీ' సినిమాలో ఉపేంద్ర ఓ రోల్ చేయనున్నారని, అది విలన్ పాత్ర అని టాక్. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 'కూలీ' సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.

# నాకు వ్యతిరేకంగా కుట్రలుచేశారు

– కంగనా రనౌత్



''బాలీవుడ్‌లోని పలువురు వ్యక్తులు నాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. నా సినిమాల్లో నటించొద్దని చాలామందికి ఫోన్స్ చేసి మరీ చెప్పారు'' అన్నారు హీరోయిన్ కంగనా రనౌత్. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ బయోపిక్‌గా రూపొందిన ఈ సినిమాని కంగనా రనౌత్, రేణు పిట్టి నిర్మించారు. పలు వాయిదాల తర్వాత సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో కంగనా రనౌత్ మాట్లాడుతూ– ''బాలీవుడ్‌లో నాకు వ్యతిరేకంగా కుట్రలు చేశారు. పలువురు క్యాస్టింగ్ దర్శకులు, సినిమాటోగ్రాఫర్స్ నాతో పని చేయడానికి నిరాకరించారు. అంతేకాదు... నాతో పని చేయొద్దని చాలామంది నటులకు ఫోన్లు చేశారు. ఎన్నో క్లిష్ట పరిస్థితులు, సవాళ్ల మధ్య అనుపమ్ ఖేర్, సతీష్ కౌశిక్, మహిమా చౌదరి వంటి నటీనటులతో 'ఎమర్జెన్సీ' కోసం పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వారు నా సినిమాలో భాగమవడంతో పాటు నన్నెంతో ప్రేమగా చూసుకున్నందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

# ఫీలింగ్ ఫైన్


● రవితేజ

షూటింగ్ స్పాట్‌లో రవితేజ కుడి చేతికి గాయం అయిన విషయం, ఆ గాయంతోనే షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పెద్దదై, శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. డాక్టర్లు ఆరు వారాల పాటు రవితేజకు పూర్తి విశ్రాంతిని సూచించారు. ఇక రవితేజ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ''సర్జరీ విజయవంతంగా జరిగింది. ఫీలింగ్ ఫైన్. మీ (అభిమానులు, ఇతరులు) ఆశీర్వాదాలకు, సపోర్ట్‌కి కృతజ్ఞుడ్ని'' అని సోషల్ మీడియా వేదికగా రవితేజ పేర్కొన్నారు. షూటింగ్‌లో పాల్గొనే రోజు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని కూడా షేర్ చేశారు. ఇక రవితేజ హీరోగా ఆయన 75వ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం సెట్లోనే ఆయన గాయపడ్డారు.

# రేస్‌లో...


● సైఫ్ అలీఖాన్


● సిద్ధార్థ్ మల్హోత్రా

కొత్త రేస్‌ను ఆరంభించనున్నారట సైఫ్ అలీఖాన్. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలలో 'రేస్' ఒకటి. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటివరకు మూడు భాగాలు రాగా మొదటి రెండు భాగాల్లో సైఫ్ అలీఖాన్ లీడ్ రోల్‌లో నటించారు. మూడో భాగంలో సల్మాన్ ఖాన్ లీడ్ రోల్‌లో నటించారు. ప్రస్తుతం 'రేస్ 4'కు రంగం సిద్ధం అవుతోందని, ఈ సినిమాలో మెయిన్ లీడ్ రోల్‌లో సైఫ్ అలీఖాన్ నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... మరో లీడ్ రోల్‌లో సిద్ధార్థ్ ఆనంద్ కనిపించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని, నవంబరులో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించేలా చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోందని భోగట్టా. అలాగే 'రేస్' లోని తొలి రెండు భాగాలను తెరకెక్కించిన దర్శక–ద్వయం అనీల్–మస్తాన్ 'రేస్ 4'ని డైరెక్ట్ చేస్తారా? లేక 'రేస్ 3'ని తెరకెక్కించిన రెమో డిసౌజానే 'రేస్ 4'కూ దర్శకత్వం వహిస్తారా? అనేది చూడాలి.

# మేజర్ వరదరాజన్


● శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తున్నారు. నటుడు కమల్‌హాసన్‌కు చెందిన ఆర్‌కేఎఫ్ఐ, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'అమరన్' రూపొందుతోంది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ సినిమా తెలుగు థియేట్రికల్ హక్కులను నిర్మాతలు సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి పొందారు. శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై వీరు ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ''ఇండియాస్ మోస్ట్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'అమరన్'. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మునుపెన్నడూ చూడని సరికొత్త గెటప్‌లో శివ కార్తికేయన్ కనిపించనున్నారు. మేజర్ వరదరాజన్ పాత్రలో ఆకట్టుకుంటారాయన. కమల్‌హాసన్ నటించిన 'విక్రమ్' సినిమా తర్వాత శ్రేష్ఠ్ మూవీస్ 'అమరన్' చిత్రం హక్కులను సొంతం చేసుకుంది. సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి తెలుగులో విడుదల చేయనున్న 'అమరన్' మరింతగా విజయపథంలోకి వెళుతుందనే నమ్మకాన్ని కమల్‌హాసన్ వ్యక్తం చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: జీవీ ప్రకాశ్, కెమెరా: సీహెచ్ సాయి.


## బిజినెస్ రీల్

### ముగిసిన రిలయన్స్, క్లార్క్స్ జేవీ



**న్యూఢిల్లీ:** రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్, పాదరక్షల తయారీలో ఉన్న బ్రిటిష్ కంపెనీ క్లార్క్స్ తమ రెండేళ్ల జాయింట్ వెంచర్‌ను ముగించినట్టు పరిశ్రమ వర్గాల సమాచారం. నిర్దిష్ట నిబంధనలకు సంబంధించి ఇద్దరు భాగస్వాముల మధ్య విభేదాలు ఉద్భవించడంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్టు మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. క్లార్క్స్ బ్రాండ్ కింద ప్రధాన నగరాల్లో 30కిపైగా స్టోర్లను క్లార్క్స్ రిలయన్స్ ఫుట్‌వేర్ ఏర్పాటు చేసింది. ఇవి ఇక మూత పడనున్నాయి.

### అంబుజాలో హోల్డర్‌ఇండ్ 3 శాతం వాటాల విక్రయం



**న్యూఢిల్లీ:** అంబుజా సిమెంట్స్‌లో అదానీ గ్రూప్ ప్రమోటరు సంస్థ హోల్డర్‌ఇండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ దాదాపు 2.8 శాతం వాటాలు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా నిర్వహించిన ఈ లావాదేవీ విలువ సుమారు రూ. 4,250 కోట్లు. జీక్యూజీ పార్ట్‌నర్స్ తదితర ఇన్వెస్టర్లు ఈ వాటాలను కొనుగోలు చేశారు. వివిధ సంస్థల్లో హోల్డింగ్స్‌ను నిర్దిష్ట నిష్పత్తికి తగ్గట్లు సర్దుబాటు చేసుకునే క్రమంలో ప్రమోటరు ఈ మేరకు విక్రయం చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం అంబుజా సిమెంట్స్‌లో ప్రమోటర్ అయిన హోల్డర్‌ఇండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ 6.79 కోట్ల షేర్లను (సుమారు 2.8 శాతం వాటా) షేరు ఒక్కింటికి రూ. 625.50 చొప్పున విక్రయించింది. ఈ డీల్ అనంతరం కంపెనీలో హోల్డర్‌ఇండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 50.90 శాతం నుంచి 48.1 శాతానికి తగ్గుతుంది. అలాగే మొత్తం ప్రమోటర్ల వాటా 70.33 శాతం నుంచి 67.53 శాతానికి తగ్గుతుంది. జీక్యూజీ పార్ట్‌నర్స్ వాటా 1.35 శాతం నుంచి 3.13 శాతానికి పెరుగుతుంది.

### విక్రయ రుసుము తగ్గించిన అమెజాన్



**ముంబై:** పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ విక్రేతలకు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తీపి కబురు అందించింది. విభిన్న ఉత్పత్తుల విభాగాల్లో విక్రయ రుసుము 12 శాతం వరకు తగ్గిస్తున్నట్టు శనివారం ప్రకటించింది. సెప్టెంబర్ 9 నుంచి సవరించిన ఫీజు అమలులోకి వస్తుందని తెలిపింది. ఈ నిర్ణయంతో విక్రేతలు వివిధ ఉత్పత్తుల విభాగాల్లో 3–12 శాతం వరకు విక్రయ రుసుము తగ్గింపు ప్రయోజనం పొందుతారని కంపెనీ వెల్లడించింది. చిన్న వ్యాపారుల నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌కు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అమెజాన్ ఇండియా సెల్లింగ్ పార్ట్‌నర్ సర్వీసెస్ డైరెక్టర్ అమిత్ నందా వివరించారు.

### స్టెర్లింగ్‌లో జైడస్‌కు వాటా



**న్యూఢిల్లీ:** స్టెర్లింగ్ బయోటెక్‌లో 50 శాతం వాటాను జైడస్ లైఫ్‌సైన్సెస్ దక్కించుకుంటోంది. పర్ఫెక్ట్ డే ఇంక్‌తో ఈ మేరకు ఒప్పందం చేసుకున్నట్టు జైడస్ శనివారం వెల్లడించింది. డీల్ వివరాలను ఇరు కంపెనీలు వెల్లడించలేదు. ఒప్పందంలో భాగంగా స్టెర్లింగ్ బయోటెక్‌లో టిమసెక్ కంపెనీ అయిన పర్ఫెక్ట్ డే ఇంక్ తన 50 శాతం వాటాను విక్రయిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా పులియబెట్టిన జంతు రహిత ప్రోటీన్‌ను తయారు చేయడానికి జేవీ ఒక ప్లాంటును ఏర్పాటు చేస్తుందని జైడస్ లైఫ్‌సైన్సెస్ ప్రకటించింది. ఆరోగ్యం, పోషకాహారం కోసం ప్రత్యేక బయోటెక్ ఉత్పత్తుల్లోకి జైడస్ ఈ డీల్ ద్వారా ఎంట్రీ ఇవ్వనుంది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 25-8-2024 | |
|---|---|
| విశాఖ | 505–00 |
| చిత్తూరు | 508–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 485–00 |
| విజయవాడ | 485–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 450–00 |
| వరంగల్ | 452–00 |
| రిటైల్ ధర | 5.10 |

# భారత్‌లో ఎలక్ట్రిక్ రైడ్



- జనవరి–జూలైలో 10,75,060 యూనిట్లు
- 2023తో పోలిస్తే సేల్స్ 28 శాతం జూమ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) అమ్మకాలు భారత్‌లో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఏడు నెలల కాలంలో ఒక మిలియన్ యూనిట్ల విక్రయాల మార్కును చేరుకోవడం విశేషం. 2024 జనవరి–జూలైలో దేశవ్యాప్తంగా 10,75,060 ఈవీలు రోడ్డెక్కాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 28 శాతం వృద్ధి నమోదైంది. 2023 జనవరి–జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైతో ముగిసిన ఏడు నెలల్లో ఈ–టూ వీలర్స్ 29 శాతం దూసుకెళ్లి 6,34,770 యూనిట్లు నమోదయ్యాయి. ఈ–త్రీ వీలర్స్ 26 శాతం ఎగసి 3,77,439 యూనిట్లను తాకాయి. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికిల్స్ (కార్, ఎస్‌యూవీ, ఎంపీవీ) రిటైల్ అమ్మకాలు 21 శాతం అధికమై 56,207 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ–కమర్షియల్ వెహికిల్స్ ఏకంగా 190 శాతం వృద్ధి చెంది 6,308 యూనిట్లుగా ఉంది. ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా 2,13,036 ఎలక్ట్రిక్ వెహికిల్స్ కస్టమర్ల చేతుల్లోకి చేరాయి. జూలైలో 1,78,948 యూనిట్లు రోడ్డెక్కాయి.

**ఈ ఏడాది 2 మిలియన్లపైనే..**

ప్రస్తుత వేగాన్నిబట్టి చూస్తే భారత్‌లో అన్ని విభాగాల్లో కలిపి 2024లో ఎలక్ట్రిక్ వాహనాల రిటైల్ అమ్మకాలు 20 లక్షల యూనిట్లను దాటడం ఖాయంగా కనిపిస్తోందని పరిశ్రమ ఆశాజనకంగా ఉంది. 2023లో ఈవీల విక్రయాలు దేశవ్యాప్తంగా 50 శాతం వృద్ధితో 15.3 లక్షల యూనిట్లను నమోదు చేశాయి. 2022లో ఈ సంఖ్య 10.2 లక్షల యూనిట్లు మాత్రమే. మొత్తం వాహన రంగంలో ఎలక్ట్రిక్ విభాగం 2023లో 6.38 శాతానికి చేరింది. 2021లో ఇది 1.75 శాతమే. ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఈ– టూ వీలర్స్, ఈ– త్రీ వీలర్స్ వాటా ఏకంగా 95 శాతంపైమాటే. ఇక ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్‌ను (ఈఎంపీఎస్) 2024 సెప్టెంబర్ వరకు పొడిగించింది. వాస్తవానికి ఈఎంపీఎస్ సబ్సిడీ పథకం జూలై 31న ముగియాల్సి ఉంది.

**2024 జనవరి–జూలై మధ్య విభాగాల వారీగా టాప్-5 కంపెనీల రిటైల్ అమ్మకాలు**

| ఈ-టూ వీలర్స్ | | ఈ-త్రీ వీలర్స్ | | ఈ-ప్యాసింజర్ వెహికిల్స్ | |
|---|---|---|---|---|---|
| కంపెనీ | విక్రయాలు | కంపెనీ | విక్రయాలు | కంపెనీ | విక్రయాలు |
| ఓలా ఎలక్ట్రిక్ | 2,69,982 | మహీంద్రా | 36,632 | టాటా మోటార్స్ | 37,842 |
| టీవీఎస్ మోటార్ | 1,09,747 | వైసీ ఎలక్ట్రిక్ | 23,978 | ఎంజీ మోటార్ | 9,210 |
| బజాజ్ ఆటో | 84,225 | బజాజ్ ఆటో | 16,182 | మహీంద్రా | 4,325 |
| ఏథర్ ఎనర్జీ | 62,437 | సరా ఎలక్ట్రిక్ | 16,122 | బీవైడీ ఇండియా | 1,368 |
| హీరో మోటోకార్ప్ | 18,869 | దిల్లీ ఎలక్ట్రిక్ | 14,234 | సిట్రన్ | 902 |

**మౌలిక వసతులు 'చార్జింగ్'..**

ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ మౌలిక వసతుల మార్కెట్ దేశంలో ఊహించనంతగా వృద్ధి చెందుతోంది. బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికిల్స్ పబ్లిక్ చార్జింగ్ కేంద్రాల సంఖ్య భారత్‌లో 2022 ఫిబ్రవరిలో 1,800 ఉంది. 2024 మార్చి నాటికి ఈ సంఖ్య ఏకంగా 16,347కు చేరిందని ప్రొఫెషనల్ సర్వీసుల్లో ఉన్న ఫోర్విస్ మజర్స్ నివేదిక వెల్లడించింది. పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన పెరగడం, అధికం అవుతున్న ఇంధన ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల కారణంగా ఈవీల డిమాండ్ దేశంలో దూసుకెళుతోంది. 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహనాలు భారత్‌లోని మొత్తం ప్రయాణికుల వాహనాల మార్కెట్లో దాదాపు మూడింట ఒక వంతు ఉంటాయని అంచనా. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బలమైన మౌలిక సదుపాయాల విస్తరణ కీలకం. 2030 నాటికి భారత రోడ్లపై 5 కోట్ల ఈవీలు పరుగెడతాయని పరిశ్రమ అంచనా వేస్తోంది. 40 వాహనాలకు ఒక కేంద్రం చొప్పున లెక్కిస్తే ఏటా భారత్‌లో 4,00,000 చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఫోర్విస్ మజర్స్ తెలిపింది.



## కరారో ఇండియా రూ.1,812 కోట్ల ఐపీవో



**న్యూఢిల్లీ:** ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ తయారీలో ఉన్న కరారో ఇండియా ఐపీవో ద్వారా రూ.1,812 కోట్లు సమీకరించనుంది. ఈ మేరకు సెబీ వద్ద పత్రాలను దాఖలు చేసింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఇష్యూ ఉండనుంది. మొత్తం ఇష్యూ ఆఫర్ ఫర్ సేల్ అయినందున ఐపీవో ద్వారా వచ్చే మొత్తం కంపెనీకి కాకుండా నేరుగా విక్రయించే వాటాదారు కరారో ఇంటర్నేషనల్ ఎస్ఈకి వెళ్తుంది. కరారో ఇండియా 1997లో ప్రారంభం అయింది. పుణే వద్ద రెండు ప్లాంట్లు ఉన్నాయి. 2023–24లో రూ.1,770 కోట్ల టర్నోవర్‌పై రూ.60 కోట్ల నికరలాభం ఆర్జించింది. బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్ బీఎన్‌పీ పరిబస్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్నాయి.


## ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ దావా



**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ అనుబంధ సంస్థ ట్రిజెట్టో యూఎస్ ఫెడరల్ కోర్టులో ఇన్ఫోసిస్‌పై దావా వేసింది. ఆరోగ్య సంరక్షణ బీమా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన వాణిజ్య రహస్యాలు, సమాచారాన్ని ఇన్ఫోసిస్ దొంగిలించిందని ట్రిజెట్టో ఆరోపించింది. టెక్సాస్ ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంలో ట్రిజెట్టో సాఫ్ట్‌వేర్ అయిన ఫాసట్స్, క్యూఎన్ఎక్స్‌టీ నుండి డేటాను చట్టవిరుద్ధంగా యాక్సెస్ చేయడంతోపాటు పోటీ ఉత్పత్తిని అభివృద్ధి, మార్కెట్ చేయడానికి ఉపయోగిస్తున్నారని విన్నవించింది. హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ సంస్థలు టాస్కలను ఆటోమేట్ చేయడానికి ఫాసట్స్, క్యూఎన్ఎక్స్‌టీ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నాయి. అయితే కాగ్నిజెంట్ ఆరోపణలను ఇన్ఫోసిస్ ఖండించింది. కోర్టులో తేల్చుకుంటామని స్పష్టం చేసింది. కాగా, హెడ్ ఆఫ్ గ్లోబల్ సర్వీసెస్, ఇన్ఫోసిస్ అమెరికాస్ ఈవీపీ రాజేశ్ వారియర్‌ను కాగ్నిజెంట్ ఈ వారమే గ్లోబల్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్, ఇండియా సీఎండీగా నియమించుకోవడం గమనార్హం. అంతేగాక ఇన్ఫోసిస్‌లో వివిధ ముఖ్య హోదాల్లో 20 ఏళ్ల పని చేసిన రవి కుమార్ ఎస్ ప్రస్తుతం కాగ్నిజెంట్ సీఈవోగా ఉన్నారు.

# మారుతీ సుజుకీ నెక్సా విస్తరణ

- మార్చికల్లా మరో 150 స్టోర్స్
- ప్రస్తుతం 500 కేంద్రాలు




కార్యక్రమంలో మారుతీ సుజుకీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పార్థో బెనర్జీ, నొబుటాకో సుజుకీ

**న్యూఢిల్లీ:** వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ నెక్సా ఔట్‌లెట్లను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. బెంగళూరులో 500వ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 150 స్టోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇందులో 100 కేంద్రాలు చిన్న నగరాల్లో రానున్నాయని వెల్లడించింది. నెక్సా సేల్స్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు చాలా దూకుడుగా ప్లాన్ చేశామని మారుతీ సుజుకీ ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ ఈ సందర్భంగా తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు పెద్ద ఎత్తున వెళ్లాలన్నది తమ ప్రణాళిక అని వెల్లడించారు. నెక్సాలో లభించే మోడళ్లకు ఈ నగరాల నుంచి మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నొబుటాకో సుజుకీ కూడా పాల్గొన్నారు.

**నెక్సా వాటా 37 శాతం..**

మారుతీ సుజుకీ 2015 జూలైలో నెక్సా ఔట్‌లెట్లకు శ్రీకారం చుట్టింది. ఏడాదిలోనే 94 నగరాల్లో 100 నెక్సా షోరూంలను నెలకొల్పింది. ప్రస్తుతం ఇగ్నిస్, బలీనో, ఫ్రాంక్స్, సియాజ్, జిమ్నీ, ఎక్స్ఎల్6, గ్రాండ్ విటారా, ఇన్విక్టో మోడళ్లను నెక్సా షోరూంలలో కంపెనీ విక్రయిస్తోంది. సంస్థ మొత్తం విక్రయాల్లో నెక్సా వాటా 37 శాతం ఉంది. 2023–24లో 54 శాతం వృద్ధితో నెక్సా షోరూంల ద్వారా 5.61 లక్షల కార్లు రోడ్డెక్కాయి. నెక్సా స్టూడియో పేరుతో చిన్న కేంద్రాలను కంపెనీ ఏర్పాటు చేస్తోంది. సంస్థ ఖాతాలో అరీనా, నెక్సా, కమర్షియల్ ఔట్‌లెట్ల సంఖ్య ప్రస్తుతం 3,925కు చేరుకుంది. ఇవి దేశవ్యాప్తంగా 2,577 నగరాలు, పట్టణాల్లో విస్తరించాయి.

## వినూత్నమైన ఉత్పత్తులు తీసుకొస్తాం

- రిటైల్ హెల్త్ విభాగంలో వాటా పెంచుకుంటాం
- ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ప్రకటన



**కోల్‌కతా:** రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో తమ వాటాను పెంచుకుంటామని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. ఇందుకు గాను వినూత్నమైన ఉత్పత్తులను తీసుకురావడంపై దృష్టి సారిస్తామని తెలిపింది. పరిశ్రమలోనే తొలిసారిగా కొత్త సదుపాయాలు జోడించడంతోపాటు ఏఐని వినియోగిస్తున్నట్టు పేర్కొంది. ఇవి తమ రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ విక్రయాలు పెరిగేందుకు దారితీస్తాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ అమిష్ సావే తెలిపారు. రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో 2.9 శాతం వాటా ఉంటే, గ్రూప్ ఇన్సూరెన్స్‌లో 11.4 శాతం మేర ఈ సంస్థ కలిగి ఉంది. ప్రస్తుతం హెల్త్ ఇన్సూరెన్స్‌లో రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ వాటా 39 శాతంగా ఉంటే, 2030–31 నాటికి 46 శాతానికి పెరగనున్నట్టు చెప్పారు. హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన పెరగడం మార్కెట్ వృద్ధికి మద్దతు నిస్తుందన్నారు. సంస్థ తీసుకొచ్చిన 'ఇన్ఫినైట్ క్లెయిమ్ అమౌంట్' ఫీచర్ పరిశ్రమలోనే మొదటిసారి అని సావే తెలిపారు. పాలసీదారులు జీవిత కాలంలో ఒక్కసారి ఆస్పత్రిలో చికిత్సలకు అపరిమిత క్లెయిమ్‌కు అర్హులని వివరించారు. ఇందుకు బేస్ సమ్ అష్యూర్డ్‌తో సంబంధం ఉండదని చెప్పారు. బేస్ ప్రీమియంపై ఇన్ఫినైట్ క్లెయిమ్ టాపప్ కోసం అదనంగా 10–12 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ముందు నుంచి ఉన్న ఆస్తమా, మధుమేహం, రక్తపోటు, హైపర్‌లిపిడెమియా, స్థూలకాయానికి వెంటనే కవరేజీ కోసం జంప్‌స్టార్ట్ యాడాన్ తీసుకోవచ్చన్నారు.

## ఎగుమతుల ప్రోత్సాహానికి హబ్స్

**డీజీఎఫ్‌టీ ట్రేడ్ నోటీస్ జారీ**




**న్యూఢిల్లీ:** ఈ–కామర్స్ ద్వారా ఎగుమతులకు దన్నుగా నిలవడానికి ఈ–కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ (ఈసీఈహెచ్) ఏర్పాటులో ముందడుగు పడింది. పరిశ్రమ నుండి ప్రతిపాదనలను కోరుతూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ట్రేడ్ నోటీస్ జారీ చేసింది. ప్రతిపాదనల ఆధారంగా అడ్డంకులు లేని, వేగవంతంగా ఎగుమతి అనుమతులను సులభతరం చేయడానికి ఈసీఈహెచ్ కోసం సాఫ్ట్‌వేర్ అవసరాలతో సహా అన్ని విధివిధానాలను పటిష్టం చేస్తారు. హబ్‌ల నిర్వహణకు సంబంధించిన ముసాయిదా విధివిధానాలను రూపొందించినట్లు డీజీఎఫ్‌టీ తెలిపింది. ప్రతిపాదించిన ముసాయిదా పద్ధతుల ఆధారంగా ప్రభుత్వం ఈసీఈహెచ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని భావిస్తోంది.

**ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం:** ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో ఈ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. తొలుత దేశంలో 10–15 హబ్‌లను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం, ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా భారత ఎగుమతులు ఏటా కేవలం 5 బిలియన్ డాలర్లు మాత్రమే. చైనా ఏకంగా 300 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేస్తోంది. రాబోయే సంవత్సరాల్లో భారత ఈ–కామర్స్ ఎగుమతులు 50–100 బిలియన్ డాలర్ల స్థాయికి చేరేంతగా అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

## దేశీ స్టీల్ పరిశ్రమకు చైనా ముప్పు!

అడ్డగోలుగా ఉక్కు దిగుమతులు • మాజీ స్టీల్ సెక్రటరీ నాగేంద్ర నాథ్ సిన్హా



**న్యూఢిల్లీ:** చైనాలో డిమాండ్ పడిపోవడంతో ఆ దేశం నుంచి ఉక్కు దిగుమతులు దేశాన్ని ముంచెత్తుతున్నాయంటూ కేంద్ర ఉక్కు శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా తెలిపారు. ''ఫ్లాట్ స్టీల్ ఉత్పత్తుల పరంగా చూస్తే దిగుమతులు పెద్ద సమస్యగా ఉంది. చైనాలో వినియోగం పడిపోవడం మన మార్కెట్‌ను కుదిపేస్తోంది''అని సిన్హా పేర్కొన్నారు. 'ఇండియన్ ఐరన్ ఓర్, పెల్లెట్' సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పెరిగిపోతున్న దిగుమతులతో స్థానిక ఉక్కు ఉత్పత్తుల ధరలపై, స్టీల్ తయారీ సంస్థల లాభాలపై ప్రభావం పడుతుందన్నారు. ''చైనా నుంచి అనుచితంగా దిగుమతులు వచ్చి పడుతున్నాయి. దీని పట్ల భారత ప్రభుత్వం సకాలంలో స్పందించాలి'' అని అన్నారు. చైనా తదితర దేశాల నుంచి ముంచెత్తుతున్న చౌక స్టీల్ దిగుమతులను అడ్డుకోవాలంటూ పరిశ్రమ ఇప్పటికే ఎన్నో పర్యాయాలుగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం గమనార్హం. ప్రపంచ ఉక్కు ఎగుమతుల కేంద్రంగా భారత్ మారాలన్న లక్ష్యానికి విరుద్ధంగా.. మన దేశం నికర దిగుమతుల దేశంగా మారుతుండడం పట్ల పరిశ్రమ ఆందోళనను వ్యక్తం చేసింది. దిగుమతులపై సంకాల విధింపునకు ఏడాది, ఏడాదిన్నర సమయం తీసుకుంటే, అది దేశీ పరిశ్రమకు మేలు చేయబోదని సిన్హా అభిప్రాయపడ్డారు.

**ఏటా 15 గిగావాట్ల చొప్పన అధికం**

• వచ్చే ఆరేళ్ల పాటు ఇదే పరిస్థితి • విద్యుత్ శాఖ అదనపు సెక్రటరీ శ్రీకాంత్



# విద్యుత్‌కు భారీ డిమాండ్

**న్యూఢిల్లీ:** విద్యుత్‌కు దేశంలో డిమాండ్ ఏటా భారీగా పెరుగుతోంది. గడిచిన దశాబ్ద కాలంలో ఏటా 11 గిగావాట్ల చొప్పున డిమాండ్ పెరగ్గా.. వచ్చే ఆరేళ్ల పాటు ఏటా 15 గిగావాట్ల మేర అధికం అవుతుందని కేంద్ర విద్యుత్ శాఖ అదనపు సెక్రటరీ శ్రీకాంత్ నాగులపల్లి తెలిపారు. సుమారు 40 గిగావాట్లు స్టోరేజ్ రూపంలో ఉంటుందన్నారు. ''2030 నాటికి రోజులో సూర్యరశ్మి ఎక్కువగా ఉండే సమయంలో (సోలార్ హవర్స్) అదనంగా 85 గిగావాట్ల విద్యుత్ డిమాండ్ తోడవుతుంది. అదే నాన్ సోలార్ హవర్స్‌లో 90 గిగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదవుతుంది''అని శ్రీకాంత్ వెల్లడించారు. 2030 నాటికి స్టోరేజ్ సామర్థ్యంపై ఆధారపడే పరిస్థితి వస్తుందన్నారు. సోలార్ హవర్స్‌లో నిల్వ చేసిన విద్యుత్‌ను, నాన్ సోలార్ హవర్స్‌లో వినియోగించుకోవచ్చన్నారు. ఐఈఈఎంఏ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. బొగ్గు ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడంతోపాటు, సోలార్, పవన (విండ్), స్టోరేజ్, ప్రసారం సామర్థ్యాల విస్తరణ కూడా చేపడుతున్నట్టు చెప్పారు.

**300 గిగావాట్ల లక్ష్యం..**

2030 నాటికి శిలాజ ఇంధనేతర మార్గాల ద్వారా (పునరుత్పాదక/పర్యావరణ అనుకూల) 500 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని కేంద్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. ఇప్పటికే పునరుత్పాదక ఇంధన వనరుల రూపంలో 200 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సాధించినట్టు శ్రీకాంత్ వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో మరో 300 గిగావాట్ల సామర్థ్యం ఆచరణలోకి వస్తుందన్నారు. ఇందులో 225 గిగావాట్లు కేవలం సోలార్, పవన విద్యుత్ రూపంలో ఉంటుందని తెలిపారు. సోలార్ సామర్థ్యం దండిగా ఉన్న రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ ప్రాంతాలతో కూడిన ఆర్ఈ జోన్‌లలో సామర్థ్యం ఎక్కువగా వస్తుందన్నారు. గుజరాత్, తమిళనాడు తీరాల్లో ఆఫ్‌షోర్ (సముద్ర జలాలు) విండ్ ఫార్మ్‌లు, ఒడిశా, గుజరాత్, తమిళనాడు తీరాల్లో గ్రీన్ హైడ్రోజన్ సామర్థ్యాల ఏర్పాటు ప్రణాళికలను సైతం వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), డేటా కేంద్రాల రూపంలోనూ విద్యుత్‌కు డిమాండ్ గణనీయంగా పెరగబోతోందన్నారు. దేశం మొత్తాన్ని ఒకే ఫ్రీక్వెన్సీతో నడిచే ఒకే గ్రిడ్‌తో అనుసంధానించడం వల్ల 170 గిగావాట్ల విద్యుత్‌ను, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరఫరా చేయొచ్చన్నారు. పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నట్టు శ్రీకాంత్ వెల్లడించారు. ''40 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్(బీఈఈఎస్)ను, 19 గిగావాట్ల పీఎస్‌పీ సామర్థ్యాన్ని ఆరేళ్లలో సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు చెప్పారు.

# తొడగొట్టి చెబుతున్నా...

ఓపెనర్‌గా శిఖర్ ధావన్ భారత జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఈ క్రమంలో పలు రికార్డులు అతని ఖాతాలో చేరాయి. ధావన్ కెరీర్‌లో కొన్ని ఆసక్తికర గణాంకాలను చూస్తే...

'నా క్రికెట్ ప్రయాణాన్ని ముగిస్తున్నాను. లెక్కలేనన్ని మధుర జ్ఞాపకాలు, అభిమానం మూటగట్టుకున్నాను. జీవితంలో ముందుకు వెళ్లాలంటే పేజీలకు తిప్పక తప్పదు. అందుకే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ నుంచి నేను రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాను. ఎన్నో ఏళ్లు భారత్ తరఫున ఆడగలిగినందుకు నా హృదయంలో ప్రశాంతత ఉంది. వెనక్కి తిరిగి చూస్తే అన్నీ గుర్తుంచుకునే క్షణాలే. ఆటను దాటి బయటకు చూస్తే అంతా కొత్త ప్రపంచమే. నా జీవితంలో భారత్‌కు ఆడాలనే ఒకే ఒక లక్ష్యం ఉండేది. అది సాధించగలిగాను. భారత్‌కు ఇకపై ఆడబోవడం లేదని బాధపడవద్దు. ఇన్నేళ్లు ఆడగలిగానని సంతోషించు అనేది నా మాట. దాని పట్ల గర్వంగా ఉన్నా. మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు. జై హింద్' -శిఖర్ ధావన్

**187** తన తొలి టెస్టులో ధావన్ చేసిన పరుగులు. అరంగేట్ర టెస్టులో భారత్ తరఫున ఇదే అత్యధిక స్కోరు కాగా...85 బంతుల్లో సాధించిన శతకం భారత ఆటగాళ్లందరిలో వేగవంతమైంది.

**65.15** ఐసీసీ టోర్నీల్లో (వన్డే వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ కలిపి) ధావన్ సగటు అందరికంటే అత్యధికం. 20 ఇన్నింగ్స్‌లలో అతను 6 సెంచరీలు, 10 అర్ధ సెంచరీలతో 1238 పరుగులు చేశాడు.

**18** రోహిత్‌తో కలిసి నెలకొల్పిన సెంచరీ భాగస్వామ్యాల సంఖ్య. సచిన్-గంగూలీ (21) తర్వాత ఇది రెండో స్థానం.


**109** తన 100వ వన్డేలో సెంచరీ సాధించిన ధావన్, ఈ ఫీట్ నమోదు చేసిన పది మంది ఆటగాళ్ళలో ఒకడు.

**12** విదేశాల్లో ధావన్ సెంచరీల సంఖ్య. భారత్‌లో 5 శతకాలు మాత్రమే అతను సాధించాడు.

**6769** ఐపీఎల్‌లో ధావన్ పరుగులు. ఓవరాల్‌గా కోహ్లి (8004) తర్వాత రెండో స్థానం.

**5** ఐపీఎల్‌లో ఐదు సీజన్లలో ధావన్ 500కంటే ఎక్కువ పరుగులు సాధించాడు.

వన్డేల్లో కనీసం 40కు పైగా సగటు, 90కి పైగా స్ట్రయిక్ రేట్‌తో 5 వేలకు పైగా పరుగులను సాధించిన ఎనిమిది మంది బ్యాటర్లలో ధావన్ ఒకడు



## 'నన్ను చాలా భయపెట్టింది'


**టీవీ చాట్ షో వివాదంపై రాహుల్**

**న్యూఢిల్లీ:** ఐదేళ్ల క్రితం 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో హార్దిక్ పాండ్యాతో కలిసి వివాదంలో భాగమైన భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ నాటి ఘటన ఇప్పటికీ తనను వెంటాడుతుందని అన్నాడు. ఆ ఇంటర్వ్యూ తర్వాత జరిగిన పరిణామాలు తనను చాలా భయపెట్టాయని, ఆ తర్వాత ఒక వ్యక్తిగా కూడా తనను తాను ఎంతో మార్చుకోవాల్సి వచ్చిందని అతను చెప్పాడు. నాటి కార్యక్రమంలో మహిళలపై తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ ఆ తర్వాత హార్దిక్, రాహుల్‌లపై బీసీసీఐ కొంత కాలం నిషేధం విధించింది. 'మామూలుగా నేను చాలా సిగ్గరిని. చిన్నప్పటినుంచి తక్కువగా మాట్లాడే తత్వం. భారత్‌కు ఆడిన తర్వాత నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది' అని రాహుల్ తన గురించి చెప్పుకున్నాడు. అయితే కరణ్ జోహార్‌తో ఇంటర్వ్యూ తనను బాగా ఇబ్బంది పెట్టిందని అతను గుర్తు చేసుకున్నాడు. 'ఆ ఇంటర్వ్యూ అసలు మరో ప్రపంచంలో సాగింది. అది నన్ను చాలా చాలా మార్చేసింది. జట్టునుంచి సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆ తర్వాత అందరితో కలిసి మాట్లాడలేకపోయాను. నేను స్కూల్‌లో కూడా ఎప్పుడూ సస్పెండ్ కాలేదు' అని రాహుల్ వ్యాఖ్యానించాడు.

# నికోలస్ పూరన్ ప్రతాపం

**వెస్టిండీస్ ఘన విజయం • దక్షిణాఫ్రికాతో తొలి టి20**

**తరూబా:** మిడిలార్డర్ బ్యాటర్ నికోలస్ పూరన్ (26 బంతుల్లో 65 నాటౌట్; 2 ఫోర్లు, 7 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో.. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ పోరులో వెస్టిండీస్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (42 బంతుల్లో 76; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్యాట్రిక్ క్రుగర్ (32 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (14), హెన్రిక్స్ (4), ర్యాన్ రికెల్టన్ (4), డసెన్ (5), డొనోవాన్ పెరీరా (8), విఫలమయ్యారు. వెస్టిండీస్ బౌలర్లలో మాథ్యూ ఫోర్డ్ 3, షామార్ జోసెఫ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. పూరన్‌తో పాటు ఓపెనర్లు షై హోప్ (36 బంతుల్లో 51; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), అలిక్ అతనాజ్ (30 బంతుల్లో 40; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచి కొట్టారు. సఫారీ బౌలర్లలో బార్ట్‌మన్ రెండు వికెట్లు తీశాడు. ఇరు జట్ల మధ్య సోమవారం రెండో టి20 జరగనుంది.



# శ్రీలంకపై ఇంగ్లండ్ ఘనవిజయం

**మాంచెస్టర్:** సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు.. శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో ఘన విజయం సాధించింది. నాలుగు రోజుల్లో ముగిసిన పోరులో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో లంకను చిత్తుచేసింది. ఓవర్‌నైట్ స్కోరు 204/6తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక.. 326 పరుగులకు ఆలౌటైంది. కమిందు మెండిస్ (183 బంతుల్లో 113; 15 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీతో రాణించి ప్రత్యర్థి ముందు మంచి లక్ష్యాన్ని నిర్దేశించేందుకు ప్రయత్నించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, మాథ్యూ పాట్స్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం 205 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 57.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ జో రూట్ (128 బంతుల్లో 62 నాటౌట్; 2 ఫోర్లు), జేమీ స్మిత్ (48 బంతుల్లో 39; 4 ఫోర్లు, ఒక సిక్సర్), డాన్ లారెన్స్ (54 బంతుల్లో 34; 2 ఫోర్లు, ఒక సిక్సర్), హ్యారీ బ్రూక్ (68 బంతుల్లో 32; 3 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చారు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, ప్రభాత్ జయసూర్య చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య లార్డ్స్ వేదికగా గురువారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.


రూట్

# నోరిస్‌కు 'పోల్'

**వెర్‌స్టాపెన్‌కు షాక్ • ఫార్ములావన్ డచ్ గ్రాండ్‌ప్రి**

**జాండ్‌వర్ట్ (నెదర్లాండ్స్):** ఫార్ములావన్ (ఎఫ్1) ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు సొంతగడ్డపై ఎదురుదెబ్బ తగిలింది. గత మూడేళ్లుగా డచ్ గ్రాండ్‌ప్రిలో సంపూర్ణ ఆధిపత్యం కనబరిచి విజేతగా నిలిచిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్)కు ఈ ఏడాది క్వాలిఫయింగ్ రౌండ్‌లో చుక్కెదురైంది. శనివారం నిర్వహించిన అర్హత పోటీలో వెర్‌స్టాపెన్‌ను వెనక్కి నెడుతూ.. లాండో నోరిస్ (మెక్‌లారెన్) 'పోల్ పొజిషన్'సాధించాడు. 2021 సీజన్‌తో ఫార్ములావన్ క్యాలెండర్‌లో తిరిగి వచ్చిన డచ్ గ్రాండ్‌ప్రిలో గత మూడు పర్యాయాలు వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించి రేసులో విజేతగా నిలిచాడు. కాగా, శనివారం క్వాలిఫయింగ్ రేసులో నోరిస్ దుమ్మురేపాడు. వెర్‌స్టాపెన్ కంటే రెప్పపాటు ముందు లక్ష్యాన్ని చేరి 'పోల్ పొజిషన్'కొట్టేశాడు. పియాస్త్రి (మెక్‌లారెన్), రసెల్ (మెర్సిడెస్), పెరెజ్ (రెడ్‌బుల్) వరుసగా మూడో, నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచాడు. బ్రిటన్ స్టార్ డ్రైవర్, ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ 12వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన 14 రేసుల్లో ఏడింట నెగ్గిన వెర్‌స్టాపెన్... డ్రైవర్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 277 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. ఇటీవలి కాలంలో వెర్‌స్టాపెన్‌కు గట్టి పోటీనిస్తున్న బ్రిటన్ డ్రైవర్ నోరిస్ 199 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో వెర్‌స్టాపెన్ జోరుకు చెక్ పెట్టిన నోరిస్.. ఆదివారం ప్రధాన రేసులోనూ దీన్ని కొనసాగిస్తాడా చూడాలి. 26 ఏళ్ల వెర్‌స్టాపెన్‌కు ఇది కెరీర్‌లో 200వ రేసు కావడం విశేషం.






## ప్రాక్టీస్‌లో కారు బుగ్గి

డచ్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ ఈవెంట్‌కు ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో అమెరికా రేసర్ లోగాన్ సార్జియాంట్ కారు ప్రమాదానికి గురైంది. సాధన సమయంలో కారు ట్రాక్‌పై నుంచి కాస్త పక్కకు వెళ్లగానే ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన సార్జియాంట్ తక్షణమే కారు నుంచి బయటకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించే లోపే కారు మొత్తం కాలి బూడిదైంది. దీంతో పాటు క్వాలిఫయింగ్ ఈవెంట్ ఆరంభానికి ముందు మరో డ్రైవర్ కారులో కూడా మంటలు చెలరేగాయి.

# ఫైనల్లో నవ్య, లక్ష్

**ఇండియన్ జూనియర్ ఇంటర్‌నేషనల్ సిరీస్**



**సాక్షి, హైదరాబాద్:** భారత జూనియర్ ఇంటర్‌నేషనల్ సిరీస్‌లో యువ షట్లర్లు నవ్య కందేరి, లక్ష్ చెంగప్ప ఫైనల్‌కు దూసుకెళ్లారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో అండర్-19 మహిళల సింగిల్స్‌లో నవ్య 18-21, 21-19, 21-13తో టానో చంద్రాపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో లిటా రామధాని వీర్యవాన్ (ఇండోనేసియా) 21-12, 21-16తో రుజూలపై గెలిచింది. పురుషుల అండర్-19 సెమీఫైనల్లో లక్ష్ చెంగప్ప మాచంగడ అయ్యప్ప 11-21, 21-14, 21-19తో చియాంగ్ జు చేహ (చైనీస్ తైపీ)పై, రౌనక్ చౌహాన్ 21-11, 20-22, 21-13తో డేనిస్ అజర్యా (ఇండోనేసియా)పై నెగ్గారు. పురుషుల డబుల్స్‌లో హ్యాంగ్ మింగ్ చెన్-చెంగ్ హన్ (చైనీస్ తైపీ) జోడీ 21-14, 21-18తో రెవాండ్ హారింటో-అక్మల్ నూర్ రహమాన్ (ఇండోనేసియా) జంటపై... హాంగ్ యా-యాన్ బిన్ హాంగ్ (చైనీస్ తైపీ) ద్వయం 22-20, 21-18తో మొహమ్మద్ విటో అనాఫ్సా-గ్రెండ్లీ అల్‌కాతిబ్ (ఇండోనేసియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో శ్రావణి వాలేకర్-తారిణి సూరి ద్వయం 16-21, 21-16, 21-19తో కొచాపోన్ చైచనా-పన్నపీ పాలియమ్ (థాయ్‌లాండ్) జంటపై.. కైలా అనీసా-మిచా లియోనా లుత్ఫియా జోడీ (ఇండోనేసియా) 21-12, 21-17తో స్కై డీప్ కౌర్-ఇషితా నేగి ద్వయంపై గెలిచి ఫైనల్లో అడుగుపెట్టారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో పన్నపీ పాలియమ్-అట్టావుత్‌శ్రీపే (థాయ్‌లాండ్) జంట 20-22, 21-14, 22-20తో ప్రగతి-లాల్‌రామ్‌సంగా జోడీపై.. తారిణి సూరి-భవ్య ఛాబ్రా జంట 21-16, 23-21తో రిషిక-మిథిలేశ్ (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించాడు.

# సినెర్ బృందంలో ఇద్దరిపై వేటు

**న్యూయార్క్:** ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్ తన డోపింగ్ ఫలితం బయటపడటంతో తన బృందంలోని ఇద్దరిపై వేటు వేశాడు. ఫిట్‌నెస్ ట్రెయినర్ ఉంబెర్టో పెరారా, ఫిజియోథెరపిస్ట్ గియాకొమొ నల్దిలను వ్యక్తిగత సహాయ బృందం నుంచి తప్పించాడు. వీళ్లిద్దరు గత రెండేళ్లుగా సినెర్‌కు సేవలందిస్తున్నారు. ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ నెగ్గడంతో పాటు ఈ జూన్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకుకు సినెర్ చేరుకున్నాడు. అయితే 23 ఏళ్ల ఇటలీ స్టార్ ప్లేయర్ నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు మార్చిలోనే పాజిటివ్ రిపోర్టు వచ్చింది. ఉద్దేశపూర్వకంగా తాను వీటిని తీసుకోలేదని, గాయానికి పూసిన ఆయింట్‌మెంట్ రూపంలో శరీరం లోపలికి ఇవి ప్రవేశించి ఉండవచ్చని, ఇకపై జాగ్రత్తగా వ్యవహరిస్తాననే వివరణతో సంతృప్తి చెందిన అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) తదుపరి చర్యలకు ఉపక్రమించలేదు. పాజిటివ్ సహా విచారణ, వివరణదాకా ఈ మొత్తం వ్యవహారం మొన్నటిదాకా ఎక్కడా బయటికి పొక్కలేదు. నెలల తరబడి అంతా గోప్యంగానే ఉంది. కానీ అనూహ్యంగా అతని డోపింగ్ అంశం బహిరంగం కావడంతో సినెర్ ఇందుకు బాధ్యులైన తన సిబ్బందిని తొలగించాడు. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు ముందు ట్రెయినర్, ఫిజియోలను తప్పించడం కఠినమైన నిర్ణయమే అయినప్పటికీ తప్పలేదని సినెర్ చెప్పుకొచ్చాడు.



# ముష్ఫికర్ భారీ సెంచరీ



- బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 565 ఆలౌట్
- పాకిస్తాన్‌తో మొదటి టెస్టు

**రావల్పిండి:** సీనియర్ ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ (341 బంతుల్లో 191; 22 ఫోర్లు, ఒక సిక్సర్) మారథాన్ ఇన్నింగ్స్ ఆడడంతో పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ భారీ స్కోరు చేసింది. పాక్ పేసర్లను ఎదుర్కొంటూ బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 565 పరుగులు చేసింది. విదేశాల్లో ఆ జట్టుకిది మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 316/5తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్.. పాక్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. లిటన్ దాస్ (78 బంతుల్లో 56; 8 ఫోర్లు, ఒక సిక్సర్)తో కలిసి ఆరో వికెట్‌కు 114 పరుగులు జోడించిన ముష్ఫికర్.. ఏడో వికెట్‌కు మెహదీ హసన్ మిరాజ్ (179 బంతుల్లో 77; 6 ఫోర్లు)తో కలిసి రికార్డు స్థాయిలో 196 పరుగులు జోడించాడు. పాకిస్తాన్‌పై ఏడో వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. 1976లో న్యూజిలాండ్ ప్లేయర్లు రిచర్డ్ హాడ్లీ, వారెన్ లీస్ నమోదు చేసిన 186 పరుగుల రికార్డును ముష్ఫికర్, మెహదీ హసన్ బద్దలు కొట్టారు. ఎనిమిదిన్నర గంటలకు పైగా క్రీజులో గడిపిన ముష్ఫికర్ తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 23 పరుగులు చేసింది. చేతిలో తొమ్మిది వికెట్లు ఉన్న పాకిస్తాన్ ఓవరాల్‌గా 94 పరుగులు వెనుకబడి ఉంది. నేడు ఆటకు ఆఖరి రోజు కావడంతో టెస్టు 'డ్రా' కావడం లాంఛనమే.

# దబంగ్ ఢిల్లీపై యు ముంబా టీటీ గెలుపు

**అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ లీగ్**


సత్యన్

**చెన్నై:** అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఐదో సీజన్‌లో యు ముంబా టీటీ జట్టు శుభారంభం చేసింది. శనివారం జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో యు ముంబా జట్టు 9-6తో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. తొలి పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి ఆటగాడు సత్యన్ జ్ఞానశేఖరన్ విజయం సాధించినా...అతని జట్టు ఢిల్లీ మాత్రం ఓటమిపాలైంది. ఖాద్రి అరున 1-2 (11-4, 9-11, 9-11)తో సత్యన్ చేతిలో ఓడిపోగా... మహిళల సింగిల్స్‌లో సుతీర్థ ముఖర్జీ 3-0 (11-6, 11-7, 11-4)తో దియా చిటాలేపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మానవ్ టక్కర్-మరియా జియావో జోడీ 2-1 (11-8, 11-9, 8-11)తో సత్యన్-ఒరవన్ పరనంగ్ జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో మానవ్ 2-1 (11-5, 11-4, 7-11)తో అండ్రియస్ లెవెంకోపై నెగ్గగా, మహిళల సింగిల్స్‌లో మరియా జియావో 1-2 (11-10, 9-11, 5-11)తో ఒరవన్ పరనంగ్ చేతిలో ఓడింది.

# ఓటమి దిశగా భారత్ 'ఎ' మహిళలు

**ఆసీస్ 'ఎ' తో అనధికారిక టెస్టు**

**గోల్డ్‌కోస్ట్:** ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత మహిళల జట్టు పరాజయం దిశగా పయనిస్తోంది. మూడో రోజు 164/7 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 'ఎ' 92 ఓవర్లలో 260 పరుగులు చేసి ఆలౌటైంది. క్రితం రోజు అర్ధ సెంచరీ చేసిన మ్యాడీ డార్క్ (197 బంతుల్లో 105 నాటౌట్; 4 ఫోర్లు) టెయిలెండర్ల సహకారంతో దాన్ని సెంచరీగా మలచుకోవడం భారత్‌ను కష్టాల్లోకి నెట్టింది. ఆట మొదలైన కాసేపటికే మిన్ను మణి మరో ఓవర్‌నైట్ బ్యాటర్ లిల్లీ మిల్స్ (7)ని అవుట్ చేసి భారత శిబిరంలో ఆనందాన్ని నింపింది. కానీ తర్వాత వచ్చిన పదో వరుస బ్యాటర్ గ్రేస్ పార్సన్స్ (57 బంతుల్లో 35; 2 ఫోర్లు), మ్యాడీ కలిసి తొమ్మిదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. మిన్నుమణి 6 వికెట్లు తీయగా, సయాలీ, ప్రియా మిశ్రా చెరో 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 28 పరుగులు కలుపుకొని భారత్ ముందు 289 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఆట నిలిచే సమయానికి 68 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు ప్రియా పూనియా (36), శుభ (45) మాత్రమే కొద్దిగా పోరాడారు. చేతిలో 4 వికెట్లున్న భారత్ విజయానికి మరో 140 పరుగుల దూరంలో ఉంది.




# అలనాటి అద్భుతం!


5,600 ఏళ్ల నాటి సమాధుల దిబ్బ

స్పెయిన్‌లో కొత్త రాతియుగపు ఆనవాలు

ఒక్కోటీ రెండు విమానాల బరువున్న భారీ రాళ్లతో నిర్మాణం


5,600 ఏళ్ల నాటి మెంగా డోల్మెన్‌లోకి దారితీసే ఇరుకైన ద్వారం

కొత్త రాతియుగానికి చెందిన సమాధుల దిబ్బ ఒకటి స్పెయిన్‌లో వెలుగు చూసింది. 5,600 ఏళ్ల నాటి ఈ కట్టడంలో అత్యంత భారీ పరిమాణంలో ఉన్న 32 ఏక శిలలను ఉపయోగించడం విశేషం! అవి ఒక్కోటీ కనీసం రెండు జంబో జెట్ విమానాలంత తూగుతాయట. కొత్త రాతియుగం నాటి అద్భుతంగా చెప్పుకునే బ్రిటన్‌లోని స్టోన్ హెంజ్‌లో వాడిన రాళ్లకంటే ఇవి పరిమాణంలో చాలా పెద్దవి. వీటిలో అతి పెద్ద రాయి అయితే ఏకంగా 150 టన్నుల బరువుంది. ఇది అతి పెద్ద జీవి అయిన నీలి తిమింగలం బరువుతో సమానం. స్టోన్‌హెంజ్‌లోని అతి పెద్ద శిల కంటే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ! ఇక 32 రాళ్లూ కలిపి 1,140 టన్నులుంటాయట. ఇవి సగటున 25 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పుతో ఉన్నాయి. ఇది దక్షిణ స్పెయిన్‌లోని మెంగా ప్రాంతంలో ఒక చిన్న గుట్టపై ఉన్న ఈ కట్టడాన్ని మెంగా డోల్మెన్‌గా పిలుస్తున్నారు. అంటే సమాధుల దిబ్బ అని అర్థం. అయితే ఇది సమాధి కాకపోవచ్చని, బహుశా ప్రార్థనా స్థలం కావచ్చని కూడా ఒక అభిప్రాయ


డోల్మెన్ నిర్మాణంలో వాడిన ఈ భారీ శిలలను ఏకంగా 850 మీటర్ల దూరంలోని క్వారీ నుంచి మోసుకొచ్చినట్టు తేలింది

ముంది. నిర్దిష్టమైన వరుసలో రాళ్లను నిటారుగా నిలిపి, వాటిపై రాళ్లను పరచడం ద్వారా దీన్ని నిర్మించారు. ఇంత భారీ శిలలను గుట్టపైకి తీసుకెళ్లేంతటి ఇంజనీరింగ్ పరిజ్ఞానం ఆనాటి మనుషులకు ఎలా తెలుసన్నది అంతుచిక్కడం లేదన్నారు స్పెయిన్‌లోని సెవిల్లే యూనివర్సిటీ పూర్వచరిత్ర విభాగ ప్రొఫెసర్ లియొనార్డో గ్రాకా సంజుస్. దీనిపై వెలువరించిన పరిశోధన పత్రానికి ఆయన సహ రచయిత. ఈ పేపర్‌ను జర్నల్ సైన్స్‌లో తాజాగా ప్రచురించారు. ''ఇది ప్రపంచంలోని పురాతన రాతి కట్టడాల్లోకెల్లా అతి గొప్ప అద్భుతం. కొత్త రాతియుగపు మానవుల శాస్త్ర సాంకేతిక ప్రజ్ఞకు అత్యుత్తమ తార్కాణం'' అని పరిశోధన బృందం అంటోంది. ''మనిషి అప్పుడప్పుడే వ్యవసాయం నేర్చుకుంటున్నాడు. అన్ని అవసరాలకూ రాతినే వాడుతున్నాడు. లోహపు పనిముట్ల కాలం ఇంకా రాలేదు. మనిషి కనీసం భాష కూడా నేర్వని కాలమది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటే ఈ డోల్మెన్ నిర్మాణం ఎంత గొప్ప ఘనతో అర్థమవుతుంది'' అని చెప్పుకొచ్చింది. వారికి అప్పటికే రాళ్ల లక్షణాలు, కోణాలతో పాటు భౌతిక శాస్త్రం గురించిన అవగాహన కూడా ఉండి ఉంటుందని సైంటిస్టులు అంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

## కచ్చితమైన కొలతలు..

ఈ నిర్మాణంలో చుట్టూ నిటారుగా పేర్చిన రాళ్లు లోపలివైపుకు నిర్దిష్ట కోణంలో వాలి ఉన్నాయి. దాంతో లోపలి ఖాళీ భాగం కింద విశాలంగా, పైకప్పుకు వెళ్లేకొద్దీ చిన్నగా ఉంది. వాటిపై ఐదు భారీ రాళ్లను పైకప్పుగా పరిచారు. ఎండ, వాన, చలి వంటివాటిని తట్టుకునేందుకు వీలుగా రాళ్ల మధ్య దట్టమైన మట్టి పూత పూశారు. ''కొలతలన్నీ కచ్చితత్వంతో కూడుకుని ఉన్నాయి. ఇలా కట్టాలంటే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అనేక పరికరాలు కూడా తప్పనిసరి'' అని పరిశోధన బృందం చెప్పుకొచ్చింది. నిర్మాణంలో వాడిన రాళ్లను అక్కడికి 850 మీటర్ల దూరంలోని క్వారీ నుంచి తొలిచి తరలించినట్టు తేల్చారు.

# జమ్మూకశ్మీర్‌లో ఒంటరిగానే పోటీ

- నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను సమర్థిస్తారా?
- కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** త్వరలో జరుగనున్న జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ ఎన్నికల వ్యవహారాల ఇంఛార్జ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయించిన సీట్లలో పోటీ ఉంటుందని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్లో అభివృద్ధి జరు గుతోందని... అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ రాష్ట్రాన్ని వెనక్కు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టోలో ఉన్న అంశాలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటి? అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామని.. అన్న నేషనల్ కాన్ఫరెన్స్‌ని సమర్థిస్తారా? అని ప్రశ్నించారు.



కశ్మీర్‌కు ప్రత్యేకంగా ఓ జెండా ఉండాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ హామీని కాంగ్రెస్ సమర్థిస్తుందా? అధికారంలోకి వస్తే.. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35–ఎ తీసుకొచ్చి తద్వారా.. కశ్మీర్‌లో అశాంతి, ఉగ్రవాదం పెంచాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆలోచనకు కాంగ్రెస్ మద్దతిస్తుందా? ప్రజలకు చెప్పాలి. అంబేడ్కర్ రాజ్యాంగం వద్దంటూ.. జిన్నా రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి కాంగ్రెస్ మద్దతిస్తుందా? ఉగ్రవాదులను విడుదల చేస్తామంటున్న ఎన్సీకి మద్దతుగా ఉంటారా? పాకిస్తాన్‌తో మళ్లీ చర్చలు జరపడం, తద్వారా లోయలో మళ్లీ వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆలోచనకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పాక్‌తో 'సరిహద్దు వాణిజ్యం' పేరుతో.. కశ్మీర్లో ఉగ్రవాదాన్ని పెంచాలన్న నేషనల్ కాన్ఫరెన్స్ కుట్రను కాంగ్రెస్ సమర్థిస్తుందా? అని అన్నారు. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలన్న డిమాండ్‌తో రాష్ట్రంలో విభజన రాజకీయాలకు బాటలు వేస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్ కుట్రలు, కుతంత్రాలకు కాంగ్రెస్ అండగా నిలబడుతుందా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.


## రాజస్తాన్‌లో ఆర్ఎస్ఎస్‌పై నిషేధం ఎత్తివేత

**జైపూర్:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదన్న ఆంక్షలను రాజస్తాన్ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి రాజేంద్ర సింగ్ సర్క్యులర్ జారీ చేశారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదంటూ 1972, 1981 సంవత్సరాల్లో జారీ చేసిన ఉత్తర్వులపై సమీక్షించిన ప్రభుత్వం..ఆంక్షల జాబితా నుంచి ఆర్ఎస్ఎస్‌ను తొలగించాలని నిర్ణయించినట్లు అందులో పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో తమ ఉద్యోగులు పాల్గొనవచ్చంటూ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం తెల్సిందే. హరియాణా, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోని బీజేపీ ప్రభుత్వాలు కూడా ఇప్పటికే ఆంక్షలను ఎత్తివేశాయి. ప్రధాని ఇందిర హయాంలో 1966లో ఆర్ఎస్ఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు పాలుపంచుకోరాదంటూ కేంద్రం నిషేధం విధించింది.

# ట్రంప్‌కు కెన్నెడీ జూనియర్ మద్దతు

**అధ్యక్ష పదవి రేసు నుంచి కూడా తప్పుకుంటున్నట్లు వెల్లడి**

**ఫీనిక్స్:** అమెరికా అధ్యక్ష పదవి రేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే ఎఫ్.కెన్నెడీ కుటుంబీకుడొకరు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థిగా అధ్యక్ష పదవి పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు కూడా ఆయన శుక్రవారం వెల్లడించారు. అధ్యక్షుడు బైడెన్ ఎన్నికల రేసు నుంచి తప్పుకుని, భారత సంతతికి చెందిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను బలపరిచాక డెమొక్రటిక్ పార్టీ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతుండగా, ట్రంప్ ప్రచారంలో వెనుకబడ్డారు. పలు కీలక రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయం కూడా హారిస్‌కు అనుకూలంగా మారింది. ఈ పరిస్థితుల్లో ట్రంప్‌నకు రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్ మద్దతు ప్రకటించడం రిపబ్లికన్ పార్టీలో కొత్త ఉత్సాహం నింపినట్లయింది. ఇటీవలి వరకు ట్రంప్ విధానాలను ఆయన బహిరంగంగానే తప్పుబట్టారు. అనుచరగణాన్ని ఆయన పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ట్రంప్ కూడా..అధ్యక్ష రేసులో అత్యంత తీవ్ర వామపక్ష భావాలు కలిగిన వ్యక్తిగా రాబర్ట్ ఎఫ్.కెన్నడీని విమర్శించారు. తాజాగా తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ.. 'ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధం భవిష్యత్తు తరాలపై జరుగుతున్న యుద్ధం..దీనిని వెంటనే ఆపాలి. అందుకే ట్రంప్‌కు మద్దతిస్తున్నా'అని ప్రకటించారు.



రాబర్ట్ నిర్ణయాన్ని కెన్నడీ కుటుంబంలోని ఐదుగురు ప్రముఖులు తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్‌కు మద్దతివ్వడం 'విషాద గాథకు విషాదాంతం'వంటిదని రాబర్ట్ సోదరి కెర్రీ కెన్నెడీ వ్యాఖ్యానించారు. 'హారిస్, వాల్జ్‌లపై మాకు విశ్వాసం ఉంది. ట్రంప్‌ను సమర్థించాలనే మా సోదరుడు రాబర్ట్ నిర్ణయం మా నాన్నకు, మా కుటుంబం అత్యంత ప్రియమైనవిగా భావించే విలువలకు ద్రోహం చేసినట్లే'అని పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు దివంగత జాన్ ఎఫ్.కెన్నడీ సోదరుడు, దివంగత అటార్నీ జనరల్, సెనేటర్ రాబర్ట్ కెన్నడీ కుమారుడే రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్.

## రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ఖైదీల మార్పిడి

**కీవ్:** రష్యా, ఉక్రెయిన్‌లు శనివారం వందమందికి పైగా యుద్ధ ఖైదీలను మార్చుకున్నాయి. రష్యా చెర నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన మొత్తం 115 జవాన్లలో 50 మంది వరకు మరియుపోల్‌లోని అజోవ్‌స్టల్ స్టీల్ ఫ్యాక్టరీ ముట్టడిలో చిక్కినవారేనని ఉక్రెయిన్ తెలిపింది. అదేవిధంగా, ఇటీవల కర్స్క్ ప్రాంతంలో నిర్బంధించిన తమ 115 మంది భద్రతా సిబ్బందిని, ఉక్రెయిన్ విడుదల చేసిందని రష్యా తెలిపింది. ప్రస్తుతం బెలారస్‌లో ఉన్న వీరిని త్వరలోనే స్వదేశానికి తీసుకొస్తామని పేర్కొంది. యూఏఈ మధ్యవర్తిత్వంతో యుద్ధ ఖైదీల మార్పిడికి అంగీకారం కుదిరిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలయ్యాక జరిగిన 55వ విడత బందీల మార్పిడి ఇది. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌లోని సుమీ ప్రాంతం, ఖెర్సన్ నగరం, డొనెట్స్క్ రీజియన్ కొస్టియాంటినివ్‌కాలపై రష్యా జరిపిన దాడుల్లో 9 మంది చనిపోగా మరో 10 మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ ప్రయోగించిన ఏడు డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. తమ స్నేక్ ఐలాండ్‌పైకి రష్యా ప్రయోగించిన ఏడు డ్రోన్లను అడ్డుకున్నట్లు ఉక్రెయిన్ తెలిపింది.

## జర్మనీలో కత్తిపోట్లు..ముగ్గురు మృతి

- 15 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**సొలింజెన్:** జర్మనీలోని దక్షిణప్రాంత సొలింజెన్ నగరంలో చోటుచేసుకున్న కత్తిపోట్ల ఘటన తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తి జరిపిన దాడిలో ముగ్గురు చనిపోగా మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నగరం ఏర్పడి 650 సంవత్సరాలవుతున్న సందర్భంగా 'ఫెస్టివల్ ఆఫ్ డైవర్సిటీ'ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలయ్యాయి. నగరంలోని ఫ్రాన్‌హోఫ్ సెంట్రల్ స్క్వేర్ వద్ద గుమికూడిన ప్రజలపై దుండగుడు ఆకస్మికంగా దాడికి పాల్పడి, అనంతరం పరారయ్యాడు. అతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానితులతోపాటు, ప్రత్యక్ష సాక్ష్యులను ప్రశ్నిస్తున్నామన్నారు. దుండగుడికి సాయపడినట్లుగా అనుమానిస్తున్న 15 ఏళ్ల బాలుడు కూడా వీరిలో ఉన్నారన్నారు. దాడి వెనుక ఉగ్రకోణాన్ని కూడా కొట్టిపారేయలేమని వెల్లడించారు. అపరిచితుడు ఈ దాడికి ఒడిగట్టినట్లు సాక్షులు చెబుతున్నారనీ, వదంతులను నమ్మొద్దని ప్రజలను కోరారు. ఘటన నేపథ్యంలో ఉత్సవాలను అధికారులు రద్దు చేశారు.

## ఆర్టికల్ 370 ఇక.. ఎప్పటికీ తిరిగిరాదు

- అమిత్ షా స్పష్టీకరణ

**రాయ్‌పూర్:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 పునరుద్ధరణ ఎప్పటికీ సాధ్యం కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీలు ఆర్టికల్ 370 పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని ఎన్నికల మేనిఫెస్టోల్లో హామీ ఇచ్చిన నేపథ్యంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్టికల్ 370ని కేంద్రం 2019 ఆగస్టు 5వ తేదీన రద్దు చేసింది. 'ఆర్టికల్ 370కి జమ్మూకశ్మీర్‌లో ఇప్పుడిక చోటు లేదు. ఎప్పటికీ ఉండదు. పునరుద్ధరణ ఎప్పటికీ సాధ్యం కాదు' అని అమిత్ షా ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**సరైన సమయంలో జనగణన**

దశాబ్దానికి ఒకసారి జరిగే జనాభా లెక్కలను సరైన సమయంలో నిర్వహిస్తామని, జనగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంటే ప్రకటిస్తామని అమిత్ షా అన్నారు. 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు జరగాల్సిన జనగణన కోవిడ్–19 కారణంగా వాయిదా పడింది. కోవిడ్ ముప్పు తొలగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల ఊసెత్తడం లేదు. మరో వైపు విపక్షాలు కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. జనగణనకు రూ.12,000 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో కేంద్ర కేవలం రూ.1,309 కోట్లు కేటాయించింది.

# సోనియా గాంధీకి 'నూరీ' ఇష్టం

**ఇన్‌స్టాగ్రామ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పోస్టు**



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీకి ఎవరంటే ఎక్కువ ఇష్టం? కుమారుడు రాహుల్ గాంధీనా? లేక కుమార్తె ప్రియాంక గాంధీనా? వీరిద్దరూ కాదు. బుజ్జి కుక్కపిల్ల 'నూరీ' అంటే సోనియాకు చాలా అభిమానం. ఈ విషయం రాహుల్ గాంధీ స్వయంగా వెల్లడించారు కాబట్టి మనం నమ్మక తప్పదు. జాక్ రస్సెల్ బ్రిటీష్ జాతికి చెందిన నూరీని బ్యాక్‌ప్యాక్‌లో వీపుపై సోనియా కట్టుకున్న సరదా ఫోటోను రాహుల్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశారు. మామ్స్ ఫేవరేట్ అనే వ్యాఖ్య జోడించారు. తన తల్లికి కన్నబిడ్డల కంటే నూరీనే ఎక్కువ ఇష్టమని పేర్కొన్నారు. ఇంట్లో నూరీని చాలా ముద్దు చేస్తుంటారని తెలిపారు. రాహుల్ పోస్టుకు నెటిజన్ల నుంచి విశేషమైన స్పందన లభించింది. 24 గంటల వ్యవధిలో 7.81 లక్షల లైక్‌లు, 5,400 కామెంట్లు వచ్చాయి. నిజానికి కుక్కపిల్ల నూరీని రాహుల్ గతేడాది స్వయంగా సోనియాకు బహూకరించారు. అప్పటి నుంచి అది ఆమెకు ప్రీతిపాత్రమైపోయింది. సోనియా కుటుంబంలో ఇప్పుడు అందరికీ అదొక ముఖ్యమైన, ప్రియమైన సభ్యురాలు. ఉత్తర గోవాలోని మపూసా పట్టణంలో 2023 ఆగస్టులో నూరీని రాహుల్ గాంధీ తొలిసారిగా చూశారు. దానిపై ముచ్చటపడ్డారు. కొనుగోలు చేసి, తల్లికి బహూకరించి ఆశ్చర్యపరిచారు. సోనియా కుటుంబ సభ్యులకు జంతువులంటే చాలా ఆపేక్ష. వారి ఇంట్లో చాలాఏళ్లుగా పలు శునకాలు ఉన్నాయి. 'పిడి' అనే శునకం రాహుల్ గాంధీ సోషల్ మీడియా పోస్టుల్లో తరచుగా కనిపిస్తూ ఉంటుంది. దానికి చాలామంది అభిమానులున్నారు.

## ఢిల్లీలో ఎల్ఈడీ హోర్డింగ్‌పై అశ్లీల వీడియో

**న్యూఢిల్లీ:** కన్నాట్‌ప్లేస్‌లోని ఒక ఎల్ఈడీ హోర్డింగ్‌పై అశ్లీల వీడియో ప్రదర్శితం కావడంతో జనం ఒక్కసారిగా అవాక్కయ్యారు. గురువారం రాత్రి అటుగా వెళుతున్న ఒకతను అడ్వ ర్టైజింగ్ బోర్డుపై అశ్లీల వీడియోను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొద్ది సెకన్ల నిడివిగల ఈ అశ్లీల వీడియోను న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అధికారుల సహాయంతో పోలీసులు తొలగించారు.

## మహిళపై అత్యాచారం.. ఇద్దరి అరెస్ట్

**ఉడుపి:** ఇన్‌స్టాలో పరిచయమైన మహిళను ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి, మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశాడు. కర్ణాటకలోని ఉడుపి జిల్లా కర్కలా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 23న ఘటన చోటుచేసుకుంది. కర్కలాకు చెందిన మహిళ(24)కు ఇన్‌స్టాలో పట్టణానికే చెందిన అల్తాఫ్ మూడు నెలల క్రితం పరిచయమయ్యాడు. ఈ నెల 23న రాత్రి ఆమె పనిచేస్తున్న ఆఫీసు నుంచి కారులో నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడే ఆమెకు మత్తు మందు కలిపిన మద్యం బలవంతంగా తాగించాడు. ఆపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం, తన స్నేహితుడు రిచర్డ్ కర్డోజా అక్కడికి చేరుకున్నాడు. తర్వాత వీరిద్దరు బాధిత మహిళను ఆమె ఇంటి వద్ద వదిలేశారు.

## పంజాబ్‌లో ఎన్నారైపై దుండగుల కాల్పులు

**అమృత్‌సర్:** పంజాబ్‌లో ప్రవాస భారతీయుడిపై హత్యాయత్నం జరిగింది. అమృత్‌సర్ శివారులోని దబుర్జీ గ్రామానికి చెందిన సుఖ్‌చైన్ సింగ్ ఇటీవలే అమెరికా నుంచి వచ్చారు. శనివారం ఉదయం ఆయన మార్నింగ్ వాక్‌కు బయలుదేరిన సమయంలో బైక్‌పై ఇద్దరు సాయుధులు అక్కడికి చేరుకున్నారు. వారు ఆయన్ను ఇంటి లోపలికి తీసుకెళ్లి కారు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇవ్వాలంటూ తీవ్రంగా కొట్టారు. అక్కడే ఉన్న భార్య, కుమారులు ఆయనకు హాని తలపెట్టొద్దంటూ చేతులెత్తి వేడుకుంటున్నా దుండగులు తెచ్చుకున్న తుపాకీతో మూడుసార్లు కాల్పులు జరిపి, అక్కడి నుంచి పరారయ్యారు. తల, ఛాతీపై తీవ్ర గాయాలైన సుఖ్‌చైన్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సుఖ్‌చైన్‌పై కాల్పుల వెనుక అతడి మొదటి భార్య హస్తముందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దుండగులను గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## రేపిస్టుల వృషణాలను తొలగించాలి: అజిత్

**యావత్‌మల్ (మహారాష్ట్ర):** బద్లాపూర్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వారి వృషణాలను తొలగించాలని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అన్నారు. లడ్కీ బహిన్ పథకంపై శనివారం నాడిక్కడ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలపై నేరాలకు పాల్పడే వారు ఎంతటివారైనా తమ మహాయుతి ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు. అత్యాచారాలు, మహిళలపై ఇతర నేరాల్లో మరింత కఠిన శిక్షలకు వీలు కల్పించే బిల్లును రాష్ట్రపతి అనుమతి కోసం పంపామని తెలిపారు. 'మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్లపై చేయి వేస్తే.. అలాంటి పశుప్రవృత్తి కలిగిన వారిని కఠినంగా శిక్షించాలనేది నా అభిప్రాయం. మరోసారి ఇలాంటి నేరాలకు వారు సాహసించకూడదు. నా భాషలో చెప్పాలంటే వారి మర్మాంగాలను తొలగించాలి. కొందరు ఎంత నీచులంటే.. వారికిది జరిగి తీరాల్సిందే' అని అజిత్ పవార్ అన్నారు.

# తప్పిపోయిన ఆరేళ్ల బాలుడు ఐదు రోజుల తర్వాత అడవిలో..

**హోచిమిన్ సిటీ:** తోబుట్టువులతో కలిసి వాగు వద్ద ఆడుకుంటూ దారి తప్పిన ఓ ఆరేళ్ల బాలుడు ఐదు రోజులపాటు అడవిలోనే తిరుగాడాడు. చెట్ల ఆకులు, పండ్లు తింటూ, దొరికిన చోట నీళ్లు తాగి పొట్టనింపుకున్నాడు. చివరికి నీరసించి పోయి, ముందుకు వెళ్లే ఓపిక లేక ఓ పొదలో కూర్చుని ఏడుపు లంకించుకున్నాడు. ఇది విన్న సమీప గ్రామస్తులు అతడి ఆచూకీ కనుగొని, కన్నవారి చెంతకు చేర్చారు. ఏ క్రూర జంతువు, విష సర్పం బారినపడకుండా ఆ చిన్నారి సజీవంగా తిరిగి రావడం ఒక అద్భుతమేనని పోలీసులు అంటున్నారు. వియత్నాంలోని యెన్ బై ప్రావిన్స్ ఈ విడ్డూరానికి వేదికైంది. డాంగ్ టియెన్ లామ్ తన తొమ్మిదిమంది తోబుట్టువులతో ఈ నెల 17వ తేదీన తమ ఇంటి సమీపంలోని వాగులోకి ఆడుకునేందుకు వెళ్లాడు. అనుకోకుండా దారి తప్పి అడవిలోకి వెళ్లాడు. అలా నడుస్తూ, నడుస్తూ ఆకలైతే దొరికింది తింటూ నీళ్లు తాగుతూ తాముండే చోటు నుంచి దాదాపుగా ఆరు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవిలోకి వెళ్లాడు. బుధవారం నాటికి అతడి ఒంటిపై ఉన్న ఎర్ర టీ షర్టు, నిక్కరు బురదకొట్టుకుపోయాయి. ఇక ముందుకు సాగే దారి దొరక్క, ఒంట్లో శక్తిలేక నీరసించి పోయి ఓ పొద మాటున కూర్చుని, ఏడ్వడం ప్రారంభించాడు. అతడి రోదన సమీపంలోని రైతులు విని వెదుక్కుంటూ వచ్చారు. అతడిని అక్కడి నుంచి తమ ఇంటికి తీసుకుపోయి ఆకలి తీర్చి, వివరాలు కనుక్కున్నారు. ఆన్‌లైన్‌లో ఈ వార్త వైరల్‌గా మారింది.

## ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది హతం

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. సాపోర్‌లోని వాటర్‌గావ్ సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రి వద్ద రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని పోలీస్ పికెటింగ్ ఏర్పాటైంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ ఉగ్రవాది పికెట్ పైకి పిస్టల్‌తో కాల్పులకు దిగాడు. వెంటనే సీఆర్పీఎఫ్ బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఘటనలో ఉగ్రవాది హతమయ్యాడు. ఘటనాస్థలి నుంచి తుపాకీతోపాటు రెండు హ్యాండ్ గ్రనేడ్‌లను స్వాధీనం చేసుకున్నారని అధికారులు తెలిపారు.

# యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు..

**36 మంది పాలస్తీనియన్లు మృతి**

**కైరో:** గాజాలోని దక్షిణ ప్రాంత ఖాన్‌యూనిస్ చుట్టుపక్కల ప్రాంతాలపై ఇజ్రాయెల్ ఆర్మీ సాగించిన దాడుల్లో కనీసం మూడు డజన్లమంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. శనివారం వేకువజామున ఓ నివాస భవనంపై జరిపిన దాడిలో ఇద్దరు చిన్నారులు సహా ఒకే కుటుంబంలోని 11 మంది వీరిలో ఉన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డుపై వెళ్తున్న రెండు ఆటోలపై జరిగిన దాడుల్లో మరో 22 మంది మృత్యువాత పడ్డారు. మొత్తం 33 మృతదేహాలతోపాటు పదుల సంఖ్యలో క్షతగాత్రులను స్థానికులు తమ ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు నాసర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇవికాకుండా, మరో మూడు మృతదేహాలను తమ ఆస్పత్రికి చేర్చారని అల్ –అక్సా మార్టీర్స్ ఆస్పత్రి కూడా తెలిపింది. ఈ ఘటనలపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు. మరో ఘటనలో ఖాన్‌యూనిస్‌లోని నివాస సముదాయంలో 10 మృతదేహాలను స్థానికులు గుర్తించారు. మరో వైపు, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం దిశగా ఈజిప్టు రాజధాని కైరోలో చర్చలు వేగం పుంజుకున్నాయి. ఆదివారం ఈజిప్టు, ఖతర్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరిగే తుది చర్చల్లో ఒక అంగీకారం కుదిరే అవకాశాలున్నా యని చెబుతున్నారు. ఈ చర్చల్లో హమాస్ పాల్గొనడం లేదు. హమాస్ ప్రతినిధి వర్గం ఖతర్, ఈజిప్టు ప్రతినిధులను కలిసి తమ డిమాండ్లను వివరించింది. ఇజ్రాయెల్ ఆర్మీ సంపూర్ణంగా గాజా ప్రాంతం నుంచి వైదొలగాలని హమాస్.. గాజా సరిహద్దుల వెంట ఉన్న రెండు కారిడార్లు ఫిలడెల్ఫి, నెట్‌జరిమ్ తమ నియంత్రణలోనే ఉండాలని ఇజ్రాయెల్ గట్టిగా పట్టుబడుతున్నాయి. చర్చల పురోగతికి ఈ రెండు అంశాలే ప్రధాన ప్రతిబంధకాలుగా మారాయని పరిశీలకులు చెబుతున్నారు.

## కేజ్రీవాల్‌ను జైల్లోనే ఉంచేందుకు కుట్ర: ఆప్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను జైలులోనే ఉంచేందుకు బీజేపీ, సీబీఐ కుట్ర పన్నుతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఎక్సైజ్ కుంభకోణం కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేస్తే.. కౌంటరు వేయడానికి సీబీఐ సుప్రీంకోర్టును గడువు కోరిందని, మరోవైపు అదే రోజు తమ కౌంటర్‌ను మీడియాకు అందించిదని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా, మంత్రి ఆతిశి ఆరోపించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తమ ఏకపక్ష వాదన పతాకశీర్షికల్లో రావాలనేదే వారి పన్నాగం అని సిసోడియా ధ్వజమెత్తారు. కేజ్రీవాల్‌ను జైలులో ఉంచడానికి బీజేపీ ఆదేశాలకు అనుగుణంగా సీబీఐ కీలుబొమ్మలా ఆడుతోందని విమర్శించారు. రాజకీయబాసులకు అనుగుణంగా సీబీఐ ఆడినా, రాజ్యాంగం, న్యాయం.. నిజం వైపు నిలబడతాయన్నారు.

### ఎక్కువ సమయం లేదు



వినాయక చవితి దగ్గర పడుతుండటంతో విగ్రహాల తయారీదారులు బిజీగా ఉన్నారు. విశాఖపట్నంలోని తాటిచెట్లపాలెం, దండుబజార్, శంకరమఠం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున విగ్రహాలు తయారుచేస్తున్నారు. ముందస్తుగా అడ్వాన్స్‌లు తీసుకోవడంతో సకాలంలో విగ్రహాలు పూర్తిచేసి అందజేసేందుకు శ్రమిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

### ప్రమాదకరం ఈ నిద్ర..



అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన వేంకటేశ్వరుని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు వస్తారు. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే అలిపిరి ఘాట్ రోడ్డులో రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 వరకు వాహనాల రాకపోకలు నిలిపేస్తారు. దీంతో అర్ధరాత్రి వచ్చిన భక్తులు ఇలా వాహనాలు రోడ్డుపై పెట్టి వాటిపక్కనే నిద్రిస్తున్నారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ఈ రోడ్డులో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

### బాబోయ్ కుక్కలు..



రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్తుంటే ఎటునుంచి కుక్కల గుంపు వచ్చి దాడిచేస్తుందో తెలియని పరిస్థితి. రాత్రి పూట అయితే పరిస్థితి మరి చెప్పనవసరంలేదు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు.. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్లాట్‌ఫాంపై ఇలా సంచరిస్తున్న కుక్కల్ని చూసి ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఆర్టీసీ అధికారులు కాంప్లెక్స్‌లో ఉన్నప్పటికీ చూసీ చూడనట్లు వెళ్లిపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

## క్లుప్తంగా...

### విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నిలిపివేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలనే ప్రయత్నం సరికాదని గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వ్యతిరేకించిందని తెలిపారు. దీనిపై హైకోర్టులో టీడీపీ పిటిషన్ కూడా వేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాత ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని తెలిపారు. గతంలో వ్యతిరేకించిన మీటర్లనే కొనసాగించడం కూటమి ప్రభుత్వ వాగ్దాన భంగమే అవుతుందన్నారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందని శ్రీనివాసరావు విమర్శించారు.

### చంద్రబాబు వ్యాఖ్యలు అనైతికం

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**రావులపాలెం/ఆలమూరు:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత సీఎం చంద్రబాబుకు లేదని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్‌పై లేనిపోని విమర్శలు చేస్తూ తన స్థాయిని మరింత తగ్గించుకుంటున్నారన్నారు. రావులపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడారు. కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన గ్రామసభలో సీఎం చంద్రబాబు ఇష్టానుసారం మాట్లాడి పరువు పోగొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చంద్రబాబు నాయుడు భారీ అవినీతికి పాల్పడ్డారని జగ్గిరెడ్డి ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటీఎంలా వాడుకుందని ప్రధాని మోదీ సైతం విమర్శించారని గుర్తుచేశారు.

### తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో సీఐడీ సోదాలు

**తిరుపతి తుడా:** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సీఐడీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. నగరపాలక సంస్థ నగరంలో రోడ్ల విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను అందించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ బాండ్ల విషయంలో రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు మరోమారు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి విచ్చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సోదాలను నిర్వహించి కొన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు.

---

'ఇక ఉచిత ఇసుక సరఫరాపై కలెక్టర్లు రోజూ నివేదిక ఇవ్వాలి. అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టడి చేసే బాధ్యత కలెక్టర్లదే'... ఇవీ బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు. బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, పర్చూరు నియోజకవర్గాలలో మాత్రం ఇసుక, మట్టి అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కూటమి నేతలు, ప్రధానంగా పచ్చ పార్టీ వారి కనుసన్నల్లోనే ఈ తతంగం సాగుతోంది. స్థానికంగానే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు సైతం పంపుతున్నారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల నుంచి ఇసుక, మట్టి తరలించి అమ్ముకుంటున్నారు. పర్చూరు నియోజకవర్గం నుంచి గ్రావెల్, ఇసుక, గ్రానైట్ కూడా నిత్యం తరలిపోతోంది. రోజుకు పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ.కోట్ల మేరకు రాబడికి గండి పడుతోంది.

# ఉచిత మాటలు... అవినీతి మేటలు!



పంట భూముల్లో తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

- ఇసుక విధానంలో ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి
- సమీక్షల్లో చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో చేసేది మరొకటి
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే అక్రమ రవాణా
- సామాన్యుడిపై భారం పెంచి అడ్డగోలుగా దోపిడీపర్వం



కొల్లూరు మండలం పెసర్లంక నక్కపాయ గండి ప్రాంతంలో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** బాపట్ల జిల్లాలో పచ్చనేతల కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కడవకుదురు నుంచి ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు తెలంగాణకు కూడా తరలిస్తున్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని కృష్ణా నదితోపాటు తీర భూముల నుంచి స్థానికంగానే కాక గుంటూరు, తెనాలి ప్రాంతాలకు పంపుతున్నారు. పెసర్లంక ప్రాంతంలోని పొలాల్లో పెద్ద యంత్రాలు పెట్టి ఏకంగా 20 నుంచి 30 అడుగుల మేర ఇసుక తవ్వి తరలిస్తున్నారు.

**పొంచి ఉన్న పెను ముప్పు**

అక్రమ ఇసుక తవ్వకాలతో కృష్ణా తీరం (కరకట్ట) దెబ్బతింటోంది. ఇది ఏ క్షణమైనా కోతకు గురై పంట పొలాలకు ముప్పు తెచ్చే ప్రమాదమూ లేకపోలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2009లో భట్టిప్రోలు మండలం వోలేరు-పల్లెపాలెం వద్ద కరకట్ట తెగి రేపల్లె పట్టణంలోకి నాలుగు అడుగుల మేర నీరు చేరింది. నాలుగు రోజులపాటు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పెద్ద ఎత్తున నష్టం కూడా వాటిల్లింది.

**వందల వాహనాల్లో తరలింపు**

గాజుల్లంక ప్రాంతంలో కృష్ణానది నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి.. తర్వాత టిప్పర్లతో గుంటూరు, తెనాలికి పంపుతున్నారు. చిలుమూరు, జువ్వలపాలెం, ఈపూరు, కొల్లూరు పొలిమేర డొంకలోని పెదలంక క్వారీ నుంచి అక్రమ రవాణా సాగుతోంది. ఎక్కువగా రాత్రిళ్లు ఈ తతంగం సాగుతోంది. స్థానికంగా రేపల్లె, నగరం, కొల్లూరు, వేమూరు, నిజాంపట్నం ప్రాంతాలకు రోజుకు వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

**సామాన్యుడిపైనే భారం**

పచ్చనేతల దోపిడీ పర్వంతో సామాన్యుడిపైనే పెను భారం పడుతోంది. ఇసుక కొనాలంటే భయపడే పరిస్థితి తెచ్చారు. ట్రాక్టర్ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు, చిన్న టిప్పర్ (మూడు ట్రాక్టర్ల ఇసుక పట్టేది) అయితే గుంటూరు, తెనాలి ప్రాంతాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ. 4 వేలలోపు ఉండేది. కూటమి నేతల దోపిడీ పుణ్యమాని ఇప్పుడు రూ. 10 వేలకు కొనాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నది ఇసుక కావడంతో డిమాండ్ ఉంటోంది. పచ్చనేతల వ్యవహారం చాలాచోట్ల అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ అధికారులకు కూడా ఆదాయ వనరుగా మారింది. ఒకవేళ అరకొరగా పట్టుకున్నా నేతల ఒత్తిళ్లతో రాత్రికి రాత్రే వదిలేస్తున్నారు.

### నిఘాపై గొప్పలు.. పట్టుకుంటే తిప్పలు

**చీరాల:** అధికారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిగా మారింది. బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేపడుతున్నారు. తీరా కష్టపడి పట్టుకున్నాక వదిలేయాలని అధికార పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు వస్తుండటంతో తల పట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ జిల్లా సమీక్షలో చీరాల ప్రాంతంలో ఇసుక యార్డుగానీ, తవ్వకాలు, రవాణా వంటివి ఏమీ లేవని అధికారులు తేల్చేశారు. ఒక్క అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణా, అమ్మకాలు ఉన్నాయి. దీంతో నూతనంగా వచ్చిన తహసీల్దార్ కె.గోపీకృష్ణ, తన రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అప్పటికే విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యాజమానులు వాటిని నిలిపివేశారు. రోజూ మాదిరిగానే టైరు బండ్లతో పాతచీరాల గ్రామంలో ఒక అక్రమ క్వారీ నుంచి ఇసుక తరలింపు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిఘా పెట్టి ఒక ట్రాక్టరు, 17 టైరు బండ్లను పట్టుకున్నారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సాధారణంగా ఎద్దుల నుంచి ఇళ్లకు పంపి టైరు బండ్లకు జరిమానాలు విధిస్తుంటారు. కానీ ప్రస్తుతం అధికార పార్టీ నేతల నుంచి ఫోన్లు రానే వచ్చాయి. దీంతో మొదటి తప్పుగా హెచ్చరికతో మానవీయ కోణంతో వదిలేశామని తహసీల్దార్ చెప్పాల్సి వచ్చింది. ఈ బండ్ల నుంచి అమ్మకానికి తీసుకెళ్తున్న ఇసుకను మాత్రం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డంప్ చేయించారు. ఇసుకను ఇకపై తరలించబోమని తూతూమంత్రంగా దొరికిన వారితో పత్రంపై సంతకాలు చేయించుకుని ఇళ్లకు పంపించారు. ట్రాక్టర్‌ను మాత్రం పోలీసులకు అప్పగిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. పాత చీరాలలో అక్రమ క్వారీల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కానీ టైరు బండ్లు మాత్రమే పట్టుకుని అసలు యాజమానులను వదిలిపెడుతున్నారు. సమాచారం ఉన్నప్పటికీ యాజమాని ఎవరో తెలియదని అధికారులు చెప్పడంలో ఆంతర్యం వారికే తెలియాలి.




తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిపిన ఇసుక టైరు బండ్లు

---

# 2022-23లో ఏపీలో తగ్గిన పేదరికం

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమతో మేలు
- రైతుల ఆదాయం పెంపుతో మెరుగుపడిన జీవనోపాధి
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదికలో వెల్లడి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేయడం, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవనోపాధి మెరుగుపడింది. తద్వారా వారి పేదరికం జాతీయ స్థాయి కన్నా తక్కువగా నమోదైంది. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 2022-23 నాటికి పేదరికం నిష్పత్తిని ఈ నివేదిక విశ్లేషించింది. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ స్థాయిలో పేదరికం 7.10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.62 శాతం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఐదు శాతం కన్నా దిగువన ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో 4.40 శాతం ఉన్నట్లు తెలిపింది. మొత్తంగా చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గణనీయంగా పేదరికం తగ్గినట్లు ఈ నివేదిక పేర్కొంది. దీనికి ప్రధాన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను నిర్మించడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడమని స్పష్టం చేసింది. వీటి ద్వారా గ్రామీణ జీవనోపాధిని గణనీయంగా మెరుగు పరచిందని నివేదిక తెలిపింది. ప్రభుత్వాలు అమలు చేసిన కార్యక్రమాలతో పేదరికం తగ్గడంతో పాటు గ్రామీణ, పట్టణ పేదల జీవనోపాధి మెరుగుపడిందని నివేదిక స్పష్టం చేసింది. అలాగే జాతీయ స్థాయిని మించి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో పేదరికం ఉందని పేర్కొంది.




# ఉరిశిక్ష పడ్డ దోషి మానసిక స్థితి చెప్పండి..



- అతని నేర చరిత్ర, కుటుంబ నేపథ్యం, జైల్లో అతని ప్రవర్తన వివరాలు కూడా..
- నెల్లూరు కలెక్టర్, డీఎస్పీ, జైలు సూపరింటెండెంట్‌లకు హైకోర్టు ఆదేశం
- వీటి ఆధారంగా తుది విచారణ కొనసాగిస్తామని వెల్లడి
- తదుపరి విచారణ సెప్టెంబరు 6కి వాయిదా

**సాక్షి, అమరావతి:** నెల్లూరు నగరంలో జరిగిన తల్లీ, కుమార్తె జంట హత్యల కేసులో ఉరిశిక్ష పడి, ప్రస్తుతం నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న దోషి షేక్ ఇంతియాజ్ మానసిక పరిస్థితి, జైలులో అతని వ్యవహారశైలి, ప్రవర్తన, అతని కుటుంబ నేపథ్యం, సామాజిక-ఆర్థిక నేపథ్యం, నేర చరిత్ర, విద్య, ఆదాయ వనరులు తదితర వివరాలను సమర్పించాలని హైకోర్టు శుక్రవారం జిల్లా కలెక్టర్, డీఎస్పీ, నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటెండెంట్‌లను ఆదేశించింది. ఈ వివరాల ఆధారంగా ఈ కేసులో తదుపరి విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేస్తూ విచారణను సెప్టెంబరు 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

**డబ్బు కోసం హత్యలు..**

వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కరస్పాండెంట్ ఎ. దినకర్‌రెడ్డి హరనాథపురంలో కొత్త ఇల్లు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన ఇంటీరియర్ పనుల బాధ్యతలను షేక్ ఇంతియాజ్‌కు అప్పగించారు. 2013, ఫిబ్రవరి 12న పనుల విషయంపై మాట్లాడే నిమిత్తం ఇంతియాజ్ దినకర్‌రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ ఇంటిని కొల్లగొట్టేందుకు ముందస్తు పథకంతో ఇంతియాజ్ తన వెంట మరో ఇద్దరిని తీసుకొచ్చాడు. ముగ్గురూ కలిసి దినకర్‌రెడ్డి సతీమణి శకుంతల, ఎంబీబీఎస్ చదువుతున్న వారి కుమార్తె భారవిలను వారి ఇంట్లోనే హతమార్చారు. అదే సమయంలో ఇంటికొచ్చిన దినకర్‌రెడ్డిపై ఇంతియాజ్ దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. బంగారు నగలు, డబ్బుతో పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.

**ఏడేళ్ల తరువాత ఉరిశిక్ష..**

సుదీర్ఘ విచారణ జరిపిన నెల్లూరు 8వ అదనపు సెషన్స్ కోర్టు కమ్ మహిళలపై అఘాయిత్యాల ప్రత్యేక న్యాయస్థానం 2020 ఫిబ్రవరి 6న ఇంతియాజ్‌కు ఉరిశిక్ష విధించింది. మిగిలిన ఇద్దరు నిందితులు మైనర్లు కావడంతో వారికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఉరిశిక్ష ఖరారు విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థిస్తూ సెషన్స్ కోర్టు 2020లో హైకోర్టుకు లేఖ రాసింది. దీంతో ఈ లేఖను రెఫర్డ్ ట్రయల్‌గా పరిగణించిన హైకోర్టు దానికి నెంబర్ కేటాయించింది. ఇదే సమయంలో ఉరిశిక్షను సవాలు చేస్తూ ఇంతియాజ్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. వీటిపై హైకోర్టు విచారణ జరుపుతూ వచ్చింది. తాజాగా.. శుక్రవారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం తుది విచారణ మొదలుపెట్టింది. ఈ సందర్భంగా ఇంతియాజ్ తరఫు న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ, 2022లో సుప్రీంకోర్టు మనోజ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసులో ఇచ్చిన తీర్పును ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఉరిశిక్ష విధించే ముందు శిక్ష తీవ్రత తగ్గించేందుకు అవకాశమున్న పరిస్థితులను కింది కోర్టు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టంగా చెప్పిందని చెబుతూ 'సుప్రీం' తీర్పులను ధర్మాసనం ముందుంచారు. వీటిని పరిశీలించిన ధర్మాసనం.. వీరారెడ్డి వాదనతో ఏకీభవించి ఇంతియాజ్ వయస్సు, మానసిక స్థితి, జైల్లో అతని ప్రవర్తన, కుటుంబ నేపథ్యం వంటి వివరాలు తెలుసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపింది. తదుపరి విచారణను సెప్టెంబరు 6కి వాయిదా వేసింది.

## శ్రీసిటీలో ఐఆర్ఎంఆర్ఐ రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం



శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఇండియన్ రబ్బర్ మెటీరియల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఎంఆర్ఐ)కు సంబంధించిన రబ్బరు, టైర్ రిసెర్చ్ ల్యాబ్ (ఆర్‌టిఆర్ఎల్)ను శ్రీసిటీలో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషనల్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) జాయింట్ సెక్రటరీ సంజీవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఐఆర్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దక్షిణ భారతదేశంలోని పరిశ్రమల అవసరాలను తీర్చే రబ్బరు, టైర్ రిసెర్చ్ ల్యాబ్‌ను శ్రీసిటీలో నెలకొల్పడం ఒక ముఖ్యమైన మైలురాయిగా సంజీవ్ పేర్కొన్నారు. ఈ ప్రాంత ఆటోమోటివ్ రబ్బరు పరిశ్రమలకు ల్యాబ్ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. అనంతరం శ్రీసిటీ పారిశ్రామికవాడ గురించి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి మౌళిక వసతులు, ప్రగతి, ప్రత్యేకతలకు శ్రీసిటీ కేంద్రం కావడం గొప్ప పరిణామమన్నారు. వేగంగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ ఆత్మనిర్భర్ భారత్‌కు చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. అనంతరం ఆయన శ్రీసిటీలోని డైకిన్, యాంబర్, ఈప్యాక్, బ్లూస్టార్, హావెల్స్, మ్యాగ్నం, ఏయిర్‌కండిషనర్ తయారీ కేంద్రాలను సంజీవ్ సందర్శించారు.

## ప్రపంచ స్థాయికి మురుగన్ కీర్తి

### పళనిలో ప్రారంభమైన అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు



సాక్షి, చెన్నై: తమిళ్ కడవుల్ మురుగన్ కీర్తిని ప్రపంచానికి చాటే విధంగా తమిళనాడులోని దిండుగల్ జిల్లా పళనిలో శనివారం అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. చెన్నై నుంచి ఈ మహానాడును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. తమిళ్ కడవులుగా పేరు గడించిన మురుగన్ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటే విధంగా ఈ మహానాడును రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. తమిళనాడులోని మురుగన్ ఆరుపడై వీడుల విశిష్టత, ప్రాముఖ్యతను చాటే రీతిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ మహానాడును ఉద్దేశించి సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ తమిళనాడులో ద్రవిడ మోడల్ ప్రభుత్వం దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. ప్రతి ఒక్కరికి భిన్నమైన నమ్మకాలు ఉంటాయని, ఇందులో హెచ్చుతగ్గులు లేవని వ్యాఖ్యలు చేశారు. ఈ నమ్మకాలకు ద్రవిడ మోడల్ ప్రభుత్వం అడ్డంకి కాదని స్పష్టం చేశారు. అందరి విశ్వాసానికి, నమ్మకానికి గౌరవం, విలువను ఇచ్చే ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అధికారంలో ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని సూచించారు. పళనిలో జరిగిన మహానాడులో మంత్రులు పెరియస్వామి, చక్రపాణి, శేఖర్‌బాబు, తిరువణ్ణామలై ఆధీనం కుండ్రక్కుడి పొన్నంబల అడిగలార్, ధర్మపురం ఆధీనం దేశిక జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి, మదురై ఆధీనం జ్ఞానసంబంధ దేశిక పరమాచార్య స్వామి తదితరులతోపాటు శ్రీలంక, మలేషియా తదితర దేశాల నుంచి మురుగన్ భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

# నల్లమల తేనెలూరు



తేనె కోసం గిరిజనుల సాహసం

సకల జీవుల అన్నదాత తేనెటీగ. అది లేని నాడు సజీవ ప్రపంచమే లేదు. ఆఖరు తేనెటీగ చనిపోయాక ఈ భూమిపై ఇంకేమి మిగలదు అని పర్యావరణ విశ్లేషకుల మాట. అంటే సకల మానవాళికి, జంతుజాలానికి ఆహారన్నందించే ఫలసాయం నిలిచి పోతుందని అర్థం. జీవవైవిధ్యం, పర్యావరణ రక్షణకు ఈ జీవి జీవితాంతం శ్రమిస్తుందనడంతో సందేహం లేదు. ఈ క్రమంలో తేనెటీగలు ఉత్పత్తి చేసే తేనె మానవాళికి బహుళ ఉపయుక్తి దాయకంగా మారింది. నల్లమలలో చెంచు గిరిజనులు గతంలో తమ జీవనం కొనసాగించడానికి తేనె సేకరణే ప్రధాన వనరుగా ఉండేది. నల్లమలలోని తేనెటీగల విశేషాలపై ప్రత్యేక కథనం.

– ఆత్మకూరు రూరల్

## అభయారణ్యంలో ఐదు రకాల తేనెతుట్టెలు

- పర్యావరణ రక్షణలో చిరు కీటకం కీలకం
- గతంలో ఏటా 6 టన్నులపైగా సేకరణ
- నాడు చెంచులకు జీవనాధారం
- ఇతర ఉపాధి అవకాశాలతో నేడు సేకరణకు దూరం

చీమల తరహాలోనే తేనెటీగలు సామూహిక శ్రమశక్తికి చిహ్నాలు. తేనెతెట్టను తయారు చేసుకున్న తరువాత తన సంతానోత్పత్తి ప్రారంభించే తేనెటీగలు షడ్భుజాకారంలోని తేనె పట్టు గూళ్లలో తమ పిల్లలను ఉంచుతాయి. ఈ పిల్లల పోషణ కోసం పువ్వుల నుంచి మకరందాన్ని సేకరించి తేనెగా మారుస్తాయి. ఒక తేనెటీగ రోజుకు కనీసం పుష్పాల లభ్యతను బట్టి 20 సార్లు మకరందాన్ని తెట్టెకు చేరుస్తాయి. ఒక్కో ట్రిప్‌లో కనీసం 50 పుష్పాలపై తేనెటీగలు వాలి తన పొడవాటి తొండంతో మకరందాన్ని సేకరిస్తాయి. పనిలో పనిగా తన కాళ్లకింద వుండే మెత్తటి స్పాంజ్ లాంటి మెత్తలకు ఆయా పూల పుప్పొడిని అంటించుకుని మరొక పువ్వుపై వాలి పరాగ సంపర్కానికి కారణమవుతాయి. నల్లమల అటవీ ప్రాంతంలో ఐదురకాల తేనె తెట్టలు కనిపిస్తాయి. తెట్టెల, ఈగల పరిమాణాన్ని బట్టి పెద్దపార, తొడిది, జున్ను (జుంటి, చిన్నపార) ముసర, కన్నుగులగా వీటిని గిరిజనులు తమ వ్యవహారికంలో పిలుస్తుంటారు.

**అడవి దాటని తేనె..**

గిరిజనులు కష్టపడి సేకరించే తేనెను గతంలో గిరిజన కో–ఆపరేటివ్ స్టోర్లలో విక్రయించేవారు. దాదాపు రెండు దశాబ్దాలుగా స్టోర్స్‌కు చేరే తేనే తగ్గుతూ వచ్చి ప్రస్తుతం సున్నా స్థాయికి పడిపోయింది. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. నిజానికి 2000 సంవత్సరం నాటికి శ్రీశైలం ఐటిడిఏ పరిధిలో 6 వేల కేజీల తేనె సమీకరించబడేది. కొండచరియల అంచుల్లో ఎత్తైన చెట్ల కొమ్మ చివర్లలో నుంచి తేనె సేకరించడం అత్యంత ప్రమాదకర విన్యాసం. 2004 తరువాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రావడం అది గిరిజన ప్రాంతాల్లో అమలు చేయడంతో ప్రమాదకరమైన తేనె సేకరణ నుంచి గిరిజనులు ఉపాధి మార్గాన్ని మార్చుకున్నారు. దీంతో తేనే సేకరణం తగ్గుతూ వచ్చింది. అంతే కాకుండా గిరిజన కో – ఆపరేటివ్ స్టోర్స్ లో తేనే నాణ్యతపై 18 రకాల ప్రమాణాలను అవలంభించడంతో ఆదిమ చెంచు గిరిజనులు సేకరించే తేనే ఆ ప్రమాణాలను అందుకోలేక పోయింది. అంతే కాకుండా స్టోర్ల గిరిజనుల నుంచి సేకరించే తేనె కేజీకి రూ. 450 మాత్రమే ఇస్తుండడంతో అక్కడక్కడా సేకరించే తేనెను బయట రూ.800 వరకు విక్రయించుకుంటున్నారు. అంతే కాక వ్యవసాయ రంగంలో క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగి పోవడం కూడా నల్లమలలో తేనె ఉత్పత్తి తగ్గి పోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. నల్లమలలో ఇపుడు సరదాకు తేనే సేకరించే వారు తప్ప దాన్ని ఉపాధిగా భావించే వారు కనుమరుగయ్యారు.

### మరిన్ని విశేషాలు..

- ఎలుగు బంటికి తేనె అంటే ఎంతో ఇష్టం. సహజంగా వాటి ఒంటి నిండా దట్టంగా వెంట్రుకలుండడంతో తేనెటీగల దాడి నుంచి తప్పించుకోగలుతాయి. ముట్టెపై మాత్రమే ఈగల దాడికి అవకాశముంటుంది. తేనె తెట్టె కనిపిస్తే వదిలేయవు. ఎంత ఎత్తులో ఉన్నా సరే తినేందుకు ప్రయత్నిస్తాయి.
- తేనెటీగ కుడితే ఆ బాధ వర్ణనాతీతం. చెంచులకు ఇందుకు అద్భుతమైన విరుగుడు కూడా తెలుసు. తేనెపార తెట్టెలో ఉండే పిల్లల తెట్టె (పిల్లలున్న గూడు)ను పిండి ఆపాలు తాగడం ద్వారా నొప్పిని నివారించుకుంటారు.
- చెంచులు తేనె సేకరణకు పచ్చటి ఆకులున్న కొమ్మలను కట్టగట్టి అందులో నిప్పు వేసి పొగను సృష్టిస్తారు. దీన్ని సుడి అని కూడా అంటారు. ఈ సుడి కట్టను తీసుకుని చెట్టు ఎక్కి వారు తేనె పట్టును చేరుకుని పట్టుపైకి పొగను మలుపుతారు.
- తేనెను తగుపాళ్లలో వినియోగించుకోవడం ద్వారా కాన్సర్, గుండె జబ్బులను నివారించవచ్చు. అల్సర్ల వంటి గాస్ట్రో ఇంటర్ స్టయిన్స్ జబ్బులను నివారిస్తుంది. తేనె బాక్టీరియా, ఫంగల్ సంబంధిత వ్యాధులను అరికడుతుంది.

### పెద్దపార..

తేనెపారలలో పెద్ద పార అన్నింటికంటే భారీగా ఉంటుంది. పెద్ద వృక్షాలు, కొండ చివర్లు, గుహ అంచుల్లో ఈ పారను చూడవచ్చు. పారను పెట్టే ఈగలు పెద్దగా ఉండడమే కాకుండా అత్యంత విషపూరితమైనవి. వీటి దాడి ప్రాణాంతకంగా కూడా ఉంటుంది. ఒక పార నుంచి కనీసం 10 కేజీలు పొందవచ్చు.



### జున్ను..

పొదల్లో చిన్నపాటి చెట్ల కొమ్మల్లో కనిపించేదే జున్ను, చిన్నపార. పరిమాణంలో చిన్నగా, కోణాకారంలో ఈ తేనె పట్టు కనిపిస్తుంది. ఈ తేనెను రుచిని బట్టి జున్ను, జుంటి అని కూడా పిలుస్తుంటారు. ఇవి కుట్టినా విష ప్రభావం తక్కువగానే ఉంటుంది.



### తొడిది..

చెట్లు తొర్రలు, రాతి పగుళ్లలో లభ్యమయ్యే తొడిది తేనే పట్టు నిర్మాణం వైవిధ్యంగా ఉంటుంది. దొంతరులుగా తేనె పట్టులను తొర్ర పరిమాణాన్ని బట్టి తేనెటీగలు పెంచుకుంటూ పోతుంటాయి. ఈ పట్టు ద్వారా 2 కేజీల వరకు తేనె లభ్యమవుతుంది.



### ముసర..

పరిమాణంలో చాలా చిన్నవి. చిన్నపాటి తెట్టెలను పెడతాయి. ముసర పట్టుల నుంచి తేనె పెద్ద పరిమాణంలో లభించక పోయినా రుచి కోసం ఈ తేనెను సేకరిస్తుంటారు. గోడల పగుళ్లలో, వృక్షాల బెరడుల కింద ఇవి కనిపిస్తుంటాయి.



### కన్నుగుల..

పిల్లలకు మాటలు రావడం ఆలస్యమవుతుందనే సమయంలో వారి నాలుకపై తేనె రాయడం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇందుకోసం ప్రత్యేక మైన తేనె ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ తేనె కన్నుగుల తేనెపట్టు నుంచి లభ్యమవుతుంది. చెట్టు కొమ్మలపై, మొక్కల మొదళ్లలో, పొదల్లో చిన్న బుడిపెల మాదిరి కన్నుగుల తేనె పట్టులు నల్లమలలో కనిపిస్తాయి.



### పసుపు వర్ణం అంటే మక్కువ..

తేనెటీగలు పసుపు వర్ణపు పూలపై ఎక్కువ మక్కువ చూపుతాయి. మకరందం సేకరణకు ఎక్కువగా ఆవర్ణపు పూలైన వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆవాలు వంటి రైతులు సాగు చేసే పంట పుష్పాలపై వాలుతూ ఉంటాయి. అలాగే అడవి పూలు అయిన పచ్చారి, నీలగపూలు, తులివి పూలు, దేవదారు, టేకు, పాలికి వంటి వాటిని ఆశ్రయిస్తాయి.



### అడవి తేనె సేకరణ తగ్గిపోయింది

గిరిజనులు తేనే సేకరణకు దూరం కావడంతో జీసీసీ స్టోర్లకు కనీస స్థాయిలో కూడా తేనె రావడం లేదు. పర్వత ప్రాంతాల్లో తేనె పట్టు పెట్టుకునే రాక్ హనీ బీలు రైతులు ఉపయోగిస్తున్న క్రిమిసంహారకాల వల్ల చనిపోతూ సంతతని కోల్పోతున్నాయి. అలాగే క్రమంలో చెంచులు తమ పిల్లలను చదివిస్తుండటం, ఇతర పనులకు పంపుతుండటంతో ఫల సేకరణకు దూరమవుతుండటంతో అడవి తేనె బయటకు రావడం లేదు. – పుల్లారావు, మేనేజర్, జీసీసీ, ఐటీడీఏ, శ్రీశైలం

### తేనె సేకరణ ఒక సాహసం



తేనె సేకరణ అన్నది మా చెంచులలో ఉన్న పురాతన వృత్తి. అత్యంత సాహసంతో తేనె సేకరణ చేయాల్సి ఉంటుంది. చిటారు కొమ్మలు, కొండ అంచులో ఉన్నా కూడా భయపడరు. ఎంత ఎత్తులో ఉన్నా సరే సులువుగా తేనె తెట్టను కిందకు దించుతారు. – అంకన్న, పెచ్చెర్వు చెంచుగూడెం

### అడవికి దూరమయ్యాం



గతంలో మేము బతికేందుకు ఈ అడవే ఆధారం. తేనె, కంద గడ్డలు, అరుదైన పండ్లు సేకరించి విక్రయించే వాళ్లం. వాటి కోసం అడవిలో చాలా దూరం పోవాల్సి వచ్చేది. ఇప్పుడు వ్యవసాయం, ఇతర పనులకు వెళ్తున్నాం. తేనె సేకరణ మా పిల్లలకు ఇప్పుడు కష్టం. – ఈదమ్మ, రుద్రకోడు చెంచుగూడెం

# జామాయిల్ డిమాండ్ జూమ్

## ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో కర్రకు పెరిగిన పోటీ

- సాగు లేక ప్రస్తుతం తగ్గిన లభ్యత
- రోజుకు 7500 టన్నులు అవసరం కాగా, వెయ్యి సైతం లభించని వైనం

కందుకూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జామాయిల్ కర్రకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. కొంతకాలంగా జామాయిల్ సాగు భారీగా తగ్గిపోవడం.. ఇదే సమయంలో ప్లయ్‌ఉడ్, పేపర్ కంపెనీలు పెరగడంతో వీరి మధ్య పోటీతో అనూహ్య డిమాండ్ వచ్చి పడింది. కంపెనీల అవసరాలకు అనుగుణంగా లభ్యత లేకపోవడంతో టన్ను కర్ర ధర అమాంతం పెరిగిపోయింది. టన్నుకు రూ.ఆరు వేల నుంచి రూ.ఏడు వేల వరకు చెల్లించేందుకు సైతం కంపెనీలు వెనుకాడటం లేదు.

**పెద్ద ఎత్తున అవసరం**

వాస్తవానికి రెండేళ్ల వరకు జామాయిల్ కర్రకు సరైన ధరల్లేక రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టన్ను ధర రూ.1800 నుంచి రూ.రెండు వేల వరకే పలికేది. ఖర్చులు సైతం రాకపోవడంతో పలువురు రైతులు సాగును పూర్తిగా మానుకున్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో ప్లయ్‌ఉడ్ తయారీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ కంపెనీల అవసరాలకు పెద్ద ఎత్తున కర్ర అవసరమైంది. అయితే జామాయిల్ సాగు దీర్ఘకాలం కావడం.. కొంత కాలంగా సాగు తగ్గడంతో నిల్వల్లేకుండా పోయాయి. దీంతో ప్రస్తుతం ఊహించని స్థాయిలో డిమాండ్ ఏర్పడింది.

**లభ్యత స్వల్పంగా..**

ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో జిల్లా నుంచే రోజుకు 7,500 టన్నుల కర్ర కంపెనీలకు అవసరమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నులు కూడా లేదని తెలుపుతున్నాయి. మరోవైపు రాష్ట్రం మొత్తమ్మీద నాణ్యమైన కర్ర నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనే సాగవుతుంది. దీంతో ఇక్కడి నుంచి వచ్చే కర్ర కోసం ఐటీసీ వంటి కార్పొరేట్ కంపెనీలు విపరీతంగా పోటీపడతాయి. దీంతో కంపెనీల మధ్య డిమాండ్ ఏర్పడింది.





**అటవీ శాఖ నుంచి భారీగా కొనుగోలు**

జిల్లాలో అటవీ శాఖ పరిధిలో సాగులో ఉన్న కర్రను ఏడాది కాలంలో కంపెనీలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. ఇలా దాదాపు ఆరు లక్షల టన్నుల కర్రను కొనుగోలు చేశాయని తెలుస్తోంది. మార్కెట్ ఫీజు రూపంలో కందుకూరు ఏఎమ్సీకి రూ.ఐదు లక్షలు, ఆత్మకూరు ఏఎమ్సీకి రూ.16 లక్షల వరకు చెల్లించారని అధికారులు చెప్తున్నారు. టన్ను కర్రను ఏకంగా రూ.ఆరు వేల వరకు కొనుగోలు చేశారు. అటవీ శాఖ పరిధిలోని కర్ర దాదాపు ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు కలిగింది కావడం, సైజు ఆశించిన రీతిలో ఉండటంతో ఇంత భారీ రేటును పెట్టి కొనుగోలు చేశాయి.

### టన్ను ధర పైపైకి..

టన్ను జామాయిల్ కర్రకు మద్దతు ధర రూ.4400గా ఉంది. ఇందులో కర్ర కటింగ్‌తో పాటు తాటతీసే ఖర్చునూ రైతులే భరించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం కటింగ్, తాటతీసే ఖర్చుతో సంబంధం లేకుండా కర్ర సైజును బట్టి టన్నుకు రూ.ఐదారు వేల వరకు కంపెనీలు చెల్లిస్తున్నాయి. నాణ్యమైన కర్ర ఉంటే టన్నుకు రూ.7500 కూడా ఇచ్చేందుకు సైతం వెనుకాడటం లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే జిల్లాలో లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం.





### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,098 మంది స్వామిని దర్శించుకున్నారు. 34,707 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని ఇస్కాన్ మందిరంలో ఆది, సోమ, మంగళవారం మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ తెలిపారు. శనివారం ఇస్కాన్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు.

### దుర్గమ్మ సన్నిధిలో రేపు కృష్ణాష్టమి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో 26వ తేదీన శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని గోశాలలో శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన భక్తులు శనివారం రూ.3 లక్షల విరాళం సమర్పించారు. విశాఖపట్నంలోని సీతమ్మధారకు చెందిన ఎం.వి.సింధూజ, ఎం.స్నిగ్ధ పేరిట వారి కుటుంబ సభ్యులు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

### 28 నుంచి శ్రీనివాసుని పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురంలోని శ్రీసంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 28 నుంచి శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

### శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ


పెద్దాపురం: తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం సమీపంలోని స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు.

### రమణీయం.. సర్వ సమర్పణోత్సవం

మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో వేదమూర్తి శ్రీరాఘవేంద్రుల ఆరాధన సప్తరాత్రోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో శనివారం రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు సర్వ సమర్పణోత్సవం గావించారు. ఉత్సమూర్తిని పంచవాహనాలపై ఊరేగించారు. అశేష భక్తజన వాహిని మధ్య రాయరు రమణీయంగా ఊరేగారు.

### అమరేశ్వరుని పవిత్రోత్సవాలు ప్రారంభం

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరాలయంలో శనివారం నుంచి పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు దాతలు యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వేదపండితులు ఉదక శాంతి, ఆలయ శుద్ధి, ప్రధాన, ఉపాలయాల మూర్తులకు స్నపనాభిషేకాలు, అర్చనలు చేశారు. అగ్నిమధనం, హోమాలు నిర్వహించారు. ఆదివారం జరిగే రెండవ రోజు పవిత్రోత్సవాలలో మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ తెలిపారు.





### విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో వ్యక్తిత్వ వికాసం–అభిరుచులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థి అని, జ్ఞాన నేత్రంతో ప్రపంచాన్ని చూడాలన్నారు. అందం అనేది మన గమ్యంలో ఉండదని, అది మన జీవన ప్రయాణంలో ఉంటుందన్నారు. ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు.

### 26 నుంచి డీఎస్‌ఏలో జాతీయ క్రీడా వారోత్సవాలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): శాప్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, హాకీ పోటీలు, ఉట్టి ఆట, 27న అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్; బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, యోగా, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, టెన్నిస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, రైఫిల్ షూటింగ్ పోటీలు ఉంటాయన్నారు. 18–40, 41–60, 61–80 ఏళ్ల వారికి, 28న జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు.

### ప్రమాణాలు పాటించని వసతిగృహాల మూసివేత

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ వసతి గృహాలను ప్రత్యేక అధికారులు నాలుగు రోజులుగా తనిఖీలు నిర్వహించారని కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన అనుమతుల్లోని, ప్రమాణాలు పాటించని తొమ్మిది వసతి గృహాలను వెంటనే మూసివేసి అక్కడి 129 మంది పిల్లలను ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటువంటి వసతిగృహ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

### రెండోదశ డిగ్రీ ప్రవేశాలు

వైవీయూ: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం రెండోదశ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో కళాశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారన్నారు. రెండోదశలో సైతం పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరనున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా చేయిస్తున్నట్లు తెలిపారు.

### 27నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేస్తున్న పాఠశాలల్లో ఈనెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ మండలి (డీసీఈబీ) నుంచి పాఠశాలలకు ప్రశ్నపత్రాలను పంపిణీ చేయనున్నట్టు వివరించారు.

### మిలటరీ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షకు సెప్టెంబరు 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



# మన వైద్యులకు భద్రత ఏదీ?

- ప్రపంచవ్యాప్తంగా వైద్య సిబ్బందిపై దాడుల్లో 3.4 శాతం భారత్‌లోనే
- దక్షిణాసియాలో అఫ్గానిస్తాన్ తర్వాత మన దేశంలోనే ఎక్కువ ఉదంతాలు
- నేపాల్‌లో ఒక శాతం లోపే దాడుల ఘటనలు.. వైద్యుల రక్షణకు అక్కడి ప్రభుత్వం ఆర్డినెన్స్
- ప్రముఖ వైద్య జర్నల్ లాన్సెట్ నివేదికలో వెల్లడి
- కోల్‌కతా హత్యాచార ఉదంతం నేపథ్యంలో నివేదికలోని అంశాలకు ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: దేశంలో వైద్యులకు రక్షణ కరువైందా? ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశంలోనే వైద్య సిబ్బందిపై ఎక్కువ దాడులు జరుగుతున్నాయా? అంటే అవుననే అంటోంది ప్రముఖ వైద్య జర్నల్ లాన్సెట్. దేశంలో వైద్యులకు భద్రత లేదని.. డాక్టర్ల రక్షణకు ఉద్దేశించిన చట్టాలకు కోరల్లేవని ఆక్షేపించింది. వైద్యులపై దాడులు ఆగకపోతే వైద్య, ఆరోగ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. కోల్‌కతాలోని ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీలో ఓ జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్యోదంతం దేశాన్ని కుదిపేస్తున్న నేపథ్యంలో లాన్సెట్ నివేదికలోని అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2019 గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి లక్ష మంది వైద్య సిబ్బందిలో ముగ్గురిపై దాడులు జరుగుతున్నాయి. దక్షిణాసియా దేశాల్లో అఫ్గానిస్తాన్ తర్వాత మన దేశంలోనే దాడులు ఎక్కువ జరుగుతుండటం గమనార్హం. పొరుగుతున్న నేపాల్‌లో ఒక శాతంలోపే ఈ తరహా దాడులు జరుగుతున్నట్లు నివేదిక తెలిపింది. అయినప్పటికీ అక్కడి ప్రభుత్వం వైద్యుల రక్షణ కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని వివరించింది.

### వైద్య వ్యవస్థలో అశాంతి



దేశంలో వైద్య వ్యవస్థ అత్యంత అశాంతి వాతావరణంలో పనిచేస్తోంది. ఈ పరిస్థితి మారాలంటే దేశవ్యాప్తంగా ఏకీకృత, బలమైన చట్టాన్ని రూపొందించడంతోపాటు దాన్ని పటిష్టంగా అమలు చేయాలి. వైద్యుల దాడుల ఫిర్యాదులకు హెల్ప్ లైన్‌లను ఏర్పాటు చేయాలి. వైద్యులకు పని ప్రదేశాలను సురక్షితంగా ఉంచాలి.

– డాక్టర్ కిరణ్ మాదల, క్రిటికల్ కేర్ విభాగం

### లాన్సెట్ జర్నల్‌లోని ముఖ్యాంశాలు...

- 2020లో దేశంలో వైద్య సిబ్బందిపై 220 దాడులు, 2021లో 110 దాడులు జరిగాయి. 2020లో దాడులు అనూహ్యంగా పెరగడానికి కరోనానే ప్రధాన కారణం.
- ప్రపంచంలోని మొత్తం వైద్య సిబ్బందిలో మన వైద్య సిబ్బంది ఒక శాతమే. కానీ ప్రపంచంలో వైద్య సిబ్బందిపై జరిగే దాడుల్లో 3.4 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయి. వాస్తవంగా జరుగుతున్న దాడులతో పోలిస్తే తక్కువగా నమోదవుతున్నాయి.
- పంజాబ్, హరియాణాలలో 2010–15 మధ్య వైద్య సిబ్బందిపై జరిగిన దాడుల్లో ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదు.
- మహారాష్ట్రలో 2015–19 మధ్య 633 దాడులపై ఫిర్యాదులకు సంబంధించి 1,366 మందిని అరెస్ట్ చేసినా చివరకు నలుగురికే శిక్ష పడింది. 2020లో అదే రాష్ట్రంలో వైద్య సిబ్బందిపై 157 దాడులు జరగ్గా 77 మాత్రమే నమోదయ్యాయి. ఆ ఘటనలకు సంబంధించి 71 మందిపై చార్జిషీట్ దాఖలైనా ఎవరికీ శిక్షపడలేదు. ఇదే పరిస్థితి దేశంలోనూ కొనసాగుతోంది.
- వైద్య సిబ్బందిపై దాడుల గురించి ఫిర్యాదు చేసేందుకు ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్లు లేవు. భద్రతపై పర్యవేక్షణ, ఆడిటింగ్ లేవు.
- వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడే వారికి 6 నెలల నుంచి గరిష్టంగా పదేళ్ల దాకా జైలుశిక్ష, రూ. 50 వేల నుంచి రూ. 10 లక్షల వరకు జరిమానాతో కేంద్రం 2019లో ముసాయిదా బిల్లు సిద్ధమైనా ఇతరులు కూడా అడుగుతారని పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి హోంశాఖ నిరాకరించింది.
- కరోనా కాలంలో 2020 ఏప్రిల్‌లో కేంద్రం ఇదే తరహాలో ఒక చట్టాన్ని తీసుకొచ్చినా కరోనా వ్యాప్తి తగ్గుముఖం అనంతరం దాన్ని ఎత్తేసింది.

## ఇండియాలో జాబ్ చేద్దాం

# విదేశాల నుంచే అన్వేషణ



**విదేశాల్లో..** ప్రధానంగా అమెరికా, దుబాయ్, లండన్‌లో ఉద్యోగాల కోసం ఇక్కడి యువత ఎన్నో కలలు కంటుంటారు కదా.. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందంట. 2021 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో భారత్‌లో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాల కోసం విదేశాల నుంచి 'సెర్చింగ్' (ఆన్‌లైన్, ఇతర రూపాల్లో అన్వేషణ) 60 శాతం పెరుగుదల నమోదైనట్టుగా ప్రముఖ గ్లోబల్ హైరింగ్, మ్యాచింగ్ ప్లాట్‌ఫామ్ 'ఇండీడ్' అధ్యయనంలో వెల్లడైంది. ప్రధానంగా యూఎస్‌ఏ, యూఏఈ, యూకేల నుంచే ఎక్కువగా భారత్‌లోని 'బ్లూకాలర్ జాబ్'ల గురించి ఆరా తీసినట్టుగా తెలుస్తోంది.

- అమెరికా, దుబాయ్, లండన్‌ల నుంచే ఎక్కువ సెర్చింగ్
- 2021 జూన్ నుంచి 2024 జూన్ వరకు ఆన్‌లైన్, ఇతర మాధ్యమాల్లో 60 శాతం పెరుగుదల
- టాప్–3 దేశాల్లో యూఎస్‌ఏ, యూఏఈ, యూకే
- కొత్త ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా భారత్
- అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ నైపుణ్యాలకు ఆకర్షణ
- గత మూడేళ్లలో విదేశాల్లో డ్రైవర్లుగా పనిచేసే అవకాశం కోసం భారత్ నుంచి 16 శాతం మంది అన్వేషణ
- అదే సమయంలో భారత్‌లో డ్రైవర్ల ఉద్యోగాల కోసం విదేశాల నుంచి 47 శాతం సెర్చింగ్
- ప్రముఖ గ్లోబల్ హైరింగ్, మ్యాచింగ్ ప్లాట్‌ఫామ్ 'ఇండీడ్' అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మన దేశం క్రమంగా వివిధ నైపుణ్యాలతో కూడిన వృత్తి నిపుణులకు గమ్యస్థానంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సాంకేతికతలు, నూతన మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఇక్కడి ఉద్యోగులు కూడా అవకాశాలను అందిపుచ్చుకుంటున్నట్టుగా ఇండీడ్ తాజా గణాంకాలు, డేటాతో వెల్లడైంది. భారత్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, డిజిటల్ సర్వీసెస్, ఇతర రంగాల్లో ముందడుగు వేసి పురోగతి సాధిస్తున్న నేపథ్యంలో సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటున్నట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్త ఆవిష్కరణలు, ఆర్థికాభివృద్ధికి భారత్ ఓ కేంద్రంగా మారడంతో ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ నైపుణ్యాలను ఆకర్షించడంలో ముందున్నట్టుగా చెబుతున్నారు. ఇక పైన పేర్కొన్న కాలంలోనే (2021–24ల మధ్య) భారత్ నుంచి విదేశాల్లోని వివిధ ఉద్యోగాల కోసం అన్వేషణ అనేది 17 శాతం మేర తగ్గుదల నమోదైనట్టు ఇండీడ్ డేటా స్పష్టం చేస్తోంది. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా అవకాశాల అన్వేషణ కంటే దేశంలోనే స్థానికంగా అందుబాటులోకి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకునేలా తమ ప్రాధాన్యతలను ఇక్కడి వారు నిర్ణయించుకుంటున్నట్టుగా వెల్లడైంది.

### వృత్తి నిపుణులకు భారత్ గమ్యస్థానంగా..

ప్రపంచ జాబ్ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలకు, నైపుణ్యాలతో కూడుకున్న వృత్తినిపుణులకు భారత్ గమ్యస్థానంగా మారింది. దాంతో దేశీయంగా.. అదేవిధంగా అంతర్జాతీయ భాగస్వాములు (ఇంటర్నేషనల్ స్టేక్ హోల్డర్స్) వివిధ రంగాల్లో పెరుగుతున్న అవకాశాలకు తగ్గట్టుగా తమను తాము మలచుకోవాల్సిన అవసరం ఉందని ఇండీడ్ పేర్కొంది., ఆటోమేషన్, డిజిటలైజేషన్ వంటి నూతన సాంకేతికతల కారణంగా వివిధ పరిశ్రమల్లో వేగంగా పరిస్థితులు మారుతున్నాయని అంచనా వేసింది. పెరుగుతున్న ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా ఆయా రంగాల్లో ఉద్యోగాలు కోరుకుంటున్న వారి స్వభావాలు, ప్రాధాన్యతల్లో కూడా మార్పు కనిపిస్తున్నట్టుగా ఇండీడ్ పరిశీలన వెల్లడించింది.

'వివిధ రంగాల వృత్తి నిపుణులు భారత్‌ను ఆయా రంగాల్లో అవకాశాలకు కేంద్రంగా పరిగణిస్తున్నారు. ఈ విషయంలో విదేశాల నుంచి ఆసక్తి పెరుగుదలకు ఇండియా ఆర్థికాభివృద్ధి, వివిధ కీలకమైన పరిశ్రమలను ముందుండి నడపగల శక్తి, తదితర కారణాలు ప్రభావితం చేస్తున్నాయి' అని ఇండీడ్ ఇండియా ట్యాలెంట్ స్ట్రాటజీ అడ్వయిజర్ రోహన్ సిల్వెస్టర్ అభిప్రాయపడ్డారు.

### టాప్–3 దేశాలు ఇవే...

- భారత్‌లో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాల కోసం అన్వేషిస్తున్న టాప్–3 దేశాలివే...
- 2021తో పోల్చితే 2024 నాటికి యూఎస్‌ఏ నుంచి ఆయా నైపుణ్యాల అన్వేషణ 13 శాతం పెరుగుదల
- అదే యూఏఈ విషయానికొస్తే ఈ సెర్చింగ్ 12 శాతం పెరిగింది
- యూకే నుంచి మాత్రం ఈ అన్వేషణ అనేది 7 శాతంగా ఉంది

### ముఖ్యాంశాలు..

- భారత్‌లో విభిన్న రంగాల్లో నైపుణ్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాల కోసం అన్వేషిస్తున్న వారి సంఖ్య పెరగడానికి ప్రధానంగా కొన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుంటున్నట్టుగా ఇండీడ్ అధ్యయనం వెల్లడించింది.
- ఆర్థిక సుస్థిరత
- వివిధ రంగాలకు సంబంధించిన వృత్తినిపుణులకు మెరుగైన అవకాశాలు
- స్థానికంగా నైపుణ్యాలను ఆకర్షించేందుకు అవకాశాలు పెరగడం
- దేశీయంగా స్థానిక ప్రాధాన్యతలకు తగ్గట్టుగా అవకాశాల మెరుగుదల
- 2021–24 మధ్యకాలంలో విదేశాల్లో డ్రైవర్లుగా పనిచేసే అవకాశం కోసం భారత్ నుంచి 16 శాతం మంది అన్వేషించారు
- అదే సమయంలో డ్రైవర్ల ఉద్యోగాల కోసం విదేశాల నుంచి 47 శాతం సెర్చింగ్ పెరిగింది
- ఈ పరిణామాలను చూస్తే దేశంలోని వివిధ రంగాల్లో స్థానికంగా ఉద్యోగ అవకాశాల పెరుగుదల స్పష్టమవుతోందని చెబుతున్నారు.

# కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

### టీఎస్‌డబ్ల్యూసీఎఫ్‌సీ చైర్మన్ శోభారాణి



సాక్షి, హైదరాబాద్: బహిరంగంగా మహిళలను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేటీఆర్.. ఎవరికీ కనిపించకుండా మహిళా కమిషన్ ముందు విచారం వ్యక్తం చేస్తే సరిపోదని తెలంగాణ రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ (టీఎస్‌డబ్ల్యూసీఎఫ్‌సీ) చైర్మన్ బండ్రు శోభారాణి వ్యాఖ్యానించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను అవమానిస్తూ బహిరంగ వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్.. బహిరంగంగానే తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె శనివారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ చట్టం మీద గౌరవం ఉన్న వారెవరైనా మహిళా కమిషన్ విచారణకు వెళ్లే సమయంలో మహిళలతో గొడవలు చేయిస్తారా? అని ప్రశ్నించారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ వెళ్లినట్టు లేదని.. కమిషన్‌పై దాడి చేసేందుకు వెళ్లినట్టు ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

# మారనున్న మార్కెట్ ప్లాన్!

- నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం
- 144 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మంజూరు
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మార్కెట్లు పదిలోపే
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణంపై పునఃసమీక్ష

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణంపై పునఃసమీక్ష చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్లపై తాజా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో మొదలైన మార్కెట్ల పనులు పూర్తి కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### కాగితాలపైనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు బజార్లు వేదికగా కూరగాయల అమ్మకాలు జరిగాయి. ఆ తర్వాత మోడల్ మార్కెట్ పేరుతో కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త మార్కెట్లు వచ్చాయి. కానీ వెజ్, నాన్ వెజ్ విక్రయాలకు వేర్వేరుగా ఈ మార్కెట్లు ఉండేవి. తెలంగాణ ఏర్పడ్డాక మౌలిక వసతులు మెరుగుపరచడంపై అప్పటి ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2015 జనవరిలో సీఎం కేసీఆర్ రికార్డు స్థాయిలో మూడు రోజుల పాటు వరంగల్ నగరంలో బస చేశారు. ఈ సందర్భంగా వరంగల్‌లో మౌలిక సదుపాయాలపై మాట్లాడుతూ కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు అమ్మేందుకు అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో నిర్మిస్తామని ప్రకటించారు.

### నత్తనడకన నిర్మాణాలు..

పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాన్ని కేసీఆర్ సర్కార్ ప్రారంభించింది. ఆయా మున్సిపాలిటీల్లో స్థల లభ్యత ఆధారంగా కనీసం 50 దుకాణాల నుంచి గరిష్టంగా 150 దుకాణాల వరకు ఉండేలా రెండెకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్లు నిర్మించాలని అధికారులకు సూచించింది. వీటి నిర్మాణ డిజైన్ల ఆధారంగా రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు నిధులు కేటాయించింది. కానీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిర్మాణ పనులు చకచకా సాగలేదు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే కనీసం సగం మున్సిపాలిటీల్లో వీటిని ప్రారంభించాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.



కొత్తగూడెంలో సగానికి పైగా పూర్తయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

### మారిన ప్రణాళిక

గత ప్రభుత్వం నిర్మాణ పనులు మొదలెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో ఆరు నుంచి 10 వరకే ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. సగం వరకు మార్కెట్లలో 70 నుంచి 90 శాతం వరకు పనులతో పైకప్పు స్థాయికి చేరాయి. ఇక్కడ స్టాళ్లు, ఫ్లోరింగ్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తే ప్రారంభించవచ్చు. కనీసం 30 చోట్ల మార్కెట్లు స్థల కేటాయింపు దశలోనే ఉన్నాయి. మిగిలిన చోట్ల పునాదులు లేదా గోడల దశలో ఉన్నట్టు సమాచారం. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వాటికి నిధులు మంజూరు చేసి.. సగం అంతకంటే తక్కువ నిర్మాణ పనులు జరిగిన చోట ప్రణాళికను మార్చాలనే యోచనలో ప్రస్తుత సర్కార్ ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. సగం వరకు నిర్మాణ పనులు పూర్తయిన మార్కెట్లకు సంబంధించి.. ఆయా మున్సిపాలిటీలో అవసరాల ఆధారంగా మార్కెట్ పనులు ముందుకు తీసుకెళ్లాలా? లేదా? అక్కడ ఫంక్షన్ హాల్, మినీ స్టేడియం లేదా ఇతర అవసరాలకు తగ్గట్టుగా కొత్తగా ఏమైనా చేయొచ్చా? అనే దిశగా ఆలోచిస్తున్నట్టు సమాచారం.

### ప్రణాళికాబద్ధంగా వ్యయం


కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రతి ప్రాజెక్టు, ప్రతి పనికి ఆచితూచి ఖర్చు పెడుతోంది. ముందుగా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంతవరకు వచ్చింది, తక్కువ ఖర్చుతో వెంటనే ఫలితాలు ఇచ్చే ప్రాజెక్టులు ఏమిటి.. ఎలా ఖర్చు చేయాలనే అంశంపై రోడ్‌మ్యాప్ రూపొందించారు. అందులో భాగంగానే ఎనిమిదేళ్లుగా నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లను ఇటీవల ప్రారంభించారు. ఇప్పుడు ఇదే తరహాలో పట్టణ ప్రగతి పనులపైనా దృష్టి సారించింది. ఎన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మిస్తున్నారు?, అవి ఏయే దశల్లో ఉన్నాయనే అంశాలపై వివరాలను సేకరిస్తోంది.



ఇల్లెందులో పునాది దశలో మార్కెట్ నిర్మాణ పనులు

# మోదీ చొరవతో రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి

### బీజేపీనేత గూడూరు ఆశాభావం



సాక్షి, హైదరాబాద్: రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందం కుదర్చడంలో ప్రధాని నరేంద్ర మోదీ సఫలమవుతారని బీజేపీనేత గూడూరు నారాయణరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ దిశలో మోదీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించి ఈ రెండుదేశాల మధ్య యుద్ధం ఆగిపోతుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపేందుకు మోదీ తనవంతు ప్రయత్నాలు చేయడం గొప్ప విషయమని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యుద్ధరంగంలో కూడా చర్చల ద్వారానే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. ఉక్రెయిన్, రష్యాల్లో పర్యటించడం ద్వారా ప్రపంచదేశాల నేతలకు మోదీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇప్పటికైనా ఇతర దేశాల నేతలు సైతం ఈ రెండుదేశాలపై ఒత్తిడి తెచ్చి చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# భారత్‌లో విపత్తు నిర్వహణ స్థాయిలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

### భారతదేశంలో విపత్తు నిర్వహణ యాజమాన్యం

భారత్‌లో 2004 వరకు విపత్తు నిర్వహణ అనేది విపత్తులు సంభవించిన తర్వాత తీసుకునే పునరావాస, పునర్నిర్మాణ, ఉపశమన చర్యల రూపంలో మాత్రమే ఉండేది. ఇలాంటి విధానాలు, కార్యక్రమాల వల్ల విపత్తు ప్రభావిత ప్రాంత ప్రజలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లేది. ఈ నేపథ్యంలో 2004 డిసెంబర్ 26న సంభవించిన సునామీ.. మన దేశంలోని విపత్తు నిర్వహణ విధానాలు, కార్యక్రమాల్లోని లోపాలను తేటతెల్లం చేసింది. దీంతో భారత్ కూడా సమగ్ర విపత్తు నిర్వహణ విధానాన్ని రూపొందించి అమలు చేస్తోంది.

ఈ మేరకు అమెరికా, జపాన్ విధానాలను, కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుంది. ఇందులో భాగంగా 2005 మే 20న జాతీయ విపత్తు నిర్వహణ చట్టానికి రూపకల్పన చేసింది. ఈ చట్టాన్ని అనుసరించి విపత్తుల సమగ్ర నిర్వహణ కోసం 2005 మే 30న జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ (NDMA)ను ఏర్పాటు చేసింది. జాతీయ విపత్తు నిర్వహణ చట్టం 2005 డిసెంబర్ 23 నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. దీంతో చట్టంలోని సెక్షన్ 3(1) ప్రకారం జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ.. 2006 సెప్టెంబర్ 27న ప్రధాని అధ్యక్షతన మరో 9 మంది సభ్యులతో పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. సభ్యుల్లో ఒకరు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

- 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టం-2005'ను అనుసరించి మన దేశంలో విపత్తు నిర్వహణ పర్యవేక్షణ 3 స్థాయిల్లో జరుగుతుంది. అవి..

1. ప్రధానమంత్రి అధ్యక్షతన కేంద్రస్థాయిలో జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థలో
2. ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థలో
3. కలెక్టర్/మేజిస్ట్రేట్/డిప్యూటీ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయిలో జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థలో

1. **NDMA అధికార పరిధి:**

ఎ) విపత్తు ముప్పును నివారించేందుకు లేదా తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు అమలుచేయాల్సిన విధానాలను, అనుసరించాల్సిన మార్గదర్శకాలను రూపొందించడం.

బి) విపత్తు నిర్వహణ ప్రణాళికల రూపకల్పనలో రాష్ట్ర ప్రాధికారక సంస్థలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను రూపొందించడం.


### విపత్తు నిర్వహణకు NDMA తీసుకున్న చర్యలు

#### యొకహోమా డిక్లరేషన్-1994

విపత్తుల నివారణ, ఉపశమనానికి సంబంధించి జపాన్‌లోని యొకహోమా నగరంలో రూపొందించిన తీర్మానానికి అనుగుణంగా మన దేశంలో విపత్తుల నిర్వహణ అంశాన్ని తొలిసారిగా 10వ పంచవర్ష ప్రణాళికా కాలంలో చేరుస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించారు. ఇదే సదస్సు 1991-2000 దశాబ్దాన్ని 'ఇంటర్నేషనల్ డికేడ్ ఫర్ నేచురల్ డిజాస్టర్ రిడక్షన్'గా ప్రకటించింది. యొకహోమా సదస్సు స్ఫూర్తితో విపత్తుల అధ్యయనానికి 1999లో కేసీ పంత్ అధ్యక్షతన అత్యున్నత కమిటీని ఏర్పాటు చేశారు.

#### హ్యోగో కార్యచట్రం

హ్యోగో(జపాన్)లోని కోబేలో 2005 జనవరి 18నుంచి 22వరకు జరిగిన సమావేశం.. 2005-15 మధ్యకాలంలో అమలుచేయాల్సిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను 'హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ఫర్ యాక్షన్ 2005-15' పేరిట విడుదల చేసింది. 168 దేశాల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో.. విపత్తుల ప్రభావాన్ని సమర్థంగా తట్టుకొనే సామర్థ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా జనసమూహంలో పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని, అమలు చేయాల్సిన మార్గదర్శకాలను రూపొందించారు.



- విధి నిర్వహణలో ఎన్‌డీఎంఏకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సహకరించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ చట్టం-2005లోని సెక్షన్-8 ప్రకారం వివిధ సంఘాలను ఏర్పాటుచేశారు. అవి..

ఎ. **జాతీయ కార్యనిర్వాహక కమిటీ (ఎన్‌ఈసీ):** దీనికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఎక్స్‌అఫిషియో ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. అంటే పదవీ రీత్యా ఎన్‌ఈసీ ఛైర్మన్‌గా ఉంటారు.

బి. **జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌ఐడీఎం):** ఇది కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. హోంమంత్రి అధ్యక్షుడిగా వ్యవహరించే ఈ సంస్థ 2003 అక్టోబర్ 16న చట్టబద్ధతను పొందింది. విపత్తు నిర్వహణను సంస్థాగతం చేసేందుకు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తగిన శిక్షణ అందించడం; వారిలో సంబంధిత సామర్థ్యాలను పెంపొందించడం; విపత్తు నిర్వహణకు సంబంధించిన పరిశోధనలను నిర్వహించడం; గ్రంథస్తం చేయడం, విద్యా సంబంధ కోర్సులను, సెమినార్లను నిర్వహించడం; పరిశోధన పత్రాలను, పుస్తకాలను ప్రచురించడం ఈ సంస్థ విధులు. ఇందులో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన మొత్తం 42 మంది సభ్యులు ఉంటారు.

సి. **జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్):** విపత్తుల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకునేందుకు తగిన సహాయ కార్యక్రమాలను చేపట్టడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. దీన్ని జాతీయ విపత్తు నిర్వహణ చట్టం-2005లోని సెక్షన్ 44 ప్రకారం 2006లో ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా BSF (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) CRPF (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) CISF (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్), ITBP (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్)లకు చెందిన 10 బెటాలియన్లను దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అవి..

1. భటిండా (పంజాబ్)
2. గౌహతి (అసోం)
3. వడోదర (గుజరాత్)
4. గ్రేటర్ నోయిడా (ఉత్తరప్రదేశ్)
5. బరాసత్ (పశ్చిమ బెంగాల్)
6. పుణె (మహారాష్ట్ర)
7. మంగళగిరి (ఆంధ్రప్రదేశ్)
8. అరక్కోణం (తమిళనాడు)
9. ముందలి (ఒడిశా)
10. బిహాటా (బిహార్)

డి. **జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్‌డీఎంఎఫ్):** విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులకు తక్షణ సాయం అందించేందుకు 2001లో ఏర్పాటుచేసిన 'నేషనల్ క్లైమెట్ కంటింజెన్సీ ఫండ్'ను రాష్ట్ర స్థాయిల్లోని 'క్లైమెట్ రిలీఫ్ ఫండ్'తో కలిపి దీన్ని 2010లో 'నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్(ఎన్‌డీఎంఎఫ్)'గా మార్చారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులను సమకూరుస్తాయి.

ఇ. **జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్‌సీఎంసీ):** విపత్తుల వల్ల ఏర్పడ్డ సంక్షోభాన్ని నివారించేందుకు నియమించిన సంక్షోభ నిర్వహణ బృందానికి ఈ కమిటీ మార్గనిర్దేశం చేస్తుంది. దీనికి కేంద్ర కేబినెట్ కార్యదర్శి అధ్యక్షత వహిస్తారు.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. విపత్తు నిర్వహణ చట్టాన్ని రూపొందించిన సంవత్సరం? (Junior Assistant in Intermediate Board-2012)
ఎ) 2004 బి) 2005
సి) 2006 డి) 2003
2. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ అధ్యక్షుడు? (Polytechnic Lecturers)
ఎ) ఆర్థిక మంత్రి
బి) ప్రధాన మంత్రి
సి) సమాచార ప్రసార శాఖ మంత్రి
డి) గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
3. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది? (Jr. Assistants in vidhana sabha)
ఎ) సూరత్ బి) కొచ్చి
సి) కటక్ డి) న్యూఢిల్లీ
4. విపత్తు నిర్వహణ కార్యకలాపాలను సమన్వయం చేసే మంత్రిత్వ శాఖ? (RTA Exam)
ఎ) గృహ మంత్రిత్వ శాఖ
బి) పర్యావరణ శాఖ
సి) ఆహార మంత్రిత్వ శాఖ
డి) ఆర్థిక శాఖ
5. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రచురించే ద్వైవార్షిక పత్రిక? (Group-I, 2011)
ఎ) Disaster & Development
బి) Disaster India
సి) Disaster mitigation
డి) Indian disaster
6. భారత విపత్తు నిర్వహణ కాంగ్రెస్ మొదటి సభ ప్రారంభమైన రోజు? (Group-I, 2011)
ఎ) 26-10-2006
బి) 29-08-2006
సి) 29-11-2006
డి) 29-10-2006
7. 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టం-2005'లో పొందుపర్చిన నిర్వహణ స్థాయి? (Computer draughtsmen grade-II)
ఎ) జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ
బి) రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ
సి) జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ
డి) పైవన్నీ

#### సమాధానాలు

1) బి; 2) బి; 3) డి; 4) ఎ;
5) ఎ; 6) సి; 7) డి;

### మాదిరి ప్రశ్నలు

1. జాతీయ విపత్తు నిర్వహణ చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 2005 డిసెంబర్ 25
బి) 2005 డిసెంబర్ 24
సి) 2005 డిసెంబర్ 23
డి) 2005 డిసెంబర్ 20
2. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారక సంస్థ ఎప్పటి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది?
ఎ) 2006 సెప్టెంబర్ 24
బి) 2006 సెప్టెంబర్ 25
సి) 2006 సెప్టెంబర్ 27
డి) 2006 సెప్టెంబర్ 26
3. విపత్తుకు ముందు తీసుకునే చర్యలు?
ఎ) నివారణ బి) సంసిద్ధత
సి) ఉపశమనం డి) పైవన్నీ
4. విపత్తు తర్వాత తీసుకునే చర్యలు?
ఎ) పునరావాసం బి) పునర్నిర్మాణం
సి) ఉపశమనం డి) పైవన్నీ
5. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (NIDM) సభ్యుల సంఖ్య?
ఎ) 39 బి) 9
సి) 41 డి) 42
6. NIDM ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 2007 ఫిబ్రవరి 19
బి) 2007 ఫిబ్రవరి 20
సి) 2007 ఫిబ్రవరి 21
డి) 2007 ఫిబ్రవరి 23
7. విపత్తు నిర్వహణకు సంబంధించిన జాతీయ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు ఆమోదించింది?
ఎ) 2009 అక్టోబర్ 19
బి) 2009 అక్టోబర్ 20
సి) 2009 అక్టోబర్ 21
డి) 2009 అక్టోబర్ 22
8. హోంగార్డ్ వ్యవస్థ లేని రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) కర్ణాటక
సి) కేరళ డి) ఒడిశా

#### సమాధానాలు

1) సి; 2) సి; 3) డి; 4) డి;
5) డి; 6) డి; 7) సి; 8) సి.

# విద్యా విధానంలో మార్గదర్శక సూత్రాలు ఏవి?



టెట్/డీఎస్సీ

సోషల్- టీచింగ్ మెథడాలజీ

### మాదిరి ప్రశ్నలు

1. 'మాధవి అనే విద్యార్థిని నూతన పరికల్పనను రూపొందించింది.' దీని ద్వారా సాధించిన లక్ష్యం ఏమిటి?
1) అవగాహన 2) వినియోగం
3) అభిరుచి 4) నైపుణ్యం
2. 'సంధ్య అనే విద్యార్థిని పార్లమెంట్‌లో చట్టాలు ఏ విధంగా రూపొందుతాయో వివరించింది.' ఇది ఎలాంటి లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
3. 'గ్రామపంచాయతీ, పురపాలక సంఘాల విధుల్లో ఉన్న భేదాలను పేర్కొనండి.' ఈ ప్రశ్న ఏ లక్ష్యానికి చెందింది?
1) నైపుణ్యం 2) అభిరుచి
3) అవగాహన 4) వినియోగం
4. 'రాజేష్ అనే విద్యార్థి పాఠశాలలో జరిగే వస్తు ప్రదర్శనను శ్రద్ధగా నిర్వహించాడు.'ఇది ఏ విధమైన లక్ష్యం?
1) అభిరుచి 2) వైఖరి
3) ప్రశంస 4) నైపుణ్యం
5. 'దేశ జనాభా పెరుగుదలను అరికట్టడానికి నీవు ఎలాంటి సూచనలు ఇస్తావు?' అనే ప్రశ్న ఏ లక్ష్యానికి చెందింది?
1) అభిరుచి 2) వైఖరి
3) వినియోగం 4) నైపుణ్యం
6. 'జాహ్నవి అనే విద్యార్థిని భారతదేశ చరిత్ర-సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించింది.' ఇది ఏ విధమైన లక్ష్యం?
1) అభిరుచి 2) వైఖరి
3) ప్రశంస 4) నైపుణ్యం
7. 'పదో తరగతి విద్యార్థి.. చెరుకు పండించే ప్రాంతాల్లో చెరుకు ఫ్యాక్టరీలు ఎందుకు స్థాపించారో విశ్లేషించాడు.' ఇది ఏ విధమైన లక్ష్యం?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
8. 'మణి అనే ఉపాధ్యాయురాలు తాజ్‌మహల్ నమూనాను తయారు చేసింది.' ఆమె సాధించిన లక్ష్యం ఏది?
1) నైపుణ్యం 2) అభిరుచి
3) వైఖరి 4) వినియోగం
9. 'శ్యామల అనే విద్యార్థిని డిమాండ్, సప్లయిలకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించింది.' ఇది ఏ విధమైన లక్ష్యం?
1) అవగాహన 2) వినియోగం
3) నైపుణ్యం 4) అభిరుచి
10. 'ఆదిత్య అనే విద్యార్థి థర్మామీటర్, భారమితిల్లో రీడింగ్‌ను కచ్చితంగా పేర్కొన్నాడు.' ఆ విద్యార్థి సాధించిన లక్ష్యం ఏది?
1) అభిరుచి 2) నైపుణ్యం
3) జ్ఞానం 4) ప్రశంస
11. 'లిఖిత అనే విద్యార్థిని సిపాయిల తిరుగుబాటుకు కారణాలు తెలిపింది' దీని ద్వారా సాధించే లక్ష్యం?
1) అవగాహన 2) వినియోగం
3) నైపుణ్యం 4) అభిరుచి
12. 'హారిక అనే విద్యార్థిని ట్రాఫిక్ రూల్స్ అన్నీ పాటిస్తోంది.' ఇది ఏ విధమైన లక్ష్యం?
1) అభిరుచి 2) వైఖరి
3) నైపుణ్యం 4) వినియోగం
13. 'మీ ప్రాంతంలో ప్రదర్శించే కళా రూపాలతో ఒక పట్టికను తయారు చేయండి.' అనే ప్రశ్న ఏ సామర్థ్యానికి చెందింది?
1) పట నైపుణ్యం
2) సమాచార నైపుణ్యం
3) విషయావగాహన
4) ప్రశంస, సున్నితత్వం
14. 'గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి వినోదంగా నిర్వహించే కోడిపందేల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌కు ఒక లేఖ రాయండి.' అనే ప్రశ్న ఏ సామర్థ్యానికి చెందింది?
1) సమాచార నైపుణ్యం
2) ప్రశంస, సున్నితత్వం
3) పట నైపుణ్యం 4) విషయావగాహన
15. 'స్థానిక కాలం, ప్రామాణిక కాలం మధ్య ఉన్న భేదాలను వివరించండి.' ఇది ఏ విధమైన సామర్థ్యానికి చెందింది?
1) విషయావగాహన
2) సమాచార నైపుణ్యం
3) పట నైపుణ్యం
4) ప్రశంస, సున్నితత్వం
16. 'కింద ఇచ్చిన రాష్ట్ర ఖనిజాల పటం ఆధారంగా ఏ ఖనిజం లభించని రెండు జిల్లాల పేర్లు రాయండి.' అనే ప్రశ్న ఏ సామర్థ్యానికి చెందింది?
1) సమాచార నైపుణ్యం
2) పట నైపుణ్యం
3) విషయావగాహన
4) ప్రశంస, సున్నితత్వం
17. విద్యా విధానంలో మార్గదర్శక సూత్రాలు ఏవి?
1) ఆశయాలు 2) విలువలు
3) స్పష్టీకరణలు 4) లక్ష్యాలు
18. తరగతి గది బోధన తర్వాత సాధించగలిగినవి ఏవి?
1) గమ్యాలు 2) లక్ష్యాలు
3) స్పష్టీకరణలు 4) విలువలు
19. 'మత్స్యకారుల జీవన విధానంపై చిత్రాలను సేకరించి, ఆల్బమ్‌ను తయారు చేయడం.' ఇది ఏ విధమైన సామర్థ్యానికి చెందింది?
1) విషయావగాహన
2) సమాచార నైపుణ్యం
3) ప్రశంస, సున్నితత్వం
4) సమకాలీన విషయాలపై ప్రతిస్పందించడం
20. 'గ్రామ సభ సమావేశాలకు తక్కువ మంది హాజరుకావడానికి కారణాలు ఏమిటి?' ఈ ప్రశ్న ఏ సామర్థ్యానికి చెందింది?
1) విషయావగాహన
2) సమాచార నైపుణ్యం
3) పట నైపుణ్యం
4) ప్రశంస, జీవ వైవిధ్యం
21. 'ప్రపంచ పటంలో ఫ్రాన్స్ దేశాన్ని గుర్తించి, దాని సరిహద్దు దేశాలను చూపండి.' అనే ప్రశ్న ఏ సామర్థ్యానికి చెందింది?
1) సమాచార నైపుణ్యం 2) పట నైపుణ్యం
3) విషయావగాహన
4) ప్రశంస, జీవవైవిధ్యం
22. 'గ్రామ పంచాయతీ చేస్తున్న పనుల గురించి ఒక పోస్టర్ తయారు చేసి, తరగతి గదిలో ప్రదర్శించడం.' ఇది ఏ విధమైన విద్యా ప్రమాణానికి చెందింది?
1) ప్రశంస, సున్నితత్వం
2) సమాచార నైపుణ్యం
3) పట నైపుణ్యం 4) విషయావగాహన
23. జతపరచండి.
జాబితా-I
i) అభిరుచి ii) నైపుణ్యం
iii) వైఖరి iv) ప్రశంస
జాబితా-II
a) చట్టాలను గౌరవించడం
b) త్యాగం, దానం చేయడం
c) ఆల్బమ్‌ను తయారు చేయడం
d) నమూనాలను తయారు చేయడం
1) i-b, ii-c, iii-a, iv-d
2) i-b, ii-d, iii-a, iv-c
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-c, ii-d, iii-b, iv-a
24. జతపరచండి.
జాబితా-I
i) వినియోగం ii) అవగాహన
iii) వైఖరి iv) అభిరుచి
జాబితా-II
a) ఉదాహరణలు చెప్పడం
b) కారణాలు తెలియజేయడం
c) క్షేత్ర పర్యటనలు
d) నిజాయతీ, బాధ్యత
1) i-b, ii-a, iii-d, iv-c
2) i-b, ii-a, iii-c, iv-d
3) i-b, ii-d, iii-c, iv-a
4) i-a, ii-b, iii-c, iv-d

#### సమాధానాలు

1) 2 2) 2 3) 3 4) 1 5) 3
6) 2 7) 3 8) 1 9) 1 10) 2
11) 2 12) 2 13) 2 14) 2 15) 1
16) 2 17) 1 18) 2 19) 2 20) 1
21) 2 22) 1 23) 3 24) 1

### గతంలో వచ్చిన ప్రశ్నలు

1. 'భారతదేశ నిరుద్యోగుల సమస్యను విశ్లేషించండి.' అనేది ఏ లక్ష్యానికి చెందింది? (డీఎస్సీ-1998)
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
2. 'ఒక విద్యార్థి.. పీడనాన్ని కనుగొనడానికి హైడ్రోమీటర్ ఉపయోగించి, కచ్చితంగా రీడింగ్‌ను కొలుస్తాడు.' దీని ద్వారా నెరవేరిన లక్ష్యం ఏది? (డీఎస్సీ-1998)
1) జ్ఞానం 2) అవగాహన
3) నైపుణ్యం 4) వైఖరి
3. 'జాతీయ పతాకాన్ని విద్యార్థి గౌరవించాడు.' దీని ద్వారా అతడిలో నెరవేరిన లక్ష్యం ఏది? (డీఎస్సీ-1998)
1) ప్రశంస 2) అభిరుచి
3) వైఖరి 4) అవగాహన
4. 'భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం పాఠాన్ని బోధించిన తర్వాత ఓ విద్యార్థి జాతీయ సమైక్యతపై వ్యాసం రాశాడు.' ఈ చర్య వల్ల అతడిలో ఏ లక్ష్యం సాధించాడని చెప్పవచ్చు? (డీఎస్సీ-1998)
1) జ్ఞానం 2) అవగాహన
3) అభిరుచి 4) నైపుణ్యం
5. ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్ర విద్యార్థులు పరిసరాల్లో లభ్యమయ్యే వస్తువులతో ఒక గ్లోబును తయారు చేశారు. వారు ఎలాంటి నైపుణ్యాన్ని నేర్చుకున్నారు? (డీఎస్సీ-1998)
1) హస్తలాఘవ నైపుణ్యం
2) చిత్రకళా నైపుణ్యం
3) రేఖాచిత్ర నైపుణ్యం
4) సమాచార నైపుణ్యం
6. '2011 జనాభా లెక్కల వివరాల పట్టికను పరిశీలించిన విద్యార్థి అధిక జనసాంద్రత ఉన్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్ అని చెప్పాడు.' అతడిలో నెరవేరిన లక్ష్యం? (డీఎస్సీ-1998)
1) వినియోగం 2) అవగాహన
3) నైపుణ్యం 4) జ్ఞానం
7. 'ఉపాధ్యాయుడు.. భారత స్వాతంత్ర్యోద్యమం అనే పాఠ్యాంశాన్ని బోధించాడు. ఇది విన్న విద్యార్థి పుస్తకాల మార్కెట్‌కు వెళ్లి వివిధ నాయకుల బొమ్మలను సేకరించి, ఆల్బమ్ తయారు చేశాడు.' దీని ద్వారా అతడిలో నెరవేరిన లక్ష్యం?(డీఎస్సీ-1998)
1) వైఖరి 2) నైపుణ్యం
3) అభిరుచి 4) అవగాహన
8. స్టాంపుల సేకరణ అలవాటు ద్వారా పెంపొందేది ఏది? (డీఎస్సీ-2002)
1) వైఖరి 2) అభిరుచి
3) ప్రశంస 4) నైపుణ్యం
9. 'ఒక విద్యార్థి.. మొగల్ పరిపాలన పాఠంలో అక్బర్ చేసిన సంస్కరణలను వర్గీకరించాడు.' ఇది ఏ విధమైన లక్ష్యం? (డీఎస్సీ-2002)
1) అవగాహన 2) జ్ఞానం
3) వినియోగం 4) నైపుణ్యం
10. 'ఒక విద్యార్థి అడవుల సంరక్షణకు తగిన సూచనలు చేశాడు.' ఇది ఏ లక్ష్యానికి చెందింది? (డీఎస్సీ-2001)
1) అవగాహన 2) ఆసక్తి
3) వినియోగం 4) నైపుణ్యం
11. కింది వాటిలో 'వినియోగం' అనే లక్ష్యానికి చెందని స్పష్టీకరణ ఏది? (డీఎస్సీ-2002)
1) సాధారణీకరించడం
2) పరిష్కారం సూచించడం
3) సంబంధాలను గుర్తించడం
4) ఫలితాలను ఊహించడం
12. నిజ జీవిత సమస్యలను పరిష్కరించుకునే శక్తి ఏ రంగానికి చెందుతుంది? (డీఎస్సీ-2002)
1) జ్ఞాన రంగం 2) భావావేశ రంగం
3) జ్ఞానేతర రంగం
4) మానసిక చలనాత్మక రంగం
13. 'విధేయత, వ్యక్తిగత సామాజిక బాధ్యతలాంటి అంశాలను విద్యార్థులకు పెంపొందించడం.' అనేది ఏ లక్ష్యానికి చెందింది?(డీఎస్సీ-2002)
1) అవగాహన 2) జ్ఞానం
3) నైపుణ్యం 4) వైఖరి
14. 'బడ్జెట్ పాఠం విన్న విద్యార్థి ప్రభుత్వం ప్రవేశపెట్టే లోటు బడ్జెట్ వల్ల కలిగే ఫలితాలను ఊహించగలిగాడు.' దీని ద్వారా నెరవేరిన లక్ష్యం ఏది? (డీఎస్సీ-2002)
1) వినియోగం 2) జ్ఞానం
3) అవగాహన 4) అభిరుచి
15. 'ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో అతిపెద్ద రాష్ట్రాన్ని వేరుచేయండి.' ఈ ప్రశ్న ఏ విధమైన లక్ష్యానికి చెందింది? (డీఎస్సీ-2002)
1) అవగాహన 2) నైపుణ్యం
3) వినియోగం 4) జ్ఞానం
16. కింది వాటిలో విద్యా ప్రణాళికల విషయాన్ని బట్టి మారనిది ఏది? (డీఎస్సీ-2004)
1) ఆశయం 2) లక్ష్యం
3) బోధనా పద్ధతి 4) స్పష్టీకరణ
17. 'ప్రతి పౌరుడు నిర్వహించే ప్రాథమిక విధులను ఓ విద్యార్థి వివరించగలుగుతాడు.' అనేది ఏ లక్ష్యానికి చెందింది? (డీఎస్సీ-2004)
1) జ్ఞానం 2) వినియోగం
3) అవగాహన 4) నైపుణ్యం
18. 'సౌరకుటుంబం' అనే పాఠాన్ని ఎనిమిదో తరగతి విద్యార్థి అభ్యసించిన తర్వాత ఒక రోజు స్నేహితులతో కలిసి నక్షత్రశాలను చూసి వచ్చాడు. దీన్ని ద్వారా అతడు ఏ లక్ష్యం సాధించాడని చెప్పవచ్చు? (డీఎస్సీ-2004)
1) వైఖరి 2) అభిరుచి
3) నైపుణ్యం 4) ప్రశంస
19. 'మీకిచ్చిన రాష్ట్ర పటంలో థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రాలను గుర్తించండి.' అనేది ఏ లక్ష్య సాధనకు ఉద్దేశించింది?
1) వైఖరి 2) జ్ఞానం
3) వినియోగం 4) నైపుణ్యం
20. కింది వాటిలో వినియోగ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ ఏది? (డీఎస్సీ-2004)
1) విచక్షణ చేయడం
2) ఉదాహరణలు
3) సాధారణీకరించడం
4) నమూనాలను తయారు చేయడం
21. 'ఒక విద్యార్థి.. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫానును చక్రవాత వర్షానికి ఉదాహరణగా పేర్కొన్నాడు.' ఇది ఏ విధమైన లక్ష్యం? (డీఎస్సీ-2006)
1) అవగాహన 2) నైపుణ్యం
3) జ్ఞానం 4) వినియోగం
22. 'ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్య సమితి పాత్రను విద్యార్థి అభినందించాడు.' ఇది ఏ విధమైన లక్ష్యం? (డీఎస్సీ-2006)
1) జ్ఞానాత్మక రంగం
2) భావావేశ రంగం
3) మానసిక చలనాత్మక రంగం
4) జ్ఞానేతర రంగం

#### సమాధానాలు

1) 3 2) 3 3) 3 4) 3 5) 1
6) 2 7) 3 8) 2 9) 1 10) 3
11) 3 12) 1 13) 4 14) 1 15) 1
16) 1 17) 3 18) 2 19) 4 20) 3
21) 1 22) 2

# ఆప్టికల్ ఫైబర్ పితామహుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భౌతికశాస్త్రం

## ధ్వని

### ధ్వని అభిలక్షణాలు

ధ్వనికి ప్రధానంగా 3 రకాల అభిలక్షణాలు ఉంటాయి. అవి.. 1. పిచ్ లేదా కీచుదనం 2. తీవ్రత 3. నాదగుణం లేదా నాణ్యత

1. **పిచ్ లేదా కీచుదనం:** కీచుస్వరం, బొంగురు స్వరాల మధ్య ఉండే లక్షణమే కీచుదనం.
- ఇది పౌనఃపున్యంపై ఆధారపడి ఉంటుంది.
- ఈ లక్షణాన్ని హెర్ట్జ్(Hz) ప్రమాణంతో కొలుస్తారు.
- ధ్వని కీచుదనం కొలవడానికి వాడే పరికరం టోనోమీటర్.

**పిచ్ లేదా కీచుదనం ఉండే జీవులు:**
1) దోమలు 2) చిన్నపిల్లలు
3) మహిళలు 4) తుమ్మెద

- మహిళల స్వరానికి పురుషుల స్వరం కంటే ఎక్కువ కీచుదనం ఉంటుంది.
- శృతిదండం పిచ్ దాని భుజాలపై ఆధారపడి ఉంటుంది.

2. **తీవ్రత:** ఇది కంపనపరిమితిపై ఆధారపడి ఉంటుంది. ఈ లక్షణాన్ని dB(డెసిబెల్) ప్రమాణంతో కొలుస్తారు.
- ధ్వని తీవ్రత కొలవడానికి వాడే పరికరం సౌండ్ మీటర్ లేదా నాయిస్ మీటర్.

**తీవ్రత ఉండే జీవులు:**
1) పురుషులు 2) సింహం 3) ఏనుగు

- 80dB కంటే ఎక్కువ తీవ్రత ఉండే ధ్వనుల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.
- విమానాశ్రయాల సమీపంలో పని చేసే ప్రజలు ఇయర్‌ప్లగ్స్‌ను ఉపయోగించి తమ చెవులు కాపాడుకోవాలి.

3. **నాదగుణం:** ధ్వనుల్లో ఉండే వ్యత్యాసాన్ని గుర్తించే స్వభావాన్ని నాదగుణం అంటారు.

**ఉదా:** వాహనాన్ని చూడకుండా దాని నుంచి వచ్చే ధ్వని ఆధారంగా వాహనాన్ని గుర్తించవచ్చు.
- ఇది వ్యక్తికి ఉండే శృతి గ్రాహ్యతపై ఆధారపడి ఉంటుంది.

**ధ్వని ముద్రణ, పునరుత్పత్తి:** పాల్సన్ మొదటిసారి స్టీల్ పలకలపై ధ్వనిని రికార్డ్ చేసి పునరుత్పాదన చేశారు. ఈ పద్ధతిలో ధ్వని తీవ్రత, స్పష్టత చాలా తక్కువగా ఉండటం వల్ల ఇది ప్రాచుర్యం పొందలేకపోయింది.
- టేప్ రికార్డర్‌లో ఉండే ప్లాస్టిక్ టేప్‌పై ఫెర్రిక్ ఆక్సైడ్ లేదా ఐరన్ ఆక్సైడ్‌తో పూతపూసి ధ్వనిశక్తిని అయస్కాంతశక్తి రూపంలో నిల్వ చేస్తారు.
- **టేప్‌రికార్డర్ ఆవిష్కర్త:** పాల్సన్.
- థామస్ ఆల్వా ఎడిసన్ గ్రామ్‌ఫోన్ ప్లేట్లపై ధ్వనిని రికార్డ్ చేసి పునరుత్పత్తి చేశారు. ఈ పద్ధతిలో పునరుత్పత్తి చేసిన ధ్వని తీవ్రత, స్పష్టత అధికం.
- ఆధునిక కాలంలో సి.డి., డి.వి.డి.లలో ధ్వని రికార్డ్ చేసి పునరుత్పత్తి చేసే ప్రక్రియలో లేజర్ కిరణాలను ఉపయోగిస్తారు.

| ధ్వని వెలువడే సందర్భం | ధ్వని తీవ్రత (dB లలో) |
|---|---|
| కనురెప్పలు కదిలినప్పుడు | 0 |
| గుసగుసలాడినప్పుడు | 15-20 |
| గోడ గడియారంలో లోలకం కదిలినప్పుడు | 30 |
| సాధారణ సంభాషణ | 50-60 |
| టెలిఫోన్ రింగ్ | 60 |
| చెవికి ప్రమాదకరమైన ధ్వని | 85 |
| ట్రాఫిక్ నుంచి విడుదలయ్యే ధ్వని | 80-90 |
| చెవిపోటుకి కారణమయ్యే ధ్వని | 120 |
| ఉరుములు ఉరిమినప్పుడు | 150 |
| జీఎస్ఎల్‌వీ నుంచి విడుదలయ్యే ధ్వని | 250 |

| పరికరం | కనుగొన్నవారు | | |
|---|---|---|---|
| ల్యాండ్‌లైన్ ఫోన్ | అలెగ్జాండర్ గ్రహంబెల్ | లిఫ్ట్ | ఓటీస్ |
| మొబైల్ ఫోన్ | మార్టిన్ కూపర్ | టెలిస్కోప్ | గెలీలియో |
| హైడ్రోఫోన్ | ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్ | థర్మామీటర్ | గెలీలియో |
| క్యాలిక్యులేటర్ | పాస్కల్ | భారమితి | టారిసెల్లీ |
| కంప్యూటర్ | చార్లెస్ బబేజ్ (కంప్యూటర్ పితామహుడు) | లైటనింగ్ డిటెక్టర్ | బెంజిమన్ ఫ్రాంక్లిన్ |
| | | అణుబాంబు | ఓపెన్ హైమర్ |
| | | హైడ్రోజన్ బాంబ్ | ఎడ్వర్డ్ టెల్లర్ |
| | | థర్మాస్ ఫ్లాస్క్ | డివేర్ |
| డైనమో | మైఖేల్ ఫారడే | సైకిల్ | మెక్‌మిలన్ |
| ఎలక్ట్రిక్ బల్బ్ | థామస్ ఆల్వా ఎడిసన్ | బాల్ పెన్ | జీజే బాండ్ |
| ఆప్టికల్ ఫైబర్ | నరేంద్రసింగ్ కపానీ | ఫౌంటెన్ పెన్ | వాటర్ మాన్ |
| విమానం | రైట్ బ్రదర్స్ | పెట్రోల్ కారు | కార్ల్ బెంజ్ |
| హెలికాప్టర్ | బ్రాకెట్ | రైల్ ఇంజన్ | స్టీవెన్‌సన్ |
| న్యూక్లియర్ రియాక్టర్ | ఫెర్మి | జలాంతర్గామి | బుష్‌నెల్ |
| | | ఎయిర్ కండిషనర్ | కారియర్ |
| రేడియో | మార్కోని | సేఫ్టీ రేజర్ | జిల్లెట్ |
| టెలివిజన్ | జె.ఎల్. బయర్డ్ | రాడార్ | వాట్సన్ |

- **సి.డి.ని ఆవిష్కరించింది:** సోనీ, ఫిలిప్స్
- సినిమా రీల్‌లో ధ్వనిని రికార్డ్ చేసి, పునరుత్పాదన చేసేందుకు 'కాంతి విద్యుత్ ఫలితం' ఉపయోగిస్తారు.

### కాంతి విద్యుత్ ఫలితం

కాంతి కిరణాలు క్షారలోహ పలకల ఉపరితలంపై పతనం చెందినప్పుడు అవి ఎలక్ట్రాన్లను ఉద్గారం చేయడం వల్ల వలయంలో విద్యుత్ ప్రసారం జరుగుతుంది. దీన్ని కాంతి విద్యుత్ ఫలితం అంటారు.
- కాంతి విద్యుత్ ఫలితాన్ని హెన్రిచ్ రుడాల్ఫ్ హెర్ట్జ్ కనుగొన్నాడు. ఇతడు రేడియో,టెలిఫోన్, టీవీ, టెలిగ్రాఫ్‌ల అభివృద్ధికి పునాది వేశారు. ఇతడి సేవలకు గుర్తింపుగా పౌనఃపున్యానికి ప్రమాణం 'హెర్ట్జ్' అని నామకరణం చేశారు.
- కాంతి విద్యుత్ ఫలితాన్ని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వివరించారు.
- **ఆడియోగ్రాఫ్:** ధ్వనిని రికార్డింగ్ చేయడం.
- **వీడియోగ్రాఫ్:** కాంతిని రికార్డింగ్ చేయడం.

## గతంలో అడిగిన ప్రశ్నలు

1. ధ్వని నాణ్యత దేనిపై ఆధారపడి ఉంటుంది? (A.DTWO-2012)
ఎ) తరంగదైర్ఘ్యం బి) పౌనఃపున్యం
సి) డోలనపరిమితి డి) అతిస్వరం
2. డెసిబెల్ దేనికి ప్రమాణం? (Asst, Director-2012)
ఎ) విద్యుత్ బి) కాంతి
సి) ఉష్ణం డి) శబ్దం
3. టెలిఫోన్ ఆవిష్కర్త? (Telugu Translater-2010)
ఎ) ఆల్ఫ్రెడ్ నోబెల్
బి) అలెగ్జాండర్ గ్రాహంబెల్
సి) ఎడిసన్ డి) డార్విన్
4. రాడార్‌ను కనుగొన్నవారు? (Jr.Asst-2012)
ఎ) వాట్సన్ బి) ఫ్లెమింగ్
సి) బుష్‌నెల్ డి) ఆస్టన్
5. టేప్‌రికార్డర్‌ను కనుగొన్నవారు? (Observer Engineer-2013)
ఎ) పాల్సన్ బి) హారిసన్
సి) ఫోకాల్ట్ డి) డావీ
6. సేఫ్టీ రేజర్ కనుగొన్నవారు? (Observer Engineer-2013)
ఎ) బెర్లిన్ బి) హారిసన్
సి) జిల్లెట్ డి) పాల్సన్
7. రేడియోను కనుగొన్నవారు? (Research Asst. Engineer-2013)
ఎ) గ్రాహంబెల్ బి) మార్కోని
సి) న్యూటన్ డి) అట్టోహాన్
8. లిఫ్ట్‌ని ఎవరు, ఎప్పుడు కనుగొన్నారు? (Jr. Asst.-2012)
ఎ) ఫారడే, 1851 బి) ఓటీస్, 1852
సి) ఎడిసన్, 1878
డి) జె.ఎల్.బయర్డ్, 1926
9. వైర్‌లెస్ టెలిగ్రఫీని కనుగొన్నదెవరు? (ASWO-2012)
ఎ) మార్కోని బి) మాక్స్‌వెల్
సి) మాక్స్‌ప్లాంక్ డి) స్టీవెన్‌సన్
10. రైలింజన్ ఆవిష్కర్త ఎవరు? (ASWO-2012)
ఎ) థామ్సన్ బి) ఆండర్‌సన్
సి) బెర్లిన్ డి) స్టీవెన్‌సన్
11. రైట్ సోదరులు దేన్ని కనుగొన్నారు? (Jr. Asst.-2012)
ఎ) టెలిస్కోప్ బి) రేడియో
సి) హెలికాప్టర్ డి) విమానం
12. జలాంతర్గామి ఆవిష్కర్త ఎవరు? (Jr.Asst-2012)
ఎ) గేటింగ్ బి) జిల్లెట్
సి) కాక్స్‌టన్ డి) బుష్‌నెల్
13. పెట్రోల్ కారు ఆవిష్కర్త ఎవరు? (Jr.Asst-2012)
ఎ) కార్ల్‌బెంజ్ బి) ఫ్రాంక్లిన్
సి) హారిసన్ డి) కేరియర్
14. ఆడియో టేపులను దేనితో పూతపూస్తారు? (Group II -2012)
ఎ) అల్యూమినియం ఆక్సైడ్
బి) సిల్వర్ అయోడైడ్ సి) ఫెర్రిక్ ఆక్సైడ్
డి) పొటాషియం నైట్రేట్
15. హెలికాప్టర్ కనుగొన్నది ఎవరు? (Jr.Asst-2012)
ఎ) ఎడిసన్ బి) బ్రాన్సీ
సి) లారెన్స్ డి) బ్రాకెట్
16. ఎయిర్ కండిషనర్ కనుగొన్నవారు? (Tech.Asst-2012)
ఎ) కారియర్ బి) హారిసన్
సి) డేనిష్ మెల్‌రోజ్ డి) ఫెర్మి
17. క్యాలిక్యులేటర్ కనుగొన్నవారు? (Jr.Steno-2012)
ఎ) రాబర్ట్ మాలెట్ బి) గోబర్
సి) పాస్కల్ డి) పాల్సన్

### సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) ఎ; 5) ఎ; 6) సి; 7) బి; 8) బి; 9) ఎ; 10) డి; 11) డి;12) డి; 13) ఎ; 14) సి; 15) డి; 16) ఎ; 17) సి.

## మాదిరి ప్రశ్నలు

1. సోనిక్ బూమ్ దేనికి సంబంధించినది?
ఎ) లేజర్ కిరణాలు బి) రాడార్
సి) సూపర్‌సోనిక్ విమానం డి) పరావర్తనం
2. సోనోగ్రఫీలో వాడే తరంగాలు ఏవి?
ఎ) మైక్రోవేవ్ బి) ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు
సి) శబ్ద తరంగాలు
డి) అల్ట్రాసోనిక్ తరంగాలు
3. స్టెతస్కోప్‌లో శబ్దం పెద్దగా వినపడటానికి కారణం?
ఎ) అనునాద శబ్దం బి)సంపోషక వ్యతికరణం
సి) అధ్యారోపణం డి) పరావర్తనం
4. ధ్వని తీవ్రత స్థాయిని కొలవడానికి ఉపయోగించేది?
ఎ) హెర్ట్జ్ బి) బెల్
సి) జౌల్స్ డి) ఆంగ్‌స్ట్రామ్
5. ధ్వని లక్షణం?
ఎ) స్థాయి బి) విరళీకరణం
సి) ప్రతిధ్వని డి) సహకార ధ్వని
6. ధ్వని ఎందులో అధికంగా ప్రయాణిస్తుంది?
ఎ) నీరు బి) గాలి
సి) ఉక్కు డి) ఖాళీ స్థలం
7. అల్ట్రాసోనిక్ శబ్దాలు వినగలిగే జంతువు?
ఎ) ఎలుక బి) ఉడుత
సి) పిల్లి డి) గబ్బిలం
8. స్త్రీ కంఠం పురుషుడి కంఠం కంటే సన్నగా ఉండటానికి కారణం?
ఎ) అధిక పౌనఃపున్యం బి) అధిక తరంగదైర్ఘ్యం
సి) తక్కువ పౌనఃపున్యం డి) ఎ, సి
9. గాలిలోని శబ్దవేగం దేని ద్వారా మార్పుచెందదు?
ఎ) సాంద్రత బి) తేమ
సి) ఉష్ణోగ్రత డి) హెచ్చు స్థాయి
10. మాక్ నంబర్ దేని వేగానికి సంబంధించింది?
ఎ) ధ్వని బి) ఓడలు
సి) యుద్ధ విమానం డి) అంతరిక్షనౌక
11. ధ్వని వేగాన్ని కొలిచే సాధనం
ఎ) ఆల్టీమీటర్ బి) అమ్మీటర్
సి) బారోమీటర్ డి) ఆడియో మీటర్
12. సోనార్‌ను ఎక్కువగా ఎవరు వినియోగిస్తారు?
ఎ) నావికులు బి) వ్యోమగాములు
సి) డాక్టర్లు డి) ఇంజనీర్లు
13. డాప్లర్ ప్రభావం దేనికి సంబంధించింది?
ఎ) ధ్వని బి) అయస్కాంతం
సి) ఉష్ణం డి) విద్యుత్
14. మునిగిపోయిన వస్తువులను గుర్తించేందుకు వాడే పరికరం?
ఎ) రాడార్ బి) సోనార్
సి) క్వాసార్ డి) పుల్సర్
15.నీటి లోపలి ధ్వని తరంగాలను కొలిచే పరికరం?
ఎ) గైరోస్కోప్ బి) ఎపిడయోస్కోప్
సి) హైడ్రోఫోన్ డి) ఫొటోమీటర్
16. ధ్వని పిచ్ దేనిపై ఆధారపడుతుంది?
ఎ) స్వభావం బి) తరంగదైర్ఘ్యం
సి) పౌనఃపున్యం డి) గమనం
17. కింది వాటిలో పిచ్ అధికంగా ఉండే జీవులు?
ఎ) చిన్నపిల్లలు బి) పురుషులు
సి) పులులు డి) ఏనుగులు
18. కిందివాటిలో ధ్వని తీవ్రత గుణం తక్కువగా ఉన్నవారు?
ఎ) పురుషులు బి) దోమలు
సి) సింహాలు డి) పైవన్నీ
19. ధ్వని తీవ్రతను కొలిచే సాధనం ఏది?
ఎ) టోనోమీటర్ బి) పిచ్ స్కేల్
సి) ఫైరో మీటర్ డి) ఆడియో మీటర్
20. ఆప్టికల్ ఫైబర్ పితామహుడు ఎవరు?
ఎ) రైట్ బ్రదర్స్ బి) కారియర్
సి) నరేంద్రసింగ్ కపానీ డి) ఫెర్మి
21. న్యూక్లియర్ రియాక్టర్ ఆవిష్కర్త?
ఎ) రైట్ బ్రదర్స్ బి) కారియర్
సి) నరేంద్రసింగ్ కపానీ డి) ఫెర్మి

### సమాధానాలు

1) సి; 2) డి; 3) డి; 4) బి; 5) ఎ; 6) సి; 7) డి; 8) ఎ; 9) డి; 10) సి; 11) డి;12) ఎ; 13) ఎ; 14) బి; 15) సి; 16) సి;17) ఎ; 18) బి; 19) డి; 20) సి; 21) డి.

# What is the code for 'PEACE'?




## MODEL QUESTIONS

*Directions( Q. 1 to 5)*:- Read the questions carefully and answer them:

In these questions, a relationship between different elements is shown in the statement(s). The statements are followed by two conclusions. Give answer

1) If only conclusion I is true.
2) If only conclusion II is true.
3) If either conclusion I or II is true.
4) If neither conclusion I nor II is true.
5) If both conclusions I and II are true.

1. **Statements:** $B < A, B \geq D, P = A, P \leq L$
**Conclusion:** I. $A > D$ II. $L > B$
2. **Statements:** $B > Z, M \leq T \leq Q, Z < M$
**Conclusions:** I. $Q > B$ II. $Z > T$
3. **Statements:** $C \geq D > L, D= N < A, C < B$
**Conclusions:**I. $B = A$ II. $N \leq C$
4. **Statements:** $A > B = X, X \geq Q, C \leq Q$
**Conclusions:** I. $B = C$ II. $B > C$
5. **Statements:** $S \geq O > L, O = N < A, S < M$
**Conclusions:** I. $M > A$ II. $M \leq A$

*Directions (Q. 6 to 10)*:- Study the information carefully and answer the following questions:

In a certain code language-
a) 'WEALTH, HEALTH, PROSPERITY, PEACE' is written as 'kat lat ho gat'
b) 'HEALTH SHOULD BE MAINTAINED' is written as, 'mat ta pat kat'
c) 'PEACE IS FINAL OUTCOME' is written as, 'zi lat ne ki'
d) 'GOOD HEALTH SHOULD RESULTS' is written as, 'zat mat kat da

6. What is the code for 'HEALTH' in the given code language?
1) gat 2) ho 3) pat
4) kat 5) da
7. What is the code for 'SHOULD' in the given code language?
1) kat 2) da 3) mat
4) gat 5) zi
8. What is the code for 'PEACE' in the given code language?
1) lat 2) ho 3) kat
4) zi 5) da
9. What is the code for 'RESULTS' in the given code language?
1) zat 2) da
3) either (1) or (2)
4) mat (5) da
10. What is the code for 'BE' in the given code language?
1) mat 2) pat
3) kat 4) ta
5) cannot be determined

*Directions (Q. 11 to 16):* Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

**Input:** sound night 12 19 wonder 20 78 around 90 twinkle 36 pot 42 calyx
**Step I:** wonder sound night 19 20 78 around 90 twinkle 36 pot 42 calyx 12
**Step II:** wonder twinkle sound night 20 78 around 90 36 pot 42 calyx 12 19
**Step III:** wonder twinkle sound pot night 78 around 90 36 42 calyx 12 19 20
**Step IV:** wonder twinkle sound pot night calyx 78 around 90 42 12 19 20 36
**Step V:** wonder twinkle sound pot night calyx around 78 90 12 19 20 36 42
**Step VI:** wonder twinkle sound pot night calyx around 90 12 19 20 36 42 78
**Step VII:** wonder twinkle sound pot night calyx around 12 19 20 36 42 78 90

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

**Input:** orange 16 any 90 total 88 12 mask 19 soil 21 thus 56 nexus. (All the numbers are two-digit numbers.)

11. Which step number is the following output?
Total thus soil orange nexus any 90 88 mask 56 12 16 19 21
1) Step V 2) Step VI
3) Step IV 4) Step III
5) There is no such step
12. How many elements (words or numbers) are there between 'mask' and '19' as they appear in last but one step?
1) 3 2) 4 3) 5
4) 2 5) 6
13. How many steps would be required to get the final output?
1) Five 2) Six
3) Four 4) Seven
5) None of these
14. Which of the following represents the position of 'any' in the fifth step?
1) Sixth from the left
2) Seventh from the left
3) Fourth from the right
4) Eighth from the left
5) Sixth from the right
15. Which word/number would be at $5^{th}$ position from the right in Step VI?
1) 12 2) 19 3) 90
4) any 5) 16
16. Which word/number is $5^{th}$ to the left of $12^{th}$ word/number from the left end in Step V?
1) 12 2) 19 3) 90
4) any 5) 16

## EXPLANATIONS

1. $A > B \geq D$
Hence, $A > D$.
Conclusion I is true.
$L \geq P = A > B$
Hence, $L > B$.
Conclusion II is also true.
*Ans:* 5
2. $Q \geq T \geq M > Z < B$. Hence, Q and B cannot be compared.
Conclusion I is not true.
$T \geq M > Z$. Hence, $T > Z$.
So, conclusion II is not true.
*Ans:* 4
3. $B > C \geq D = N < A$. As B and A cannot be compared, conclusion I is not true.
$C \geq D = N$. Hence, $C \geq N$.
so, conclusion II is true.
*Ans:* 2
4. $B=X \geq Q \geq C$. Hence, $B \geq C$, which means $B > C$ or $B = C$.
Either I or II is true.
*Ans:* 3
5. $M > S \geq O = N < A$.
As contradictory symbols (>, <) are there between the terms B and A, they cannot be compared. But, Either I or II follows.
*Ans:* 3
6. By comparing (a) (b) & (d) HEALTH = kat
*Ans:* 4
7. By comparing (b) & (d)
SHOULD = mat
*Ans:* 3
8. By comparing
(a) & (c) PEACE = lat
*Ans:* 1
9. (d) RESULTS = Either zat or da
*Ans:* 3
10. (b) BE = Either ta or pat.
Hence, cannot be determined.
*Ans:* 5

**11 - 16:**
The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

**Input:** orange 16 any 90 total 88 12 mask 19 soil 21 thus 56 nexus.
**Step I:** total orange 16 any 90 88 mask 19 soil 21 thus 56 nexus 12
**Step II:** total thus orange any 90 88 mask 19 soil 21 56 nexus 12 16
**Step III:** total thus soil orange any 90 88 mask 21 56 nexus 12 16 19
**Step IV:** total thus soil orange nexus any 90 88 mask 56 12 16 19 21
**Step V:** total thus soil orange nexus mask any 90 88 12 16 19 21 56
**Step VI:** total thus soil orange nexus mask any 90 12 16 19 21 56 88
**Step VII:** total thus soil orange nexus mask any 12 16 19 21 56 88 90

11. *Ans:* 3
12. Sixth step is the last but one.
There are four elements between 'mask' and '19'.
The elements are:
any, 90, 12, 16
*Ans:* 2
13. *Ans:* 4
14. **Step V:** total thus soil orange nexus mask any 90 88 12 16 19 21 56
Thus, seventh from the left is 'any'.
*Ans:* 2
15. **Step VI:** total thus soil orange nexus mask any 90 12 16 19 21 56 88.
Thus fifth from the right is 16
*Ans:* 5
16. In Step V, $12^{th}$ from the left end is '19', and fifth one on the left from 19 is ' any'
(Short cut:$12^{th}$ - $5^{th}$ = $7^{th}$ from the left end i.e 'any')
*Ans:* 4

## అడ్మిషన్స్

### ఎంఎస్ఎంఈ, హైదరాబాద్‌లో ఎంఈ కోర్సుల్లో ప్రవేశాలు

ఎంఎస్ఎంఈ టైల్ రూమ్ హైదరాబాద్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఎంఈ) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **విభాగాలు:** ఎంఈ మెకానికల్(క్యాడ్/క్యామ్ (ఎంఈసీసీ), ఎంఈ టూల్ డిజైన్(ఎంఈటీడీ), ఎంఈ డిజైన్ ఫర్ మ్యానుఫ్యాక్చర్(ఎంఈడీఎఫ్ఎం), ఎంఈ మెకట్రానిక్స్.
» **అర్హత:** సంబంధత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో బీఈ, బీటెక్ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులు రూ. 1500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750.
» **ఎంపిక విధానం:** మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**28.08.2024
» **వెబ్‌సైట్:** https://www.citdindia.org

### ట్రిపుల్ ఐటీడీఎం కర్నూలులో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిపుల్ఐటీ డీఎం)-విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద జూలై సెషన్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ(ఫుల్ టైమ్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 04.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సైన్సెస్ (మ్యాథ్స్, ఫిజిక్స్).
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంఎస్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు గేట్, యూజీసీ-సీఎస్ఐఆర్-జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎంలో అర్హత సాధించి ఉండాలి.
» **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2024.
» **వెబ్‌సైట్:** https://iiitk.ac.in